# కథా కౌముది

2009 - 1



శ్రీ

కౌముది

మీ మనోగేహాల్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య : 31

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. చివరకు మిగిలినది | గంటి భానుమతి | 3 |
| 2. ఎవరైతే ఏంటి | వాణిశ్రీ | 8 |
| 3 ఎంగిలి హృదయం | కృష్ణ వేమూరి | 13 |
| 4. వెన్నెల్లో ఓషధి | వాసంతి | 16 |
| 5. హంసగీతం | ఎమ్.సుగుణ రావు | 21 |
| 6. మా డాడీ రాక్షసుడు | సర్వజిత్ | 25 |
| 7. సెంటిమెంట్ | వారణాశి నాగలక్ష్మి | 30 |
| 8. జాతర | ఎ.విజయ కుమార్ | 34 |
| 9. గమ్యం లేని ప్రయాణాలు | నిర్మలాదిత్య | 37 |
| 10. గ్రక్కున విడువంగ వలయు | ఆర్.శర్మ. దంతుర్తి | 43 |
| 11. ఊహా చిత్రం | శారద | 47 |
| 12. ఏడుకొండల వాడినేమి అడిగేది | భాగవతుల రామారావు | 54 |
| 13. ఒక ప్రేమ లేఖ | వారణాశి నాగలక్ష్మి | 59 |
| 14. నా నేపథ్యం ఖరీదు | చింతలచెరువు సువర్చల | 66 |
| 15. నీలిమ | ఆర్.శర్మ. దంతుర్తి | 69 |
| 16. సంయుక్త | డి.సూర్యనారాయణ శాస్త్రి | 74 |
| 17. చివరకు మిగిలేది | తాటిపాముల మృత్యుంజయుడు | 78 |
| 18. సజీవ బంధాలు | డా. కె.వి. రమణ రావు | 85 |
| 19. గృహప్రవేశం | పింగళి బాలాదేవి | 91 |
| 20. జడబిళ్ళ | అచ్యుతుని మురళీకృష్ణ | 96 |
| 21. ఓ! భామా! | వసుంధర | 99 |
| 22. వ్యక్తిత్వం కండ్లకుంట | శరత్ చంద్ర | 105 |
| 23. అయిదోగోడ | కల్పనా రెంటాల | 113 |
| 24. మార్పు - ది ఛేంజ్ | లత కందికొండ | 121 |




## చివరకు మిగిలినది

- గంటి భానుమతి

నిశ్శబ్దం.

చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం.

ఆ కోర్టు రూంలో అందరూ నన్నే చూస్తున్నారు. రకరకాల భావాలు. అసహ్యం, కోపం, ఆశ్చర్యం, జాలి వాళ్ళ మొహాల్లో.

ఆ కోర్టు రూంలో నేనీ వైపున ఉంటే.......... ఆ వైపున ముగ్గురు పిల్లలు, వాళ్ళ తండ్రులు ఉన్నారు.

"అతనే, డ్రగ్స్ తీసుకుంటాడు. అది నేరం. ఆ అబ్బాయిల జీవితాల్ని భవిష్యత్తుని పాడు చేసాడు. అది ఇంకా పెద్ద నేరం.............." నాకు దగ్గరగా ఉన్న వాళ్ళు అనుకుంటుంటే వినపడింది.

ఆశ్చర్యంగా చూసాను.

"నేనా! ఆ పిల్లల జీవితాల్ని పాడు చేసానా! నాకేం తెలీదే!"

లాయరుగారు నా దగ్గర నుంచున్నారు.

"ఎప్పటినుంచీ ఈ అలవాటు? అదే డ్రగ్స్ తీసుకోవడం"

కళ్ళుమూసుకున్నాను. ఎప్పటినుంచి? ఆలోచిస్తున్నాను.

మమ్మీ డాడీ దెబ్బలాడుకుంటుంటే, చూసినప్పట్నించా? నాన్న మమ్మల్ని వదిలేసినప్పుడా? రాత్రింబవళ్ళు అమ్మ తన బిజినెస్‌లో ఉండిపోయినప్పటినుంచా? లీగల్‌గా వాళ్ళిద్దరూ విడిపోయినప్పటినుంచా? లెక్కకి మించిన డబ్బు చేతిలోకి వస్తున్నప్పటినుంచా? ప్చ్.... ఏమో!? తెలీదు ఊహించడం కష్టం.

జరిగినది ఊహించడానికి, జరిగింది అని నమ్మడానికి మధ్య చాలా దూరం.

"ఫర్వాలేదు. ఆలోచించుకో......." అన్నారు లాయరుగారు.

కన్‌ఫ్యూజన్ లేదుకానీ, కచ్చితంగా ఎప్పుడో తెలీదు. కానీ ఒకటి మాత్రం నిజం. ఇంట్లో గొడవలకి నిద్రపట్టేది కాదు. ఏదో కోపం... ఇరిటేషన్.

"నేను ఇంటికి వచ్చేదారిలో ఓ మెడికల్ హాల్ ఉండేది. ఆయనని నిద్రకి ఏదైనా మందివ్వమని అడిగాను. ఏదో ఇచ్చాడు. అంతకుముందు నేనెరగని నిద్ర. కమ్మటి నిద్ర."

"అది తప్పుకాదా!" అన్నారు లాయరుగారు.

తల అడ్డంగా ఊపాను.

"తప్పా! అందులో తప్పేముంది? జ్వరం వస్తే మందేసుకుంటాం. తల నొప్పి వస్తే మందేసుకుంటాం.... అలాగే......... ఇదికూడా.... నిద్రరావటం లేదు. నిద్రకోసం మందు వాడడం తప్పనినాకనిపించలేదు. బహుశా... అది మొదటి అడుగు కావచ్చు....."

"తర్వాత........."

"నాలో ఏదో భయం. తెలీని భయంతో రోజులు గడిపేవాడిని. నెర్వస్‌నెస్. ఎవరికి చెప్పుకోవాలో తెలీని స్థితి. మళ్ళా మెడికల్ హాల్ అంకుల్ దగ్గరికెళ్ళి పరిస్థితి వివరించాను. ఆయన వేరే టాబ్లెట్లిచ్చాడు అది వేసుకోగానే భయం టెన్షన్ పోయాయి. ప్రశాంతత. చాలా నెమ్మది తనం నాలో చోటు చేసుకున్నాయి...... అక్కడి నుంచి కూడా మరో రెండడుగులు ముందుకేసానేమో......"

"మీ అమ్మా నాన్నకి......."

మధ్యలోనే అడ్డుకున్నాను.

"వాళ్ళకి తెలీదు. వాళ్ళ గొడవలకే వాళ్ళకి టైము లేదు. తలుపులేసుకున్న నా గదిలో ఏం జరుగుతుందో వాళ్ళకెలా తెలుస్తుంది?"

ఆఖర్న జడ్జిగారు అన్నారు. "సాత్విక్ అనబడే ఈ వ్యక్తి డ్రగ్స్ వాడతాడు. కానీ, అమ్మలేదు. క్రిమినల్ రికార్డ్ లేదు. చేతి నిండా డబ్బు, పెద్దవాళ్ళు పట్టించుకోకపోవడంవల్ల ఇతను ఎడిక్ట్ అయ్యాడు. కొన్ని రోజులు నార్కోటిక్ ఎడిక్ట్స్‌లో ఉంచండి. మామూలు మనిషి అయ్యేవరకూ ప్రోగ్రాం చేయండి. శిక్ష వేయడం అన్నది ఆ తర్వాత జరుగుతుంది...." అంటూ కేసుని వాయిదా వేసి వెళ్ళిపోయారు.

ట్రీట్‌మెంట్ మొదలయింది. నాకో గది. అలాంటి గదులు చాలా ఉన్నాయి. నాలాంటి దారి తప్పిన బాటసార్లు అక్కడ చాలామంది ఉన్నారు. ఇదివరకు నడిచిన దారి ఎలా ఉన్నా ఇప్పుడందరి దారి ఒకటి.... రీహాబిలిటేషన్.

నాకు మెల్ల మెల్లగా కొన్ని కొన్ని గుర్తొస్తున్నాయి.

కాలేజి రోజుల్లో ఉత్సాహంగా ఉండేవాడిని. బి.కాం అయిపోగానే ఎం.బి.ఎ చేసాను. నా అలవాట్లు చదువుకి ఆటంకం కాలేదు. అడ్డాలేదు. అమ్మా నాన్నా విడిపోయినా, నాకు మాత్రం డబ్బు ఇద్దరూ ఇచ్చేవారు.

నా అలవాట్లు పెళ్ళికి అడ్డుకాలేదు. ఎందుకంటే చాలా ప్రశాంతంగా ఉండేవాడిని బుద్ధిమంతుడని అనుకున్నారు.

పెళ్ళి అయ్యాక భార్య మీనా వేధింపులు ఎక్కువయ్యాయి. దానితో దెబ్బలాటలు, ఏడుపులు, ఆ టెన్షన్ తట్టుకోడానికి కొకెయిన్ అలవాటయింది.

కొంచెం వాడితేనే ఇంత బావుంది కదా, ఇంకా కొంచెం ఎక్కువ వాడితే......... లాజిక్ పనిచేసింది, కానీ నా భార్య మీనాకి అనుమానం వచ్చింది.

ఓ రోజు తూలుతూ వచ్చాను.

తలుపుతీసిన నా భార్య నిలదీసింది.

"మోసపోయాను అయినా ఫర్వాలేదు. నా జీవితం నాకుంది. నేను మేనేజ్ చేసుకోగలను. నా ఇంట్లో నువ్వు ఉండద్దు. నీలాంటి ఎడిక్ట్‌ని నేను భరించలేను. నాకు నువ్వు అక్కరలేదు, నీ కోట్ల డబ్బు అక్కరలేదు......" అంటూ మొహం మీదే తలుపులు వేసింది.

అవమానం అనిపించలేదు.

అమ్మా నాన్నా విడిపోయారు మేం కూడా అంతే. అందుకే బాధ అనిపించలేదు.

"ఆల్ రైట్. నచ్చకపోతే ఉండను" అంటూ నా సామాన్లు అవీ తెచ్చుకుని మా ఫ్రెండ్స్ దగ్గరికెళ్ళిపోయాను.

అయినా, ఈ మొగుడు, పెళ్ళాం, పెళ్ళి బంధం అంతా ట్రాష్ నాటకం.

ఎంతోమంది ఎన్నో ప్రశ్నలు. తడుముకోకుండానే జవాబులు. అన్నీ అబద్ధాలే. అబద్ధం అలవాటయిపోయింది. నా అబద్ధాలు నా బిజినెస్ పార్ట్నర్‌కి నచ్చలేదు. నన్ను పొమ్మన్నాడు. డబ్బుంది కాబట్టి, ఏ ఇబ్బంది లేకపోయింది.

"ఏం చేస్తావ్? భార్య వదిలేసింది, నువ్వు అమ్మ నాన్నలని వదిలేసావ్? ఉద్యోగం, అదే బిజినెస్ పోయింది....."

"తెలీదు... ఇంకా ఆలోచించలేదు" అన్నాను ఇది మటుకు నూటికి నూరుపాళ్ళు నిజం.

కొన్ని మన ప్రమేయం లేకుండా జరిగిపోతాయి. దానికి నేనే బాధ్యుడ్ని అంటే నేనొప్పుకోను.

కొన్ని కావాలంటే కొన్ని వదులుకోవాలి. కొకెయిన్ కోసం నా చుట్టు ఉన్న మనుషుల్ని వదులుకున్నాను. అయినా నేను ఎడిక్ట్ అని అనుకోలేదు.

రెండు రెస్టారెంట్లు, ఇద్దరు పంజాబి ఫ్రెండ్సుతో కలిపి పెట్టాను. బంగారం రావడం మొదలు పెట్టింది.

ఓసారి, ఓ పార్టీలో ఉన్నప్పుడు నా వెనకాలే ఎవరో మాట్లాడుకుంటున్నారు.

"సాత్విక్ ఎడిక్ట్ తెలుసా! అన్నిరకాలు తీసుకుంటాడట.కానీ కంట్రోల్‌లో ఉంటాడు....."

"కావల్సినప్పుడు దొరుకుతోంది కాబట్టి, యాక్టివ్ గా ఉంటున్నాడు. లేకపోతే కంట్రోల్‌లో ఉండటం చాలా కష్టం........"

"నిజమే........... కానీ ........కళ్ళు చూస్తే తెలిసిపోతుంది, డ్రగ్స్ వాడుతాడన్న సంగతి."

నేనూ ఓ ఎడిక్ట్! హుం......... ఎడిక్ట్ అని ఎవరిని అంటారో వీళ్ళకి తెలీదు. ఎడిక్ట్ అంటే సినిమాల్లోలాగా, ఇనప ఊసల్లాంటి జుట్టూ, చేతుల్లేని జాకెట్లో, జీన్స్ జాకెట్లో వేసుకుని, భుజాల మీద చేతుల మీద నల్ల టట్టూలతో, అస్తమానం ఏదో నవులుతుంటారు.

మరి నేను.......

నేనలాగా ఉండను కదా! ఫుల్ సూట్, మంచి డ్రెస్సెన్స్ ఉన్నవాడిని. నల్ల కళ్ళజోడుతో, హోండా సిటీ నడుపుతూ, హుందాగా ఉంటాను. పక్కా జంటిల్మెన్‌లా ఉంటాను. నేను ఎడిక్ట్ ఏవిటీ? నాన్సెన్స్.....

ఓసారి అమ్మ ఫోన్ చేసింది.

"మీ డాడీ నేను కలిసి ఉంటున్నాం. డాడీకి కాన్సర్, ఒక్కసారి రా.......... హాస్పటల్‌లో ఉన్నారని...."

పిచ్చి మమ్మీ..... నేను అక్కడికి వెళ్ళి ఏం చేస్తాను? వెళితే ఆరోగ్యంగా అయిపోతాడా! నేను వెళ్ళకపోతే చచ్చిపోడు కదా! ఆయనకి తోడుగా స్వర్గానికి వెళతానా! వెళ్ళను కదా! ఒక్కళ్ళమే వస్తాం. ఒక్కళ్ళమే వెళతాం. ఎవరి జీవితాలు వారివే అని అమ్మ ఎప్పుడూ అంటుండేది... అలాంటి అమ్మ ఒక్కసారి డాడీని చూడ్డానికి రమ్మని అంటోంది..... ఏంవిటో పిచ్చి........

వెళ్ళలేదు.....

మరోసారి ఫోన్ చేసింది డాడీకి అస్సలు బాగాలేదని, ఒక్కసారి వచ్చి వెళ్ళమని.

ఆలోచనలో పడ్డాను డాడీ ఎలా ఉంటారు?మర్చిపోయాను. ఓ చిన్న జ్ఞాపకం కూడా నాలో లేదు. కనీసం దగ్గరకు తీసుకున్నది కూడా లేదు.

కానీ, ఎక్కడో నా చేతుల్నిండా డబ్బిచ్చిన మనిషిని చూడ్డానికి చిన్నప్పటి మమత చిన్నగా తట్టింది.

కానీ, నాన్న కన్నా, అమ్మకన్నా నా బిజినెస్, కొకెయిన్ ముఖ్యం అందుకే  వెళ్ళలేదు.

జీవితం పట్ల వ్యాపార విలువలు తప్ప సెంటిమెంట్లు లేవు. ఎందుకంటే గతం నుంచి తప్పించుకునే స్థితిలో లేను.

ఓసారి లాయర్‌గారు నా దగ్గరకి వచ్చారు.

"ఎలా ఉన్నాడు సాత్విక్?"

"కఠినమైన శిక్షణం ఆధ్యాత్మిక స్పృహ, యోగాతో వీళ్ళనిదారిలో పెడుతున్నాం......" అన్నారు డాక్టరు లాయర్ని చూస్తూ. ఆయన తల ఊపి నావైపు తిరిగారు.

"నువ్వు సరే....... మీ పేరెంట్స్ నీ గురించి పట్టించుకోలేదు. చేతినిండా డబ్బుంది. ఫ్రెండ్స్ లేరు. ఒంటరితనం, పనిలేదు, ఇంట్లో గొడవలు, నిద్రపట్టక నిద్రమాత్రల అలవాటు నుంచీ, మెల్ల మెల్లగా అన్నిరకాల డ్రగ్స్‌కి అలవాటు పడ్డావు. చిన్నపిల్లల సంగతి ఏంటి? వాళ్ళకి అలవాటు అయింది. వాళ్ళని కూడా దారి మళ్ళించావు. తొందరగానే గ్రహించారు వాళ్ళ,పేరెంట్స్ కాబట్టి బ్రతికిపోయారు. అయినా, పిల్లలకి ఈ డ్రగ్స్ అలవాటు చేయడం తప్పని అనిపించలేదా!"

భుజాలెగరేసాను.

"ఆ పిల్లలకి అలవాటు నేను చేయలేదు. మా అబ్బాయి.."

బాంబు పడ్డట్టుగా ఉలిక్కిపడి అదోలా చూసారు.

"మీ అబ్బాయా!..."

అవునన్నట్లుగా తలూపాను.

"నా భార్య మీనా నన్ను వదిలేసాక మా అబ్బాయిని నేను చూడలేదు. కోర్టు ఒప్పందం ప్రకారం వాడు తన సెలవలని నాతో గడపవచ్చు. వాడికి పన్నెండేళ్ళు వచ్చాక, మొట్టమొదటిసారి నా ఇంటికి వచ్చాడు. నా భార్య నన్ను వదిలేసినా, నేను హాయిగా ఉన్నానని ఆమెకి తెలియాలంటే మా అబ్బాయి ఒక్కడే దారి. అందుకని వాడి ముందు కావాలని తీసుకునే వాణ్ణి. ఓసారి వాడు అడిగాడు "నేను ఓసారి రుచి చూడనా!" నా భార్య మీనా లేకున్నా, నేను లైఫ్‌ని ఎంజాయ్ చేస్తున్నానని ఆమెకు తెలవాలని, వాడు అడిగితే వద్దనలేదు. సరే అన్నాను. అయితే ఆ పిల్లలు ఈ ఏరియాలోని వాళ్ళే. ఏ పార్క్‌లోనో ఇంటి బయటో పరిచయం అయి ఉంటే ఇంటికి తీసుకు వచ్చి ఉంటాడు వాడే ఆ పిల్లలకి ఇచ్చి ఉంటాడు ఇదొక్కటే పాజిబులిటి... మా బాబు ఉన్నన్ని రోజులు ఆ పిల్లలు రోజూ మా ఇంట్లోనే ఆడుకుంటూండేవారని తెలిసింది....."

ఆయన చాలా సేపు తల అడ్డంగా ఊపారు. "చాలా తప్పు చేసావు.. చాలా... ప్చ్.... పెద్ద తప్పు చేసావు. నీలాగే నీ కొడుకుని కూడా తయారుచేస్తున్నావ్... ఓకే... ఆ తర్వాత ఏం జరిగింది?"

"ఓ వారం రోజులు అయాక, ఊగిపోతున్న పిల్లల్ని తీసుకుని వాళ్ళ తల్లితండ్రులు వచ్చారు. మరో గంట తర్వాత పోలీస్ స్టేషన్‌లో ఉన్నాను. నా ప్రపంచంలోంచి బయటపడేసాయి. ఒక్కోసారి నిశ్శబ్ధం నా జీవితంలోంచి వెళ్ళిపోయింది... అలజడి. మారిపోవడానికి గడువుఇవ్వమన్నాను. అంతే బెయిల్ మంజూర్ అయింది ట్రీట్‌మెంట్ మొదలయింది... ఆ తర్వాత మీకు తెలుసు."

"ఏం డాక్టర్! విత్‌డ్రాల్ సింటమ్స్ కనిపిస్తునాయా!" అని లాయర్ అడిగారు.

"చాలా ఇంప్రూవ్‌మెంట్ ఉంది. ఈ సారి కోర్టుకి వచ్చేప్పుడు మామూలు సాత్విక్‌లాగా రావడానికి అవకాశాలు చాలా ఎక్కువ." అని అన్నారు.

అక్కడున్న ఆర్నెల్లు.... ఓ మామూలు మనిషిని అయ్యాను. ట్రీట్‌మెంట్‌లో ఉండగానే నాన్నగారు, డాడీ అనడం లేదు. నాన్నగారు పోయారు.

ఈసారి నిజంగా వెళ్ళాలని అనుకున్నాను. నాన్నగారిని చూడాలని అనుకున్నాను. చాలా ఏళ్ళతర్వాత ఆ ఇంటికి వెళ్ళాను. దీర్ఘనిద్రలో ఉన్నారు. నా జీవితం ఇలా అయిపోవడానికి కారణం అయిన ఆయన ఈ లోకం విడిచి వెళ్ళిపోయారు. హాయిగా తోటి పిల్లల్తో గడపాల్సిన బాల్యం ఒంటరితనంలో గడిచిపోయింది. ఎన్నో పోగొట్టుకున్నాను. నా మీద నాకు జాలి, బాధ

మొగవాళ్ళు ఏడవరట కానీ ఏడ్చా. నాన్నగారిని అడగాల్సినవి, అడగాలని అనుకున్న ప్రశ్నలు నాలో ఉండిపోయాయి.

నేనెందుకిల్లా అయానా? కారణం నువ్వు కాదా! నీ మూలంగానే నా అందమైన బాల్యం నానుంచి దూరం అయింది. నాకు తెచ్చి ఇయ్యగలవా! ఎందుకు? ఎందుకు? ఎందుకిలా చేసావ్?

నా జీవితాన్ని గూర్చిన ఏ విధమైన ప్రశ్నలు నాలో కలగనన్ని రోజులు నాన్న, నేను మొహాలు చూసుకోలేదు.

ప్రశ్నలు నాలో మొదలవగానే నాన్న ఈ లోకంలోంచి వెళ్ళి పోయారు.

ప్రతీ వస్తువుని, ప్రతి జీవితాన్ని రెండు రకాలుగా వాడుకోవచ్చు. నేను తప్పుగా వాడాను. కారణం నా బాల్యం.

ప్రతీదానికి వెల ఉంటుంది. నా జీవితానికి వెలకట్టాను. కారణం నా చేదు బాల్యం.

పెద్దయినా కూడా బాల్యం నీడలు నా వెన్నంటే ఉన్నాయి. ఇనాళ్ళు ఓ నీడని. హృదయస్పర్శని తెలియని నీడని.

నన్ను నేనే బంధించుకున్నాను. బయటి ప్రపంచంలో నార్మల్ సంబంధాలు పెట్టుకోకుండా, బయటికి రావడానికి వీల్లేకుండా తాళం చెవిని కిటికీలోంచి ఎక్కడో విసిరేసాను.

నా ఆత్మని, నాలోని మానవుణ్ణి, మానవత్వాన్ని అన్నీ పోగొట్టుకున్నాను. కాదు అమ్ముకున్నాను.

నాన్నగారు పోయాక జరిగే కర్మలన్నీ, ఒక్కొక్కటి చేస్తూంటే, ఓ కొడుకుగా చేయాల్సిన విధులన్నీ చేస్తూంటే, జీవితాన్ని అతి దగ్గరగా చూసినట్లనిపించింది. మొదట సారి చూసాను. మానవ ప్రకృతిలో పోరాటం. ఆరాటం. వార్ అండ్ పీస్.

ఓ తండ్రిలాగా కొడుకుని అక్కున చేర్చుకునాను. అమ్మకూడా మొదటిసారి నా తలని ఆప్యాయంగా నిమిరింది. కళ్ళల్లో నీళ్ళు. మానవ వికాస సారాంశం అదే - నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే.

మానవత్వానికి అర్థం వెతకడానికి అందరం ప్రయత్నించడానికి పోతూంటే నీతికిరణాలు మెల్లిగా తాకడం మొదలుపెట్టాను. ప్లాటో నుంచి మొదలు పెట్టి, ఉపనిషత్తులోకి తొంగి చూసి, గీత దగ్గర ఆలోచిస్తే ఏం తెలుస్తోంది? ఏ పుస్తకాల సారమైనా ఒకటే. చివరకు మిగిలేది శూన్యం. మూసిన గుప్పెట శుష్కం. ఖాళీ. నాలోని మనసు పైకొచ్చింది. దీనికోసం, ఈ చివరికి మిగిలేదాని కోసం ఎంత ఆరాటపడ్డాను! ఎంత అజ్ఞానం! నాన్నగారు ఏం తీసుకెళ్ళారు? ఆయనకి మిగిలిందేమిటి? ఏ లేదు. ఓ చెడ్డ పేరు తప్ప అందరం కలిసి ఉంటున్నాం.

బాల్యం ఎలా ఉంటుందో నన్న అనుభవం కోసం ఓ ప్రభుత్వ పాఠశాలలో వాలంటరీగా రెండు గంటలు చదువు చెప్పడం మొదలుపెట్టాను. అంతా అన్నారు. "ఇదివరకు ఓ రకం పిచ్చి, ఇప్పుడు మరో రకమైన పిచ్చి"అని.

అమ్మ పక్కన కూచుని, చిన్నపిల్లాడిలా అడిగాను "ఏమ్మా! నాకు నిజంగా పిచ్చా!" మమ్మీ అమ్మగా మారిపోయింది.

నవ్వింది ఓ అమ్మలా నవ్వింది. కాదన్నట్లు తల అడ్డంగా ఊపింది.

జీవితానికి సరి అయిన అర్థం కోసం తాపత్రయ పడేవాళ్ళంతా పిచ్చి వాళ్ళలాగే కనపడతారు. సత్యాన్ని వెదికే వాళ్ళంతా పిచ్చివాళ్ళలాగా కనపడతారు. ఎందుకంటే సత్యాన్వేషికి సమాధానం ఎప్పుడూ స్క్వేర్ రూటాఫ్ మైనస్ వన్ అంటే.. ఐ... అంటే కాంప్లెక్స్ అన్నమాట" మళ్ళా నేనే అన్నాను.

"ఈ సూక్ష్మం తెలియడానికి ఎన్ని ఏళ్ళు పట్టిందో కదు!" అంది అమ్మ.

## ఎవరైతే ఏంటి? - వాణిశ్రీ

**శిఖ సడన్** బ్రేక్ లేసింది. కీచమని టైర్లు అరిగిన శబ్దం వచ్చింది. ఆమె తల స్టీరింగ్‌కి కొట్టుకుంది. గుండె దడదడలాడింది. మెదడు మొద్దుబారినట్లయింది.

"మైగాడ్!" అని గొణుక్కుంది.

కొన్ని క్షణాలలో కోలుకుని కారు దిగింది. ఎవరో ఆమె కారుకి అడ్డంగా వచ్చింది. రోడ్డుమీద పడిపోయింది. టైర్లు ఆమెకు కొద్దిగా తగిలినట్లున్నాయి. ఆమె స్పృహలో లేదు.

ఇంకా తెల్లవారలేదు.

తూర్పు ఎర్రబడుతోంది.

రోడ్డు మీద కొందరు వాకింగ్ చేస్తున్నారు. యాక్సిడెంట్ చూసి కొందరు పరుగెత్తుకొచ్చారు.

"ఏమైంది?"

"ఎవరో కారుకి అడ్డం వచ్చింది." చెప్పింది శిఖ.

"పోలీసు కేసు ....!" ఎవరో గొణిగారు.

శిఖకి మండుకొచ్చింది.

"పోలీసులేం చేస్తారు? ముందు ఆమెను కారులోకి ఎక్కించండి. ప్లీజ్." శిఖ గట్టిగా అనేసరికి వాళ్ళు కదిలారు.

ఆమెను కారులో వెనుక సీట్లో పడుకోబెట్టారు.

"ఇందులో నా తప్పేం లేదు. ఆమె సడన్‌గా కారుకి అడ్డం వచ్చింది. సూసైడ్‌కి అటెంప్ట్ చేసిందేమోనని నా అనుమానం. ఎనీహౌ. నేను ఆమెను హాస్పటల్‌కి తీసుకెళ్ళి ట్రీట్ మెంట్ ఇప్పిస్తాను." చెప్పింది శిఖ.

ఎవరూ మాట్లాడలేదు.

"ఇది పోలీస్ కేసు అనుకుంటే పోలీసులకు ఇన్ఫాం చెయ్యండి. జరిగింది చెప్పండి. ఇదుగో నా కార్డు."

శిఖ చేతిలో కార్డు అందుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు.

"ఇది పెద్ద ప్రమాదం కాదు. ఆమె భయంతో తెలివి తప్పివుంటుంది. మీరెళ్ళండి మేడమ్." ఒక యువకుడు అన్నాడు.

శిఖ కారుని దగ్గర్లోని హాస్పటల్ ముందు ఆపింది.

****

"ఈ మేడమే నిన్ను హాస్పటల్లో చేర్చింది." నర్స్ చెప్పింది బెడ్ మీద పడుకుని ఉన్న ఆమెతో.

ఆమె లేవబోయింది.

"వద్దు. ప్లీజ్ పడుకో." అని ఆమెను వారించింది శిఖ.

నర్స్ ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళిపోయింది.

"ఐ యాం సారీ!" చెప్పింది శిఖ.

"నేనే సారీ చెప్పాలి. "

"ఎందుకు?"

"మీకు ట్రబుల్ ఇచ్చాను."

"ముందు అసలు విషయం చెప్పు? కావాలని కారుకి అడ్డం వచ్చావు కదూ?" నిలదీసింది శిఖ.

ఆమె నోరు పెగల్లేదు. కళ్ళల్లో నీళ్ళూరాయి. దుఃఖం ఆపుకుంది. పెదవులు వణుకుతున్నాయి.

ఔనన్నట్లు తలఊపింది.

"మైగాడ్! లక్కీలీ నీకేం కాలేదు. ఏదైనా ఐతే? తల్చుకుంటేనే భయంగా ఉంది. రెండేళ్ళ నుంచీ కారు నడుపుతున్నా చిన్న యాక్సిడెంట్ కూడా చెయ్యలేదు. అటువంటిది నువ్వు పొరపాటున నా కారు కిందపడి చచ్చిపోయివుంటే? హెల్. జీవితాంతం నరకం. ఇక జన్మలో కారు డ్రైవ్ చేసి ఉండేదాన్ని కాదు."

ఆమె మౌనంగా శిఖ మాటలు వింటోంది.

"నీ పేరేంటి?" అడిగింది శిఖ.

"పద్మావతి." నెమ్మదిగా అన్నది.

శిఖ ఆమెను పరీక్షగా చూసింది. మెరూన్ కలర్ చుడీదార్‌లో ఎంతో అందంగా ఉంది. పచ్చటి శరీర ఛాయ. ఇరవై ఏళ్ళలోపే ఉంటాయి ఆమెకు. ఇంత చిన్న వయసులో జీవితం మీద ఎందుకు విరక్తి కలిగివుంటుంది?

"ఇఫ్ యూ డోంట్ మైండ్ చెప్పు. ఎందుకు చేశావీ పని?" అనునయంగా అడిగింది శిఖ.

పద్మావతి కళ్ళుమూసుకుంది బాధగా. ఆమెకు అన్నీ గుర్తొస్తున్నాయి.

పద్మావతి ఇంటర్ పూర్తి చేసింది. ఫస్ట్ క్లాస్ వచ్చినా పై చదువులు చదవడానికి తండ్రి ఆర్థికపరిస్థితి సహకరించడంలేదు. స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకుని ఏదైనా జాబ్‌లో చేరాలనుకున్నది. అక్కడే పరిచయమయ్యాడు విద్యాసాగర్.

ఇద్దరూ ప్రేమించుకున్నారు. అన్ని ప్రేమకథల మాదిరే ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు. రిజిష్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. కాపురం పెట్టారు. విద్యాసాగర్ ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అక్కడే రిసెప్షనిస్ట్ జాబ్‌లో చేరింది పద్మావతి. విద్యాసాగర్ అసలు స్వరూపం తర్వాత బైటపడింది. తాగుడు, పేకాట వ్యసనాలున్నాయి. కంపెనీ డబ్బువాడుకున్నాడు. జాబ్ పోయింది. పద్మావతి అదే కంపెనీలో లక్షరూపాయలు అప్పు తీసుకుని, సాగర్ జైలుకు పోకుండా కాపాడగలిగింది.

తర్వాత తన ఒక్కదాని సంపాదన సంసారం బండీ లాగడానికి సరిపోవడంలేదు.

పద్మావతి చెప్పడం ఆగింది.

"ఇవన్నీ మామూలే. అందుకు ఆత్మహత్య చేసుకోవాలా? అతన్ని మార్చడానికి ప్రయత్నించాలి. లేదా భరించింది చాలని వదిలించుకోవాలి. చస్తే ఏమొస్తుంది?" అన్నది శిఖ.

"నేను అందుకు చావాలని అనుకోలేదు."

"మరి?"

"మా బాస్‌కి గవర్నమెంట్‌లో ఒక ఆఫీసర్‌తో పని పడింది. ఆయన తనకు కావాల్సిన ట్రీట్ అడిగాడు. అది డబ్బు కాదు. వారం రోజులు ఫారిన్ ట్రిప్. అందుకయ్యే ఖర్చు భరించడం మా బాస్‌కి సమస్యకాదు. ఆ ఆఫీసర్ కన్ను నా మీద పడింది. నన్ను అతనికి తోడుగా పంపమన్నాడు. మా బాస్ నన్ను పిలిచి ఇది డ్యూటీ అనుకో అన్నాడు. నువ్వు కంపెనీకి చెల్లించాల్సిన డబ్బు మాఫీ చేయిస్తాను. నువ్విప్పుడు అద్దె ఇంట్లో ఉన్నావు. నీకు ఒక ఫ్లాట్ కొనిస్తాను. అప్పుడప్పుడు ఇటువంటి అవసరాలు ఉంటుంటాయి. అవి అటెండ్ కావాలి. బాస్ నిర్మొహమాటంగా చెప్పాడు. నేను మర్నాడు ఆఫీసుకి వెళ్ళలేదు. సాగర్ కారణం అడిగాడు. నేను ఏడుస్తూ జరిగింది చెప్పాను. ఇందులో ఏడవటానికేముంది. మంచి ప్రపోజలే కదా అన్నాడు."

పద్మావతి వెక్కి వెక్కి ఏడ్చింది.

"జీవితంలో సెటిల్ కాకుండా ప్రేమలో పడటం, తల్లితండ్రులను కాదని వెళ్ళిపోవడం ఘోరమయిన తప్పని గ్రహించాను. ప్రేమ ఒక భ్రమ అని అర్థమైంది. ఇంకెందుకు ఈ జీవితం అనిపించింది. విరక్తి కలిగింది. నేను బాస్ చెప్పినట్లు వినకపోతే అక్కడ నాకు జాబ్ ఉండదు. ఏం చేయను? చావడం తప్పా?" అన్నది ఏడుపు ఆపుకుని.

"నీకు ఇంకెక్కడైనా జాబ్ దొరకదా?" అడిగింది శిఖ.

"దొరుకుతుంది. కానీ అక్కడా ఇటువంటి పరిస్థితే ఎదురైతే? పోనీ నా భర్త సపోర్టు ఉంటే జీవితంతో పోరాడగలను. నా బాధ అతను అర్థం చేసుకోవడం లేదు. కేవలం డబ్బేనా మనిషికి కావాల్సింది? డబ్బు కోసం లొంగిపోవాల్సిందేనా? ఇష్టం లేని పనులు, నీచాతి నీచమైన పనులు చేయాలా? ఎందుకు? ఎవరికోసం చేయాలి? నేను శరీరం అమ్ముకుని వాడికి అన్నీ అమర్చిపెట్టాలా? నాకు జీవితాంతం తోడుగా ఉంటాడని నమ్మినవాడు కూడా నన్ను అర్థం చేసుకోకపోతే ఏం చేయాలి? నేనిలా మోసపోతానని ఊహించలేదు."

పద్మావతి కన్నీటికి ఆనకట్టలేదు.

"పద్మా! నిన్ను కట్టుకున్నవాడు అర్థం చేసుకోనంత మాత్రాన ఈ లోకంలో ఇంకెవరూ అర్థం చేసుకోరా? అతను మోసం చేసినంత మాత్రాన చావాలనుకోవడం అవివేకం. ఈ లోకం చాలా విశాలమైనది. అదే సమయంలో సంకుచితమైనది. ఎవరి స్వార్థం వారిది. మనలో ధైర్యం ఉంటే మన ఇష్టం వచ్చినట్లు జీవించగలం. నువ్వు ధైర్యంగా నిలబడితే ఎవరో ఒకరు అండగా, తోడుగా నిలబడతారు." చెప్పింది శిఖ.

"ఎవరు?"

"నేనే?"

పద్మావతి శిఖను ఆశ్చర్యంగా చూసింది.

"నువ్వింకా చిన్నదానివి. అఫ్‌కోర్స్ నేనూ చిన్నదాన్నే. నేనింకా యూనివర్సిటీలో చదువుకుంటున్నాను. నాకు జీవితంలో అనుభవం లేకపోవచ్చు. కానీ ఆడవాళ్ళ సమస్యల మీద అవసరాల మీద అవగాహన ఉంది. నేను మా యూనివర్శిటీలో లీడర్ని. నువ్వు గుండె ధైర్యం తెచ్చుకో. మీ బాస్, నీ భర్త నీ మీద అధికారం చలాయించలేరు." చెప్పింది శిఖ.

పద్మావతి శిఖలో ఒక నాయకురాలిని చూసింది.

తనలో ఉన్న నిరాశ, నిస్పృహలు తొలిగిపోతున్నట్లనిపిస్తోంది. మంచు తెరలు విడిపోతున్నట్లు వెలుగులోకి ప్రయాణం చేస్తున్నట్లు అనుభూతి కలుగుతోంది.

నిజమే! అక్కడ జాబ్ పోతే మరొక చోట దొరుకుతుంది. సాగర్ వంటి నీచుడు భర్తగా లేకపోతేనేం? తను ఎందుకు చావాలి?

*****

పద్మావతి కోలుకొంది. డిశ్చార్జి చేశారు హాస్పటల్ నుంచి.

శిఖ ఆమెను కారులో ఎక్కించుకుని బయలుదేరింది. పద్మావతి తన ఇంటికి దారి అడుగుతుందని అనుకుంది. కాని శిఖ ఏం మాట్లాడలేదు.

కారు సరాసరి పద్మావతి పనిచేస్తున్న కార్పోరేట్ కంపెనీ పోర్టికోలో ఆగింది.

పద్మావతి అయోమయంగా శిఖవైపు చూస్తోంది.

"ప్లీజ్! నన్ను మా ఇంట్లో వదలండి. నేనిక్కడ పనిచెయ్యదల్చుకోలేదు." బాధగా అన్నది పద్మావతి.

శిఖ నవ్వింది.

"ఏదైనా సమస్య వచ్చినప్పుడు బహిరంగ పరచక పోవడం తమలో తాము కుమిలిపోతూ, చెప్పుకుంటే సిగ్గుచేటని భావిస్తూ చావుకు పాల్పడడం ఆడవాళ్ళు అనాదిగా చేస్తున్నదే ఎన్నాళ్ళిలా? నువ్వు చదువుకున్నదానివేకదా? నీకు అన్యాయం జరుగుతున్నప్పుడు తిరగబడాలి. అందరికీ తెలిసేట్లు చేయాలి. ఇప్పుడు రోజులు మారాయి. నువ్వు ఫోన్ చేస్తే పత్రికా విలేఖరులొస్తారు. టీ.వీ. జర్నలిస్టు లొస్తారు. నీకు జరగబోయే అన్యాయాన్ని లోకానికి తెలియజేస్తారు."

శిఖ చెపుతోంది.

పద్మావతి మౌనంగా వింటోంది.

"ఎదిరించకుండా ఉంటే ఎప్పటికీ అన్యాయాలు చేస్తూనే ఉంటారు. చచ్చినట్లు వింటారు అనే ధోరణి పెరిగిపోతుంది. తిరగబడతారు అని తెలుసుకున్నప్పుడు అన్యాయాలు చెయ్యడానికి జంకుతారు. ఏమంటావు?"

పద్మావతి మాట్లాడకుండా కారు దిగింది.

"నువ్వు ఇక్కడే జాబ్ చెయ్యాలి. చేస్తావు. మీ బాస్ తో నేను మాట్లాడుతాను." అన్నది శిఖ.

శిఖని అనుసరించింది పద్మావతి. ఆమె సరాసరి బాస్ ఛాంబర్‌లోకి ప్రవేశించింది. ఎవరూ ఆమెను అడ్డుకోలేదు. చూస్తూ ఉండిపోయారు.

బాస్ శిఖను, పద్మావతిని చూస్తూనే భ్రుకుటి ముడి వేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"పద్మకు వంట్లో బాగాలేదు. అందుకే డ్యూటీకి రాలేదు." చెప్పింది శిఖ.

బాస్ మాట్లాడలేదు. అసహనంగా సీట్లో కదిలాడు. శిఖ బాస్ ఎదురుగా కూర్చుని ఉంది. పద్మావతి నిలబడేలా ఉంది.

"పద్మా! ప్లీజ్ కూర్చో!" అన్నది శిఖ.

పద్మావతి బాస్ ఎదురుగా ఎప్పుడూ కూర్చోలేదు. తనేకాదు అక్కడ పెద్ద ఉద్యోగులు సైతం బాస్ ముందు కూర్చోరు. నిలబడే మాట్లాడతారు. బాస్ సీటు ఎదురుగా ఉన్న సీట్లన్నీ వి.ఐ.పీల కోసమే.

శిఖ ఆమె చెయి పట్టుకుని లాగి తన పక్క సీట్లో కూర్చోబెట్టుకుంది.

బాస్ సింహం అయితే. శిఖ పెద్ద పులిలా ఉంది.

"పద్మని ఫారిన్ ట్రిప్ డ్యూటీ ఏదో వేశారట కదా! ఆమె రావడం లేదు. ఆ ఆఫీసర్ వెంట నేను వెళతాను." కూల్‌గా అన్నది శిఖ.

బాస్ నెత్తిన బాంబ్ పడినట్లు అదిరిపడ్డాడు. మనిషి షేక్ అవుతున్నాడు. ముఖం ఎర్రగా మారిపోతోంది. పెదవులు కోపంతో వణుకుతున్నాయి. ఏ.సీ. రూమ్‌లో కూడా అతనికి చెమట్లు పట్టాయి.

బాస్ అవస్థ చూసి శిఖ పెదవులపై చిరునవ్వు మెరిసింది.

పద్మావతి షాక్ తిన్న మనిషిలా అయిపోయింది. శిఖ అటువంటి ప్రపోజల్ బాస్ ముందు తెస్తుందని అనుకోలేదు. ఏ మాత్రం ఊహించలేని విషయం. శిఖ బాస్‌తో ఏదో పోట్లాడుతుందనీ, ఆడపిల్లకు ఇంత అన్యాయం చేస్తారా అని నిలదీస్తుందనీ ఏదేదో అనుకుంది.

కాని శిఖ?

పద్మావతికి శిఖ ఏమాత్రం అర్థంకావడంలేదు.

"గెటౌట్?" బాస్ పెద్దగా కేకలు పెట్టాడు.

"ఎవరైతే ఏంటి? వాడివెంట వెళ్ళడానికి నేను పనికిరానా? పద్మ మాత్రమేనా? నేను పద్మంత అందంగా లేనా? వయసులో లేనా? ఐయామ్ ఓన్లీ ట్వంటీ ప్లస్. నాట్ పార్టీ ప్లస్." అన్నది శిఖ.

బాస్ కోపంతో లేస్తూ బజ్జర్ మోగించాడు.

యూనీఫాంలో ఉన్న సెక్యూరిటీ వాళ్ళొచ్చారు.

"ముందు వీళ్ళని బైటకు పంపండి. "కోపంగా అరిచాడు.

సెక్యూరిటీవాళ్ళు బొమ్మల్లా నిలబడిపోయారు. ఒక అడుగు ముందుకు వెయ్యలేదు.

"ఆఫీసర్ వెంట పద్మని పంపితే కంపెనీకి బోల్డంత లాస్. ఆమె తీసుకున్న లోన్ మాఫీ చెయ్యాలి. ఫ్లాట్ ఏదో కొనిస్తానన్నారట. పదిలక్షలైనా లేనిదే పాత ఫ్లాట్ కూడా రాదు. ఎందుకు అంతలాస్? నేను వెళితే ఆ డబ్బంతా మనకి మిగులుతుంది కదా డాడీ! "

'డాడీ!'

పద్మ అదిరిపడింది.

'బాస్, శిఖ డాడీ!'

"డాడీ! పద్మ కూడా నీ కూతురు లాంటిది కాదా? అవసరాల కోసం ఎందుకు అమాయకురాళ్ళను ఊబిలోకి దించుతారు? ఎంత డబ్బు సంపాదిస్తే మీ ధన దాహం తీరుతుంది!"

శిఖ మాటలు తూటాలై బాస్ గుండెల్ని తాకుతుంటే హార్ట్ ఎటాక్ వచ్చిన వాడి మాదిరి కుర్చీలో కూలబడిపోయాడు. అవమానంతోనో, బాధతోనో తలవంగిపోయింది.

"డాడీ! పద్మ ఇక్కడే జాబ్ చేస్తుంది. ఇంక్రిమెంట్ శాంక్షన్ చెయ్యండి. ఆమె భర్తకు మళ్ళీ జాబ్ ఇవ్వండి. అతనికి తప్పుదిద్దుకునే అవకాశం ఇవ్వండి."

శిఖ చరచరా లేచి వెళ్ళింది. పద్మావతి ఆమెను అనుసరించింది.

"పద్మా! ధైర్యంగా ఉండు. ఈ కంపెనీకి నేనూ బాస్‌నే. నేను కూడా ఒక డైరెక్టర్ని. మా మమ్మీ కూడా డైరెక్టర్. నేనీ విషయం మమ్మీకి చెప్పలేదు. చెపితే మమ్మీ నాకంటే స్పీడ్ డాడీకి విడాకులిస్తుంది."

శిఖ నవ్వింది.

"నీ సీట్లో కూర్చో. బై..."

శిఖ పద్మావతి కంటికి దేవతలా కనిపిస్తోంది. ఇంత చిన్నవయసులో లోకం గురించి ఎంత అవగాహన అని ఆశ్చర్యపోయింది.

శిఖ కారులో కూర్చుని చేయి ఊపుతోంది. పద్మావతి కంట్లోనుంచి కన్నీరు కారుతోంది. అది బాధతో కాదు. ఆనందంతో.

శిఖ లాంటి ఆడది లక్షకి ఒక్కరున్నా ఈ దేశంలో ఆడదాని జీవితం బాగుపడుతుందేమో?' అనుకుంది పద్మావతి.

# ఎంగిలి హృదయం

- కృష్ణ వేమూరి

విశ్వామిత్రకి నలభై అయిదేళ్ళు. ఊహ తెలిసినప్పటినుంచీ రకరకాల అనుభవాలతో తలపండిన విశ్వామిత్రకి ఇదొక కొత్త అనుభవం. ఆ అనుభవం తెచ్చిన సమస్య. ఇలాంటి సమస్యలో అతను తన ఇరవై ఏళ్ళ వయస్సులో ఉన్నప్పుడు పడ్డాడు. పడి లేచి సమస్యను అధిగమించాడు. సమస్యను అధిగమించాడు అనటంకన్నా ..... సమస్యలో పడి కొట్టుకుపోతుంటే సమస్యే అతన్ని ఓ ఒడ్డున పడేసింది ఆ వివరాల్లోకి వెళితే...

దగ్గరగా దగ్గరగా ముప్పై ఏళ్ళ క్రితం... విశ్వా ఏనుగెక్కినంత సంబరపడ్డాడు. దానికి కారణం అతనికి ఇంజినీరింగ్‌లో సీటు వచ్చింది. అదీ అప్పట్లో టాప్ బ్రాంచి! ఎలక్ట్రానిక్స్! విశ్వా అతని ఫ్యామిలిలో మొట్టమొదటి ఇంజినీరు. అందరూ సంతోషించారు.

చాలా మంది మధ్యతరగతి వాళ్ళలా అతనికి బోలెడన్ని ఆశలు. మంచి ర్యాంక్, మంచి ఉద్యోగం, మంచి జీతం, అందమైన భార్య.

ఇవన్నీ ఒకెత్తు. లవ్ చేసి పెళ్ళిచేసుకోవాలనుకోవటం ఒకెత్తు. కాని ప్రేమించాలి... ప్రేమించటమంటే పిడికొట్టేసి ఇంజినీరింగ్ సీటు తెచ్చుకున్నంత సులభం కాదని తెలిసింది, తన బ్రాంచిలో ఉన్నది నలుగురు. మిగిలిన బ్రాంచ్‌లలో అన్నిటిలోను కలిపి పదిహేనుకు తక్కువ మంది అమ్మాయిలు! అబ్బాయిలు నూటా యాభై. కాంపిటేషన్! తను స్వతహగా సిగ్గరి కావటం వల్ల అమ్మాయిల్ని ధైర్యంగా నోట్సు అడిగే స్టేజికి రావటానికి ఒక సంవత్సరం పట్టింది. అప్పటికే తన specs ఉన్న అమ్మాయిలకి పెళ్ళిళ్ళు కుదిరిపోయాయన్న విషయం తెలిసి హతాసుడైపోయాడు!

"క్లాస్‌మేట్స్‌ని ప్రేమించడం... మరదల్ని ప్రేమించటం ఈజీ" అనుకుని తనెప్పుడూ చూడని... తనంటే తెలియని అమ్మాయి తనతో లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌లో పడాలని, అలాంటి అమ్మాయిని ప్రేమించాలని కోరిక... ఇది అతని కోరిక.

ఉన్నది ఒక సైకిల్. అదీ హంబర్ బండి కూడా కాదు. పాత అట్లాస్ డొక్కు సైకిల్ ఉండేది డేస్కాలర్... పైగా వెరీ కన్సర్వేటివ్ ఫ్యామిలి జేబులో రోజుకి రూపాయి తప్ప ఉండేది కాదు కానీ కోర్కెలో!

అప్పట్లో శ్రీదేవి, జయప్రద అందానికి రిప్రజెంటేటివ్స్. వాళ్ళలాంటి అమ్మాయి.... తనతో.... నిష్కల్మషంగా.. మొదటిసారి చూసీ చూడగానే ప్రేమలో పడాలి!

ఆ రోజుల్లో తన క్లాస్‌మేట్, మరదలూ కాని ఒక అందమైన అమ్మాయి.. తనంటే ఎవరో తెలియని అబ్బాయితో లవ్‌లో పడేంత స్వేచ్ఛ అమ్మాయిలకి లేదు. అంత కన్సర్వేటివ్. అందుకే విశ్వామిత్ర కార్యం మరీ కష్టమైంది.

అందుకని తన స్పెసిఫికేషన్స్ సడలించాడు. ఉమెన్స్ కాలేజీ, పి.ఆర్ కాలేజీ, ఐడియల్ కాలేజి వాటిల్లో అమ్మాయిలు అందంగా ఉంటారని తన డొక్కు సైకిల్ మీద బీటెయ్యటానికి పోయాడు... తనొక్కడే తనలాంటివాడు అక్కడున్నాడు... కాని

అక్కడ తన సీనియర్స్...జూనియర్స్ ఏకలవ్యులు ( uni lovers: The lovers love one girl after the other only when the love with first girl fails)

పేరలవ్యులు (parallovers: The Lovers parallelly toy more than one girl, so that atleast one girl falls in love with him) దేవదాసులు... మజ్నూలు.... హీరో సైకిల్ గాళ్ళు... హంబర్ సైకిల్ గాళ్ళు. ఒకటి అరా బజాజ్ స్కూటర్ గాళ్ళు... ఎంతైనా ఆరోజుల్లో లవ్ చెయ్యటం కా స్ట్లీ కాదు... ఇప్పుడో మధ్యతరగతి కుర్రాడు ప్రేమలో పడాలంటే చాలా ఖర్చు.... ఎక్కడో శిరీష్ భరద్వాజ్ లాంటి వాళ్ళు తప్ప. వాళ్ళకి కూడా 'A' క్లాసు అమ్మాయిలు పడరు..... ఏదో 'C' క్లాసుతో సరిపుచ్చుకోవాలి!

ఈ కాంపిటేషన్స్ వల్ల తన స్టాండెర్డ్స్ తగ్గించుకుని ఒక బి.ఏ లిటరేచర్ అమ్మాయిని ప్రేమలోకి దింపగలిగాడు.

అదెలా జరిగిందంటే!

చాలా రోజులుగా తను వెనకపడుతున్న ఒక అమ్మాయి దగ్గరకెళ్ళి ఇలా మాట్లాడాడు.

"ఏమండీ నాపేరు."

"తెలుసు విశ్వామిత్ర. ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం. మా ఫ్రెండ్ చెప్పింది"

విశ్వామిత్ర ఛాతీ పదంగుళాలు పెరిగింది. ఆ అమ్మాయికి తనగురించి తెలుసు! తెలుసుకుంది!! (తనతో మొదటి చూపులో ప్రేమలో పడి ఉంటుంది!)

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను... మీరు ఊఁ అంటే పెళ్ళి చేసుకుంటాను." అని చెప్పాడు విశ్వామిత్ర.

అమ్మేశాడు విశ్వామిత్ర

తన ప్రేమని అమ్మి ఆ అమ్మాయి ప్రేమని కొన్నాడు. పెళ్ళిని ఎరగా వేసి! The Trade of Love!

"ఇంకా నేను ఇంజినీరింగ్ చదువుతున్నాను. ఇంకా రెండేళ్ళలో అయిపోతుంది! తర్వాత పదిహేనువందల రూపాయల ఉద్యోగం. కట్నం వద్దు. "

"ఆ అమ్మాయి ఎక్కడ వద్దంటుందేమో" అని చాలా చెప్పుకుంటూ పోతున్నాడు.

ఆఫర్ బాగుంది.

ఆ అమ్మాయి ఆలోచించి చెపుతానంది.

ఆ అమ్మాయి ఆలోచించింది! వాళ్ళది బీద కుటుంబం. అతను నిజంగా పెళ్ళిచేసుకుంటే కుటుంబానికి బోలెడు భారం దించినట్టు "సరే మన జాగ్రత్తలో మనముండి.... ఈ ప్రేమని పెళ్ళివరకు జరపాలి" అనుకుంది.

నాలుగైదు రోజుల తర్వాత - ఆ అమ్మాయి విశ్వామిత్రకి చెప్పింది "I Love you" అని అమ్మో అమ్మాయి!! Love of Convenience!

వాళ్ళిద్దరూ ప్రేమించుకుంటు రెండేళ్ళు గడిపారు (ప్రేమించుకోవటం అంటే ఏమిటి?) ఇంతలో విశ్వా ఇంజినీరింగ్, అమ్మాయి డిగ్రీ అయింది. తమ ప్రేమ పెళ్ళి తల్లితండ్రులకు చెప్పమని ఆ అమ్మాయి విశ్వాను పోరసాగింది. విశ్వా ఎందుకో ఆ విషయం దాటేస్తూ వచ్చాడు.

ఇంతలో ఉద్యోగమొచ్చింది. ఎక్కడో దూరాన.

తల్లితండ్రుల పోరు... ప్రియురాలి సాధన విశ్వా బుర్ర పగిలి పోయేది... ఏం చేయాలో తెలీక.

"అబ్బో ప్రేమించటం అంత సులువా? అదే అమ్మాయిని పెళ్ళి చేసుకోవటం ఇంతకష్టమా? ప్రేమిస్తున్నప్పుడు, తను కూడా ప్రేమిస్తున్నట్టు, తనకో ప్రియురాలు ఉన్నట్టు సంతోషపడి, తన ఫ్రెండ్స్‌కి, కజిన్స్‌కి చెప్పుకున్నాడు.

ఎందుకు తల్లితండ్రులకి చెప్పలేకపోతున్నాడు?

బోళ్ళు శోభన్‌బాబు సినిమాలు చూసాడు విశ్వా. "పోనీ! శోభన్ బాబులా ప్రేమించిన అమ్మాయిని వదిలేసి........... తల్లితండ్రులు చెప్పిన అమ్మాయిని చేసుకుని, ప్రియురాలికి ఒకసారి పడేస్తేనో. ఛీ ఛీ ఏమిటిలా ఆలోచిస్తున్నాను" అని పలుమార్లు అనుకున్నాడు.

బుర్ర పగిలిపోయే ఆలోచనలతో సతమతమవుతున్నాడు.

"అమ్మా, నాన్నకి చెప్పాలి"

"ఒప్పుకుంటారా"

"ఏమో! ఎందుకు తల్లిదండ్రులకి చెప్పలేకపోతున్నాను. నేను సర్వస్వతంత్రుడనైతే బాగుండును. నా ఇష్టం వచ్చినట్టు చేసేవాడిని. ప్రేమించిన అమ్మాయి గురించి ఇట్లో చెప్పాలంటే భయం... ఏమన్నా నా సామ్రాజ్యం వస్తే బాగుండును" అనుకున్నాడు. తల్లిదండ్రులకి చెప్పాలా! వద్దా! అనే డెసిషన్ తీసుకోవటానికి కొన్ని నెలలుగాఆలోచించాడు. డెసిషన్ పోస్ట్‌పోన్ చేయటం ఎప్పుడు సొల్యూషన్‌లా అనిపించేది. డెసిషన్ తీసుకోవటానికి Fraction of a second చాలు! ఆ split second లోనే ఎన్నెన్నో విరుద్ధభావనలు...

ఎలాగైతేనేం ఒక రోజు డెసిషన్ తీసుకుని తల్లిదండ్రులకి చెప్పాడు.

చాలా గొడవలు..

పెళ్ళి ........ ప్రేమించిన ప్రియురాలితో మళ్ళీ గొడవలు

"ఎందుకు ప్రేమించానురా! భగవంతుడా" అనుకోని రోజు లేదు కొన్నేళ్ళవరకు.

అదీ అతని గతం... ఇరవై మూడేళ్ళ తర్వాత విశ్వామిత్ర విశ్వామిత్రయ్య అయ్యాడు. అతని భార్య అమ్మగారు లేక మేడం అయింది. వాళ్ళిద్దరూ నలుగురు పిల్లల తల్లిదండ్రులయ్యారు. పిల్లలందరూ టీనేజర్స్. విశ్వామిత్రయ్య అమెరికాలో పనిచేసి, హైదరాబాదులో ఒక కంపెనీలో సి.టి.వో గా స్థిరపడ్డాడు.

అసలు కథకి ప్రారంభం కూడా ఇదే గత ఏడాదిగా విశ్వామిత్రయ్య మళ్ళీ విశ్వామిత్ర అయ్యాడు. తెల్లబడిన జుట్టుకి రంగేయటం.. పెరిగిన బొజ్జని తగ్గించుకోవటానికి జాగింగ్ చెయ్యటం....

దీనికంతటికి కారణం విశ్వామిత్ర మళ్ళీ ప్రేమలో పడ్డాడు. అదీ తన ఆఫీసులో పనిచేసే ముప్ఫై ఏళ్ళ సాఫ్ట్‌వేర్ ఇంజినీరుతో ఆ అమ్మాయి కూడా ఇతన్ని గాఢంగా ప్రేమిస్తుంది. వాళ్ళిద్దరికీ తెలుసు! ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారని!

విశ్వామిత్ర ప్రేమలో పడేముందు, తర్వాత తనలో తను తర్కించుకున్నాడు. ఆ తర్కం తనని తను సమర్థించుకుంటూ ఇలా సాగింది.

"అప్పటి ప్రేమ! అది ప్రేమ కాదు, అదో ట్రేడ్ ఆఫ్ లవ్ ఫర్ మారేజ్, నాకు ప్రియురాలు కావాలి.. ప్రేమించుకోవటం ఒక సరదాగా అనుకుని ప్రేమించాను. బహుశః ఆ అమ్మాయి కూడా నేను పెళ్ళిచేసుకుంటాననే ఉద్దేశ్యంతోనే ప్రేమించి ఉంటుంది.

ఇప్పటి ప్రేమ.

మలినం లేనిది.

మారేజ్ కోసం గానీ! సెక్స్ కోసం గాని ట్రేడ్ చెయ్యబడటం లేదు.

నిష్కల్మషమైన, Selfless Love!!

నేనామెను ప్రేమిస్తున్నాను. ప్రేమిస్తూనే ఉంటాను"

విశ్వాకి తను ఒక పవిత్రమైన ప్రేమలో పడ్డానని నమ్మకం. తను సాధించిన ఈ పవిత్ర ప్రేమను నలుగురితో చెప్పుకుని ఆనందించాలని ఓ కోరిక! ఒక రకంగా ముప్పై ఏళ్ళ క్రితం తను పడిన తీయని బాధని అనుభవిస్తున్నాడు. స్నేహితులకి చెప్పుకున్నాడు, తల్లిదండ్రులకు చెప్పుకోలేక బాధపడ్డాడు. కాని ధైర్యం చేసి చెప్పాడు. అప్పుడు తను స్వతంత్రుడనయితే బాగుండుననిపించేది.

ఇప్పుడు తను సర్వస్వతంత్రుడు.

ఇంటా బయటా డెసిషన్స్ తీసుకునేంత సమర్ధుడు. భార్య .... కొడుకులూ... కూతుళ్ళు తనేం చెప్పినా వింటారు. ఫ్రెండ్సులో తనంటే గౌరవం.

తనెంతో మాధుర్యాన్ని అనుభవిస్తున్న ఈ ప్రేమను, పవిత్రమయిన ప్రేమను

భార్యకు చెప్పుకోలేడు....

పిల్లలకు చెప్పుకోలేడు....

ఫ్రెండ్స్‌కి చెప్పుకోలేడు...

తను నిజమైన ప్రేమలో పడ్డాడన్న విషయాన్ని గుప్తంగా తనమనసులోనే దాచుకోవాలి!

మళ్ళీ అతనిలో తన ప్రేమ మీద జడ్జిమెంట్... నిజమైనదా? కాదా!

*( ఈ కథకి ముగింపేమిటి... చాలా రోజుల్కితం* ***Alberto Moravio*** *అనే ఇటాలియన్ రచయిత, ఆంగ్లానువాదం* ***Ghost at afternoon*** *అనే నవల చదివాను. దానిలో చెప్పిన ఒక విషయం నాకు చాలా బాగా నచ్చింది. అదేమిటంటే "నీవు ప్రేమించే వారిని, నీ ప్రేమని ఎప్పుడూ జడ్జి చెయ్యాలని చూడకు. నీవు జడ్జి చెయ్యటం మొదలుపెడితే, నువ్వు చాలా కోల్పోతావు" ఇదే విషయాన్ని ఇంకోలా ప్రజెంట్ చేసాను.)*

## వెన్నెలో ఓషధి - 'వాసంతి'

"మా మమ్మీ ఉందాండి?" సురేష్ లోపలికి తొంగి చూస్తూ అడిగాడు.

నిన్న కలిసినప్పుడు తెలుగు భాషా భవిష్యత్ ప్రమాదంలో పడుతోందన్న గురువుగారి హెచ్చరికల గురించి ఆలోచిస్తున్న శంకరరావు చెవిన పడింది సురేష్ ప్రశ్న. అసహనంగా అటు చూశాడు.

సురేష్ గొంతు విని చేతిలోని పని వదిలి నిర్మల బయటకువచ్చింది.

"ఈవేళ స్కూలు నుంచి ఇక్కడకు రమ్మంది, మా మమ్మీ ఉందాండి"

నిర్మల జవాబిచ్చేలోగా కొడుకు గొంతు విని ఆరేసిన బట్టలు తీసుకు వస్తున్న లక్ష్మి పిలిచింది. "సురేషూ, ఇక్కడున్నారా"

"మమ్మీ" అని అరుస్తూ ఆనందంతో తల్లి దగ్గిరకు పరుగెత్తాడు సురేష్.

"ఈ వేళ మార్కులు చెప్పారు. మా క్లాసు అన్ని సెక్షన్స్‌లోనూ నేనే ఫస్ట్"

లక్ష్మి మురిసిపోతూ బట్టలు లోపల పెట్టి కొడుకి టిఫెన్ పెట్టుకుని వచ్చింది. సురేష్ కేరేజి పుస్తకాల సంచీ పక్కగా పెట్టి కాళ్ళు, చేతులూ కడుక్కుని వచ్చాడు.

"ఎవరదీ" శంకరరావు గదిలోంచి కేకేసాడు.

"అచ్చెమ్మ మనవడు సురేష్. ఈవేళ పనెక్కువ ఉందని లక్ష్మి ఇంటికి వెళ్ళలేదు కదూ. తల్లి రమ్మంటే వచ్చాడు" నిర్మల లోపలికి వెళుతూ జవాబిచ్చింది.

"వీడికి కూడా మమ్మి కావలసి వచ్చిందే!" వెటకారంగా అన్నాడు శంకర్రావు

"వీడికి కూడా అంటారేమిటి? కాన్వెంట్ స్టూడెంట్, వాడి క్లాసులో వాడే ఫస్ట్. తోటిపిల్లల్ని చూసి వాళ్ళమ్మని మమ్మీ అని పిలవాలని సరదాగా ఉన్నట్లుంది."

కాన్వెంట్ మాట వినగానే చిరాకు పడుతూ ఏదో అనబోయి ఫోన్ మోగటంతో అటు వెళ్ళాడు శంకర్రావు. ఫోనెత్తబోతుంటే అది కట్ అయి చిరాకు ఇంకాస్త పెరిగింది. ఇంతలో గేటు తీసుకుని మరో కుర్రాడు వచ్చాడు. వాడిని చూసి నిర్మల మంచినీళ్ళు, రెండు అరటిపళ్ళు తీసుకెళ్ళి ఇచ్చింది. వాడు అరటిపండు తింటూ ఉంటే సురేష్ వాడితో చేరి కబుర్లు చెపుతున్నాడు.

చిరాకులో ఉన్న శంకర్రావుకి వాళ్ళ దోస్తీ నచ్చలేదు.

"ఇతగాడు ఎవరూ? ఆయన సావాసగాడా?"

"రాంబాబు, మన కిష్టప్పగారబ్బాయి. ఇద్దరూ ఒక క్లాసే. కలిసి చదువుకుంటారు." పిల్లవాడి చేతిలో ఖాళీగ్లాసు తీసుకోబోయింది నిర్మల. శంకర్రావు అసహనం పెరిగిపోయింది. దురుసుగా కేకేసాడు, "అక్కడ పెట్టిపో పంతులూ."

వాడు భయం భయగా చూస్తూ గ్లాసు కిందకి పెట్టి ప్రక్కకు తపుకున్నాడు.

"వాడి మమ్మీ అంట్లు తోముతుంది. వీడి డాడి పీనుగుల్ని మోస్తాడు. ఈ దొరలందరికి నువ్వు అంటేవి కాబోలు.. ప్రతివాడూ మమ్మీ, డాడీ అంటూ తయారు. అమ్మ, బాబు తప్పుడు మాటలయిపోయాయి. ప్రతి బికారాగాడికి కాన్వెంటు తప్ప తెలుగు బడి సొక్కటం లేదు"

ఆ ప్రవాహం ఆపటం సాధ్యం కాదని తెలిసిన నిర్మల మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

అయ్యగారి విసుర్లు ఇంత తీవ్రంగా ఎప్పుడూ చూడని లక్ష్మికి జవాబివ్వాలనిపించినా అత్తగారు అలాంటి ప్రమాదం జరగకుండా ఆమెని ఇంటికి లాక్కుపోయింది.

❧ ❧ ❧

తల్లి పిలుపు విని క్రిందకి దిగివచ్చాడు మోహన్.

"నాన్నెక్కడమ్మా!" టిఫెన్ ప్లేటు లాక్కుంటూ అడిగాడు.

"పెద్దాయన రమ్మాన్నారట, సిటీకెళ్ళారు"

"ఎప్పుడొస్తారమ్మా? సాయంత్రం దాకా రాడా?"

"ఏమో, ఆయనిష్టం, పెద్దాయన దయ. రెండేళ్ళకు వచ్చిన కొడుకునుచూడటం కంటే పెద్దాయన వెనకాల మీటింగులకు తిరగడం ముఖ్యమైంది మీ నాన్నకి" నిర్మల అసంతృప్తిగా అంది.

"మీటింగులు దేనికి?"

"మీ నాన్నకు కొత్త పిచ్చి పట్టిందిలే, గురువుగారి పుణ్యమా అని. ఇద్దరూ కలిసి తెలుగు నశించిపోకుండా కాపాడుతారట"

"తెలుగుని నశించిపోకుండా కాపాడుతారా?" నోరు తెరిచాడు మోహన్, "తెలుగుని వీళ్ళు కాపాడటమేమిటి? ఏం చేస్తారేమిటి?"

"దేశంలో ఇంగ్లీష్ పిచ్చి ముదిరి అంతా తల్లి భాషను మరచిపోవటంతో తల్లిభాష నశించి పోతుందట"

"తల్లి భాషా? ఈ కొత్త పేరేమిటి?"

"మాతృభాష సంస్కృతం కదా, మన భాష కాదు కదా. పనిలో పనిగా సంస్కృతం మాటల్ని కూడా తీసేసి, స్వచ్ఛమైన తెలుగును కాపాడతారట"

మోహన్ నవ్వు ఆపుకోలేకపోయాడు " ఈ కాపాడటం ఏమిటి? తెలుగుని సంస్కృతం, ఇంగ్లీష్ గుప్పెట్లోంచి కాపాడితే సరిపోతుందా? మరి ఉర్దూ, మరాఠీ, తమిళం, కన్నడం వగైరా భాషల మాటలు? పరాయి మాటలన్నింటిని తీసేస్తే ఎన్ని మాటలు మిగులుతాయి?"

"అడిగేటంత ఆలోచన ఎవరికి? గురువుగారికి హఠాత్తుగా తెలుగువారి గుర్తింపు, అదే అస్థిత్వం దెబ్బతింటుందని, తెలుగుకి తగిన గౌరవం అందటం లేదని గుర్తుకొచ్చింది, నాన్నలాంటి శిష్యుల్ని కూడగట్టుకుని తెలుగుని కాపాడుకోటానికి బయలుదేరారు. నాన్నకు కూడా మీరు, పిల్లలు వచ్చి వెళ్ళేక ఇంక మీరు రారేమో అన్న బెంగెక్కువయిందిలే. దాంతో గురువుగారి ప్రభావంలోకి మరీ వెళ్ళిపోతున్నారు. పిల్లలు ఇంగ్లీషు వ్యామోహంలో తెలుగును మరచిపోయి లోకువ చేస్తున్నారని, తల్లిని చంపి మమ్మిని చేస్తున్నారని అది ఆపాలని ఉద్యమం చేస్తారట"

"చంపటం ఏమిటో ఓహో... మమ్మి అంటే అదొక్కటే అర్ధమేమిటి?"

"ఆ అర్థం ఉంది కాబట్టి తల్లిని అలా పిలిస్తే, చచ్చిన దానా అన్నట్లవుతుందట."

"ఓహో... ఆయన పేరుహరికదా, అంటే కోతి అని అర్థం అనో, హరి సంస్కృతం మాట కాబట్టి తన పేరు మార్చుకుంటున్నారా!"

నిర్మల నవ్వింది "శిష్యులు, అనుచరులు నాయకులని ప్రశ్నించకూడదు అనుసరించాలంతే"

"పెద్దాయన మనవలు అమెరికాలో తెలుగుబడిలో చదువుతున్నారా, లేకపోతే వాళ్ళనిక్కడకు రప్పించి తెలుగు బడిలో చేరుస్తారా"

"మనవలు వాళ్ళమ్మా, నాన్నల ఇష్టప్రకారంగా పెరుగుతారట"

"ఓహో, ఊరివాళ్ళ అమ్మ నాన్నా ఆయనేనా? లేకపోతే ఆదర్శాలు శిష్యులకు, ఆస్తిపాస్తులు పిల్లలకు కాబోలు"

నిర్మల నవ్వుతూ "సరేలే, ఆ గోల వదిలేసి మీ విశేషాలు చెప్పు" అంది

తల్లితో కబుర్లు చెపుతూ, టిఫిన్ తినటం పూర్తి చేసి మెట్లవైపు నడుస్తూ వెనక్కి తిరిగాడు మోహన్. "అమ్మా, పిల్లల కోసం పుస్తకాలు, బట్టలూ తెచ్చాను. లక్ష్మిని పంపించు తీసిస్తాను. రాంబాబుని కూడా పిలవమను"

"లక్ష్మికి కబురు పంపుతాలే, ఇద్దరినీ పంపమని"

"అదేమిటి అప్పుడే వెళ్ళిపోయిందా?"

"వాళ్ళిప్పుడు మనింట్లో పని చెయ్యటం లేదు"

"ఏమయిందమ్మా"

"లక్ష్మి కొడుకు కాన్వెంటులో చదవటమూ, వాళ్ళమ్మని మమ్మీ అనిపిలవటం ఇంతవరకు నాన్న దృష్టిలో పడలేదు. మొన్న కాన్వెంటు యూనిఫారాన్ని, వాడి మమ్మీ అన్న పిలుపుని చూసి ఆయనకు చాలా కోపం వచ్చింది. అలాంటప్పుడు ఏంజరుగుతుందో నీకు

తెలుసు కదా. మర్నాడు వాళ్ళ వాళ్ళని పిలిచి కాన్వెంటు చదువూ, మమ్మీ అన్న పిలుపు మానిపించమన్నారు. వాళ్ళు ఒప్పుకోలేదు. మాట మీద మాట పెరిగి పన్లోకి రావద్దన్నారు. "

"నారాయణ?"

"సంవత్సరం మధ్య కదా. ఇప్పుడు పీకెయ్యలేరు కనక ప్రస్తుతానికి ఫర్వాలేదు. తోటలోనే ఉన్నారు వాళ్ళు"

"సరేనమ్మా, సెల్ పట్టుకెళ్ళాడు కదా, నాన్నతో మాట్లాడుతాలే. ఈసారి వచ్చేసరికి కారు, సెల్‌ఫోను మానేస్తాడేమిటో" హైదరాబాద్‌లో దిగి ఎడ్లబండి మీద వచ్చే శంకర్రావుని ఊహించుకుని ఇద్దరూ మనసారా నవ్వుకున్నారు. మనసు తేలికయింది.

మోహన్ వెళ్ళి బ్యాగ్ తీసుకుని, తల్లిని పిలిచాడు.

"అమ్మా, తోటలోకి వెళ్ళి వద్దామా"

"నేను వద్దులే నాన్నా, నువ్వెళ్ళిరా, మళ్ళీ నాన్నకు తెలిస్తే గొడవ"

"నాన్నతో మాట్లాడేనమ్మా, సాయంత్రందాకా రానన్నాడు, వచ్చి వంట చేయవచ్చు పద". తోట నుండి ఇద్దరూ వచ్చేసరికి, శంకర్రావు కారు దిగుతున్నాడు. సాయంత్రం దాకా రానని చెప్పినా, కొడుకు వచ్చే వేళకు ఇంట్లో ఉండకుండా, రోజంతా గురువుగారి వెంట తిరగటం తనకే నచ్చలేదు. అవకాశం దొరకగానే ఇంటికి వచ్చేసాడు. భర్తను చూసి నిర్మల మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

వాళ్ళు ఎక్కడినుండి వస్తున్నారో తెలిసినా తాను చేసిన పనిలో తప్పు గుచ్చుకోవడంతో నెమ్మదిగానే అడిగాడు శంకర్రావు "ఎక్కడకి వెళ్ళారు?"

"అచ్చమ్మా వాళ్ళని చూడ్డానికి వెళ్ళాం నాన్నా" తండ్రి వెనకే లోపలికి నడిచాడు మోహన్.

శంకర్రావుకు అణుచుకున్న కోపం మళ్ళీ రేగింది. "నాన్నకోపం లెక్క చేయనక్కరలేదు. రేపటి నుండి పనిలోకి రమ్మనమని చెప్పడానికా, వాడికా కాన్వెంటు చదువుకు డబ్బివ్వడానికా?"

"నిన్ను లెక్క చెయ్యకపోవడం ఏమిటి నాన్న? నన్ను అచ్చమ్మ పెంచింది. నారాయణ నా చిన్ననాటి నేస్తం. ఎప్పుడూ రాగానే వాళ్ళింటికి వెళ్ళడం నువ్వెరగవా? చూసి వద్దామని వెళ్ళాం" తండ్రి పక్కనే సోఫాలో కూర్చున్నాడు మోహన్.

శంకర్రావుకేం చెప్పాలో తోచలేదు. వాళ్ళతో సన్నిహితంగా ఉండమని చిన్నప్పటినుంచీ కొడుకుని తనే ప్రోత్సహించాడు. కొడుకుతోపాటు నారాయణని, శవాలు మోసే రామశాస్త్రి కొడుకునీ చదివించాలని తనే ప్రయత్నం చేసాడు.

మోహన్ తండ్రి చెయ్యి పట్టుకున్నాడు "నాన్నా, నువ్వే నాకు ఈ సంస్కారం నేర్పావు. నారాయణతోటి, కృష్ణప్పలతో తిరిగినందుకు నన్ను తాత కొడితే నువ్వు తిరగబడినప్పటినుండీ నువే నా హీరోవి. వాళ్ళిద్దరితో నా స్నేహాన్ని మనస్ఫూర్తిగా ప్రోత్సహించావు. నాతో పాటు వాళ్ళని చదివించడానికి సిద్ధపడ్డావు"

"దానివల్ల ఏం జరిగింది? ఎక్కడివాడు అక్కడే ఉంటాడని ఋజువు చేసి చూపించారుగా"

మోహన్ తండ్రి ముఖంలోకి చూసి ఏదో అనబోయి ఊరుకున్నాడు.

మంచి ర్యాంకు తెచ్చుకుని కాలేజీలో చేరిన కృష్ణశాస్త్రి ర్యాగింగులో శవాలు మోసేవాడి కొడుకుగా భరించిన హింస, అది తట్టుకోలేక చదువు మానేసి, ఇల్లువదిలి పారిపోయి ఎందుకూ కొరగాకుండా తయారయి వెనక్కి వచ్చి పీనుగులు మోసే కిష్టప్పగా స్థిరపడ్డాడని తను పడ్డ బాధ గుర్తుకు వచ్చింది శంకర్రావుకు. పనిమనిషి కొడుకు నారాయణ హైస్కూలు చదువు పూర్తిచేయకుండానే తండ్రి జబ్బు పడితే చదువుమానుకుని ఉన్నవన్నీ అమ్ముకుని చివరకు పాలేరుగా మిగిలాడు.

"నేనేం చేసినా అది నీ పెంపకం వల్లే నాన్నా. మనోడు మన్ని తక్కువగా చూస్తే కసిపెంచుకుని వాడిని తిట్టడంతో తృప్తిపడి జీవితం వృధా చేసుకోవటం కాదు. వాడిని మించమన్నావు. పనివాళ్ళతో సహా అందరి తీరు మార్చి చదువుకున్నవాళ్ళతో సమంగా

మాట్లాడటం, ప్రవర్తించడం చిన్నప్పుడే నేర్పావు. పనివాళ్ళని కూడా ప్రోత్సహించి మాతోపాటు చదువుకుని పైకి రమ్మన్నావు. అందరూ ఇంగ్లీషు నేర్చుకోవాలన్నావు. అవన్నీ మరచిపోయావా? నీకు కాన్వెంటు చదువంటే అంతకోపం ఎందుకునాన్న?"

"అదివేరు"

"అది ఇది ఒకటే నాన్నా. ఇప్పటికీ ఇంగ్లీష్ రావటం వల్ల వచ్చే ఉద్యోగాలు ఎక్కువ కాదూ? ఇంగ్లీష్ బాగా రాక తెలివైన పిల్లలు మంచి ఉద్యోగవకాశాలు పోగొట్టుకున్న సందర్భాలెన్నో ఉన్నాయని చాలాసార్లు చెప్పి బాధపడుతుంటావు కదా....

"ఇంగ్లీష్ చదువు బ్రతుకు తెరువుకి పైకి ఎదగటానికి ఎక్కువ అవకాశం ఇస్తుందని తెలిసి ఎవరినైనా అది ఎలా చదవద్దనగలం?"

"అంటే తెలుగు పనికి రాని భాష అని పారెయ్యాలా?"

"చదువుకు వృత్తికి ఇంగ్లీష్ అవసరం ఉన్నంత మాత్రాన మన భాషని ఇంక వదిలేస్తామా?"

తన మాటల్లోని అసంబద్ధత చటుక్కున తట్టింది శంకర్రావుకి. ఇంగ్లీష్ చదువూ, దశాబ్దం పాటు విదేశీవాసం మోహన్‌లోని తెలుగుతనాన్నేం మార్చలేదు. అతని పిల్లలిద్దరు అక్కడే పుట్టినా తెలుగు వ్రాత, చదువు, పాటలు, పద్యాలు చక్కగా నేర్చుకున్నారు.

తండ్రి మనసు అర్థం చేసుకుని జాగ్రత్తగా మళ్ళీ మొదలు పెట్టాడు మోహన్.

"మన భాషకు ఆదరణ పెరగాలంటే పిల్లలు ఇంగ్లీష్ చదువు మానేయ్యాలనడం కాదు నాన్నా. ఈ సమస్యకి అది పరిష్కారం కాదు. ఇంగ్లీష్ చదివిన వాళ్ళకే మంచి ఉద్యోగాలు వస్తున్నప్పుడు అదే చదవాలని ఆశపడటం తప్పుకాదు. ఎన్ని మీటింగులు పెట్టి ఇంగ్లీష్‌ని ఎంత తిట్టినా, కడుపు నింపే చదువు ఎవరూ మానరు. వాళ్ళని పైకి రానివ్వటం లేదని మిమ్మల్ని ద్వేషిస్తారంతా. మనం చదివిన చదువు మరొకరిని చదవద్దంటే మరి అంతే.

పనిముగించుకుని నిర్మల కూడా వచ్చి కూర్చుంది. శంకర్రావు అయిష్టంగా, ఇబ్బందిగా చూచాడు భార్యవైపు.

"మీకు తెలుగు భాషమీద ఉన్న అభిమానాన్ని మరోరకంగా చూపించవచ్చుకదా నాన్నా. మనింట్లో మా చిన్నప్పటి పుస్తకాలన్నీ ఉన్నాయికదా, వాటితో ఒక లైబ్రరి పెట్టి పిల్లల్ని సాయంత్రాలువచ్చి చదువుకోమని ప్రోత్సహించండి. కథలు, వ్యాసాలు వ్రాయటంలో పోటీ పెట్టి ఎక్కువమందికి చిన్న చిన్న బహుమతులు, వాళ్ళకి పనికి వచ్చే వస్తువులు ఇవ్వండి. వాళ్ళలో క్రియేటివిటి, ఆలోచనా, ఆత్మవిశ్వాసం పెంచి ఉద్యోగ అవకాశాలు వేరు, జీవితాలు వేరు అని తెలుసుకునేందుకు సహాయపడండి. మీరిద్దరూ మన ఊరికి ఆ మాత్రం చేయగలరు.... ఎన్ని మీటింగులు పెట్టి ఇంగ్లీషుని ఎంత తిట్టినా కడుపు నింపలేని చదువును ఎవరూ కోరరు. ఖర్చు తట్టుకోలేక తెలుగు చదివిన వాళ్ళు న్యూనతాభావాన్ని పెంచుకుని తెలుగును ద్వేషించవచ్చు. "

"తెలుగులో చదివినవాళ్ళు మరి రోడ్లు పట్టుకుని తిరగటం లేదుకదా. ఆఫీసుల్లో తెలుగు మాట్లాడటం పెరిగింది. టీవీ ఛానల్స్ పెరిగాక ఎన్ని కొత్త ఉద్యోగాలు వస్తున్నాయి. కొద్ది మంది ఏంకర్స్ తప్ప అంతా చక్కటి తెలుగు మాట్లాడుతున్నారు."

నిర్మల అవకాశాన్ని అందిపుచ్చుకుంది, "పెదనాన్నా వాళ్ళు వచ్చినప్పుడు సిటీ చూచి, సరదాగా లోకల్ ట్రైనులో ఎక్కితిరిగాం. పొద్దున్న హైటెక్ సిటికి వెడుతున్న ఉద్యోగులు ఎందరో తెలుగులో మాట్లాడుతున్నారు. చాలా ముచ్చటేసింది"

మోహన్ ఆశ్చర్యంగా తండ్రికేసి చూసాడు. కాదనలేని శంకర్రావు ఇబ్బంది పడుతూ అవునని తలూపాడు. నిర్మల భర్తతో చూపులు కలపకుండా జాగ్రత్త పడింది.

శంకర్రావు తొందరగానే తిప్పుకున్నాడు, "సరేపోనీ అమ్మ, నాన్నా పిలుపుకూడా పనికిరాదా? మమ్మీ, డాడీ అని పిలుస్తేనే ఇంగ్లీష్ చదువూ, ఉద్యోగాలూ వస్తాయా"

"ఆ పిలుపు వాళ్ళ తల్లితండ్రులకు ఆనందం కలిగిస్తుంటే మనకి బాధెందుకు? నీరుకావి బట్టలూ, చెప్పులు లేని కాళ్ళు పేదరికానికి వెనుకబాటు తనానికి గుర్తుగాను, ఇంగ్లీషు చదువు ఉద్యోగాలు తెచ్చేదిగాను, కాన్వెంటు యూనిఫారములు, మమ్మి, డాడీ

పిలుపు ప్రగతికి గుర్తుగాను వాళ్ళకు కనబడితే తప్పుబట్టే బదులు, వాళ్ళ ఆలోచనను అర్థం చేసుకోవాలి. పనివాళ్ళు కూలీలు మమ్మి, డాడీ అని పిలిపించుకుంటే తెలుగుకీ తల్లితండ్రుల ప్రేమకు ప్రమాదం రాదు, డబ్బుగల ఇళ్ళలో పిల్లలు అలా పిలిస్తే రానట్లే"

శంకర్రావు కళ్ళు అది నిజమని ఒప్పుకున్నా ముఖం ఇంకా అప్రసన్నంగానే ఉంది.

"నిన్ను నొప్పించటం నాకు చాలా కష్టంగా ఉంది నాన్న. నేను ఇంటికి వస్తుంటే సురేష్ అడిగిన ప్రశ్న నన్ను కలవరపెట్టింది"

ఏమిటన్నట్లు చూసాడు శంకర్రావు.

"మా అమ్మకూడా చిన్నమ్మలా అమెరికాలో ఉద్యోగం చేస్తే నేనూ మమ్మీ అనిపిలవచ్చుకదూ.. అని అడిగాడు. ఇది ఏ ఆలోచనకు దారి తీస్తుంది? నీ మాటల్లో తెలుగుపట్ల ఆదుర్దా కన్నా అలా పిలిపించుకునే అర్హత వాళ్ళ వర్గానికి లేదన్న అర్థం వాళ్ళకు కనపడింది."

శంకర్రావు మొహంలో చిరునవ్వు కదలాడింది. చిన్నప్పుడు పిల్లలకు తను చెప్పిన మాటలకు ప్రతిధ్వని వింటున్నట్లు అనిపించింది అతనికి. తాను పిల్లలకు చెప్పిన 'ఓషధులు చల్లని వెన్నెల్లో పెరుగుతాయ'ట, వ్యక్తిత్వ వికాసానికి వెన్నెలలాంటి ఆదరణ, ప్రోత్సాహం తప్ప ఉద్రేకాలు, విద్వేషాలు కావన్న మాటలు గుర్తుకు వచ్చి ఎవరి గమ్యం వాళ్ళను ఎన్నుకోనిచ్చి దారి చూపించే మార్గదర్శకులు కావాలిప్పుడు అని నిర్ణయించుకున్నాడు.

పూర్తిపేరు శ్రీమతి కె.జ్యోతిర్మయి. ప్రస్తుత నివాసం కాకినాడ. 2001లో హైదరాబాదులోని గవర్నమెంట్ వుమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారు. 2004 నుంచీ రచనలు చేయడం ప్రారంభించిన వీరి కలంనుంచీ వెలువడిన కథలు రాసిలో తక్కువే ఐనా ప్రతి కథా గుర్తింపుకి నోచుకోవడం గమనార్హం.



# హంస గీతం - డాక్టర్. ఎమ్. సుగుణరావు

**పరమంహంస** చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయాడు వాడెప్పుడూ ఇంతే! హఠాత్తుగా మాయమయిపోతాడు. చిన్నప్పుడు స్కూల్లోను, ఆ తర్వాత కాలేజీలో క్లాసు మధ్యలో వెళ్ళిపోయేవాడు. సినిమా కొచ్చి మధ్యలో వెళ్ళిపోయేవాడు. ఇలా వెళ్ళిపోవటం వెనుక ఒక బలమైన కారణం ఉండేది. దాన్ని ఎవరితోనూ చెప్పుకునే వాడు కాదు.

- అయితే ఈ సారి వెళ్ళిపోయిన పరమహంస తిరిగి కనిపించడనే చేదునిజం భరించలేకపోతున్నాను. ఆ విషాదంలోంచి బయటపడడానికి ఈ ఆడిటోరియంలో ఎవరో గురూజీ ప్రశాంతత గురించి ఉపన్యాసం ఇస్తున్నారని తెలిసి వచ్చాను.

"ప్రాణాధికంగా ప్రేమించే తోబుట్టువులో, కన్నవారో, సన్నిహితులో చనిపోతే కన్నీరు కార్చడం, సహజం. అయితే ఆ దుఃఖం అంతటితో ఆగిపోవాలి. ఆ మానసిక వేదనతో కుమిలిపోతూ అమూల్యమైన జీవితాన్ని పోగొట్టుకున్నవారు మనకు కనిపిస్తారు"

- గురూజీ చెపుతున్న మాటలు నాకు ఆశ్చర్యం కలిగించాయి! అది అక్షరాల పరమహంస జీవితానికి వర్తిస్తాయి.

నేనూ, పరమహంస చిన్నప్పటినుంచే కాదు, ఇంజినీరింగ్ కాలేజీలోనూ సహాధ్యాయులం, చదువులో నాకన్నా చురుగ్గా ఉండేవాడు. ఇద్దరం ఒకేసారి ఇంజినీరింగ్ పూర్తి చేసినా నాకన్నా ముందే ఉద్యోగం సంపాదించాడు. చిన్నప్పటి నుంచీ తన సంతోషాన్ని మాతో

పంచుకుని, తన దుఃఖాన్ని మాత్రం తనే భరించేవాడు పరమహంస. అలాగే నా కష్టనష్టాలను చేదోడుగా ఉంటూ నిజమైన స్నేహానికి చిరునామాగా మిగిలేవాడు.

అలా మా మధ్య ఉన్న స్నేహం, మా చిన్నాన్నగారి అమ్మాయిని పరమహంస పెళ్ళి చేసుకోవడంతో అది బంధుత్వంగా మారింది. మేము మరీ దగ్గరయిపోయాం. పరమహంస సంసార జీవితం సంతోషంగా సాగింది. భార్యను, ఇద్దరు పిల్లల్ని చక్కగా చూసుకునేవాడు. అతడిని చేసుకున్న మా చెల్లెలు అదృష్టవంతురాలు అనేవారు మా బంధువర్గం. పిల్లలిద్దరినీ బాగా చదివించాడు. ఇద్దరూ ఇంజినీరింగ్‌లో జాయినయ్యారు.

పరమహంస గురించిన ఆలోచనలతో ఉన్న నేను గురూజీ ఉపన్యసించడం మాని, ఏదో భజన గీతం రాగయుక్తంగా పాడడం గమనించలేదు. మళ్ళీ పరమంహంస గుర్తుకొచ్చాడు. అతనూ చక్కగా పాడేవాడు. స్టేజీమీద, కచేరీల్లోనూ పరమహంస పాడేవాడు కాదు. నిశ్శబ్ద వాతావరణంలో, ఆరుబైట వెన్నెల్లో సన్నిహితులం కూర్చున్నప్పుడు, "నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది, కన్నుల్లో నీరు తుడిచి కమ్మని కల ఇచ్చింది" అంటూ అతడు పాడే ఆ పాట హృదయాన్ని తాకేది.

సంతోషంగా ఏ ఒడిదుడుకులు లేకుండా సాగుతోన్న పరమహంస జీవితం రెండేళ్ళక్రితం జరిగిన దుర్ఘటనతో తలక్రిందులయిపోయింది. ఏదో పెళ్ళికి వెళ్ళి కారులో వస్తున్న పరమహంస తల్లితండ్రులు, అతడి ఆఖరిచెల్లెలు ఏక్సిడెంట్లో చనిపోయారు. అంతే! తల్లితండ్రుల్ని, తోబుట్టువునూ విపరీతంగా ప్రేమిస్తూ వారికి ఏ కష్టం వచ్చినా తట్టుకోలేని పరమహంస జీవితంలో ఇదో పెద్ద షాక్. మామూలు మనిషి కాలేకపోయాడు. తాగుడికి బానిసయ్యాడు. అంతకుముందు సంవత్సరానికోసారి పార్టీల్లో తగుమాత్రం పుచ్చుకునే పరమహంస అది లేకుండా పూటగడవని స్థితికొచ్చాడు. కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసాడు. జీతం అంతా తాగుడికే సరిపోయేది. దానికి తోడు విపరీతంగా సిగరెట్లు కాల్చడం.

మేమంతా సాయం చేయకపోతే అతడి కుటుంబం నడిరోడ్డు మీద పడేది. తాగుబోతుగా మారిన పరమహంసను అతడి భార్య, పిల్లలు అసహ్యించుకునేవారు. తాగేసి ఎక్కడో పడిపోయేవాడు. స్పృహ ఉండేదికాదు. ఒంటి మీద బట్టలు లేని స్థితిలో ఎవరో చూసి చెపితే ఇంట్లోవాళ్ళు తీసుకొచ్చేవారు. పరమహంస ఆరోగ్యస్థితి క్షీణించింది. ఒకరోజు ఆఫీసులో పనిచేస్తున్న పరమహంసకు హఠాత్తుగా గుండెల్లో నొప్పి. ఆస్పత్రిలో జాయిన్ చేసారు.

డాక్టర్లు హార్ట్ ఎటాక్ అని తేల్చారు. మరోసారి వస్తే బతకడనీ, ఆపరేషన్ చెయ్యాలనీ అన్నారు, అయినా కష్టమే, రక్తనాడులన్నీ ఆల్కహాలు, నికోటిన్‌తో నిండిపోయి, ఆపరేషన్ సజావుగా సాగుతుందా, పరమహంస సజీవంగా బయటికి వస్తాడా అన్న సంశయం..! ఆపరేషన్ థియేటర్‌లోకి పరమహంసను పంపించి అతడి కుటుంబ సభ్యులతో బైట ఉన్న నాకు క్షణ క్షణం టెన్షన్. సాయంత్రం ఆరుగంటలకు ఆపరేషను పూర్తయ్యింది. 'అంతా బావుంది' అని డాక్టరుగారు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నాం. ఆవిధంగా బ్రతికి బట్టకట్టాడు ప్రమంహంస ఒక ఉపద్రవం నుంచి.

అయితే ఆపరేషన్ అయిన రెండు నెలల తర్వాత మరో దుర్ఘటన.

ఆ రోజు ఆదివారం. మా ఇంటికి స్కూటర్‌లో వచ్చాడు పరమహంస. ఇద్దరం చాలాసేపు మాట్లాడుకున్నాం. మా ఇంటికి దగ్గరలోని పార్క్‌లోకి వెళ్ళాం. పల్చగా అప్పుడే చీకటి తెరలు విస్తరించుకుంటున్నాయి. వాతావరణం చల్లగా ఉంది. పార్కులోని మొక్కలనుంచి వస్తున్న గుబాళింపుతో మేం కూర్చున్న ప్రదేశం అంతా గుబాళిస్తోంది. నేను ఒక పాటపాడమన్నాను. అతను చిన్నతనంలో తరచుగా పాడే ఆ పాటను గుర్తుచేసాను.

అది నాకు చాలా ఇష్టమైన పాట "నేను ఇప్పుడు పాడలేనురా" అన్నాడు. నేను బలవంతం పెట్టలేదు. ఆ తర్వాత వాడు స్కూటరెక్కి ఇంటికి బయలుదేరాడు. పరమహంస ఇంటికి వెళ్ళాలంటే హైవే రోడ్డు దాటాలి. అతను మా ఇంటినుంచి బయలుదేరిన

పావుగంటకి వచ్చింది ఆ దుర్వార్త. హైవేలో స్కూటర్ మీద వెళుతున్న పరమహంసను లారీ గుద్దేసింది. ఆస్పత్రికి తీసుకెళ్ళే సమయంలోనే చనిపోయాడంట! నాకు ఆ వార్త చాలా షాక్ కలిగించింది. ఒక గండం నుంచి బయటపడిన పరమంహంస మరో గండంలోనుంచి బైటపడలేకపోయాడు. అలా అతడి ఆకస్మిక మరణం నన్ను కృంగదీసింది. అయితే అతడు చనిపోయాడనే బాధతోపాటు అతడి భార్యా పిల్లల వ్యవహారం నాకు ఆశ్చర్యాన్ని, మరింత బాధను కలుగ చేస్తోంది.

పరమహంస చనిపోయిన రోజు అతడి భార్య కళ్ళనుంచి నీళ్ళు రాలేదు. తాగబోతుగా అతడు పెట్టిన బాధలకు ఏడ్చి, ఏడ్చి ఆమె కన్నీళ్ళన్నీ ఇంకిపోయి ఉంటాయని సరిపెట్టుకుందామనుకున్నా అగ్ని సాక్షిగా పెళ్ళాడిన భర్త చనిపోయినందుకు ఒక్క కన్నీటి బొట్టు రాల్చకపోవడం ఏమిటి?

ఒకసారి పరమహంస ఇంటికివెళితే బావుంటుంది. నా దుఃఖానికి ఉపశమనం! అలా అనుకుంటూ ఆ ఓపెన్ ఎయిర్ థియేటర్ దాటి బయటికొచ్చి స్కూటర్ స్టార్ట్ చేసాను. పావుగంటలో పరమహంస ఇంటికి చేరుకున్నాను. పరమ హంస ఇంటి బయట పార్క్ చేసిన కొత్త కారు. దాన్ని రంగురంగుల బుడగలతో, పువ్వులతో అలంకరించారు.

లోపల ఇంట్లో అంతా సందడిగా ఉంది. ఎదురుగా డ్రాయింగ్ రూంలో గోడకు తగిలించిన పరమహంస నిలువెత్తు ఫోటో. నా దుఃఖాన్ని ఆ ఫోటో మరింత ఎక్కువచేసింది. నన్ను చూడగానే పరమహంస భార్య. "కూర్చో అన్నయ్యా. కారు కొన్నాము, అబ్బాయిలు వారి స్నేహితులకు పార్టీ ఇస్తున్నారు" అంది. నేన్ను ఆలోచనల్లో పడ్డాను. అసలే అప్పుల్లో ఉన్నవాళ్ళు ఇంకా తీరక మునుపే కారుకొనటమేమిటి? డబ్బు ఎక్కడ నుంచి తెస్తారు?

నా మనసులోని భావాలు పరమహంస భార్య చదివింది కాబోలు వెంటనే అంది -

"ఆయన కారుకి రెండు నెలల్రకితమే అడ్వాన్స్ కట్టారు, అంటే ఆపరేషన్ అయి ఇంటికొచ్చిన తర్వాత. 'ఇన్ని అప్పులుండగా కారెందుకండీ అన్నాను. అప్పులన్నీ తీరిపోతాయి, పిల్లలు సరదాపడుతున్నారు, నాతోటి ఇంజినీర్లంతా కార్లు కొనేసారు అన్నారు."

"మరి అప్పులన్నీ తీరిపోయాయా? " అన్నాను "తీరిపోయాయంకుల్ నాన్న ప్రమాదవశాత్తూ చనిపోయారు కదా, ఆయన చేసే ఉద్యోగం, వయసు, ఆధారపడిన వారసుల బట్టి పాతిక లక్షలు పైగా వస్తుందట!"

పరమహంస కొడుకు వాళ్ళ అమ్మగారు చెపుతున్న మాటలకు అడ్డొస్తూ అన్నాడు.

పరమహంస కొడుకు చెప్పిన మాటలతో నాలో అలజడి. "అప్పులు తీరే మార్గం ఇదా?'. పరమహంస ప్రమాదవశాత్తూ చనిపోవటంతో రాబోయే నష్టపరిహారంతో అప్పులు తీరతాయా? అసలు ప్రమాదవశాత్తూ చనిపోక పోతే! నాలో ఏవో అనుమానాలు..

నేను ఒక్కసారి పరమహంస భార్యవంక పరిశీలనగా చూసాను. పరమహంస బతికున్న రోజుల్లో ఉన్నట్టే ఉంది. ఖరీదైన చీర. ముఖాన బొట్టు. అంతవరకూ నాతో మాట్లాడిన పరమహంస పెద్దకొడుకు, రెండోకొడుకు లోపల గదిలో వారి స్నేహితులతో కలిసి ఏదో వీడియో సినిమా చూస్తున్నారు. హుషారుగా చప్పట్లు కొడుతూ ఆనందిస్తున్నారు. మనసులో ఏదో పెనుగులాట. ఎందుకో ఆ ఇంట్లోని వ్యక్తుల ప్రవర్తన, సందడితో నేను సమాధానపడలేకపోతున్నాను. నా మనసులోది కక్కెయ్యక పోతే మన శ్శాంతి లేదు. "భారతీ.. మీ అబ్బాయిల్ని పిలువు మీతో మాట్లాడాలి" అంటూ వారి బెడ్ రూములోకి కదిలాను. అతిధులముందు నా మనసులోని విషయం చెప్పడం ఇష్టంలేక.

వారంతా నన్ను అనుసరించారు. నేను తలుపు గడియపెట్టాను. వారికి ఆశ్చర్యంగా ఉంది నేను నోరు విప్పాను.

"చనిపోయిన మనిషి గురించి కొన్ని రోజులైనా తలుచుకోకపోతే ఆ మనిషి ఆత్మకు శాంతి ఉంటుందా?" అన్నాను.

వారంతా నా మాటలకు మౌనం వహించారు. క్షణం తర్వాత పరమహంస పెద్దబ్బాయి నోరు విప్పాడు. "అంకుల్ నాన్నకు హార్ట్ఎటాక్ వచ్చిన తర్వాత ఆపరేషన్కు వెళ్ళేముందు ఒక ఉత్తరం రాసి కవరులో పెట్టి మాకు ఇచ్చారు. నేను ఆపరేషన్ టేబుల్ మీద

చనిపోతే ఈ ఉత్తరం చదవండి. నేను బ్రతికి బట్టకడితే ఈ ఉత్తరం అవసరంలేదు అన్నారు. ఆయనకు ఆపరేషన్ అయి ఆరోగ్యంగా తిరిగొచ్చారు. ఆ ఉత్తరం సంగతి మరచిపోయాం. మళ్ళీ మమ్మల్ని దురదృష్టం వెంటాడింది. నాన్న ఏక్సిడెంట్‌లో చనిపోయారు, ఆయన రాసిన ఉత్తరం గుర్తుకొచ్చింది, వెంటనే తీసి చదివాం. ఇదుగో ఆ ఉత్తరం" అంటూ పరమహంస పెద్దకొడుకు, ఒక పుస్తకం తెర్చి ఒక ఉత్తరం దాంట్లోంచి తీసి నాకు అందించాడు, ఆ ఉత్తరంలోని అక్షరాల వెంట నా కళ్ళు పరుగు తీసాయి.

"ప్రియమైన భారతికి, సురేష్, రమేష్‌లకు పరమహంస ఇచ్చే ఆఖరి సందేశం. నేను ఆపరేషను బల్ల మీద చనిపోతే మీరు నాకోసం కన్నీరు కార్చకూడదు. నా మరణం మీలో దుఃఖం కలిగించకూడదు. మా నాన్న, అమ్మ చెల్లెలు ప్రమాదంలో చనిపోయినపుడు నేను ఆందోళనతో, నిరాశతో ఏ స్థితిలోకి మారి మిమ్మల్నందరినీ బాధపెట్టానో మీకు తెలుసు. ఎవ్వరూ ఈ ప్రపంచంలో శాశ్వతంగా ఉండిపోరు. మీరు ఆనందంగా, హాయిగా ఉంటేనే నా ఆత్మకు శాంతి..."

ఆ ఉత్తరం చదవటం పూర్తికాగానే నా మనసు మూగగా రోదించింది. అయినా ఆ శబ్దం బైటకు వినిపిస్తోంది. పరమహంస భార్యా, పిల్లలు ఏడుస్తున్నారు. దుఃఖించవద్దు అంటూ పరమహంస చెప్పిన మాటలు వారు తూచ తప్పకుండా పాటించారు. వేదనను ఇన్నాళ్ళూ గుండెల్లో దాచుకున్నారు, నా మాటలతో ఆ దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది. నేను వారి దుఃఖాన్ని ఆపదలచుకోలేదు, తనివితీరా ఏడ్వాలి! ఇంతవరకూ ఆవేదనను అణిచిపెట్టుకున్న వారిని చూసి నాకు జాలేసింది. పరమహంస రాసిన ఉత్తరం ఉంచిన పుస్తకం కేసి యాధాలాపంగా చూసాను. పుస్తకం అట్టమీద పేరు చూసి ఉలిక్కిపడ్డాను - 'రోడ్డు ప్రమాదాలు - నష్టపరిహారం' అనే ఇంగ్లీషు పుస్తకం. కంగారుగా ఆ పుస్తకం పేజీలు తిరగేసాను. అది పరమహంస కొన్నపుస్తకమే అనడానికి గుర్తుగా ఆ పుస్తకం బిల్లు పై అతడి పేరు దాన్ని కొన్న తారీకు సరిగ్గా పరమహంస చనిపోయిన వారం రోజులముంది. పావుగంట క్రితం నాలో కలిగిన అనుమానాలన్నీ నిజమని తేలాయి. అరగంట క్రితం గురూజీ ఆడిటోరియంలో చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

పుట్టినప్పుడు శిశువు ఏడుస్తాడు. ఆ బిడ్డ తల్లీ తండ్రులు, బంధువులూ ఆనందిస్తారు, ఆ బిడ్డ పెరిగి పెద్దవాడై కాలగతిలో మరణిస్తే ఆ బిడ్డ పుట్టిన సమయంలో ఆనందించిన వారంతా దుఃఖిస్తారు. అయితే మరణశయ్య పైకి వెళ్ళే సమయంలోనూ ఆ వ్యక్తి చిరునవ్వుతో మరణాన్ని, ఆహ్వానించగలిగితే ఆ జీవి బ్రతుకు ధన్యం.

"ఔను గురూజీ చెప్పినట్లు పరమహంస తన మరణాన్ని చిరునవ్వుతో ఆహ్వానించాడు. సుఖదుఃఖాలనుంచీ, ద్వేష విద్వేషాలనించీ మనిషిని బైటపడవేసే అద్భుతమైన ముగింపుగా వేదాంతులు ప్రవచించే మృత్యువును ముందుగానే స్వీకరించాడు. అది తన వాళ్ళకు ఆర్థికపరమైన పరిష్కారం ఇస్తుందని తెలిసి. ఇది లోకానికి తెలియని నేను మాత్రమే తెలుసుకున్న నిజం -"

ప్రమాదం జరిగిన రోజు నేను ప్రాధేయపడి అడిగినా పరమాంస పాడకుండా వెళ్ళిపోయిన ఆ పాట నాకు పదే పదే గుర్తుకొస్తోంది. ఆ పాట - "తొందరపడి ఒక కోయిల ముందే కూసింది."

# మా డాడీ రాక్షసుడు - సర్వజిత్

**"మా డాడీ రాక్షసుడు"** అరచినట్లు చెప్పింది అర్చిత.

నిర్ఘాంతపోయాడు డాక్టర్ పవన్.

అర్చిత ముఖం అంతా కందగడ్డలా అయిపోయింది. ఆమె ముఖంలోని హావభావాలు పరిశీలిస్తూ మౌనంగా ఉండిపోయాడు.

ఆమె కనుబొమలు చిట్లించింది. ముఖం చీదరగా పెట్టింది. పెదవులు కదుపుతోంది. ఏమంటున్నదీ మాత్రం తెలియడంలేదు.

"మీ డాడీ ఎందుకు రాక్షసుడు ?" నెమ్మదిగా పెదవుల మీద నవ్వుతెచ్చుకుని, కాసేపయ్యాక అడిగాడు డాక్టర్ పవన్.

ఆమె సమాధానం చెప్పలేదు. చీదరగా ముఖం పెట్టి తల దించుకుని చేతివేళ్ళు విరుచుకుంటూ కూర్చుంది. "మీ డాడీ రాక్షసడంటే.... ఎలా?" ప్రశ్న మార్చి అనునయంగా అడిగాడు.

ఆమె తల పైకెత్తి డాక్టర్ ముఖంలోకి చూసింది. అతను చిరునవ్వు నవ్వుతూ మంచం మీద చేయి ఆన్చి కుర్చీలో కూర్చున్నాడు.

ఆమె తలతిప్పుకుని రూము అంతా కలయ చూస్తోంది తప్ప అతని ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

"ఇప్పుడేం చదువుకుంటున్నావ్?" మామూలుగా అడిగాడు డాక్టర్.

"సిక్స్"

"ఏ కాన్వెంటులో?"

చెప్పింది అర్చిత.

"పొద్దున ఎన్నిగంటలకు లేస్తావ్?"

"ఐదింటికి"

"లేచి?"

"టెన్నిస్ ప్రాక్టీస్.....ఆరింటికి కాస్సేపు రిలాక్సయి గార్డెనింగ్...."

"తర్వాత?"

"ఏముందీ.... త్వరగా రెడీ అయి... కాన్వెంట్ బస్సొస్తుంది ఎనిమిదింటికి.... ఎనిమిదికిలోమీటర్లు వెళ్ళాలి.... బస్సులో అందరం నిద్రపోతాం. యు.కె.జి నుంచి అదే బస్సు, అదే నిద్ర... సాయంత్రం ఆరింటికి వస్తాను. టిఫిన్ అయాక కాంప్లానో, బోర్నవిటానో తాగి అరగంట కూడా కూర్చోను... డాన్స్ క్లాసు కెళతాను.. ఆమె ఓ దెయ్యం."

"ఎవరు?"

"ఇంకెవరు? మా డాన్స్ టీచర్..... కళ్ళు తిప్పు, మూతి తిప్పు.... చేతులు అలాక్కాదు ఇలా... అంటూ చంపుకు తినేస్తుంది. ఎనిమిదింటికి ఇంటికొస్తా.. సోఫాలో కూర్చుంటానా... అలాగే నిద్దరొచ్చేస్తుంది. మా మమ్మీ లేపి కూర్చోపెట్టి అన్నం పెడుతుంది.... తిన్నాక హోం వర్కు ... తప్పదుగా.... చేసి మంచం ఎక్కేసరికి మా డాడీ వచ్చేస్తాడు. మంచం మీద నా ప్రక్కన కూర్చుని జనరల్ నాలెడ్జి అంటూ చెప్పుకొస్తాడు... నాకు నిద్ర.... వింటున్నావా అంటుంటాడు మధ్య మధ్యలో.... రాక్షసుడు..."

చెప్పయ్యడం అయిపోయినట్లు అర్చిత చికాగ్గా ముఖం పెట్టింది.

కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయాడు డాక్టర్ పవన్.

చేతులకున్న గాజులు ముందుకీ వెనక్కీ జరుపుతూ కూర్చుంది అర్చిత.

"ఓకే బేబీ! హాయిగా పడుకో. నిన్నెవరూ లేపరు. నీకేవన్నా కావలసివస్తే సిస్టర్‌ని పిలువు.. ఓకె!" అని చెప్పి పవన్ కుర్చీలోంచి లేచాడు.

అర్చిత అలాగే వెల్లకిలా పడుకుండిపోయింది మంచం మీద. నవ్వుకుంటూ డాక్టర్ పవన్ ఆమె రూములోంచి బయటకు వెళ్ళిపోయాడు.

అర్చిత రూములోంచి డాక్టర్ బయటకి రాగానే వరండాలో ఉన్న అర్చిత తల్లితండ్రులు ఆయన దగ్గరకొచ్చారు.

"డోంట్ వర్రీ!.... పాప పడుకుంది. మీరు నాతో రండి" అన్నాడు.

డాక్టర్ తన రూములోకి వెళ్ళి తన సీట్లో కూర్చుంటూ వాళ్ళని కూర్చోమన్నట్లు కుర్చీలు చూపించాడు.

"కండిషన్ ఏమిటి డాక్టర్?" ఆదుర్దాగా అడిగాడు అర్చిత తండ్రి ప్రభాకరం.

"కంగారు పడాల్సిందేమీ లేదు." చెప్పాడు డాక్టర్ పవన్.

ఆ మాటకు ప్రభాకరం దంపతులు ఊపిరి పీల్చుకున్నారు.

"అదిసరే మిస్టర్ ప్రభాకర్! పాపకి మరీ అంత టైట్ షెడ్యూలు పెట్టేసారేంటి?" అనడిగాడు పవన్.

"టైట్ షెడ్యూలేం ఉంది డాక్టర్?..... అందరూ చేస్తున్నపనే... తనకి టెన్నిస్ ఇష్టం కదాని ప్రాక్టీస్ చేయించాం. స్కేటింగ్ చాలా ఈజ్‌తో చేస్తుంది. కాన్వెంటు చదువు మామూలే... టీ.వీ చూస్తూ గెంతులేస్తుంటే డాన్సు నేర్పిస్తున్నాం... ఇక పడుకునే ముందు పనికిమాలిన కథలెందుకని, జనరల్ నాలెడ్జి విషయాలు చెపుతుంటాము... అప్పుడప్పుడు టేలంట్ టెస్టులకి, కాంపటేషన్లకి పంపుతాం. చాలా బహుమతులు తెచ్చుకుంది కూడాను..." ప్రభాకరం గొప్పగా చెప్పుకొచ్చాడు.

"అక్కడకీ తనకి కావల్సిన డ్రస్సే కొంటాం. కావల్సిన వన్నీ కొనిపెడతాం...." అర్చిత తల్లి శాంతకుమారి అన్నది.

ఆ ఇద్దరూ చెప్పిన మాటల్ని మనసులో విశ్లేషించుకుంటున్నాడు పవన్.

"ఓకే! పాపని రెండురోజులు ఆసుపత్రిలోనే ఉంచండి. నథింగ్ టు వర్రీ! ఉంటే ఎవరైనా ఒకళ్ళు పాపకు తోడుగా ఉండచ్చు. పాపని సిస్టర్ చూసుకుంటుంది. పాప రూములోకి మీరు వెళ్ళకండి." డాక్టర్ పవన్ చెప్పి సీట్లోంచి లేచాడు.

"హలో బేబీ! ఎలా ఉన్నావ్?" మర్నాడు ఉదయం అర్చిత రూములోకి వస్తూ అడిగాడు డాక్టర్ పవన్.

"ఫైన్ అంకుల్" చెప్పింది అర్చిత మంచం మీద లేచి కూర్చుంటూ.

డాక్టర్ ఆమె కళ్ళూ, నాలుక పరీక్షించాడు.

"రాత్రి బాగా నిద్రపోయావా?" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

"ఓఁ...బాగా... ...?"

"నిజంగా.... ఎలా?"

"సిస్టర్ చాలాసేపు కథలు చెప్పింది కూడా."

"కథలా? ఏం కథలు?"

"అదే. రాజకుమారుడు... ఎగిరే గుర్రం... బంగారు బాతుగుడ్డూ.... అలాంటి కథలు. "

"నువ్వెప్పుడూ వినలేదా అవి?"

"ఊహూ... మాడాడీ చెబితేగా... ఆకథల్లో ఏం ఉందీ చెత్త... అంటూ జనరల్ నాలెడ్జ్‌గా చెప్పేది..."

"మీ డాడీ చెప్పేది మంచివేగా?!"

"మంచివే.. ఎప్పుడూ అవేనా?... మా ఫ్రెండ్స్ ఎంచక్కా సినిమాలకీ, షికార్లకీ వెళతారు.... నేనెప్పుడూ వెళ్ళను... వెళ్ళినా... డాన్స్‌క్లాసుకి టైమయిపోతుంది.... మళ్ళీ పొద్దునే లేవవు... ఆ టేలెంటు టెస్టుకి ప్రిపేరవ్వాలి.... అంటూ కంగారు పెట్టేస్తారు...."

"మరి నువ్వు చాలా ప్రైజులు తెచ్చుకున్నావు కదా"

అర్చిత మాట్లాడలేదు. ఆ ప్రశ్నకి ఏం సమాధానం చెప్పాలో ఆమెకర్థం కాలేదు. దిక్కులు చూస్తూ కూర్చుండిపోయింది. ఆ రూములోనే ఒక మూలగా అర్చిత తల్లి శాంతకుమారి మౌనంగా నిల్చుని కూతురు చెప్పింది వింటున్నది. సిస్టర్ నవ్వుతూ నిల్చున్నది.

డాక్టర్ పవన్ నవ్వుతూ అర్చిత ముఖంలోకి చూశాడు. అర్చిత ముఖంలో రంగులు మారడం గమనించాడు. "ఎప్పుడూ ప్రైజులు, ప్రైజులు...." విసుగ్గా అనేసి మంచం మీద అటు తిరిగి పడుకుండిపోయింది అర్చిత.

నవ్వుకుంటూనే డాక్టర్ పవన్ లేచి "ఒకే బేబీ రెస్ట్ తీసుకో...." అనేసి వెళ్ళిపోయాడు.

అర్చిత స్వతహాగా తెలివిగల పిల్ల. బొద్దుగానూ కాదు, అలాగని సన్నగా రివటగానూ కాదు, చూడగానే ముచ్చట పడేట్లుంటుంది. పెద్ద కళ్ళు, గుండ్రటి ముఖం.

కోపగించినా, ఇష్టం లేకపోయినా, విసుగుదల వచ్చినా ఆమె ముఖంలో ఇట్టే భావాలు కనిపిస్తాయి. ఏదైనా తొందరగానే గ్రహించే తెలివితేటలు ఉన్నాయి. సాధించాలన్న పట్టుదలా ఉంది.

కూతురిలో టేలెంటు అంటూ ప్రభాకరం ప్రత్యేకంగా గుర్తించలేదు కానీ, ఆమెతో ఏదేదో చేయించెయ్యాలని మాత్రం ఊహించేశాడు. అందుకు న్యూస్ పేపర్‌లో చూసిన రెండు వార్తలు అతన్ని బాగా ఆకర్షించాయి.

అవి - ఓ చిన్నారి చేసిన స్కేటింగ్ విన్యాసాలు, మరో చిన్నారి భరత నాట్య ప్రతిభ! భరతనాట్యం చేసిన అమ్మాయి చూడ చక్కగా మాత్రమే లేదు. ఆ అమ్మాయి కన్నా తన కూతురు అర్చిత చాలా రెట్లు అందంగా ఉంటుందని ప్రభాకరం అనుకున్నాడు. ఒక్క సారిగా చాలా ఆలోచనలు అతని మనసులో మెదిలాయి. "అర్చూ రేపట్నుంచీ నువ్వు ఎర్లీ మార్నింగ్ లేవాలి...." రాత్రి ఆఫీసు నుంచి రాగానే కూతురుతో అన్నాడు ప్రభాకరం.

భార్య శాంతకుమారి, కూతురు అర్చిత ఏమిటన్నట్లు చూశారు.

"పేపర్లో చూడు... ఆ అమ్మాయెవరో స్కేటింగ్ లో ఫస్టట!.... నువ్వూ ప్రాక్టీస్ చెయ్యి అర్చూ....." అన్నాడు.

అర్చితకి అర్థం కాలేదు. నాలుగేళ్ళ కూతుర్ని ప్రభాకరం ఒళ్ళో కూర్చోపెట్టుకుని స్కేటింగ్ గురించి వివరించాడు. చాలా విషయాలు చెప్పాడు.

అర్చిత తెగ సంబరపడిపోయింది. ఆ విషయం వెంటనే వెళ్ళి ఫ్రెండ్స్‌కి చెప్పేయాలని ఆరాటపడిపోయింది. మర్నాడు తెల్లవార్ఝామున ఐదింటికి తల్లి లేపగానే బద్ధకంగా ఉన్నా లేచిపోయింది.

అలా అర్చిత స్కేటింగ్ ప్రాక్టీసు ప్రారంభమయ్యింది. స్కేటింగ్ షూ కాళ్ళకి కట్టుకుని ట్రాక్‌లో జారుతుంటే చాలా సరదాగా, థ్రిల్లింగ్‌గా అనిపించింది. గలగలా నవ్వొచ్చింది. ఇంకా తనలాంటి పిల్లలు, తనకన్నా చిన్నవాళ్ళూ, కాస్త పెద్దవాళ్ళూ ప్రాక్టీసు చేస్తూ పడిపోతూ, ఏడుస్తూ, నవ్వుతూ, తమ దగ్గరికి కోచ్ వచ్చి చెబుతుంటే నిజంగా ఆమెకు సరదాగానే అనిపించింది. తల్లి వారిస్తున్నా, అప్పుడప్పుడు ఇంట్లోనూ అవి కాళ్ళకు వేసుకుని జారడం ఆమెకు చాలా గమ్మత్తుగా అనిపిస్తుంది. మరో ఆర్నెల్లకు స్కేటింగ్ కాంపిటేషన్‌లో అర్చిత ఫస్ట్ ప్రైజు తెచ్చుకుంది.

తర్వాత డాన్సు ప్రాక్టీసుకు పంపించాడు అర్చితని ప్రభాకరం. స్కేటింగ్ అంత సరదాగా లేకపోయినా మొత్తం మీద అదీ మొదట్లో థ్రిల్లింగ్‌గానే అనిపించిందామెకు.

"మీ అమ్మాయి చాలా షార్పండీ. ఒకసారి చెపితే చాలు ఇట్టే గ్రహించేస్తుంది." అని ఒక రోజు డాన్సు టీచర్ చెపుతుంటే ప్రభాకర్ పొంగిపోయాడూ. అర్చితకీ హుషారుగా అనిపించింది.

దాంతో అర్చితకి జనరల్ నాలెడ్జి గురించి చెప్పడం ప్రారంభించాడు ప్రభాకరం. టేలెంటు టెస్ట్లకి తీసుకెళ్ళడమూ మొదలు పెట్టాడు. ఓ టెస్టులో ఆమె తొలిసారిగా ద్వితీయ బహుమతి కూడా అందుకుంది. మరో ఆరునెలలు పోయేసరికి ఒక సాంస్కృతిక సంస్థ వార్షికోత్సవ వేడుకల్లో అర్చిత తొలిసారి గజ్జె కట్టింది. జనం చప్పట్లు... పేపర్లో ఫోటోలు ప్రభాకర్కి ఏనుగెక్కినంతగా అనిపించింది.

"అర్చూ.... స్కేటింగ్ ఓ.కె!.... డాన్స్ ఓకే!... టేలెంట్ టెస్టులు కొంచెం ఇంప్రూవ్ అవ్వాలి. చూడు చదువులో మాత్రం వెనక పడకూడదు సుమా! అన్నింట్లోనూ నైన్టీస్ తెచ్చుకోవాలి మరి!" ఆ రాత్రి భోజనాలప్పుడు కూతుర్ని హెచ్చరించాడు ప్రభాకరం.

"ఏంటి అర్చూ టెన్నిస్ ప్లే చూస్తున్నావా? నీకంత ఇష్టమా?" తండ్రి మాటలకి వెనక్కి తిరిగి చూసి నవ్వేసింది అర్చిత.

"టెన్నిస్ ప్రాక్టీస్ చేస్తావా?" అనడిగాడు ప్రభాకరం.

అర్చిత ఏం మాట్లాడలేదు. దాదాపు రెండేళ్ళకి పైగా టేలెంట్ టెస్టులు, డాన్సు ప్రోగ్రాంలు - మధ్యలో స్పోర్ట్స్ ఈవెంట్లులో స్కేటింగ్ పోటీలు, మరో ప్రక్క చదువు... ఎందులో వెనక పడ్డా ప్రభాకర్ ఊరుకోడు. భార్యనీ, కూతుర్నీ రెండు రోజులు సతాయిస్తాడు. ఈ రెండేళ్ళలో ఆమె చాలా ప్రైజులు తెచ్చుకుంది. సిటీలో ఏ కార్యక్రమం జరిగినా అర్చితని తీసుకు వెళ్ళి డాన్సు ప్రోగ్రాం ఇప్పిస్తాడు. ఆ సిటీలో, చుట్టు ప్రక్కలా ఏ టేలెంటు టెస్టు జరిగినా ఆమె పాల్గొనవలసిందే

మిగతా పిల్లల్లా ఆడుకోవడం కుదరదు. టీ.వీలో కార్టూన్ షోలు చూడ్డమూ కుదరదు.

"అర్చూ... అయిదయింది. లేమరి.... లేవాలి... ప్రాక్టీసుకు వెళ్ళొద్దూ...." అంటూ రోజూ తండ్రి లేపుతుంటే.... తల్లిని కౌగిలించుకుని పడుకున్న అర్చితకి ఈ మధ్య లేవాలనిపించడం లేదు.

కానీ అర్చిత ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా నిర్ణయాలు జరిగిపోయాయి. టెన్నిస్ ప్రాక్టీసు ఇప్పుడు మరో అదనపు పని అర్చితకు. ఇది మరో కొత్త అనుభూతి. మొదట్లో ఉత్సాహంగానే అనిపించింది.

అలా రెండేళ్ళు గడిచిపోయాయి. అర్చిత ఫిఫ్త్ స్టాండర్డ్ చదువుతోంది. క్వార్టర్లీ పరిక్షల్లో అర్చిత మార్కులు చూసి షాకయ్యాడు ప్రభాకరం. ఒక్క సబ్జెక్టులోనూ ఆమెకు పాసుమార్కు రాలేదు.

"ఇదేంటి అర్చూ...." అన్నాడు కొంచెం కోపంగా.

అర్చిత మాట్లాడలేదు. ప్రశ్న మరోసారి రెట్టించి అడిగాడు. శాంతకుమారి భర్తకు సర్ది చెప్పి అదిక సమస్యకాకుండా చూసింది.

ఆ తర్వాత రెండు మూడు టాలెంటు టెస్టులకు వెళ్ళిన అర్చిత అక్కడా అంతే పేలవంగా చేసి ముఖం వేలాడేసుకుని వచ్చింది. ప్రభాకరానికి చాలాకోపం వచ్చింది. ఇంటికి వచ్చాక కూతుర్ని దండించాడు. నాలుగు దెబ్బలు కూడా వేశాడు.

ఆ రాత్రి శాంతకుమారి కూతుర్ని ఒళ్ళోకి తీసుకుని ఓదార్చింది. అలా ఎందుకు జరిగిందని అనునయంగా అడిగింది. అర్చిత ఏమీ మాట్లాడలేదు. తల్లి ఏవేవో అడుగుతూనే ఉంది. అర్చిత నిద్రలోకి జారుకుంది.

నిద్రపోతున్న కూతురు ముఖంలోకి చూసింది శాంతకుమారి. డాన్స్కీ, స్పోర్ట్స్కీ, టాలెంటు టెస్టులకీ కూతురు పడుతున్న హైరానా, భర్త ప్రభాకర్ అదిలింపులూ, ఆగ్రహాలు - అన్నీ ఆమె కళ్ళల్లో మెదిలాయి.

"ఈ కార్టూన్ షో చూడనియమ్మా... ప్లీజ్ అమ్మా...." అని అర్చిత బేలగా అడిగిన క్షణాలు గుర్తుకు వచ్చాయి.తల్లిగా ఆమె కళ్ళు చెమర్చాయి.....

అది మొదలు అర్చిత అన్నింటిలోనూ విఫలమవుతూనే ఉంది. హాఫ్‌యర్లీ పరీక్షల్లోనూ అత్తెసరు మార్కులే. ఎలాగో ఫిఫ్త్ గట్టెక్కింది. ప్రభాకరం రోజూ తిడుతున్నాడు. రాను రానూ అర్చిత పరిస్థితి దిగజారింది. స్కూలుకు వెళ్ళి పుస్తకాలు పారేసుకుంటోంది. ఒక రోజు క్యారేజి మర్చిపోయి వచ్చింది. స్కేటింగ్ ఈవెంట్‌కి తీసుకెళితే పడిపోయి దెబ్బలు తగిలించుకు వచ్చింది. కూతురి పరిస్థితికి భయపడి భర్త దగ్గర పోరు పెట్టింది శాంతకుమారి.

❧ ❧ ❧

"అప్పుడప్పుడూ మా వారితో కలిసి నేనూ తప్పు చేశాను డాక్టర్ గారూ. పేపర్లో ఫోటోలు, ప్రైజులు ఇవే ఆయనకు కనిపించేవి. అంతే కాని పిల్ల ఎంత నలిగిపోతోందో అని ఆయనాలోచించలేదు. పాపం పిచ్చి ముండ ఎంత నలిగిపోయిందో!?... ఇప్పుడు కానీ నాకర్థంకాలేదు డాక్టరుగారూ...." శాంతకుమారి కళ్ళు తుడుచుకుంది.

ఆమె ప్రక్కన కూర్చున్న ప్రభాకర్ డాక్టరు ముఖంలోకి చూశాడు. డాక్టరే పవన్ టేబుల్ మీద పేపర్ వెయిట్‌ని గిరగిరాతిప్పుతున్నాడు. క్షణం పోయాక డాక్టర్ తలెత్తి ప్రభాకర్ కేసి చూశాడు.

ప్రభాకర్ తత్తరపడ్డాడు. అంతలోనే తేరుకుని అన్నాడు: "మంచి తెలివైన పిల్ల. అందుకే అన్నింటిలో ఎంకరేజ్ చేశాను. ప్రైజులు కూడా తెచ్చుకుందిగా మరి!" అంటూ ఇంకా ఏదో చెప్పబోతుండగా డాక్టరే అన్నాడు: "తెలివైన పిల్లే! ఎంకరేజ్ చెయ్యాలి.... కాని ఎంతవరకు? మనపిల్లలు పైపైకి ఎదగాలని మనం కోరుకోవడంలో తప్పులేదు... ఒక అబ్దుల్ కలాం... ఒక కపిల్‌దేవ్... ఒక బిల్‌గేట్స్.... ఒక చిరంజీవి... ఇలా గొప్ప గొప్పవాళ్ళు కావాలని ప్రతి తండ్రి, తల్లీ కోరుకోవాలి. కోరుకోక పోతే అసలు వాళ్ళు పేరెంట్సే కాదు.... కానీ ఒకే వ్యక్తిని పట్టుకుని ఆ అందరూ అయిపోవాలనుకోవడం అత్యాశ... దురాశకూడా. ఆ దురాశతో మనమేం చేస్తున్నామో మనకి తెలియడం లేదు. ఇప్పుడు జరిగిందదే మిస్టర్ ప్రభాకర్!...... ఆ చిన్నారి గుండెమీద మోయలేనంత భారం మోపేశారు. ఆ మాటకొస్తే ఇప్పటి చదువులే అలా ఉన్నాయి. దానికి తోడు మీలాంటి వాళ్ళు తెస్తున్న ఇలాంటి అదనపు వత్తిళ్ళు కొన్ని....."

డాక్టర్ ఆ దంపతులిద్దరివైపూ చూశాడు. వాళ్ళు తలలు వంచుకున్నారు.

❧ ❧ ❧

"హలో అర్చితా! పాలు తాగావా" ఆమె మంచం దగ్గరగా కుర్చీలాక్కుని, కూర్చుంటూ అడిగాడు డాక్టర్ పవన్.

"ఉహూ! బోర్నవిటా తాగుతాను." లేచి కూర్చుంటూ అంది అర్చిత.

సిస్టర్‌కి పురమాయించాడు డాక్టర్.

"సరే! ఇంతకీ నీకు ఏ గేమ్.... టాలెంటు టెస్టులు.... స్కేటింగ్... టెన్నిస్... డాన్స్... వీటిలో ఏదంటే నీకిష్టం?" నవ్వుతూ అడిగాడు.

ఇంతలో సిస్టర్ బోర్నవిటా తెచ్చి ఇచ్చింది. అదందుకుని ఓ గుక్క తాగి: "నాకు స్కేటింగ్.... ఉహూ కాదు కాదు డాన్స్.... డాన్సంటేనే ఇష్టం..." చెప్పింది అర్చిత.

"ఓ.కే ఇకనుంచి నువ్వు డాన్స్ ఒక్కటే చెయ్యి మిగిలినవన్నీ మానెయ్"

"థాంక్యూ అంకుల్" అని మంచం మీదనుంచి దిగి అమాంతం డాక్టర్ బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది అర్చిత.

## సెంటిమెంట్ - వారణాసి నాగలక్ష్మి

ఉదయపు నడక పూర్తై ఇంట్లోకి అడుగుపెడుతుంటే ఫోను మోగింది. పిల్లల్ని బాత్‌రూముల్లోకి తరిమి, ఫోను తీసింది రాధ. అవతలివైపు జానకి పలికింది.

"ఏమిటమ్మా విశేషం? పొద్దున్నే ఫోను చేశావు? నాన్నగారెలా ఉన్నారు?" అడిగింది రాధ.

"ఏం లేదే.. ఇంటి ఆడపడుచులకి ఈ నెల్లో ఆకుపచ్చ చీరలు, గాజులు పెడితే పుట్టింటివాళ్ళకి చాలా శుభం జరుగుతుందటే. ఇక్కడంతా చెప్పుకుంటున్నారు! నాక్కూడా నీకూ, అక్కయ్యకీ అలా పెట్టుకోవాలని ఉంది. నీకు నచ్చిన చీరేదైనా ఆకుపచ్చరంగులో కొని ఉంచుకో. ఎంతైతే అంత నే వచ్చాక ఇస్తా. వచ్చేవారం శీనుగాడి పెళ్ళికోసం హైదరాబాద్ వస్తున్నాం కదా. అపుడు నీకు పెడతాను" అంది జానకి.

రాధ నవ్వింది. "ఏమిటమ్మా నువ్వు? రెండునెల్ల క్రితమేగా పుట్టినరోజుకి చీర కొనిపెట్టావు! ఇలాంటివన్నీ ఎలా పుడతాయో తెలుసా? ఏ బట్టల మిల్లువాళ్ళకో ఆ రంగు చీరలు మిగిలిపోయి ఉంటాయి. లేదా ఏ ఆడపడుచుకో పుట్టింటినుంచి చీర సంపాదించాలనిపించిందేమో. అదీ కాకపోతే మార్కెట్ డల్‌గా ఉందని వందనా బ్రదర్స్ వాళ్ళో, స్పందన సిస్టర్స్ వాళ్ళో మంచి ఉపాయం కనిపెట్టి ఉంటారు" అంది.

"నువ్వలా అనకే రాధా! దీనిలో నీకేం నష్టం చెప్పు. పుట్టింటికి శుభం అంటున్నారు. మాకోసమే అడుగుతున్నాను. నువ్వు కొనుక్కోకపోతే నాకు నచ్చినదేదో నేనే కొని తెస్తాను. నచ్చితే ఆఫీసుకి కట్టుకో. నచ్చకపోతే ఇంట్లో వాడెయ్యి" నొచ్చుకుంటూ అంది జానకి.

"అమ్మా! నిన్ను బాధపెట్టాలని కాదు. ఇలా 'పుట్టింటికి మంచిది', అన్న దమ్ములకి శుభం', 'భర్తకి దీర్ఘాయుష్షు'..... ఇలాంటి సెంటిమెంట్లు తగిలిస్తే జనం తు.చ తప్పకుండా వింటారు. చెప్పినవన్నీ వేలం వెర్రిగా కొంటారు. ఎంత ఖర్చయినా ఏదో మంచి జరుగుతుందని, లేదా అలా చెయ్యకపోతే ఏదో అశుభం జరుగుతుందేమో అని అప్పు తెచ్చయినా ఆ పని చేస్తారు! నాలాంటి వాళ్ళకేమో 'అయ్యో! వాళ్ళు శుభం జరుగుతుందని అడుగుతుంటే వద్దనడం తప్పు కదా' అనిపిస్తుంది. అవునా? కాదా?" అంది రాధ అనునయంగా.

"అబ్బా! ఈ సొదంతా చెప్పకే నాకు. అక్కయ్యకేం చెప్పినా ఎదురు చెప్పకుండా వింటుంది. నువ్వే ఇలా వాదించి విసిగిస్తావు. మా కిష్టమై పెడుతుంటే పుచ్చుకుందుకు నీకేమిటే?" విసుక్కుంది జానకి.

"సరే తల్లీ. ఏదో పెళ్ళి చేశారు, పురుళ్ళుపోశారు. ఇప్పుడేమో నాన్నగారు రిటైరైపోయారా! మీకొచ్చే ఆ కాస్త ఆదాయంలో ఇలాంటి మూఢనమ్మకాల్ని పెంచి పోషించడం, ఇబ్బంది పడడం ఎందుకని అన్నాను" అంది రాధ

"సర్లే. ఇంక ఆ చర్చ వదిలేసి విషయం చెప్పు. నువ్వు కొని ఉంచుతావా? లేదంటే ఇక్కడ కొని తెస్తాను" అంది జానకి.

"నీకెలా వీలో చెప్పమ్మా. అలాగే చేస్తా` అంది రాధ

"నీకు నచ్చింది కొని ఉంచు తల్లీ . నీ ఎన్నిక బావుంటుందీ" ప్రేమగా అంది జానకి.

నిట్టూర్చి "సరే" అంది రాధ.

పిల్లల కుశలం అడిగి పెట్టేసింది జానకి. గబగబా తయారై ఎవరి దారిన వాళ్ళు స్కూళ్ళకీ ఆఫీసులకీ వెళ్ళారు. దారిలో తల్లితో తన సంభాషణ గుర్తుచేసుకుంటూ `పెరిగిన వాతావరణాన్ని బట్టీ, కుటుంబ నేపథ్యాన్ని బట్టి అందరికీ ఏవో నమ్మకాలు ఏర్పడుతాయి. అవికాక ఇతరులకోసం కొన్ని ఆచారాలూ పద్ధతులూ గుడ్డిగా పాటిస్తూ ఉంటాం. బట్టలైనా, వస్తువులైనా ప్రేమతో ఇచ్చి పుచ్చుకోవడం వల్ల ఎంతో సంతోషం కలుగుతుంది. కానీ ఈ పెట్టుపోతలు పాటించి తీరాల్సినవై బరువుగా అయిపోకూడదు, అనుకుంది రాధ. ఆటో పోస్టాఫీసు దాటుతుంటే కిందటి వారం రోడ్డుకడ్డంగా నల్లపిల్లి పరుగెత్తడం గుర్తొచ్చింది. ఆ రోజు తనకి డిపార్ట్‌మెంటల్ టెస్ట్ ఉండింది. ఇన్ని కబుర్లు చెప్పే తనక్కూడా ఆ వేళ కొంచెం ఆదుర్దా కలిగింది! మళ్ళీ తనకి తనే సర్ది చెప్పుకుని చిన్నప్పుడు తడిబట్టతో పలక తుడుచుకున్నట్టుగా బుర్రలోంచి ఆ భయాన్ని తుడిచేసుకుంది. ఆ అనుమానమే గనక తన బుర్రలో పాతుకుని ఉంటే పరీక్షలో ఏదో పొరపాటు చేసి ఉండేదే. అలా తన భావాన్ని సరిచేసుకోవడం వల్లే పరీక్షలో అన్నీ చక్కగా రాసింది. దాంతో నల్లపిల్లి భయం పోయింది. `ఇంకోసారి ఏదేనా అనుకోనిది జరిగినా దాన్ని నల్లపిల్లితో ముడిపెట్టదు తను` అని నవ్వుకుంది.

ఆఫీసులో మధ్యాహ్నభోజనం వరకు మామూలుగా జరిగిపోయింది. రోజూలాగే లంచ్ టైంలో నవీన వచ్చింది కలిసి తినడానికి. కబుర్లు చెప్పుకుంటూ తింటుండగా హఠాత్తుగా నుదురు మునివేళ్ళతో కొట్టుకుంటూ "అయ్యో" అంది నవీన.

"ఏమైంది?" కంగారుగా అడిగింది రాధ.

"ఎన్నిసార్లు అనుకున్నా వచ్చేముందు మర్చిపోయా..ఛీ.. ఈ మధ్య మతి మరుపు ఎక్కువైపోయింది" తనని తనే తిట్టుకుంటూ అంది నవీన.

"ఏమిటో చెప్పవోయ్ నీ సస్పెన్స్ బంగారంగానూ"

"అదికాదు రాధా! మా అబ్బాయి ఎమ్‌సెట్ అప్లికేషన్ ఇవాళ పోస్టు చెయ్యాలి. హడావిడిలో మర్చిపోయి వచ్చేశా. నామీద నాకే కోపం వస్తోంది. ఇప్పుడేం చెయ్యనూ?" అంది నవీన.

"అయ్యో! ఎప్పుడూ లాస్ట్ డేట్?" అడిగింది రాధ.

"టైమింకా ఉందిలే. వాడి నక్షత్రానికి ఇవాళ పోస్ట్ చేస్తే మంచిదన్నారు మా అత్తగారు ఆ కవరు కాస్తా టీవీ మీద పెట్టి మర్చిపోయి వచ్చా" చిరాకు పడిపోతూ అంది.

"నవీనా! నీ పేరేమిటి? నీ ఆలోచనలేమిటి?" నవ్వుతూ అంది రాధ.

"అలా అనకు రాధా! నాకు చాలా నమ్మకం తిథి, వార, నక్షత్రాల్లో అప్లికేషన్ ఫిల్ చేయడం కూడా అత్తగారు పెట్టిన ముహూర్తంలోనే మొదలు పెట్టాం. సరేలే... ఇదంతా ఎవరితోనూ చర్చించకు. ఎవరి అభిప్రాయాలు వాళ్ళు అడక్కపోయినా వినిపిస్తారు. నా నమ్మకాలు నావి. నేనిప్పుడే ఇంటికెళ్ళి, అది పోస్ట్ చేసి, లంచ్ బ్రేక్ అయేలోపు వచ్చేస్తా" అంటూనే తింటున్న డబ్బా మూతపెట్టేసి వెళ్ళిపోయింది నవీన.

రాధ ఆలోచిస్తూ భోజనం పూర్తిచేసి పనిలో నిమగ్నమైంది. నవీన తిరిగివచ్చేసరికి అరగంట లేటైంది. సెక్షన్ హెడ్ చేత అక్షింతలు వేయించుకున్నా నవీన మొహంలో ఏదో స్థిమితం కనిపించింది రాధకి. 'అలావెళ్ళి ఉండకపోతే, ఆ పరీక్ష పూర్తై రిజల్ట్స్ వచ్చేవరకు ఈవిడకి మనసు మనసులో ఉండేదికాదు. ఇపుడైనా వాళ్ళబ్బాయికి మంచి రాంక్ వస్తే ఈ ముహూర్తబలమే అనిపిస్తుంది తనకి. రాకపోతే మాత్రం వాడి జాతకంలో ఆయోగం లేదనిపిస్తుంది!' అనుకుంది.

సాయంత్రం ఇంటికొస్తూ దారిలో అలవాటైన బట్టలషాపు దగ్గర ఆగింది, ఏదో ఓ చీర తీసుకెళితే తల్లి చెప్పిన పని అయిపోతుంది కదా అని.

"ఆకు పచ్చ రంగులో..." అంటూ రాధ పూర్తిగా చెప్పకముందే "ఆడపడుచు చీరలా మేడమ్?" అంటూ ఇరవై చీరలదాకా తెచ్చిపడేశాడు, వాటిలో సామాన్యమైన ధరలో ఒక నేత చీర తీసుకుని బిల్లు చెల్లించి ఇల్లు చేరింది.

"ఏమిట్రా అది? హోంవర్క్ తర్వాతే టీవీ అని చెప్పాకదా. ఇవాళేమయింది?" అడిగింది.

"అమ్మా ప్లీజ్! రేపు సెలవు. తర్వాత చేసుకుంటామమ్మా ప్లీజ్" ఇద్దరూ ఏకకంఠంతో అన్నారు.

"రేపెందుకర్రా సెలవూ?"

"స్కూల్ మూసే టైంకి ఎవరో గ్రేట్‌మాన్ పోయారని తెలిసిందట. అందుకే..." టీవీకి కళ్ళప్పగించి, తల్లికి ముక్తసరిగా జవాబు చెప్పారిద్దరూ.

"ఎవరేనా గొప్పవ్యక్తి చనిపోతే స్కూళ్ళూ, ఆఫీసులూ మానేసి ఏం సాధిస్తుందో ఈ ప్రభుత్వం, అనుకుని అంత నిమగ్నమై చూస్తున్న ఆ సినిమా ఏమిటా అని అటువైపో చూపు పడేసింది. రకరకాల శకునాల నేపథ్యంలో తీసిన ఇంగ్లీష్ సినిమా అది. ఉసూరుమనుకుంటూ 'అది పిల్లలు చూడాల్సిన సినిమా కాదని, డిస్కవరీ ఛానెల్‌లాంటివేవైనా చూస్తామంటే ఊరుకుంటానని లేకపోతే టీవీ కట్టేస్తాన'ని ఖచ్చితంగా చెప్పింది. పిల్లలు గొడవ చేస్తే అలాంటి సినిమాల వల్ల ఎలాంటి మనస్తత్వం అలవాటవుతుందో అనునయంగా వివరించి చెప్పి, వాళ్ళతోపాటు కాసేపు కార్టూన్ నెట్‌వర్క్ చూసి, మెల్లిగా తన పనిలోకి ప్రవేశించింది. ఆలోచిస్తూ "ఈ పిల్లలు సెలవు కావాలనిపించినపుడల్లా 'ఎవరేనా వి.ఐ.పి. పోతే బావుణ్ణు' అనుకోవడం తన చెవులతో ఎన్నోసార్లు వింది! ఈ సెలవు రోజు వీళ్ళు చేసే గొప్ప పనేమిటంటే ఇలాంటి పనికిరాని సినిమాలు చూడ్డమో, పగటి నిద్ర పోయి బద్ధకం పెంచుకోవడమో! ఏ వ్యక్తి మరణం వల్ల ఈ సెలవు దొరికిందో, ఆయన ఆదర్శాలకి పూర్తి వ్యతిరేకమైన పనులే తొంభైశాతం మంది చేస్తారు ఆరోజు! దీని బదులు రెండు నిమిషాలు మౌనం పాటించి, ఆ వ్యక్తి పేర అతనికి సంబంధించిన రంగంలో స్కాలర్‌షిప్పులో, అవార్డులో ప్రకటించకూడదూ" అనుకుంది.

పదిరోజులు గడిచాయి. మేనల్లుడి పెళ్ళికోసం జానకి, మధుమూర్తి హైదరాబాద్ వచ్చారు. పొద్దున్నే ఆకుకూర కొని తెస్తున్న రాధను చూసి "ఇవాళ సోమవారం కదా" అంది జానకి.

"అవును. ఏం?" అడిగింది రాధ.

"సోమవారం తోటకూర కొనకూడదన్నారే సుందరత్తయ్యగారూ"

"అబ్బా ఎందుకటా?"

"ఎందుకోలే!" విసుగ్గా అని "అన్నీ చెప్పాలి నీకు ఆ ఒక్క రోజూ కొనకపోతే ఏంపోయింది? ఎన్ని రకాల ఆకుకూరలున్నాయి? అదే కొనాలా ఆ రోజు?" చిరాకుపడింది జానకి.

"ఎందుకో చెప్పనా? పిల్లలు తోటకూరకాడల్లా వాడిపోతారని కాబోలు! వారంలో మొదటిరోజు కాస్త జాగ్రత్తగా ఉంటే మంచిది కదా!" పరిహాసంగా అంటూ 'ఎందుకో జవాబు తెలియనప్పుడల్లా అమ్మకి చిరాకొచ్చేస్తుంది' అనుకుంది మనసులో నవ్వుకుంటూ.

"నీకెలా తెలుసు?" అడిగింది జానకి రాధ వేళాకోళం తెలిసినా.

"అలాంటిదే ఏదో ఒక గుచ్చుకునే సెంటిమెంట్ తగిలించకపోతే మూర్ఖజనం వినరుగదా" అంది రాధ.

"అన్నిటికీ అలాగే అంటావే"

"అదికాదమ్మా. నిన్నచూడు ఆ చీర నాకు పెట్టేటపుడు 'దూలం కింద బొట్టుపెట్టి తాంబూలం ఇవ్వకూడదు' అన్నావు. చెక్కదూలాలు ఉండే రోజుల్లో వాటి మీద బల్లులూ అవీ తిరుగుతాయి, మీద పడతాయనో లేదా దూలాలే పాతబడి విరుగుతాయనో ఏదో అప్పటి కారణాలవల్ల అలా పెట్టి ఉంటారు. ఈ కాంక్రీటు బీమ్ కింద అలాంటివేం జరుగుతాయి? నిన్న సాయంత్రం దీపం పెట్టుకుంటావని కుందిలో వత్తులు అమర్చి, నూనెపోస్తుంటే చూసి ఏమన్నావు? అలా ముందు వత్తులు వేసి, తర్వాత నూనె పొయ్యకూడదనీ, ముందే నూనె పోసి తర్వాత వత్తులు వెయ్యాలని ఏమిటో చెప్పావు? అలాంటివన్నీ రోజురోజుకీ కొన్ని కొత్త నమ్మకాలు నీకెవరు తగిలిస్తున్నారు? ఇలాంటి అనవసరమైన నమ్మకాలు పెంచుకుంటూ, వాటిని పాటిస్తూ, నీ జ్ఞాపకశక్తినంతా ఇందుకే ఖర్చుచేస్తున్నావు! పొద్దున్న ఎన్నెన్నో స్తోత్రాలు వల్లిస్తూ పదకొండు దాటేదాకా ఏమీ తినకుండా గడుపుతావు నిస్త్రాణ వచ్చేదాకా. ఆరోగ్యం కోసం, ఆ బీపీ, షుగరు తగ్గించుకోవడం కోసం ఓ పావుగంట ప్రాణాయామం, ఓ అరగంట వాకింగ్ చేస్తే ఎంత బావుంటుంది? వాటికి మాత్రం టైము లేదంటావు. ఆ స్తోత్ర పాదాల సంఖ్య తగ్గించి, 'దేహమే దేవాలయం' అని గుర్తిస్తే బావుణ్ణు! నీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటే దేవాలయాన్ని పరిశుభ్రం చేసినట్టే. ప్రతిమనిషీ తన ఆరోగ్యానికి తనే బాధ్యుడు. నీకు ఒంట్లో బావుండకపోతే నీకూ కష్టమే, నాన్నగారికీ, అన్నయ్యా వదినలకీ కష్టమే కదా!" అంది రాధ ప్రేమగానూ, సూటిగానూ.

"పొద్దున్నే పెద్ద లెక్చర్ పెట్టావు బానేవుంది! అక్కడికి నేను తీరి కూర్చుని ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నట్టు! ఇంతమందిని కని, పెంచాను. ఇప్పటికీ మనవల బాగోగులు చేతనైనంత చూసుకుంటున్నాను. 'ఏదో అమ్మ నమ్మకాలు అమ్మవి' అనుకుని నన్నిలా పోనీరాదూ" చిన్నబుచ్చుకుంటూ అంది జానకి.

"అమ్మా! కోపం తెచ్చుకోకు ప్లీజ్. నువు చెప్పినవి నిజమే. నీకు ఓపిక ఉండి చెయ్యగలిగినపుడే కొన్ని సింపుల్ ఎక్సర్సైజులు అంటే వాకింగ్, ప్రాణాయామంలాంటివి మొదలుపెట్టాలి. కీళ్ళనొప్పులు ఎక్కువైతే వాకింగ్ కష్టమవుతుంది. నువు మాకూ, మాపిల్లలకీ సేవ చేసినన్నాళ్ళూ మా అందరికీ బానే ఉంటుంది. నువు చెయ్యలేకపోతే సంగతి అలా ఉంచు. నువ్వే చేయించుకోవలసిన పరిస్థితి వస్తే మాలో ఎవరు నీకు సేవచేయగలుగుతామో తెలీదు! " గొంతు బరువై ఒక క్షణం ఆగింది రాధ.

కూతురి మనసు అర్థమై జానకి మనసు ఆర్ద్రమైంది.

"పిచ్చిదానా! నువు చిన్నప్పటినుంచీ ఇంతే... ఎక్కువ ఆలోచిస్తావు" తేలిగ్గా నవ్వేయబోయింది గాని గొంతు జీరబోయింది కళ్ళు చెమ్మగిల్లాయి. సర్దుకుని "ఇంక చాల్లే ఈ సుత్తి! నడులోపలికి" అంది కోపం నటిస్తూ.

"ఆగాగు. ఒక్క నిముషం. ఈ ఒక్కటీ విను. పూర్వం ఒకళ్ళింట్లో పెద్ద యజ్ఞం జరుగుతోందట. అక్కడేమో ఒక మూల ఓ పిల్లిని కట్టేశారట. ఆ యజ్ఞం జరిగినంత సేపు మియాఁవ్ మియాఁవ్మంటూ ఆ పిల్లి ఒకటే అరుపులు! అంతా ఎవరి పనుల్లో వాళ్ళుంటే ఓ ముసలాయన మాత్రం ఒక మూల కూర్చుని నవ్వుకుంటున్నాట్ట. ఆయన మనవడు వచ్చి "తాతా! ఎందుకలా నవ్వుతున్నావు? ఆ పిల్లిని ఎందుకలా కట్టేశారు?" అనడిగాడట. అపుడాయన ఏం చెప్పాడో తెలుసా?" కళ్ళు చికిలించి, టీజింగ్గా అడిగింది రాధ.

"తెలీదు. చెప్పు తల్లీ త్వరగా చెప్పు. అన్ని పనులూ ఆగిపోయాయి" అంది జానకి నడుం మీద చెయ్యి ఆన్చుకుంటూ.

"మా తాతగారి కాలంలో తరుచు యజ్ఞాలు చేసేవారు, అప్పట్లో మా ఇంట్లో ఓ పిల్లి ఉండేది అది నైవేద్యం కోసం ఉంచినవాటిని ఎంగిలి చెయ్యకుండా ఉండాలని యజ్ఞం జరుగుతునంతసేపూ దాన్ని కట్టేసేవారు. కొన్నేళ్ళ తర్వాత మా తాతగారు పోయారు. ఆ తర్వాత ఆ పిల్లి కూడా చచ్చిపోయింది. తర్వాతి కాలంలో ఎపుడు యజ్ఞం తలపెట్టినా చెయ్యాల్సిన పనుల లిస్టులో మా

ఇంట్లో వాళ్ళకి ముందు గుర్తొచ్చేది ఓ పిల్లని ఎక్కడినుంచైనా తెచ్చి ఒక మూల కట్టేయడం!! ఊరంతా తిరిగి ఒక పిల్లి ఎలాగోలా పట్టుకుని తెచ్చి కట్టేశాక యజ్ఞం మొదలు పెట్టేవారు. అలా పిల్లిని కట్టేయక పోతే యజ్ఞం ఫలించదని అందరికీ నమ్మకం ఏర్పడిపోయింది. అదీ ఈ పిల్లికథ. ఇదే తలుచుకుని నవ్వుకుంటున్నా' అన్నాట్ట ఆయన! బావుందా?" అడిగింది రాధ.

"చాలా బావుంది! ఆ విషయం ఆయన అన్నాళ్ళుగా తన పిల్లలకి ఎందుకు చెప్పలేదో?" అంది జానకి వెటకారంగా.

"నాలాంటి 'యంగ్‌లేడీ' చెప్పితే నువ్వు వింటున్నావా? మూలనున్న ముసలాయన చెపితే వాళ్ళెందుకు వింటారు?" కళ్ళు తిప్పుతూ అడిగింది రాధ.

"పెద్దవాళ్ళు చెపితే పిల్లకాయలు వింటే ఎలా? నీలాంటి యంగ్ లేడీ చెపితే నాలాంటి ముసలి వాళ్ళు వినాల్సిందే" ఉడుక్కుంటూ అంది జానకి లోపలికి నడుస్తూ.

వెంట నడుస్తూ "అమ్మా! ఒకమాట. మా ఆఫీసులో ఓ పూజారిగారున్నారమ్మా! ఆయన త్రికాలజ్ఞుడు. ఆయనేం చెప్పారో తెలుసా? ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఎవరైతే పావుగంటసేపు ప్రాణాయామం చేస్తారో, వాళ్ళ పిల్లలకి దీర్ఘాయుష్షు లభిస్తుందిట. సూర్య భగవానుడు ఉదయించేవేళ ఎవరైతే అరగంటకి తగ్గకుండా వాకింగ్ చేస్తారో వాళ్ళ మనవలకి అష్టైశ్వర్యాలూ లభిస్తాయిట!" కళ్ళు విప్పార్చి, చేతులు చాచి, 'డ్రమటైజ్' చేస్తూ నమ్మబలికింది రాధ.

వంటగదిలో అప్పుడే పనిమనిషి తోమిపెట్టిన గిన్నెలోంచి ఒక గరిట తీసి రాధని కొట్టబోతున్నట్టు పైకెత్తింది జానకి. రాధ నవ్వుతూ గుమ్మం బైటకి పరుగెట్టింది. ఇన్నాళ్ళకి అమ్మని కొట్టడానికి అమ్మమ్మ వచ్చిందని పకపకా నవ్వుతూ చప్పట్లు కొట్టారు పిల్లలు!

## జాతర - ఎ.విజయకుమార్

**అమ్మవారి జాతర** ఆ రోజు. సంవత్సరానికి ఓ సారి వచ్చే ఆ జాతర అంటే ఊరంతటికి మహా సరదా. అయిదురోజులు పాటు సాగే ఆ జాతర కన్నుల పండువుగా ఉంటుంది. బుధవారం తీసుకువచ్చిన అమ్మవారిని ఆదివారం తిరిగి గుడికి చేర్చడం ఆనవాయితీ. ఆ అయిదు రోజులు తెల్లవారుఝాము వరకు సినిమాలు, హరికథలు, బుర్రకథలు, అప్పుడప్పుడు కుర్రకారుని ఆకర్షించడానికి అనకాపల్లి నుంచి రికార్డింగ్ డాన్సు తెచ్చి ఆడిస్తారు....

రోజూ సాయంత్రం అమ్మవారి స్థానంలో సింధూరం పూసిన కత్తిని ఉంచి పూజ చేస్తారు. పసుపు రాసిన ఘటాలను ఊరేగిస్తారు. ఈ తంతు అంతా జరిగిన పూజారికి అమ్మవారు పడుతుంది. పూజారి అప్పుడు అరుస్తూ, గెంతుతూ, ఊగిపోతూ నృత్యం చేస్తాడు. చివరి రోజున పూజారి పులి అయిపోతాడు. అప్పుడు అచ్చం పులిలాగానే పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ జనం మీదకు వస్తాడు. అక్కడున్న అసిస్టెంట్ పూజారులు అతన్ని నిరోధిస్తుంటారు.

ముందురోజే చుట్టాలందరూ మా ఇంటికి చేరారు. అత్తలు, మామయ్యలు, పిన్నిలు, బాబాయిలు, అక్కలు, తమ్ముళ్ళు... ఓహ్.. మొత్తం బెటాలియన్తో మహాసందడిగా ఉంది. అన్నయ్యలు, అక్కలు అంతా కలిసి కారమ్స్ ఆడుతున్నారు. నేను తమ్ముడితో కలిసి చెస్ ఆడుతున్నాను. చెస్ అంటే చాలా ఇష్టం నాకు. ఇంతలో "ఒరేయ్ విష్ణు...!" నాన్న గొంతు వినపడింది.

అయిదు క్వార్టర్ బాటిల్స్ తెమ్మని డబ్బులు ఇచ్చాడు నాన్న. ఒక్కో క్వార్టర్‌కి పదిరూపాయలు కమీషన్ కూడా ఇచ్చాడు. మామూలు సమయాలలోనే తాగడం మానడు. ఇక పండగ సమయాల్లో అస్సలు ఎవ్వరు చెప్పిన వినడు. తాగొద్దని చెప్తాననే కాబోసు నాకు కమీషన్ కూడా ఇచ్చేది. నాకు ఇచ్చే కమీషన్ డబ్బులు ఎప్పుడు అమ్మకిచ్చేస్తుంటాను. మాకేమి తక్కువ చేయకపోయినా తన బలహీనతలని మాత్రం వదులుకోలేదు.

"ఏరా...! దేవతకి తిండి పెట్టరా...?" అడిగాడు నాన్న.

"పెడుతున్నాం....! " చెల్లి సమాధానం

"బ్యాండ్ వాళ్ళకి కబురు పెట్టారా...?" మళ్లి అడిగాడు

"ఇందాకడే చెప్పి వచ్చాను. వాళ్ళు వచ్చేసారు కూడా... చెప్పాన్నేను"

"మళ్ళీ పెండాల్ దగ్గర జనం ఎక్కువైపోతారు పదండి...." తొందర చేసాడు.

అమ్మ ఎర్ర చీర, పసుపు, కుంకుమ, ఎర్ర మట్టిగాజులు, ఎర్ర పువ్వులు అన్నీ కలిపి ఓ కంచంలో వేసి పట్టుకుంది. అమ్మవారికి ఎరుపు రంగంటే ఇష్టమని అందరి నమ్మకం. అందుకే ఎరుపు రంగు పూలతోనే పూజిస్తారు. అందరం కలిసి పెండాల్ దగ్గరికి బయలుదేరాం. తాగిన వాళ్ళంతా బ్యాండ్ వాళ్ళ శ్రుతికి తప్పటడుగుల తాళం వేస్తున్నారు. లోపల నుంచి "దేవతని" తీసుకువచ్చి ఎర్ర సింధూరం పెట్టి మెళ్ళో మారేడు ఆకుల దండ వేసి మేళ తాళాలతో ఊరేగిస్తూ బయలుదేరారు.

"పాపం నాన్న... ఆ మేకని ఇవ్వాళ్ళ చంపేస్తారా...?"

"తప్పమ్మా...." అది మొక్కుబడి మేక. దాన్ని మేక అనకూడదు. దేవత అనాలి. చంపడం అనకూడదు. మొక్కు తీర్చుకోవడం అనాలి... లెంపలేసుకో".... అంటూ నా లెంపలు వాయించాడు.

"చంపడం తినడంలాంటివి విచక్షణ జ్ఞానం లేని జంతువులు చేసే పని. మరి ఆ జంతువులనే చంపుకు తినే మనం మనుషులమా లేక దయ్యాలమా....?"

ఆ మేక కదలటానికి మొరాయిస్తుంది. దానికి ముందుగా తెలిసిపోయినట్టుంది. భయంతో బిక్కచచ్చిపోయింది. ఫలానా రోజు చస్తావని తెలియడం వరం అంటారు. కానీ నన్నడిగితే అదో పెద్ద శాపం అంటాను. ఇలాంటప్పుడే అనిపిస్తుంది. "మనిషికి కూడా ఇలాగే దండ వేసి నుదుటున సింధూరం పెట్టి, మెళ్ళో దండ వేసి, ఊరేగించి బలిస్తే అప్పుడు తెలుస్తుంది ఆ నరకయాతన. ఉరిశిక్ష వేసే ఖైదీకి కూడా సుఖంగా మరణించాలని ముందు స్పృహ తప్పేలా చేసి తరువాత ఉరి తీస్తారు. కరుడుగట్టిన ఖైదీలపై ఉండే ఆ అనుగ్రహం ఏ పాపం తెలియని ఈ మూగ జీవాలపై ఎందుకుండదు?"

"పాముని చూస్తే భక్తితో దండం పెడతాం. పులిని చూస్తే భయంతో పారిపోతాం. అదే మేకని చూస్తే బలిస్తాం లేదా కూర వండుకు తింటాం. ఎందుకంటే అది మన దౌర్జన్యాన్ని మౌనంగా సహిస్తుంది. తిరగబడే స్వభావం లేనిది." మేక మెడకు ఓ తాడుని కట్టి బలంగా ముందుకు లాక్కెళుతున్నారు. అది మెడ అటు ఇటు ఆడిస్తోంది. అయినా దాని గోడు ఎవరూ పట్టించుకోవటం లేదు. అది ముందర కళ్ళ దన్నుతో వెనక కాళ్ళను ఆసరాగా పెట్టి కదలటానికి మొరాయిస్తోంది. అయినా సాయుధులు దాన్ని బలంగా లాక్కెళుతున్నారు.

అది అదోరకంగా చూస్తోంది. ఆ చూపులో పాపం చేస్తున్న వాళ్ళకి కసి పగ, చేయని వాళ్ళకి జాలి కనపడుతూంది. ఆ మేక మే... మే... అంటూ బేలగా అరుస్తోంది. "నేను మీకు ఏం అన్యాయం చేస్నా? కడుపు కొట్టానా? కాలు కొట్టానా? నా మీద ఎందుకు

ఈ కక్ష? నన్ను బతకనివ్వండి" అన్న అభ్యర్థన ఆ కళ్ళల్లో, చూపులలో, అరుపులో, అర్థమౌతోంది." సాయుధులు తమ బలాన్నంతా ఉపయోగించి పెండాల్ దగ్గరకు లాక్కొచ్చారు. అప్పటికే పెద్ద క్యూ ఉంది.

మా ముందర ఒక మనిషి కోడిని పట్టుకుని ఉన్నాడు. కోడి, మేక, ఒకదానినొకటి జాలిగా చూసుకున్నాయి. ఆ చూపులో ఒకదానినొకటి ఓదారుస్తున్నట్టుగా అనిపిస్తుంది. పూజారి ఆ కోడికి సింధూరం పెట్టి పూజ చేసి అమ్మవారి దగ్గరున్న బియ్యం తినిపించాడు. కాని ఆ కోడి తినలేదు. అలా తింటేనే ఆ కోడి మనస్ఫూర్తిగా బలికి ఒప్పుకున్నట్టట. పూజారి దానిచేత బలవంతంగా తినిపించాడు.

తరువాత మా మేకకి పూజ చేసాడు. అక్కడున్న వేపాకుల గుత్తితో దాని మీద మూడు సార్లు కొట్టాడు. ఏవో మంత్రాలు చదివాడు. ఎర్ర సింధూరం అప్పటికే దాని నెత్తిన ఉన్నా మళ్ళీ పెట్టాడు. నల్ల మేక ముఖం ఆ సింధూరంతో ఎర్రగా మారిపోయింది. దాన్ని పెండాల్ వెనకగా తీసుకుని వెళ్ళమన్నాడు. పెండాల్ వెనకనే ఈ పశువులన్నిటిని బలి ఇచ్చేది. "ముందర భక్తితో నమస్కారాలు. వెనకనేమో ఈ క్రూరత్వాలు." మేకని పెండాల్ వెనకగా తీసుకెళ్ళాము.

ఆకాశంలో చుక్కల్లా అడుగు పెట్టటానికి కూడా వీల్లేకుండా అప్పటికే తీసిన కోడి ఈకలు, తెగిపడిన తలలు. అదంతా ఓ స్మశాన వాటికలా ఉంది. ఇంకా చెప్పాలంటే అదంతా ఓ యుద్ధభూమిలా ఉంది. అక్కడ ఓ పక్కగా కోళ్ళని మరో పక్కగా మేకల్ని, గొర్రెల్ని నరుకుతుంటారు. నరికిన తర్వాత అక్కడే ఓ దూలానికి మేక మొండాన్ని వేలాడదీసి దానిపై చర్మాన్ని ఒలుస్తారు. దాని గుండెకాయని వేరు చేస్తారు. దాని మాంసాన్ని బంధువులందరికి పంచుతారు. సమవర్తి కూడా ఇంత వికృతమైన శిక్షలు వెయ్యడే అనిపిస్తుంది. ఇదంతా చూస్తే?

చివరగా మా మేక వంతూ వచ్చింది. నాకు తెలియకుండానే నా కళ్ళవెంబడి నీరు రాసాగింది. మూడు నెలలు ఆప్యాయంగా దాన్ని పోషించేది మనం నరుక్కుతినడానికా...? వీటన్నిటిని నరకడానికి కమిటీ వాళ్ళు ముల్లు అనే మనిషిని ఉంచుతారు.

గత సంవత్సరం నరుకుతుంటే చూసాను. అప్పటినుంచీ నాకు భయమే!..! పెద్ద పదునైన గొడ్డలి తీసుకొచ్చాడు. ఇంత చిన్న జీవిని చంపడానికి అంత పెద్ద గొడ్డలి అవసరమా అనిపించింది.

"ఒరేయ్ ముల్లు మొండెంకి మొయ్యగా నరుకు. ఎక్కువ మాంసం వస్తుంది. కమిటీ వాళ్ళు చెప్పి పంపించారు. ఎందుకంటే మేక ముందు భాగం మెడ కమీటీ వాళ్ళది. వెనక మొండెం మాత్రమే బలి ఇచ్చినవాళ్ళది"

గత సంవత్సరం చూసిన సంఘటన మనసులో మెదిలింది.

***

ఆరోజు మేక మెడకు ఓ తాడుని కట్టి బలంగా ముందుకు లాగాడు. అలాగే వెనకకి కాళ్ళకి కూడా ఓ తాడుని కట్టి అంతే బలంగా లాగాడు. మేక గింజుకుంటున్నా, అరుస్తున్నా, వేడుకుంటున్నా వినిపించుకోకుండా కర్కశంగా క్రూరంగా, నిర్దయుడిగా, ఒక్క వేటుతో ఆ మేకతలని నరికాడు.

ఒక్కసారిగా తెగిపడడంతో తాళ్ళని పట్టుకున్న వాళ్ళు ఆ బలానికి కింద పడ్డారు. ఫౌంటైన్ నుంచి నీరు తుల్లినట్టుగా రక్తం అక్కడున్న వాళ్ళ ముఖం మీద చిమ్మింది. తల మొండెం నేలమీద వేరువేరుగా పడ్డాయి. తలలో ఆ అభ్యర్థన నిండిన కళ్ళు ఇంకా తెరిచే ఉన్నాయి. ఏ కోసానో ప్రాణం ఉంది కాబోసు.... కాళ్ళు ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాయి. అలా కొట్టుకుంటూ, విలవిలలాడిపోతూ ఆ కళ్ళతోనే శాపనార్థాలు పెడుతూ ఆ మేక నేలకొరిగిపోయింది.

***

ఆ దృశ్యం ఇంకా కనురెప్ప దాటిపోలేదు. కళ్ళ ముందర కదలాడుతూనే ఉంది. ఒళ్ళంతా జలదరించింది. అందుకే నేను చెల్లి భయమేసి చెట్టు చాటుకి వెళ్ళి దాక్కున్నాం. ఇంతలో....

"పట్టుకోండిరా మేకని పారిపోతోంది...". అరుపు  వినపడింది. మేక సింహం జూలు విదిలించినట్టుగా తన బుర్రని అటు ఇటు ఆడిస్తూ ఊగిపోతోంది. దాన్ని పట్టుకోడానికి సాయుధులు చేసే ప్రయత్న ఫలించటంలేదు. అప్పుడే హఠాత్తుగా ఎక్కడినుంచో అమ్మవారి గొంతు వినపడింది. అంతా ఒక్క క్షణం నిశ్చలంగా ఉండిపోయారు.

"ఒరేయ్. ఏమిరా నేను చెప్పానా...? మూగజీవాన్ని బలివ్వండి అని. మీరే కొబ్బరికాయలు కొడుతున్నారు. మీరే తింటున్నారు. మీరే నా పేరు చెప్పి కోళ్ళను, మేకలను బలిచ్చి భోంచేస్తున్నారు. గుడికి వచ్చి పూజారి ఒక చిప్ప ఇస్తాడా... రెండు చిప్పలు ఇస్తాడా. అని ఆలోచిస్తూ మనసు నా మీద లగ్నం చేయలేని మీరు ఎంతో ఆర్భాటంతో మేళ తాళాలతో వీటితో నాకు రక్తతర్పణం చేస్తే స్వీకరిస్తాననుకున్నారా. దైవశక్తి ఒక్క భక్తికే లొంగుతుందన్న విషయం ఇకనైనా గ్రహించండి. నాకు భక్తితో చిన్న అరటిపండు ఇచ్చినా సంతోషమే..." అని చెప్పింది.

అంతే....! మేక అలా అలా ఊగుతూ కింద పడిపోయింది. వెంటనే మేకని వదిలేసారు. నాకు చెల్లికి చాలా ఆనందం వేసింది.

నాతో సహకరించిన చెల్లి మళ్ళీ అమ్మవారి నుండి మామూలు మనిషి అయింది.

మేక అలా హఠాత్తుగా విదిలించి వదులుకోవడానికి కారణం కమీషన్ డబ్బులుతో కొన్న క్వార్టర్ బాటిల్ అని అక్కడ ఎవరికీ తెలీదు. నేను చెప్పను కూడా...!

***

## "గమ్యం లేని ప్రయాణాలు" - నిర్మలాదిత్య

### వంగూరి ఫౌండేషన్ వారు నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు కథల పోటీలో బహుమతి పొందిన విదేశాంధ్ర కథ

"గోపాలరావుతో, మాట్లాడాలి" వాసు మదిలో రిమైండర్ మరోసారి మ్రోగింది.

తెరవేసి దేవుడికి నైవేద్యం అర్పిస్తుండగ, ఫోను మ్రోగింది. పట్టించుకోలేదు. సేవలన్ని ముగించి మంగళారతి కూడా పాడి, వాసు ఫోన్ దగ్గరకి వెళ్ళి వాయిస్ మెయిల్ చెక్ చేసాడు.

"వాసు దేవ శాస్త్రిగారు, నేను రామ్ పెద్దపాడు మాట్లాడుతున్నాను ఇవ్వాళ సత్యనారాయణ వ్రతం ఉందికదా, తప్పక వస్తున్నారు కదా బయలు దేరే ముందు ఫోన్ చేయండి ఉంటాను మరి"

వాసు ఫోన్ తీసి, తన డైరీలో నోట్ చేసుకున్న నంబరు డయిల్ చేసాడు.

"హలో రామ్‌గారా? నమస్కారమండి. గుళ్ళో పూజారి వాసుదేవశాస్త్రి మాట్లాడుతున్నాను. మీ మెసేజ్ అందిందండి. ఇంకో గంటలో బయలు దేరుతున్నాను."

"ఇంటికి రూటు తెలుసు కదండి అన్నాడు," రాం.

"ఆఁ గూగుల్ మ్యాప్స్ నుండి, ప్రింట్ చేసానండి. అన్నట్లు ఈ మధ్య గోపాలరావుగారు కూడా తన పాత జి.పి.ఎస్ ఇచ్చారండి. కాబట్టి సాయంత్రం నాలుగ్గంటల కల్ల వచ్చేస్తాను లెండి", అన్నాడు వాసు.

"ఒకే థాంక్స్, సీయు, అన్నట్లు మీరు చెప్పిన వస్తువులన్ని రెడీ చేసి ఉంచాము. ఒక్క తమలపాకులు తప్ప. పరవాలేదంటారా?"

"తమలపాకులు మొన్న చికాగో నుంచి గుళ్ళోకి తెప్పించారు. నేను తెస్తాను లెండి. సాయంత్రం కలుద్దామండి" అని చెప్పి వాసు ఫోను పెట్టేసాడు.

గుడిలో ఎవ్వరూ లేరు. శని, ఆదివారాలంటే జనాలతో గుడి కళకళలాడుతుంది. ఇది వర్కింగ్‌డే అయ్యింది. ఇటు గణపతి, కార్తికేయుడు తన భార్యలతో సహా, శివలింగాలతో చిన్న చిన్న మండపాలలో ఉండి వెలిగిపోతుండగా అటువైపు ఆంజనేయుడు, రాధాకృష్ణులు, దుర్గాదేవి ఆసీనులై ఉన్నారు. గుడి హాల్‌లోకి ప్రవేశిస్తూనే ఇలా మండపాలు ఇరువైపుల ఉంటే ఎదురుగా గర్భగుడిలో జయవిజయులు బయట పర్యవేక్షిస్తుండగా దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు బాలాజీ.. గర్భగుడికి ఇరువైపుల చిన్న గుళ్ళలో భూదేవి శ్రీదేవి భర్త అందాలకి మురిసిపోతున్నారు, వాసు అన్ని దేవుళ్ళ వస్త్రాభరణ అలంకారాలు చూసి బాగా చేసానని తృప్తి చెందాడు.

మొన్న మొన్న వచ్చినట్లుంది అప్పుడే నాలుగేళ్ళై పోయాయి అనుకున్నాడు వాసు. తిరుపతి వేద పాఠశాలలో చదువుకున్నాడు. చక్కగ చదివి గోల్డు మెడల్ కూడా సంపాదించి, మంచి పేరు తెచ్చుకున్నాడు. కొన్ని రోజులు దేవస్థానంలోనే పని చేస్తుండగ, యు.ఎస్ లో ఉన్న తనతో పాటు పాఠశాలలో చదువుకున్న సీనియర్ రావడం, తన వివరాలు తీసుకుని వీసా పంపించడము తను తన ఇరవై రెండేళ్ళకే యు.ఎస్‌లో ఓ మహానగరానికి చేరడం అయ్యిపోయాయి. అక్కడ ఓ సంవత్సరం పనిచేసాడు. అప్పటికే ఆ గుళ్ళో ఆరుగురు పూజరులు ఉన్నారు. గుడిపెద్దదే వచ్చే భక్తజనం, ఆదాయం కూడా ఎక్కువే. కాని వాసు అక్కడ ఇమడలేకపొయ్యాడు.

అప్పుడే గోపాలరావును ఆ గుళ్ళోనే కలిసాడు. అర్చన అయ్యిన వెంటనే భక్తులందరూ వెళ్ళిపోయినా ఒకరిద్దరు ఆగి తనతో ఒకటి రెండూ కబుర్లు చెప్పి వెళ్ళడం మామూలే. హిందీలో మాట్లాడితే వాళ్ళతో హిందీలో మాట్లాడటం, అలానే తమిళం, కన్నడం, తెలుగులో మాట్లాడడం అలవాటైపోయింది. ఈ మధ్యనే మళయాళం కూడా నేర్చుకునాడు వాసు. వారి వారి మాతృభాషలలో మాట్లాడితే వారి ముఖాలలోని వెలుగును చూసి ఆశ్చర్యపోయేవాడు. తెలివైనవాడు, కలుపుగోలు మనిషి కాబట్టి, కొద్దిరోజుల్లోనే మంచిపేరు సంపాదించుకో గలిగాడు. తనంత పాపులర్ అవ్వడం, మిగతా పూజారులకు కంటకంగానే ఉండటం అది తనకు వారిని దూరం చేయడం కష్టంగా ఉండేది వాసుకు. గుడికి జనం రాని రోజులలో, మరీ ఒంటరి తనంగా అనిపించేది.

గోపాలరావుగారు, ఆయన భార్య అందరితోపాటు అర్చన చేసినతరువాత, ప్రసాదం అదీ తీసుకుని తనతో పాటు కబుర్లు వేసుకునే వారితో మిగిలారు. అలాంటి సమయంలో ఒకరు మాట్లాడడం, మిగతావాళ్ళు వాళ్ళ అవకాసం కోసం అసహనంగా వేచి ఉండటం అలవాటే. సమయం కోసం పరుగులు తీస్తూ జీవనం గడపడానికి అలవాటు పడి పూజారితో మాట్లాడటానికి వేచి ఉండాలంటే అందరికీ చేతకాదు. అలా వెనుక నుంచున్న వాళ్ళు కొందరు ఓపిక లేక కదిలిపోతే, మరికొందరు జరుగుతున్న సంభాషణలో చొచ్చుకుని కొన్ని మాటలు విసిరేసి, వాసు ముఖంలోని అర్ధం అయ్యి లేని నవ్వునే సమాధానంగా తీసుకుని వెళ్ళిపోయేవారు. గోపాలరావుగారి భార్య కూడ అలా ఇలా చూసి, అటువైపు పరిచయస్థులు ఎవ్వరో కనిపిస్తే, అమాంతంగా గోపాలరావును వదిలివేసి, ఆనందంగా అటువైపు ఓ పెద్ద రిలీఫ్‌తో అడుగులు వేసింది.

అందరు వెళ్ళిపోయేంతవరకు, ఆగి వాసు మాత్రమే మిగిలినప్పుడు గోపాలరావు ముందడుగు వేసి, "వాసుదేవ శాస్త్రిగారు నమస్కారం. చాలా బాగా అర్చన చేసారండి. మీ ఉచ్చారణ, పూజ విధానం నాకు బాగా నచ్చిందండి" అన్నారు.

"ఆఁ. చాలా సంతోషమండి, అంటే మీరు చేస్తున్న పూజలో నిమగ్నమయ్యారండి. పుణ్యమంతా మీకే" అన్నాడు వాసు.

"అలిసిపోయి ఉంటారు అలా కూర్చుందామా", అన్నాడు గోపాలరావు

"తప్పకుండానండి. మీ పేరేమిటి? ఎక్కడనుంచి వచ్చారు? " తనని సాటి మానవునిగా చూడడం, తను చేస్తున్న పనిపై ఆసక్తి కనపరచడం, గోపాలరావు ముఖంలో ఉన్న ప్రశాంతత, తనపై కనిపించి కనిపించకుండా మెదలుకున్న ఆప్యాయత. వాసును మంత్ర ముగ్ధుని చేసాయి.

మళ్ళీ అర్చనకు మరో అరగంట ఉంది. ఆ అరగంట సమయం గోపాలరావు సమక్షంలో అరక్షణంలా గడిచి పోయింది. తిరుపతిలో ఉన్న తన ఆప్తులందరు ఆ రోజు గోపాలరావు రూపంలో తరలి వచ్చారనిపించింది.

గోపాలరావుగారు, అప్పుడప్పుడు రావడం, తనతో పూజ తరువాత మాట్లాడడం, కొన్ని సార్లు ఫోనులో మాట్లాడి తన క్షేమ సమాచారాలు విచారించడం జరిగింది. అలా కొద్ది నెలలలోనే గోపాలరావు వాసుకు ఆప్తుడిగ మారిపోయాడు, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే గోపాలరావు వృత్తిరీత్యా సర్జన్. క్షణం తీరికలేని మనిషి, పెద్ద ఇల్లు మంచి కార్లు, బాగా డబ్బున్న మనిషి. కాని వాసుకు ఆ విషయం తెలియడానికి చాలా రోజులే పట్టింది. అది గోపాలరావుగారు చెప్పలేదు. ఓసారి సత్యన్నారాయణ వ్రతం చేయడానికి, ఆయనే గుడివారితో ఏర్పాటు చేయించుకుని, తననే ప్రత్యేకంగా అడిగి, తనకారులో వారింటికి తీసుకెళ్ళి మళ్ళీ దించినపుడు అర్థం అయ్యింది. అది తెలిసిన తరువాత, గోపాలరావుగారి మీద గౌరవం మరింత పెరిగింది.

గోపాలరావుగారు ఉన్న ఊరు చిన్నదే. తనున్న నగరానికి ఓ నాలుగుగంటల ప్రయాణం అవతల ఉన్నది. ఓ వంద దేశీజనాలున్న ఊరని గోపాలరావుగారే చెప్పారు. ఓ రోజు గోపాలరావుగారు గుడికొచ్చి మాట్లాడుతూ "వాసు మీరు మా ఊరు వస్తారా. ఓ గుడి కట్టబోతున్నాం."

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడం కోసం బాగానే శ్రమించాల్సి వచ్చింది. కొత్త గుడి అంటున్నారు నా ఉద్యోగం ఉంటుందా, కొన్ని రోజుల తర్వత ఊడుతుందా R1 వీసా మీద ఉన్నాను గోపాలరావుగారు మార్పించగలరా? నాకు గ్రీనుకార్డు కోసం ప్రయత్నిస్తారా? జీతం ఎంత ఇస్తారు?

తన ప్రశ్నలన్నింటికి గోపాలరావుగారు ఓపికగా జవాబు చెప్పారు. కాని తనున్న అసంతృప్తి పరిస్థితిలో గోపాలరావు వెంట వెళ్ళడానికి పెద్ద ప్రయత్నం చేయవల్సిన అవసరం లేకపోయింది.

అలా ఈ చిన్న ఊరుకి రావడం, సాఫ్ట్వేర్ ఆటుపోట్లతో జనాలు కూడ ఈ ఊరు రావడం పోవడంతో గుడిలో పని కూడా మరీ అంత ఎక్కువ, మరీ తక్కువ కాకుండా ఉండేది. శని ఆదివారాలలో, పండుగ దినాలలో గుడి కిటకిటలాడుతుండేది, ఇలా వర్కింగ్డే అయితే దేవునితో ఏకాంత సేవనే. కాని వాసుకి ఇది బాగానే చచ్చింది. గుళ్ళో తనొక్కడే పూజారి. గోపాలరావుగారి ధర్మమా అని, అన్ని ఏర్పాట్లు సక్రమంగానే ఉన్నాయి. ఈ ఊరు చుట్టు ప్రక్క ఉన్న ఊర్లో జనాలు, పూలకని, వ్రతాలని, పిలిచి సంభావనలు ధారాళంగానే ఇస్తున్నారు. జీతం కాకుండా అదో ఆదాయం. ఈ ఊరి కొచ్చిన తరువాత తిరుపతి వెళ్ళి పెళ్ళి కూడా చేసుకుని వచ్చాడు వాసు. అమ్మాయిది హైదరాబాదు. పేరు లక్ష్మి. తిరగడానికి గోపాలరావే ఓ సెకండ్ హేండ్ కారు కొని ఇచ్చారు. మొన్నీ మధ్యే గ్రీన్ కార్డు వచ్చింది. జీవితం బాగానే ఉందనిపించింది వాసుకు.

"గోపాలరావుగారితో మాట్లాడాలి. ఎలానూ రాత్రి గుడికి వస్తారు కదా," మరోసారి వాసు మదిలో ఆలోచన అప్రయత్నంగ మెదిలింది. లక్ష్మి మనస్సులో తిష్ట వేసి 'గోపాలరావుగారితో ఆ ప్రసక్తి తెచ్చారా లేదా' అని మరోసారి గగ్గోలు పెట్టినట్లనిపించింది.

ఆలోచనలు ఆపి దేవుళ్ళకి తెరలు వేసి ఒక్క దీపం మాత్రం ఉంచి గుడి తాళం వేసుకుని కారులో రామ్ గారింటి అడ్రసు జిపియస్ లో ఎక్కించి, కారు చేసాడు వాసు.

బయట సన్నగా స్నో షవర్స్. తను పంచ మీదనే పాంటు, పైన పర్క, జుట్టుముడి మీదే ఓ ఉలెన్ టోపీ వేసుకోవటం వల్ల చలి తట్టుకోగలుగుతున్నాడు. కారులో హీటర్ కూడా వేడెక్కి కొంచెం ఉపశమనం కలిగించింది, వాసుకు. జేబులో ఉన్న సెల్ మ్రోగింది. లక్ష్మి నుండి

"ఏమండి గోపాలరావుగారితో మాట్లాడారా లేదా!"

"లేదు లక్ష్మి ఇప్పుడే గుడి కట్టేసి రామ్ గారింటికి బయలుదేరాను. ఇవ్వాళ గోపాలరావుగారు గుడికి రాలేదు. కలిసినప్పుడు తప్పక మాట్లాడతాను."

"మీరు మరీ భయస్తులండి. ఎన్నో రోజులనుండీ దాటవేస్తున్నారు. అక్కడ చెప్పాల్సిన గడువు ముంచుకొస్తున్నదా! ఇవ్వాళా ముగించేయండి" అని పెట్టేసింది.

వింతగా మారిపోయింది లక్ష్మి. ఈ ఊరు వచ్చిన కొద్దినెలలోనే లక్ష్మితో సంబంధం ఖాయం అవ్వడం, పెళ్ళీ జరిగి తనని ఈ ఊరు తీసుకు రావడం జరిగింది. ఊరివాళ్ళు, అందులోను గోపాలరావు తనంత బాగానే లక్ష్మిని కూడా ఆదరించారు. ఊరంతా కలిసి తమకుంటుంబానికి కావల్సిన వస్తువులు తన ఇంటిని సర్దివేసారు. ఇంట్లో ఎక్కువైన మంచాలు, డైనింగ్ టేబుల్, చెయర్స్ అన్ని తనింటో చోటు చేసుకున్నాయి.

కానీ ఏదో సత్యనారాయణ పూజలనో, గృహప్రవేశం అనో దాదాపు అందరి ఇళ్ళు లక్ష్మీ తనతోపాటు చూడడం జరిగింది. అలానే జనాలకు ఉన్న సెంటిమెంటువల్ల, వాహన పూజ ధర్మమా అని అన్ని కొత్త కార్లు చూడటం, చాలాసార్లు వాటిలో ప్రయాణం చేయడం జరిగింది. గుడికి వచ్చే భక్తుల వద్ద ఉన్న కొత్త కొత్త కెమేరాలు, సెల్‌ఫోన్లు, కదలకుండానే ప్రివ్యూ చేసే అవకాశాలు కలిగాయి.

దాంతో మొదట్లో బాగానే ఉందనుకున్న ఈ జీవితంలో, లక్ష్మికి, తనకు ఓ చిన్న అసంతృప్తి బీజం వేసుకుని, మొక్కై పెరగడం మొదలైందేమో అనిపించింది.

రోడ్లు బాగేనే క్లీన్ చేసారు. కాని కారు సెకెండ్ హాండ్, టైర్లు పాతవి కావడంతో అక్కడ కూడా స్లిప్ అవుతూనే ఉంది. కొంత మెల్లగా గంటకి ఏభై మైళ్ళు మించకుండ వాసు జాగ్రత్తగా నడుపుతున్నాడు. మామూలుగా అయితే 75 మైళ్ళ వేగం తగ్గేవాడు కాదు, ఈ గంటలో రామ్ వాళ్ళింటికి చేరిపోయి ఉండేవాడు. ఇవ్వాళ మరో అరగంట ఎక్కువ పట్టింది.

రామ్ వారింటికి చేరడంతో "డిస్టినేషన్ ఆన్ యువర్ రైట్" అంటూ జిపియస్ లో ఉన్న అమ్మాయి గొంతు తొణుకు బెణుకు లేకుండా అదే మంద్ర స్థాయిలో చెప్పి, తన పని ముగించేసుకుంది.

రామ్ గారిల్లు పెద్దదే. ఆయనా గోపాలరావుగారి హాస్పటల్లో ఇటీవలే కొత్తగా చేరిన డాక్టరు. రామ్‌గారి భార్య అపర్ణ కూడా డాక్టరే. ఆ ఇంట్లో తనున్న అపార్ట్‌మెంట్లు ఓ పది దారాళంగా ఇమిడిపోవచ్చునేమో. అంత పెద్దగా ఉంది. ఇంటి ముందు పార్కింగ్‌కు కావల్సినంత చోటున్న ప్రదేశంలో కార్లన్ని నిండిపోయాయి. అన్నీ తన దగ్గరికి వాహన పూజకు వచ్చినవే. అదుగో ఆ లెక్సస్ వెంకట్ పరిగిరి గారిది, ఆ ప్రయస్ రాడ్ మంగళం పేట కూతురు మంజరిది, ఆ మెర్సిడెజ్ నికితా అగర్వాల్‌ది, ఆ హైలాండర్ సందీప్ ముఖర్జీది,.... బి. గోపాలరావుగారు కూడ వచ్చినట్లుంది. సెవన్ సిరీస్ బి.యమ్‌బి,యం డబ్ల్యు కారు కనిపించింది. గోపాలరావుగారి దగ్గర మరో లెక్సుసు హైబ్రిడ్ వాల్వో కార్లు కూడా ఉన్నాయి.

వేచి ఉన్నట్లున్నారు, ఇంటి తలుపు దగ్గరకి పోతూనే రామ్‌గారు తలుపు తీసి సాదరంగా ఆహ్వానించి ఇంట్లోకి తీసుకెళ్ళారు. పూజ హాలులోనే పెట్టారు. ఎత్తైన సీలింగ్‌తో, విశాలంగా ఓ 50 మంది ధారాళంగ కూర్చుండేంత విశాలంగా ఉంది. ఆ హాల్‌లో ఉన్న ఫర్నిచరంతా గోడల దగ్గరకి తోసి వేసి, స్థలం కల్పించడంతో చాలా మంది కార్పెట్ మీద కూర్చుండేంత స్థలం ఏర్పరచ గలిగారు.

అప్పటికే దాదాపు ఓ 70 మంది దాకా జనం చేరారు. గోడల దగ్గరున్న సోఫాల పైన, క్రింద కార్పెట్టు పైన, ఎక్కడ కనిపిస్తే అక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. రామ్‌గారు నేరుగా హాల్ మధ్యలో పూజకని ఖాళీగా ఉంచిన స్థలం దగ్గరకు తీసుకెళ్ళారు.

తను చెప్పిన వస్తువులన్ని ఎక్కడెక్కడ ఉన్నాయి అని రామ్‌గారి భార్య అపర్ణ వివరించింది. రామ్, అపర్ణలను అక్కడే కూర్చోమని, తనవెంట తెచ్చిన సత్యన్నారాయణ స్వామి పటం తీసి పెట్టి పూజకు కావాల్సిన సామాగ్రిని కూడ అందుబాటులో ఉండేటట్లు చూసుకుని పూజ మొదలు పెట్టాడు వాసు.

ఈ పూజ ఎన్నిసార్లు చేసినా చిత్త శుద్ధితో మొదటిసారి చేసినట్లు చేయడం వాసుకు ఆ ఊరి వారికి దగ్గరకు చేరడానికి మొదటికారణం. అలానే అక్కడున్న వారి పిల్లలను పేరుపేరునా పిలిచి వారిచే ఇంగ్లీషులోనే వ్రతకథ చదివింపచేయడం, అన్ని రొటీన్‌గా జరిగిపోయాయి. తను ఆసక్తిగ పూజ చేయడం కూడ, తన నైజంలో ఒక భాగం అయ్యిపోయింది. కాని ఈ మధ్య ఈ పనిలో మెల్ల మెల్లగా చోటు చేసుకుంటున్న అసంతృప్తి కనబరచకుండా ఉండటం ఎన్ని రోజులు సాధ్యం అవుతుంది!?

పూజ అయ్యింది, భోజనాలు అయ్యాయి. గుడికి చెక్కు, తనకు ఓ వంద డాలర్ల కాష్, ఇంటికని గారెలు, స్వీట్లు జిప్‌లాక్ బ్యాగులో వేసి ఇచ్చారు రామ్ దంపతులు. ఇంటికి బయలుదేరబోతుండగా గోపాలరావుగారు కనిపించారు. ఆప్యాయంగా పలుకరించి తనతో పాటు ఆయనకూడా కార్లవైపు అడుగులు వేయసాగారు, గోపాల్ రావుగారిని అడగాల్సిన విషయం గుర్తుకొచ్చింది. అడుగుదామనుకున్నాడు కానీ అడగాలంటే ఓ గిల్టీ ఫీలింగ్. గోపాలరావుగారు, గుడి ట్రస్టీ ఛెయిర్మెన్. గుడిలో ఉన్న ఆఫీసుకు తరచు వస్తూనే ఉంటారు. అక్కడ అడగాలనుకున్నాడు. కాని ఆఫీసు రూములో ప్రవేశించే గోపాలరావుగారి ముఖంలో కనిపిస్తున్న ఆప్యాయత, చూస్తూ నోట్లో మాటలు కదలటం లేదు. అడగాల్సిన విషయం అణగదొక్కుకుని, ఇంకా టైముంది కదా అని దాటవేస్తూ వస్తూనే ఉన్నాడు. ఇప్పుడూ అదే అయ్యింది. గుళ్ళో కలిసినప్పుడు అడుగుదామనుకున్నాడు.

తన కారు దగ్గర్కి వెళ్ళి గోపాలరావుగారికి చేయి ఊపి కారు స్టార్ట్ చేశాడు. క్లిక్ క్లిక్ అంటూ శబ్దం వస్తున్నది కానీ, కారు స్టార్టు కాలేదు. వెంట వెంటనే మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాడు. లాభంలేదు. గోపాలరావుగారు గమనిస్తూనే ఉన్నారు. తన తలుపు దగ్గరకి వచ్చి "బేటరీ డెడ్ అయ్యినట్లుంది వాసు, నా కారులో వచ్చేయి. తరువాత ట్రిపుల్ ఏ కి చెప్పి చేయిద్దాములే, నీవీ చలిలో జంపుస్టార్టు చేసేవరకు వేచి ఉండటం అనవసరం" అనటంతో వాసు, గోపాలరావుగారితో వారి కారువైపు నడిచాడు. గోపాలరావుగారి బి.ఎం డబ్ల్యు కారులో ఉన్న సుఖమే వారు. సీట్లు అన్నీ వేడిగ అయ్యి లోపల కూర్చోవడం సుఖంగా ఉంది. బాలమురళి కృష్ణ కచేరి మ్యూజిక్ సిస్టంలో వస్తుంటే బాల మురళి గారు వారి బృందంతో పాటు కారులోనే కూర్చుని ప్రయాణం చేస్తున్న ఫీలింగ్. కారు స్టీరింగ్ కూడ వార్మర్ ఉందని విన్నాడు వాసు. దీనికి వాహన పూజ చేసి రెండు నెలలు కూడా కాలేదు. గోపాలరావుగారు ప్రతి సంవత్సరం ఓ కొత్త కారు లీడ్ చేస్తుంటారు. లీడ్ కాబట్టి ఆయన వద్ద ఎప్పుడు మూడేళ్ళకు మించి పాతవైన కార్లు ఎప్పుడూ చూడలేదు.

గోపాలరావుగారు కబుర్లు చెబుతూనే ఉన్నారు, కార్లో ఉన్న వాతావరణం ఏమో, బాలమురళిగారి గాన మహత్యం ఏమో, గోపాలరావుగారితో లక్ష్మి చెప్పాలని పోరు పెడుతున్న విషయం నోటివరకు వచ్చేసింది. "ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను, చాలా రోజులనుంచి" ఆమాటలు చెప్పింది వాసుకాదు. గోపాలరావుగారు చెప్పడం, ఏదో సైకిక్ అనుభంలా తోచింది. కాని మొదట ఆ ప్రసక్తి తెచ్చింది గోపాలరావుగారు కాబట్టి తన ఆలోచనలను ప్రక్కన పెట్టి, గోపాలరావుగారి మాటలు వినసాగాడు వాసు.

"ఈ సమ్మర్లో ఈ ఊరు వదిలి వెళ్ళదలచాను వాసు" అన్నారు గోపాలరావుగారు.

"అదేంటండి, మీరెలా వెళ్ళిపోతారు. మీరు వెళ్ళిపోతే ఈ గుడి ఏమౌతుంది. మీరున్నారని ఈ గుళ్ళో ఇన్ని రోజులున్న నా గతి, ఈ ఊరి వాళ్ళ సంగతి ఏంటండి". బాగా షాక్ అయ్యి చెప్పాడు వాసు.

"వాసు, ఎన్నో రోజుల నుండి అనుకుంటున్నాను. ఈ క్వాటర్‌లో ఓ చిన్న ఆసుపత్రి ఆరంభించి అక్కడ వారికి సహాయం చేద్దామని, ఇదుగో ఇప్పటికి వీలైంది" అన్నారు గోపాలరావు.

"ఆ పనేదో ఇక్కడే చేయొచ్చు కదండి" అన్నాడు వాసు

"ఇది పనికాదు, సేవ", నవ్వారు గోపాలరావు గారు "నేను పోతున్న ప్రదేశం మారుమూల కుగ్రామం. అక్కడ చుట్టుపక్కల వందమైళ్ళ వరకు ఒక డాక్టరు కూడా లేడు, వైద్య సదుపాయం లేదు. అక్కడ పనిచేయాలనుకుంటున్నాను. ఆవిడ రావటం లేదు. తను అక్కడికి రాదని నాకు తెలుసు. కాని ఈ పని నేను చేయాల్సిందే నా మెదడు ఇన్నిరోజులు తొలిచేస్తున్న ఆలోచన్లని చంపడానికి ఇదొక్కటే మార్గం."

"ఒంటరిగా ఎందుకెళుతున్నారండి!" అన్నాడు వాసు

"నేను వెళ్ళే ప్రదేశం ఓ రిమోట్ అడవుల్లో ఉంది. అక్కడ ఉండటానికి, బంగళాలు లేవు, తిరగడానికి కార్లు లేవు. కరెంటు కూడా లేదు. అంతా ప్రిమిటివ్ లైఫ్" వాసు షాక్‌తో కొంతసేపు మౌనం వహించాడు. ఇక గోపాలరావుగారు కూడా ఈ గుడిని, ఈ ఊరిని వదిలేసిపోతున్నప్పుడు తను అడగాల్సిన విషయం అడగకపోవడం పిచ్చిపనే.

"గోపాలరావుగారు ఇదంతా షాకింగ్‌గా ఉందండి. కాని నేను కూడా మీతో చెపుదామనే అనుకుంటున్నాను కుదరలేదు. గ్రీను కార్డు వచ్చింది కదా కొంచెం వేరే ప్రదేశానికి వెళదామ అని లక్ష్మి పోరు పెడుతూనే ఉంది. కాలిఫోర్నియాలో బే ఏరియాలో గుళ్ళో కాళీ ఉందని పిలిచారు. జీతం బాగానే ఇస్తాం అన్నారు"

"గుడ్ న్యూస్ వాసు. ఈ మాట ఇంకా వినలేదనే అని నేననుకుంటున్నాను. గ్రీన్ కార్డు వచ్చిన వెంటనే మారాలనుకోవడం సహజమే కదా" అన్నాడు గోపాలరావు.

"మీకీ విషయం చెప్పేంత వరకు మనస్సు ఉపశమనం అవుతుందనుకున్నాను. కాని మీరు ఇక్కడున్న ఆస్తిపాస్తులు, భార్య పిల్లలు మీ లైఫ్ స్టైల్ అంతా వదిలేసి, ఏదో సేవ అంటూ ఎటువంటి సౌకర్యాలు లేని జీవితాన్ని ఏరి కోరి గడపాలనుకుంటున్నారంటే, నేను చేసేది సరియేనా అనిపిస్తుంది," అన్నాడు వాసు.

గోపాలరావుగారు వెంటనే జవాబు చెప్పలేదు. ఆలోచించి, నవ్వుతూ

"వాసు, తప్పుకాదు. నువ్వు లక్ష్మి ఇప్పుడే సంసార జీవితంలోకి అడుగుపెట్టారు. ఈ దశలో అలానే ఉంటుంది. మంచి ఇల్లు, మంచికారు, ఇంకా పెద్ద ఇల్లు, ఖరీదైన ఖారు సెలవల్లో కొత్త దేశాలలో వెకేషన్లు ఇవన్నీ నేను నీ వయస్సులో ఆశించినవే. అందుకే నిన్ను లక్ష్మిలను కూడ, ఇక్కడి కమ్యూనిటీ కాలేజీలో చదువుకొమ్మని కూడా ప్రోత్సహించాను"

"అవునండి లక్ష్మి కూడ నన్ను ఈ పని మానేసి సాఫ్ట్‌వేర్‌కి మారిపొమ్మని పోరుతూనే ఉంది. తనెలాగూ ఆ కంప్యూటర్ కోర్సులు ముగించేసింది కాబట్టి కాలిఫోర్నియా వెళ్ళిన వెంటనే అక్కడే ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తానని నిర్ణయించేసుకుంది. కొన్ని ఇంటర్వ్యూలు కూడా అయ్యాయి"

"వాసు, నీవి తెలివైన వాడివి. నీకున్న తెలివికి నువు సులభంగా డాక్టరో, ఇంజినీరో, ఓ ఐ.ఎ.ఎస్ ఆఫీసరో అయినా నేను ఆశ్చర్యపడను. ఏదో కారణం వల్ల నీవు వేద పాఠశాలలో చేరావు. విద్యలో ప్రవీణుడవయ్యావు. నీకు డబ్బు కావాలని మరో వృత్తికి మారినా నువ్వు అందులోనూ టాప్ లెవెల్‌కి వెళ్ళగలవని దృఢనమ్మకం. ఏ మాత్రం సందేహం లేదు. నీకి వెళ్ళాలనిపిస్తే వెళ్ళు. తప్పక వెళ్ళాలి కూడా.."

"అది తప్పు కదండో.. నాలాంటివాడు మీలా ఏదో సేవ చేయడమో, భగవన్నామ స్మరణంలోనో ఉండాలి కాని.." అన్నాడు వాసు.

"నో..నో.. వాసు తప్పు కాదు. పౌరోహిత్యమూ నీకు ఒక జాబే. నీ జీవనోపాథి. కాబట్టి నీ వృత్తి ఏదో సన్యాసానికి మెట్లు అనుకోవద్దు. నీవు అనుక్షణం చూస్తున్న జీవనవిధానం, ఇక్కడి కార్లు, ఇక్కడి బంగళాలు నిన్ను అలా ఆలోచింపచేయలేవు. నీవు వాటిన్ననింటినీ సంపాదించాలి, అనుభవించాలి. అన్నీ అనుభవించిన తరువాతనే మనస్సులో నాకు వచ్చిన ఆలోచనలు రావచ్చు. రాక పోవచ్చు.ఆలోచనలు వచ్చినా ఆచరించడానికి మనస్సు రాకపోవచ్చు. ఎక్కడో చదివినట్లు లైఫ్ ఈజె జర్నీ.. ఈ ప్రయాణానికి గమ్యమంటూ లేదు. ఎప్పుడు తోస్తే అప్పుడు ఆగి ఆలోచించి మరో త్రోవ పట్టవచ్చు. అదీ నచ్చకపోతే మరోదారి.."

గోపాలరావు గారి మాటలు పూర్తిగా అర్థం అయ్యాయా లేక ఆయన నాకు తెలియని విషయాలు చెప్తున్నారా? సందిగ్ధంగానే ఉంది. కాని అర్థం అయ్యిన విషయం ఒకటే, గోపాలరావు గారికి తను కూడ ఊరు వెళ్ళడం సమ్మతమే. మంచి రిలీఫ్‌గా అనిపించింది వాసుకి కాలిఫోర్నియా వెళ్ళిన వెంటనే కొత్త కారు కొనుక్కోవాలి అనుకున్నాడు.

"వాసు ఎప్పుడు నోటీసు ఇస్తున్నావో చెప్పు. మరో కుర్రాడ్ని వెదకాలిగా. అన్నట్టు కాలిఫోర్నియా ప్రయాణానికి ముందే చెప్పు. నాదగ్గర ఎయిర్ మైళ్ళు ఉన్నాయి. టిక్కెట్లు నేనే కొనిస్తాను.." అన్నాడు గోపాలరావు.

## గ్రక్కున విడువంగవలయు... - ఆర్. శర్మ. దంతుర్తి

సాయంకాలం నీరెండలో ఏటి ఒడ్డున కూర్చుని అస్తమిస్తున్న సూర్యుణ్ణి తదేకంగా చూస్తున్నాడు నారాయణ. వెనకనుంచి ఎవరో వస్తున్న చప్పుడైతే తలతిప్పి చూసాడు.

"ఇలా ఒక్కరూ కూర్చున్నారేం?" అంటు వచ్చాడు శంకరం.

"చూడు శంకరం ఈ ఏటి ఒడ్డూ, గలగల పారే నీళ్ళూ, ఈ సూర్యాస్తమయం అన్నీ ఒక్కసారి అద్భుతంగా కుదిరాయి కదూ?" వచ్చి కూర్చోమన్నట్టూ చెయ్యూపుతూ పిల్చాడు నారాయణ.

"ఏంటో మీరు చెపుతారు కానీ ఇక్కడేముంది చూట్టానికి? రోజూ చూసేదేగా?" అంటూ నారాయణ పక్కనే చతికిలపడ్డాడు శంకరం.

కొంత సేపు మౌనంగా కూర్చున్నాక నారాయణ అన్నాడు - "ఇక్కడేముందని కదూ అన్నావ్? ఎన్ని కోట్లు కుమ్మరించినా, ఎంతదూరం వెళ్ళినా దొరకని మనఃశాంతి ఇక్కడ దొరుకుతుంది శంకరం. కొన్నేళ్ళు పోయాక నీకే అర్థమవుతుంది. నువ్వింకా చిన్నవాడివి కనక తెలీదు నీకు." అన్నాడు సాలోచనగా నారాయణ.

"వేదాంతం చెపుతారు గానీ అమెరికా వెళ్ళి ఆరేళ్ళు ఉండి వెనక్కి వచ్చేసి ఇలా వ్యవసాయం చేసుకుంటూ, ఈ దుమ్ము నేలమీద కూర్చుని మనఃశ్శాంతి గురించి మాట్లాడేవాళ్ళని ఎక్కడా చూళ్ళేదు నేను. శుభ్రంగా అక్కడుండి అన్నీ అనుభవించక ఇక్కడ వ్యవసాయం చేయడానికొచ్చారు మీరు. ఒక్కోసారి మీ గురించి ఆలోచిస్తూ ఉంటే రాత్రంతా నిద్రే పట్టదు నాకు. అసలు మీరు ఇలా వచ్చేయడానిక్కారణం చెప్పండి ముందు. ఎన్నిసార్లు అడిగినా వీలున్నప్పుడు చెపుతాను అని దాటవెయ్యడమే కానీ చెప్పరేం?" దబాయిస్తున్నట్టు చొరవగా అడిగాడు శంకరం.

"నేను కూడా అక్కడ ఉందామనే వెళ్ళాను ముందు. కానీ నాకేమీ బాధలేదు. పైపెచ్చు అక్కడకన్నా ఇక్కడే సుఖంగా ఉన్నాను. ఇప్పుడున్న నా జీవితాన్ని ఏమిచ్చినా వదులుకోను ఎందుకంటే వెనక్కి వచ్చాక మొదటి మూడేళ్ళూ నేను వ్యవసాయం గురించి ఎంతో తెలుసుకున్నాను. మనం ఇప్పుడు పంటకి పెట్టే నీరు తొంభై శాతం వేస్టేనని ఇజ్రాయిల్ వెళ్ళినప్పుడు నేర్చుకున్నాను. ఇప్పుడు డ్రిప్ ఇరిగేషన్‌తో నా వ్యవసాయం బాగానే ఉంది, లాభాలు బాగానే ఉన్నాయి. కారూ, ట్రాక్టరూ కొనగలిగాను. రేపు ఉద్యోగం పోతుందన్న చింత లేదు. రిటైరయ్యాక ఎక్కడుండాలనే తలనెప్పి లేదు. అదీకాక నేనే కొంత మందికి ఉపాధి చూపించగలుగుతున్నాను. రెండుమూడేళ్ళలో ఇక్కడే దగ్గర్లో ఒక రైస్ మిల్లు పెట్టే ఆలోచనుంది. అమెరికా, అమెరికా అని అర్రులు చాస్తారు కానీ అక్కడకెళ్ళేదాకానే ఈ సంబరం. ఆ తర్వాత ఉద్యోగం పోతుందేమో. పిల్లలు పుడితే వాళ్ళని చదివించడానికి అవస్థలూ, వాళ్ళు పెద్దయ్యాక మనమాట వినరేమో, ఏ అమెరికన్ని పెళ్ళి చేసుకుంటారో అనేవి ఓ పక్కన పెడితే వెళ్ళాక గ్రీన్ కార్డుకీ, అక్కడ తెల్లవాళ్ళతో సమానంగా ఉండడానికి పడే తిప్పలు కోకొల్లలు. అక్కడ మనం ఆ సొసైటీలోనూ ఇమడలేం, మన ఇండియన్ జీవితాన్నీ ఒదులుకోలేం. ఒక్కోసారి గాంధీగారు వెనక్కి ఇండియా వచ్చేయడానికి కారణం ఇదేనేమో అనిపిస్తూ ఉంటుంది నాకు..."

ఇంకా మాట పూర్తవ్వకుండానే శంకరం అడ్డుకున్నాడు, "ముందు మీరు వెనక్కి ఎందుకొచ్చేసారో చెప్పండి. మీరిక్కడ గ్రేండ్ సక్సెస్ అని నాకు తెలిసిందే ముందు ముందు కూడా మీరు హాయిగా బతగ్గలరు. అక్కడ మీకు గ్రీన్ కార్డుకి హెల్ప్ చేయడానికి వేలువిడిచిన మేనమామో ఎవరో ఒకరు మనవాళ్ళు లేరా? మీరెన్ని చెప్పినా కానీ అమెరికా అమెరికాయే ఇండియా ఇండియాయే కదా?"

"వేలు విడిచిన మేనమామేమిట్లే? సొంత మేనమామే ఉన్నాడు నాకు. సరే చెపుతా విను," అంటూ చెప్పడం మొదలెట్టాడు నారాయణ.

*అక్కరకు రాని చుట్టము:*

"నేను ఇలా ఎమ్మెస్ చెయ్యడానికొచ్చాను, మొదట అమెరికాలో అడుగుపెట్టగానే ఇంటికి ఫోన్ చేసి క్షేమం చెప్పాక మావయ్యకే చేసాను ఫోను. నువ్వూ, అత్తా, పిల్లలూ బాగున్నారా అంటూనూ. 'ఎప్పుడో ఓ సారి ఇండియా వచ్చినప్పుడు చూసా్నా నిన్నూ. మా అమ్మాయి కన్నా రెండ్నెల్లు పెద్దాడివి కదూ? వీలున్నప్పుడు ఇక్కడికి రా' అని చెప్పాడు మావయ్య కాలిఫోర్నియా నుంచి పొడిపొడిగా. ఎమ్మెస్ అవగానే స్నో, చలి తప్పించుకోడానికి ఫ్లోరిడా పోదాం అనుకుంటుండగానే కాలిఫోర్నియా నుంచి వచ్చింది ఉద్యోగం ఆఫర్. అదీ మామయ్య ఉంటున్న శాన్‌ఫ్రాన్సిస్కోలోనే. ఈ సారి ఫోన్ చేసేసరికి మామయ్య మాటల్లో చాలా తేడా కనిపించింది. అమెరికా వచ్చావంటే బానే ఉంది కానీ మా ఇంట్లో తిష్ఠ వెయ్యడం ఎలా కుదురుతుందీ అన్నట్లు మాట్లాడాడు. మొదట్లో వాళ్ళింట్లోనే ఉండి ఉద్యోగం చెయ్యొచ్చనుకున్నాను కానీ వాళ్ళు నన్ను ట్రీట్ చేయడం చూసాక ఓ వారంలో వేరే రూం చూసుకున్నాను."

"సొంత మామయ్యే?" శంకరం అడ్డుకున్నాడు ఆశ్చర్యంగా.

"ఆ! సొంత మామయ్యే. కూతురు అప్పటికే డాక్టర్ చదివి రెసిడెన్సీ చేస్తోంది. అదయ్యేదాకా పగలనకా, రాత్రనకా హాస్పట్లోనే మూడేళ్ళూ చెయ్యాలి చాకిరీ. అబ్బాయేమో డిగ్రీ చదువుతున్నాడు. వాడిక్కూడా డాక్టర్ గిరీ కట్టబెట్టాలని మామయ్యనుకుంటున్నాడు. అత్తకి ఎప్పుడూ మేమంటే కోపమే అనుకో. ఆవిడ మాటలకి ఎదురు చెపితే తిండి నిద్రా ఉండవు కదా మావయ్యకి? వెంటనే నేను వేరే రూంలోకి మారాను. వీసాలోనూ ఇమ్మిగ్రేషన్ ప్రాసెస్‌లోనూ ఏదో హెల్ప్ అడుగుతానని అనుకున్నాడేమో, 'నేను నిన్ను స్పాన్సర్ చేయడం కుదరదు, కుదిరినా నీకు వీసా రావడానికి పదీ పన్నెండేళ్ళు పడుతుంది, అంచేత నీదారి నువ్వు చూసుకో' అని చెప్పేసాడు. 'నేను నిన్ను ఏమీ అడగలేదు మావయ్యా, ఇక్కడ ఉద్యోగం వచ్చింది కదా మీ ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉందామనుకున్నాను కానీ వెంటనే వెళ్ళిపోతానూ, కాస్త రూం దొరికేదాకా ఓపిక పట్టు' అని చెప్పాను. మొత్తం మీద అప్పుడు తెలిసొచ్చిందేమిటంటే, అమెరికాలో ఉన్న

ఇండియన్స్ మనవాళ్ళే కానీ మనలో ఇమడలేరు. మనని వాళ్ళళ్ళో ఇముడ్చుకోలేరు. అందుకే వాళ్ళు ఎన్నారై ఇండియన్సూ మనం ఉత్త ఇండియన్సూను. మనక్కానీ గ్రీన్‌కార్డొచ్చి అక్కడ ఉంటే అప్పుడు మనం కూడా వాళ్ళలాగే తయారవుతాం."

"మీరు పెద్ద చదువులు చదువుకున్నా, మీ మావయ్యకి మీమీద మంచి అభిప్రాయం లేదా? అడిగాడు శంకరం.

"పెద్ద చదువులుకీ చుట్టరికాలకీ ఏవీ సంబంధం లేదు శంకరం. వాళ్ళింట్లో ఉండడం కుదరదని డైరెక్ట్‌గా చెప్పొచ్చు కదా, దానికి బదులు ఎడమొహం పెడమొహంగా ట్రీట్ చేసారు నన్ను. మొత్తం మ్మీద వెంటనే నేను ఇది అక్కరకు రాని చుట్టము అని గ్రహించడానికి రెండురోజులు కూడా పట్టలేదు. చిత్రంగా వాళ్ళింట్లోంచి బయటకొచ్చేసాక ఒక్కసారి కూడా మావయ్య నాకు ఫోన్ కూడా చెయ్యలేదు. ఓసారెప్పుడో తెలుగు అసోసియేషన్ జరిపే సంక్రాంతి సంబరాల్లో కనిపించాడు. కులాసా అంటే కులాసా అనుకుని మొహాలు మళ్ళీ కనబడకుండా తప్పుకున్నాము. ఒక్క రెండురోజులు వాళ్ళింట్లో ఉండడం తప్ప నేను చేసిన తప్పేమిటో ఇప్పటికీ నాకు అర్ధం కాలేదు. ఎందుకు మావయ్య నన్ను అలా ట్రీట్ చేసాడో మరి. పిల్లలు కూడా హాయ్ అంటే హాయ్ అనే తప్ప నాతో మాట్లాడలేదు. అసలు నీకు చెప్పడం మర్చిపోయాను. అమెరికాలో ఉండాలంటే గ్రీన్ కార్డుకి కంపెనీ అప్లై చేస్తే తొందరగా వస్తుంది. ఉద్యోగం ఇచ్చినప్పుడు ఇంటర్వ్యూలో నాకు గ్రీన్ కార్డు ఇప్పిస్తామని ప్రామిస్ చెయ్యడం వల్లనే నేను ఆ కాలిఫోర్నియా ఉద్యోగంలో చేరాను. మామయ్యేదో ఊడబొడుస్తాడని కాదు కాలిఫోర్నియా వెళ్ళింది."

"మరి గ్రీను కార్డు రాలేదా?" అడిగాడు శంకరం.

*మొక్కిన వరమీని వేల్పు:*

నారాయణ చెప్పడం మొదలెట్టాడు. "ముందుగా డిగ్రీ చేతిలోకి రాగానే ఓ ఏడాది ఉద్యోగం చేసుకోవడానికి పర్మిషన్ ఇస్తారు. ఆ ఏడాదిలోగా స్టూడెంట్ వీసా నుంచి హెచ్ వన్ వీసాకి మారాలి. అక్కడే ఉద్యోగం చేసుకుంటూ బతకాలంటే. నేను చేరిన మూడు నెలలకి నాకు హెచ్ వన్ వచ్చింది. అప్పట్నుంచీ నాకు అవుటాఫ్ సిటీ ప్రోజెక్టులే ఇచ్చేవారు. అంటే సోమవారం పొద్దున్నే ఏ బోస్టనో వెళ్ళడం శుక్రవారం సాయంత్రం గూటికి చేరుకోవడం. ఇలా రెండేళ్ళు గడిచేసరికి అమెరికాలో ఉన్న చిన్నా పెద్ద ఊళ్ళు చూడ్డం అయిపోయింది. ఇక్కడో కడుపు నెప్పీ, అక్కడో తలనెప్పీ వచ్చినా నేను అప్పుడు చిన్నవాణ్ణే కనక హెల్త్ ప్రోబ్లమ్స్ తట్టుకుని నిలబడగలిగాను. వచ్చిన చిక్కేంటంటే సోమవారం వెళ్ళి శుక్రవారం వచ్చే పద్ధతిలో నేనెప్పుడూ సొంత ఊళ్ళో ఆఫీసుకి వెళ్ళలేకపోయేవాణ్ణి. ఈ సొంతూరి ఆఫీసే నా గ్రీన్ కార్డ్ ప్రోసెస్ చేసేది. నా బాసుని కల్సి మాట్లాడదామంటే దూరాభారం. ఫోన్ మీద తప్ప కుదిరేది కాదు. ఎప్పుడు గ్రీన్ కార్డు గురించి అడిగినా నీ పేపర్లు ఆల్రెడీ పంపించాము. డోంట్ వర్రీ అని చెప్పడమే. హెచ్ వన్ వీసా అని చెప్పాను కద?! అది మూడేళ్ళకే పరిమితం. ఈ మూడేళ్ళలో గ్రీన్ కార్డ్ రాకపోతే మళ్ళీ ఈ హెచ్ వన్ ని ఇంకో మూడేళ్ళు పెంచుకోవచ్చు. అలా రెండేళ్ళ పైన కొన్ని నెలలు తిరిగాక మా బాసు పిల్చి చావు కబురు చల్లగా చెప్పాడు. మన కంపెనీని వేరే డెట్రాయిట్ కంపెనీ కొనుకుందనీ, అంచేత మమ్మల్నందరినీ ఇంక ఇంటికి పోవచ్చనీను. అప్పటిదాకా అసలు కంపెనీ అమ్ముతున్నట్టు కూడా మాతో చెప్పనే లేదు. అదే అడిగితే, 'నాక్కూడా అమ్మాలని లేదు కానీ మంచి ఆఫర్ వచ్చింది ఈ వారంలోనే, నేనూ ఈ చలిలోంచి హవాయి వెళ్ళిపోదామని అనుకుంటున్నా. అంచేత ఇలా అయింది' అన్నాడు ముక్తసరిగా మా బాసు. నాలాంటి వాళ్ళు కంపెనీలో ఓ అయిదారుగురున్నారు. మరి మా గ్రీన్ కార్డ్ మాటేమిటీ అని అడిగితే, మీ గ్రీన్ కార్డ్ అప్లికేషన్లూ అన్నీ వెనక్కి తెచ్చేయమని లాయర్‌తో చెప్పాను, అన్నాడు. ఆ పేపర్స్ వెనక్కి తెచ్చేయడం ఎందుకయ్యా, అలాగే ఉంచి వాటిని ప్రోసెస్ చెయ్యించొచ్చుకదా? అంటే నేను అమెరికన్ సిటిజెన్‌ని అలా చేయ్యడం దేశ ద్రోహం అని చెప్పాడు. అంచేత చేసిన చాకిరీకి ఏమీ మిగల్లేదు. అప్పటికి మా వీసాలు ఇంక ఆర్నెల్లు మిగిలున్నాయి. ఇంక చేసేదేవుంది? చివరి రోజుల్లో కంపెనీ అమ్మకం అయినప్పుడు అడిగినా జీతాలిచ్చేవాడు కాదు. రెట్టిస్తే ఏదో రెండువారాల జీతం నెలకోసారి ఇచ్చేవాడు. సరే చేసేది లేక అలా దిగడిపోయిన మేం నలుగురం కూర్చుని ఒక ఇంటర్నెట్ కంపెనీ

పెట్టడానికి నిర్ణయించుకున్నాం. కానీ హెచ్ వన్ వీసా అనేది దాన్ని స్పాన్సర్ చేసిన కంపెనీకి సంబంధించింది. అది ఏ కంపెనీకి ఇచ్చారో దానికి పనిచెయ్యొచ్చు. అంచేత మేం నలుగురం లాయర్ దగ్గరకెళ్ళి కొత్తకంపెనీ ఏర్పాటు చేసుకుంటున్నాం, ఈ వీసాలు మార్చడానికి డబ్బులు జేబులోంచి పెట్టుకుంటాం అని చెప్పాం. ఆ పేపర్ వర్క్ అలా జరుగుతుండగానే మా కంపెనీ వెబ్ సైటు మొదలు పెట్టి వాల్ స్ట్రీట్ షేర్లు అమ్మడానికి, కొనడానికి కంపెనీ ప్రారంభించాము. ఇదొకరకంగా షేర్ బ్రోకర్‌లాంటి పని."

"వావ్, ఇంటర్నెట్ కంపెనీతో మిలియన్లు సంపాదించారన్నమాట." నవ్వుతూ అన్నాడు శంకరం.

*తానెక్కిన బారని గుర్రము:*

"పప్పులో కాలేస్సేవు అక్కడే" అన్నాడు నారాయణ. "కంపెనీ మొదలు పెట్టిన మొదటి మూడు నెలలు బాగానే ఉంది. అప్పుడొచ్చింది డాట్ కం బస్ట్. రోజుకో డజన్ కంపెనీల చొప్పున ఇంటర్నెట్ కంపెనీలన్నీ పిట్టల్లా రాలిపోయాయి. ఒకప్పుడు యాభై డాలర్ల దగిర పలికిన ఏ ఇంటర్నెట్ కంపెనీ షేర్ అయినా అప్పుడు డాలర్ కంటే తక్కువగా పడిపోయింది. కొనే నాధుడే లేడు. ఈ బస్ట్ తట్టుకుని నిలబడింది ఏవో కొన్ని పెద్ద కంపెనీలే. అలాగే బస్ట్ వచ్చిన రోజుల్లోనే ఔట్ సోర్సింగ్ బాగా పుంజుకుంది. ఇందులో వాదనేమిటంటే, ఇండియాలో కమ్యూనికేషన్స్ బాగా పెరిగాయి. ఇండియా నుంచి అమెరికాకీ, అమెరికానుంచి ఇండియాకీ ఫోన్ ఛార్జీలు చాలా తగ్గాయి. ఇక్కడ ఇండియాలో ప్రతీవాడు కంప్యూటర్ ప్రోగ్రామరే. వీళ్ళందరినీ అమెరికా తీసుకెళ్ళాలంటే హెచ్ వన్ వీసాల ప్రోబ్లం. ఇక్కడే చిన్న కంపెనీ బ్రాంచ్ పెట్టేస్తే పోయింది కదా అనుకుని పెద్ద కంపెనీలన్నీ ఇక్కడికి రావడం మొదలుపెటాయి. అంచేత మేం మొదలెట్టిన కంపెనీ గుర్రం కదల్నని మొరాయించింది. ఈ లోపల లాయర్ పిడుగులాంటి వార్త తెచ్చాడు - మీ వీసాలు ఎక్స్టెండ్ చెయ్యడం కుదరదూ అని. అప్పుడు తెలిసిన విషయం ప్రకారం, హెచ్ వన్ వీసా అయిపోయిన వారం, పదిరోజుల్లో దేశం విడిచి వెళ్ళిపోవాలి లేకపోతే డిపోర్ట్ చేస్తారూ అని. మూటా ముల్లే సర్దేసి వచ్చేస్తుంటే అప్పుడు తట్టింది బద్దెన చెప్పిన రెండో పద్యం."

"రెండో పద్యమా?" శంకరం అడిగాడు.

"నేను పుట్టింది ఇక్కడే, పెరిగింది ఇక్కడే చీకూ చింతా లేకుండా ఇక్కడే సుఖంగా ఉండొచ్చు. కానీ చదువుకున్న చదువొదిలేసి అంతంత మాత్రంగా తెలిసిన వ్యవసాయం చూసుకోవాలి. ఇంట్లో ఒప్పుకోరనుకో. కానీ వాళ్ళని ఒప్పించడం అంత కష్టం కాదు. ముఖ్యంగా నేను హైదరాబాద్ వెళ్ళి ఏదో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించుకోవచ్చు కానీ అక్కడ ప్రశాంతంగా ఉండగలనా? ఇక్కడైతే నాకు నచ్చింది నేను చేసుకోవచ్చు. ఎవరి ధర్మం మీదా ఆధారపడక్కర్లేదు. ఉద్యోగం నిలబెట్టుకోవడానికి ఒకరి మీద చాడీలు చెప్పక్కర్లేదు. ఉద్యోగం ఉంటుందా ఊడుతుందా అనే చింత లేదు. ఇలా ఆలోచించి వ్యవసాయం చెయ్యడానికి నేనే నాన్నని ఒప్పించాను. మొదట్లో నష్టం వచ్చింది నిజమే కానీ దానికి తప్పు పూర్తిగా నాది. తర్వాత్తర్వాత నేనెంతో నేర్చుకున్నాను. ఓసారి వరి వేసిన పొలంలో వెంటనే వరి వెయ్యట్లేదు. కూరగాయలు పండిస్తున్నాను. ఆవులు గేదలు కొని పాల వ్యాపారం మొదలుపెట్టాను. నేను సప్లై చేసే పాలు ఎలాంటి క్వాలిటీయో నువ్వు రోజూ చూస్తూనే ఉన్నావుకదా? నేను అమెరికా కంటే ఇక్కడే హాయిగా ఉన్నాను. ఓసారి ఇజ్రాయిల్ వెళ్ళి డ్రిప్ ఇరిగేషన్ నేర్చుకొచ్చి ఇప్పుడు ఆచరణలో పెట్టాను. క్రితం ఏడు అబ్దుల్ కలాం నా పొలం చూసాక ' మన దేశానికి ఒక లక్షమంది నారాయణులుకావాలి' అన్నారు. ఎవరికైనా ఇంతకంటే ఏం కావాలి చెప్పు? ఇంక ఎంతో కష్టపడి మెకానికల్ ఇంజినీరింగ్ సీట్ సంపాదించుకున వాళ్ళూ, బీ.కాం చదివిన వాళ్ళు హైదరాబాద్ వెళ్ళి అమీర్ పేటలో కంప్యూటర్ ట్రైనింగ్ తీసుకుని ప్రోగ్రామర్లగా ఉద్యోగాలు చేస్తున్నారు. వాళ్ళకంటే నేను ఎంతో సుఖంగా ఉన్నాను. అవునా కాదా?" అడిగాడు నారాయణ.

"మీరు చెప్పింది అక్షరాల సత్యం. మరి బద్దెన రెండో పద్యం అన్నారు అది కూడా చెప్పెయ్యండి మరి" అన్నాడు శంకరం కుతూహలంగా.

"ముందు చెప్పాను గుర్తుందా? నేను అమెరికాలో ఒక కంపెనీకి పనిచేసినప్పుడు చివర్లో అడిగినా జీతాలిచ్చేవాడు కాదని? ఈ అక్కరకు రాని చుట్టమూ, మ్రొక్కిన వరమీని వేల్పు, ఎక్కిన బారని గుర్రము అవన్నీ గ్రక్కున విడిచి వచ్చేస్తునపుడు ఇండియా వచ్చేసాక ఏం చెయ్యాలో ఆలోచిస్తుంటే అప్పుడు వ్యవసాయం గురించి తట్టింది. అదే బద్దెన చెప్పిందీను. విను మరి" అన్నాడు నారయణ లేచి ఇంటికెళ్ళడానికి బయలుదేరుతూ." అక్కడ్నుంచి వచ్చేసాక సరిగ్గా అదే చేస్తున్నాను ఇప్పుడు."

అడిగిన జీతం బియ్యని
మిడిమేలపు దొరను గొల్చి మిడుగుట కంటెన్
పడిగల యెద్దులు గట్టుక
మడి దున్నుక బ్రతుకవచ్చు మహిలో సుమతీ

బిగ్గరగా నవ్వుతూ ఇంటికెళ్ళడానికి నారాయణని అనుసరించాడు శంకరం.

*వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు కథల పోటీలో బహుమతి పొందిన విదేశాంధ్ర కథ*

## ఊహా చిత్రం

- శారద
(ఆస్ట్రేలియా)

"ఒక ఇండియన్ లేడీని అడ్మిట్ చేసాను పొద్దున్న. కొంచెం వెళ్ళి పలకరిస్తారా? తను చాలా నెర్వస్‌గా ఉంది," జేన్ చెప్పింది పేషెంట్ల రిజిస్టర్ చూస్తుండగా.

"ష్యూర్. ఏమిటావిడ పేరు?"

"పల్లావి"

"పల్లావి, కాదు! పల్లవి!" నవ్వుతూ సరిదిద్దాను.

"ఓహ్! ఇండియన్స్ నేమ్స్!" తనూ నవ్వుతూ అంది. "సర్జరీ రేపనుకుంటా. ఇవాళ మీ పేషెంట్లు ఇద్దరు రేడియేషన్ కొరకు ఎదురు చూస్తున్నారు."

"నా పేషెంట్లు కాదు! ఐ ఏం నాట్ డాక్టర్. ఎనీహౌ, ఐ విల్ చెక్ పల్లవి అవుట్," అంటూ బయటికి వెళ్ళాను.

పెద్ద కేన్సర్ హాస్పిటల్‌లో నేను రేడియేషన్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాను. కేన్సర్ పేషెంట్లకి కీమోథెరపీతో పాటు రేడియేషన్ కూడా ఇస్తారు. ఆ రేడియేషన్ సక్రమంగా, సరైన కొలతల్లో ఉండేలా చూడటం నా బాధ్యత, లేకపోతే కేన్సర్ కణాలతోపాటు ఆరోగ్యంగా ఉన్న టిష్యూలు రేడియేషన్ బారిన పడే ప్రమాదం ఉంది. అంతేకానీ కేన్సర్ చికిత్స నా బాధ్యత కాదు. రేడియేషన్ కొరకు వచ్చే పేషెంట్లంతా అవుట్ పేషెంట్లే. సర్జరీ కొచ్చే పేషెంట్లు మాత్రమే వార్డులో ఉంటారు. నేనెప్పుడో కాని వార్డులో కెళ్ళను. పేషెంట్లతో వ్యక్తిగత స్నేహం కూడా సాధారణంగా నాకిష్టం ఉండదు. అయినా కొన్నిసార్లు భారతీయులనగానే కొంచెం సాఫ్ట్‌కార్నర్. కేన్సర్ మహమ్మారి బారిన పడి భయపడుతున్నారో ఏమో, కొంచెం ధైర్యం చెపితే పోయేదేముంది, అనిపిస్తుంది.

ఆలోచనల్లోనే వార్డులోకెళ్ళాను. మంచం మీద కూర్చుని దీక్షగా పుస్తకం చదువుతున్నారావిడ. దగ్గరగా వెళ్ళగానే, తలెత్తి చూసి పుస్తకం పక్కన పెట్టి, "గుడ్ మార్నింగ్ డాక్టర్," అంది. లేబ్ నుంచి నేరుగా రావటంతో తెల్లటి లేబ్ కోటులోనే ఉన్నాను. అందువల్ల పొరపడి ఉండొచ్చు. అది చాలా సార్లు జరిగేదే. దానికి తోడు న్యూక్లియర్ మెడిసెన్‌లో నా పిహెచ్ డీ డిగ్రీ నా పేరు ముందర డాక్టర్ బిరుదు కూడా తగిలించింది మరి.

"గుడ్ మార్నింగ్ పల్లవీ. నా పేరు శేఖర్. బైదిబై, నేను కేన్సర్ చికిత్స చేసే డాక్టర్‌ని కాను. ఇక్కడ కేవలం చీఫ్ ఫిజిస్టుని మాత్రమే. కేన్సర్ చికిత్సలో కేవలం రేడియేషన్ మాత్రమే నా బాధ్యత!" చేయి చాచాను. నవ్వు మొహంతో నా చేయందుకుని, "ఐ యాం సారీ అబవుట్ ది మిస్టేక్. ఎనీవే, మిమ్మల్ని కలవటం చాలా సంతోషంగా ఉంది," అంది.

నేననుకున్నట్టు దిగులుగా, భయంగా కాకుండా ప్రశాంతంగా, ఉత్సాహంగా ఉన్నారావిడ. దాదాపు నలభై ఏళ్ళు ఉంటాయేమో. చిన్నగా, సన్నగా ఉన్న ఆవిడ కళ్ళల్లో మెరుపూ, ఎనర్జీ ఉన్నాయి. బహుశా అది తెలివితేటలూ, ఆత్మ విశ్వాసమూ కలిసిన మెరుపై ఉండొచ్చు. జీన్స్ పేంటూ పైన సాదాగా ఉన్న పసుపు పచ్చ టీ షర్టులో కూడా హుందాగానే ఉన్నారు. పరాయి స్త్రీ వైపు చూడటం సభ్యత కాదనిపించి ఆమె చదువుతున్న పుస్తకం వైపు చూపు తిప్పాను. "ది టావో ఆఫ్ ఫిజిక్స్"! పుస్తకం పేరు చూసి నా ఆశ్చర్యం దాచుకోకుండా ఉండలేకపోయాను.

స్టీరియో టైపింగ్ అంత మంచి అలవాటు కాదని తెలిసినా, ఆడవాళ్ళెప్పుడూ మేరీ హిగిన్స్ క్లార్క్ సస్పెన్స్ నవలలో, లేకపోతే డేనియల్ స్టీల్ రాసిన ప్రేమ కథలో చదువుతారన్న దృఢమైన అభిప్రాయం ఉండేది నాకు. ఆ తప్పుని కప్పిపుచ్చుకోవటానికి, "మంచి పుస్తకం! చాలా ఏళ్ళ కింద చదివాను," అన్నా ఎపాలొజెటిక్‌గా.

"మీరు చదివారా? చాలా ఆశ్చర్యంగా ఉందే!" ఆవిడ మాటలు విని తెల్లబోయాను.

"అంటే, మీ వయసులో ఉండే అబ్బాయిలు సీరియస్ పుస్తకాలు చదువుతారని నేనెప్పుడూ అనుకోలేదు." నా మనసులో ఆలోచనలన్నీ పుస్తకం చదివినట్టు చదివేసిందావిడ. ఆవిడ పెదవుల మీద అదోరకమైన కొంటె నవ్వు చూసి నేనూ నవ్వకుండా ఉండలేకపోయాను. "నేను మీరనుకున్నంత చిన్న అబ్బాయినేమీ కాదు. ముప్పై అయిదేళ్ళు పైనే బడ్డాయి!" అంటూ ఆవిడ కేస్ షీట్ చేతిలోకి తీసుకున్నాను.

సర్జరీ మర్నాటికి షెడ్యూల్ చేసారు. కీమో, రేడియేషన్ ఇప్పట్లో అవసరం లేదేమో. ఆవిడ కన్సల్టెంట్‌ని అడిగితే చెపుతారు. కేస్ షీట్ పక్కన పెట్టి మామూలు సంభాషణ మొదలు పెట్టాను. వాళ్ళు ఆస్ట్రేలియాలో ఉండటం పదేళ్ళపైనే ఐనా అడిలైడ్ వచ్చి ఏడాది కూడా కాలేదు. ఆవిడా వాళ్ళాయనా ఇద్దరూ ఫైనాన్షియల్ కన్సల్టెంట్లు. ఇద్దరు పిల్లలూ చదువుకుంటున్నారు. పిల్లల ప్రసక్తి వచ్చేసరికి మాత్రం ఆవిడ మొహంలో చిన్న బాధ. పర్స్‌లో నుంచి వాళ్ళ ఫోటోలు తీసి చూపించారు.

"ఒంటరిగా ఉన్నారు. అందరూ ఏరి?"

"నేనే వాళ్ళందరినీ పంపించేసాను. ఎన్ని రోజులు ఆఫీసూ స్కూలూ మానేసి నాతోపాటే ఉంటారు? సాయంత్రం వస్తారు. నేను లేకుండా బాగానే మేనేజ్ చేసుకుంటున్నారు. మంచిదే కదా."

ఒక్కసారే ఇద్దరమూ నిశ్శబ్దంగా అయిపోయాము. తన భయం, బాధల్తో పోరాడుతూ ఆమె, ఏమని ఓదార్చాలో తెలియని అయోమయంతో నేనూ! పాపం, ఆమె భయమూ దిగులూ చాలా వరకు ఆమె కుటుంబం, పిల్లల గురించే అయి ఉండాలి. చదువూ, తెలివితేటలూ, సంఘంలో హోదా వీటిలో వేటితోనూ సంబంధంలేని అమ్మ! ఆమె నిస్సహాయత చూసి నా మనస్సంతా జాలితో నిండిపోయింది.

మృత్యు ముఖంలో ఉన్న పేషెంట్లతో ఎక్కువగా పరిచయం పెంచుకోకూడదు, మనమూ మానసికంగా వల్నరబుల్‌గా అయే ప్రమాదం ఉంది, మా హాస్పిటల్ సూపర్నెండెంట్ మాటలు గుర్తుకొచ్చాయి.

"అధైర్యపడకండి. అంతా బాగానే జరుగుతుంది." యాంత్రికంగా అని బయటికొచ్చాను.

ఆ మర్నాడు వద్దనుకుంటూనే సర్జరీ జరిగే ముందు ఆవిడ రూంలోకెళ్ళాను. ఆవిడ భర్తా పిల్లలూ ఉన్నారు. అందరూ గలగలా నవ్వుతూ, అమ్మ మీద జోకు లేస్తూ ఉన్నారు. వాళ్ళ మధ్య ఆవిడ కూడా నవ్వుతూ హాయిగా అనిపించారు. ఆవిడనలా చూస్తుంటే నాకు మనసంతా ఒకలాంటి హాయి కలిగింది. నాలో పుట్టిన ఆ ఇరేషనల్ సంతోషానికి నేనే ఆశ్చర్యపడుతూ లేచొచ్చాను.

❦ ❦ ❦

పల్లవికి సర్జరీ జరిగి ఆరునెలలయింది. ఈ ఆరునెలల్లో నేనావిడని నాలుగైదు సార్లు హాస్పిటల్‌లో చూసాను. కీమో, రేడియేషనూ, సర్జరీ మూడూ కలిసినా కేన్సర్ వల్ల ముంచుకొచ్చే మృత్యువుని ఆపలేవు. ఆవిడ రోజు రోజుకీ క్షీణించటం మా అందరికీ కనబడుతూనే ఉంది. ఎంత డిటాచ్డ్‌గా ఉందామన్నా నాకు నా దగ్గరి బంధువులెవరో పోతున్నంత బాధగా ఉంది.

ఉన్నట్టుండి ఒక రోజు ఆఫీసుకి ఫోనొచ్చింది పల్లవి భర్త శ్రీనివాస్ దగ్గర్నించి, మీతో కొంచెం మాట్లాడాలి, అంటూ, వింతగా ఉంది అనుకుంటూ రండెల్ మాల్‌లో కాఫీకెళ్ళాను అతన్ని కలవటానికి.

"పల్లవి దేని గురించో చాలా బాధపడుతోంది, అది ఆమె జబ్బు గురించి మాత్రం కాదు!" ఉన్నట్టుండి అన్నాడాయన. నేనేమంటాను? అసలు నాకు వాళ్ళ గురించేం తెలుసని? ఇదంతా నాకెందుకు చెపుతున్నాడో అని మాత్రం అనుకున్నాను! మళ్ళీ కాసేపాలోచించి, "మీరు నాకొక్క సహాయం చేయగలరా?" అన్నాడు నిజానికి నేనా క్షణంలో నిర్మొహమాటంగా వీలు కాదని చెప్పాల్సిన మాట. ఇతరుల అంతరంగిక వ్యవహారాల్లో తల దూర్చటం ఎంత మాత్రం నా తత్వం కాదు. పైగా మా హాస్పిటల్లో కేన్సర్ పేషెంటు! కానీ ఎందుకో అంత కొరటుగా ఉండలేకపోయాను. అయినా ఎందుకైనా మంచిదని, "చేయగలిగే సహాయమైతే చేయటానికి నాకేమీ అభ్యంతరం లేదు అన్నాను" కొంచెం జంకుతూనే. పల్లవి స్థానంలో ఒక మగ పేషంటుంటే అంతే సెన్సిటివ్‌గా ఉండేవాడినా అన్న ప్రశ్న నా మనసులో మెదిలిన మాట కూడా నిజం. నేనీ ఆలోచనల్లో ఉండగానే, ఆయనన్నాడు, "మీరంటే పల్లవికి చాలా ఇష్టం," అని.

చురుక్కున కోపం వచ్చిందాయన మాటలకి.

"మీరేం మాట్లాడుతున్నారో మీకర్థం అవుతుందా? నేనావిడతో అసలు నాలుగు మాటలు కంటే ఎక్కువ మాట్లాడలేదు. నాకీ సంభాషణ ఏ మాత్రం నచ్చటంలేదు."

"సారీ! మీరు నా మాటలని అపార్థం చేసుకున్నట్టున్నారు. ఐ మెంట్ ఇట్ ఇన్ ఎ గుడ్ సెన్స్! ఇంకే విధమైన చెత్త అభియోగాలూ చేయటం లేదు. పల్లవి గురించి అలా ఆలోచించటం కూడా తప్పే! ఆమె నా భార్య కావటం నిజంగా నా అదృష్టం." ఆయన నా చేయి పట్టుకుని కొంచెం శాంతింప చేసాడు. అయినా నాకు చిరాకు వదల్లేదు. "దట్స్ ఒకే! కానీ నేను వెళతాను."

"ప్లీజ్! నా మాట కొంచె వినండి. ఇష్టం అని నేనటంలో ఉద్దేశ్యం గౌరవం, సదభిప్రాయం అని. చిన్న వయసులో ప్రొఫెషన్లో చాలా పైకొచ్చారనీ, మృదువుగా మాట్లాడతారనీ, సెన్సిటివ్‌గా ఆలోచిస్తారనీ, చాలా కాంప్లిమెంట్స్ ఇస్తూ ఉంటుంది. దాన్ని మనసులో పెట్టుకుని అన్నానంతే! వయసులో మాకంటే మీరు చిన్నవారు. మిమ్మల్ని కానీ, నా భార్యని కానీ అనుమానించేంత కుసంస్కారిని కాను!" ఈసారి ఆయన మాటలు సిన్సియర్‌గానే అనిపించాయి. ఆయన మాటలు పూర్తిగా వినడానికే నిశ్చయించుకున్నాను, ఇదెందులోకి దింపుతుందో అని భయపడుతూనే! ఆయన చెప్పుకొచ్చాడు.

పల్లవి స్వతహాగ చాలా పాజిటివ్‌గా ఆలోచించే మనిషి. ఏ విషయంలో కూడా అధైర్యపడటం, సెల్ఫ్ పిటీతో కృంగిపోవటం ఆమె వ్యక్తిత్వంలోనే లేవు. రెండేళ్ళ కింద కేన్సర్ గురించి తెలిసినా ఎక్కువ కాలం బాధపడలేదామె. దానికంటే భర్తా పిల్లలకి తను లేని లోటు

తెలియకుండా, వాళ్ళ బాగోగులు చూసుకోవటం నేర్పటంలోనే ఎక్కువ కాలం గడిపింది. ఏ సమస్యనైనా, "ఇప్పుడేం చేద్దాం?" అన్న కోణంలోంచే చూసి ఆలోచించి చేయటమే తనకలవాటు. "ఇదిలా ఎందుకు జరిగింది? నాకీ శిక్ష ఎందుకు?" లాటి ప్రశ్నలన్నీ ఆమెకి టైం వేస్ట్‌లా అనిపిస్తాయి. అలాటిది ఒక రెండు మూడు నెలలనుంచీ మూడీగా, ఏదో ఆలోచిస్తున్నట్టు కనిపిస్తుంది. రాత్రిళ్ళు నిద్రపోవటం లేదు. శ్రీనివాస్ ఆమెని వాళ్ళ అమ్మా నాన్నల దగ్గరకి ఇండియా తీసుకెళ్ళారు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ, ఒకేసారి పదిచోట్లకి వెళ్ళేంత ఎనర్జీ ఉన్న మనిషి చాలా డల్‌గా, ఏ ఆసక్తీ లేనట్టూ రెస్ట్‌లెస్‌గా ఉంటుంది. కారణం అంతుపట్టటం లేదు. ఆయన మాటలు శ్రద్ధగా వింటున్నాను. కొంచెం జాలేసింది.

"చావు నిజంగా దగ్గరికొచ్చినప్పుడు మనిషి భయపడటం సహజం. పిల్లల గురించి బెంగ పడుతున్నారేమో!"

"కాదు! అదే అయితే తను నాతో చెప్పి ఉండేది. మా పెళ్ళై ఇరవైయేళ్ళు! ఆమె ప్రతీ కదలికకీ, చూపుకీ, నవ్వుకీ, పెదవి విరుపుకీ, ప్రతీదానికి కారణం తెలుసు నాకు. ఇదే మొదటిసారి నేనామె మనసులో ఏముందో కనిపెట్టలేక పోవటం. ఆమె దేనికోసం బాధపడుతుందో అది తెలుసుకుని ఆ బాధలేకుండా చేయాలని ఉంది నాకు. ఐవాంట్ హర్ టు గో హేపీలీ ఎండ్ పీస్‌ఫుల్లీ" ఆయనకి గొంతు పెగలలేదు ఆ పైన. ఆయన కళ్ళల్లో నీళ్ళు చూడటం ఇష్టం లేక గోడ మీద పోస్టర్ని చాలా దీక్షగా చూడసాగాను.

రెండు నిమిషాల తరువాత గ్లాసెడు మంచి నీళ్ళు తాగి సర్దుకున్నాడాయన.

"చాలాసార్లు ఆడవాళ్ళు భర్తతో చెప్పుకోలేనివీ, చెప్పనివీ, స్నేహితులతో చెప్పుకుంటారు. అయితే ఈ ఊళ్ళో మాకెవరూ దగ్గరి స్నేహితులు లేరు కూడా! మీరొక్కసారి తనని అడిగి చూస్తే, మీతో చెపుతుందేమోనని నా ఆశ."

ఆయన ఆశ మాటెలా ఉన్నా, నాకు ఇంకొకరి వ్యక్తిగత విషయాలు వినాలన్నా, సలహాలివ్వాలన్నా చాలా ఇబ్బందిగా మొహమాటంగా ఉంటుంది. నేను ఆవిడ మనసులో ఏముందో ఎలా తెలుసుకోగలను?

నేను వెళ్ళేసరకి పల్లవి తోటలో మొక్కల మధ్య ఏదో పని చేసుకుంటోంది. తలకి చిన్న స్కార్ఫ్ కట్టుకుని చాలా చిక్కిపోయి ఉంది. నన్ను చూసి నవ్వి లేచి వచ్చింది.

పక్కనే చిన్న టేప్ రికార్డర్ నుంచి సన్నగా పాట వస్తుంది, "హాల్ - ఎ - దిల్ యూ ఉన్నే సునాయా గయా" అంటూ. ( నా మనసులోని మాట తనకి ఇలా వివరించాను).

"వాటె సర్ప్రయిజ్! ఏమీటిలా వచ్చారు? ఇవాళ హాస్పిటల్ కెళ్ళలేదా?" అంటు లోపలికి దారి తీసింది.

లోపల రూం చాలా బాగుంది. ఎక్కువ ఫర్నీచరేమీలేకుండా, చాలా సింపుల్‌గా, ఆవిడలాగే ఉంది. మూలన ఒక పెద్ద పుస్తకాల షెల్ఫ్, ఒకరాసుకునే బల్లా, కుర్చీ, బల్లపైన లాప్‌టాప్ కంప్యూటరూ, పక్కనే చిన్న టేబుల్ మీద ప్రింటరూ ఉన్నాయి. ఇటు పక్క ఒక రాకింగ్ చైరూ, రెండు సోఫాలూ, మధ్య టీపాయ్. గోడ మీద ఒకే ఒక పెయింటింగ్. అంత సింపుల్ అలంకరణతో ఆ గదికి అంత అందం తేవటం చాలా కష్టమే. నేనా గదినీ, గదిలోని పుస్తకాలనీ పరిశీలిస్తుండగానే లోపల్నించి ట్రేలో రెండు గ్లాసుల్లో పళ్ళ రసంతో వచ్చిందావిడ.

"చెప్పండి! ఏదయినా మెడికల్ రిపోర్ట్స్ ఇవ్వటానికా?"

"భలేవారే! మామూలుగా మిమ్మల్ని చూడటానికి రాకూడదా?" నవ్వుతూ అడిగాను.

"తప్పకుండా రావొచ్చు. చెప్పండి ఏమిటి విశేషాలు?" నేను ఊరికే తనని చూసి పోదామని వచ్చాననగానే తను చాలా రిలాక్సయ్యింది. పుస్తకాలూ, సంగీతం, పిల్లలూ, చాలా కబుర్లే దొర్లిపోయాయి మా మధ్య.

మధ్యాహ్నం ఒంటిగంట కావొస్తుండటంతో, "భోజనం చేస్తారా?" అని అడిగింది. మొదట నా ప్లాన్‌లో అది లేకపోయినా, ఆవిడ కంపెనీ హాయిగా ఉండటంతో సరేనన్నాను. మెల్లిగా మాటల్లో ధైర్యాన్నంతా కూడదీసుకుని అడిగాను, "మీరు నేను మిమ్మల్ని మొదట చూసినంత ఉత్సాహంగా లేరు. ఈజ్ ఎనీథింగ్ బాదరింగ్ యూ? మీరున్న పరిస్థితిలో అది అర్థం లేని ప్రశ్నే అనుకోండీ. పిల్లల గురించేమైనా భయపడుతున్నారా? ఇప్పుడు కీమోథెరపీ, రేడియేషన్ల సహాయంతో జీవితకాలాన్ని చాలా వరకు పొడిగించొచ్చు. భయపడాల్సిందేమీ లేదు."

రెండు క్షణాలు ఆవిడేమీ మాట్లాడలేదు. మెల్లిగా పైకే ఆలోచిస్తున్నట్టు అంది, "చచ్చిపోవటం గురించి నాకు పెద్దగా భయంలేదు. మానసికంగా సిద్ధమయ్యే ఉన్నాను. ఎదిగీ ఎదగని పిల్లల్ని వదలటం కష్టమే. కనీసం చిన్నవాడి చదువైపోయేవరకైనా," ఆవిడ ఇంకేమీ అనలేకపోయింది. మెల్లిగా కళ్ళు తుడుచుకుని మొదలు పెట్టింది, "ఐ హేవ్ నో రిగ్రెట్స్. దేవుడి దయ వల్ల నా జీవితమంతా ఏ సమస్యలు లేకుండానే గడిచిపోయింది. ప్రాణంలా ప్రేమించే భర్తా, రత్నాల్లాంటి బిడ్డలూ, తెలివితేటలకి పదును పెట్టే వృత్తీ, ఎందులోనూ ఏ లోటూ లేదు నాకు. ఇంత అందమైన జీవితాన్ని అంగీకరించినట్టే, డిగ్నిటీతో చచ్చిపోతాను. అది వచ్చినప్పుడు వస్తుంది. దాని గురించి పెద్దగా ఆలోచన కూడా లేదు. కానీ, "ఇంకా ఏదో ఉందావిడ మనసులో. ఆవిడే మనసులో ఆలోచనలని విశ్లేషించుకుని చెపుతారని నేనేమీ మాట్లాడలేదు.

"ఒకే ఒక్క వ్యక్తి నేను చచ్చిపోతున్నానని తెలియదు. అదొక్కటే నా బాధ." మనసులోతుల్లోని రహస్యాలను గురించి ఆలోచించటమే మన కిష్టం ఉండదు. వీలైనంత వరకూ వాటిని మరచిపోవటానికే ఇష్టపడతాం. అలాటిది పరాయిల ముందు చెప్పటం బహుశా భయంకరంగా ఉంటుంది కాబోలు. లేదా మనకేమీ కాని వారి ముందు ఇంకా నిర్భయంగా మన మనసు విప్పి చెపుతామేమో! నాకైతే తెలియదు. ఇదే ఆలోచిస్తూ ఆమె మాటలు వింటున్నాను.

"నా చిన్నతనమంతా హైదరాబాదులోనే గడిచింది. అమ్మా నాన్నల సంరక్షణలో, స్నేహితులూ అన్నదమ్ముల మధ్య హాయిగా పెరిగాను, శ్రద్ధగా చదువుకుంటూ, ఏ చీకూ చింతల్లేని జీవితం అది. చిన్నప్పట్నించి నేనూ శ్రీధర్ కలిసి పెరిగాం. ఇంటర్మీడియట్ నుంచీ డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ దాకా మా స్నేహం ఏ అడ్డంకులూ లేకుండా సాగిపోయింది. వేరు వేరు చదువులే అయినా, వాళ్ళ చెల్లి ఎక్కువగా మాతోటే ఉండేది కాబట్టి అతనూ మా గ్రూపుతోనే ఉండేవాడు. చదువు తప్ప ఇంకే విషయాల మీద నాకు పెద్దగా ఆసక్తి ఉండకపోవడం వల్ల, పెద్దదవుతున్న కొద్దీ నా పట్ల అతని ప్రవర్తనలో వస్తున్న తేడాని కనిపెట్టలేకపోయాను, ఎవరో స్నేహితులు నవ్వుతూ కామెంట్ చేసేదాకా. ఆ మరునాడే చెప్పాను, అలాటి ఆలోచనలు కూడా నాకు రావనీ, ప్రస్తుతం బాగా చదువుకోవటం తప్ప నా ఆలోచనల్లో ఇంకేమీ లేవని చెప్పాను. ముందు ఆశ్చర్యంగా నావైపు చూసి, తరువాత నవ్వేసాడు. దాని గురించేమీ మాట్లాడుకోలేదు ఆ తర్వాత మేము. చదువైపోగానే నాకు ఒక ప్రభుత్వ రంగ సంస్థలో, వైజాగ్‌లో పెద్ద ఉద్యోగం వచ్చింది. ఫ్రెండ్సందరూ పార్టీ అని గోల పెట్టారు. అందరం కలిసి పిక్నిక్‌కి వెళ్ళాం. ఆ రోజు మొదటి సారి శ్రీధర్ నాకు తన మనసులోని మాట చెప్పాడు. అదీ చాలా డొంక తిరుగుడుగా, "నన్నొదిలి వెళ్ళటానికి నీకు మనసెలా ఒప్పుతుంది?" అంటూ. తేలిగ్గా నవ్వేసాను. "నిన్నే కాదు, మా అమ్మా నాన్నలనీ, అన్నయ్యనీ, తమ్ముణ్ణీ కూడా వదిలి వెళుతున్నా కదా, " అన్నాను.

"వాళ్ళూ నేనూ ఒకటేనా నీకు?" అని అడిగి లేచి వెళ్ళిపోయాడు. ఎప్పుడూ లేనిది ఆ రోజు చాలా రెస్ట్‌లెస్‌గా నిరుత్సాహంగా అనిపించాడు. ప్రయాణం హడావిడిలో నేను దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఉత్తరాలు రాస్తానని అందరు స్నేహితులకీ చెప్పినా, ఉత్తరాలంటే నాకు తగని బద్ధకం. ఎన్నిసార్లు నేను హైదరాబాదు వెళ్ళినా మాకు ఒంటరిగా మాట్లాడుకోవటం వీలయేది కాదు. మొత్తం మీద ఏదో కమ్యూనికేషన్ గేప్ వచ్చింది. తరువాత నన్ను శ్రీనివాస్ కలవటం మా పెళ్ళీ జరిగిపోయాయి. నేను శ్రీధర్‌ని దాదాపు మరిచిపోయాననే చెప్పాలి. కానీ విచిత్రంగా ఏడెనిమిదేళ్ళ కింద నాకు శ్రీధర్ వాళ్ళ చెల్లి కలిసింది. ఎందుకో నాతో ఎక్కువగా

మాట్లాడటానికి ఇష్టపడలేదు. నేను శ్రీధర్ ఎలా ఉన్నాడు, అని అడిగితే, ఒక్క క్షణం నిశ్శబ్ధంగా నావైపు సూటిగా చూసి, బాగానే ఉన్నాడు, అంది, ఇంకా ఏదో అనబోయేంతలో, "లెటజ్ నాట్ టాక్ అబౌట్ హిం" అంది. ఎంత ఆలోచించినా నాకు ఆ మాటలకర్థం బోధపడలేదు. ఆ తరువాత మళ్ళీ దాని గురించి ఆలోచించలేదు. కానీ ఈ మధ్య, ఒక్కసారి చచ్చిపోయేలోగా ఒక్కసారి అతన్ని చూడాలనిపిస్తుంది. అతని మాటలూ, నవ్వులూ, చూపులకర్థం నాకిప్పుడు తెలిసింది, కానీ ఏం లాభం! అసలెలా ఉన్నాడో! పెళ్ళయిందో లేదో! నన్ను అమాయకంగా, ఏ స్వార్ధమూ లేకుండా ప్రేమించింది అతనొక్కడేనేమో! సరే అదంతా అర్ధం లేని పాత చరిత్ర. కానీ ఇప్పుడెలా ఉన్నాడు? నేను పోయాక ఎవరైనా అతనితో చెపుతారా? చెపితే బాధపడతాడా? ఏమో."

ఆమె ఆలోచనలని భగ్నం చేయటం ఇష్టం లేక నేనేమీ మాట్లాడలేదు. సాయంత్రం చీకట్లు కమ్ముకుంటుంటే మేమిద్దరం అలా ఎంతో సేపు మౌనంగా ఉండిపోయాం.

ఆ తరువాత ఆరునెలలకే పల్లవి పోయింది. ఆమె కోరిక ప్రకారం నేను ఇండియా వెళ్ళాను. ఎవరూ కాని నా మీద ఆమెకి నమ్మకమెందుకు కలిగిందో కానీ, ఒక్కసారి హైదరాబాదు వెళ్ళి శ్రీధర్ ఎలా ఉన్నాడో చూసి రమ్మంది. అసలు తను బ్రతికుండగానే ఆ పని చేయమంది, కానీ నాకే ఇండియా ప్రయాణం ఏర్పాట్లు చూసేసరికి సమయం మించిపోయింది. నిజానికి ఆమె చచ్చిపోవటం తోటే నాకు శ్రీధర్ని కలవాలన్న కోరిక చచ్చిపోయింది. అయినా ఎందుకో బయలుదేరాను. మాటమాటికీ ఆ సాయంత్రం మోకాళ్ళ మీద తల ఆనించుకుని "ఎవరైనా ఒక్కసారి వెళ్ళి అతన్ని చూసొస్తే చాలు. నాకింకేమీ వద్దు" అంటున్న ఆమె రూపం నుంచి తప్పించుకోవాలంటే అదొక్కటే మార్గమనుకున్నాను.

పల్లవి ఇచ్చిన అడ్రసు పట్టుకుని శ్రీధర్ ఇంటికెళ్ళాను. శ్రీధర్ తండ్రి కాబోలు, కుర్చీలో కూర్చుని చదువుకుంటున్నాడు. శ్రీధర్ గురించి అడిగితే బెంగుళూరులో ఉంటున్నాడని చెప్పాడు. అడ్రసు తీసుకుని బెంగుళూరు వెళ్ళాను.

ఇంటికి కాకుండా ఆఫీసుకి ఫోన్ చేశాను. ఆస్ట్రేలియా నుంచొచ్చాననీ, తనతో చిన్న పనుందనీ చెప్పాను. చాలా ఆశ్చర్యపోయాడు, నాకు ఆస్ట్రేలియాలో ఎవరూ తెలియదే, అంటూ. కావాలనే ఇంకే వివరాలు చెప్పలేదు.

మర్నాడు లంచ్ టైంలో శ్రీధర్ని కలవటానికి ఈడెన్ పార్క్కి వెళ్ళాను. అప్పటికే అతను వచ్చి మెనూ చూస్తున్నాడు. పల్లవి దగ్గరున్న ఫోటోలో కంటే కొంచెం భిన్నంగా ఉన్నాడు. ఆ ఫోటోలో సన్నగా పొడవుగా కళ్ళద్దాలతో నవ్వు మొహంతో ఉన్నాడు. ఇప్పుడు కొంచెం ఒళ్ళొచ్చింది. మొహం అలసటగా చిరాగ్గా ఉంది. ఆ ఫోటోని తలచుకుని, అతన్ని ఊస్తే, "ఇరవై ఏళ్ళు ఎంత సుదీర్ఘమైన కాలం" అనిపించక మానదు.

చాలా పనితొందరలో ఉన్నట్టున్నాడు, "చెప్పండి. ఏం పని మీద నన్ను కలవాలనుకున్నారు?" అని అడిగాడు.

"మీకు పల్లవి తెలుసా?"

"పల్లవి? ఏ పల్లవి?" ఎందుకో ఆ ప్రశ్నకి చిరాకేసింది నాకు.

"ఎంత మంది పల్లవులు తెలుసు మీకు?" ఎదురు ప్రశ్న వేసాను.

"ఇటీజ్ క్వైట్ కామన్ నేం."

"సరే అయితే! మీకు చాలా స్పెషల్గా ఎవరైనా పల్లవి అనే అమ్మాయి గుర్తొస్తే ఈ నెంబరుకు ఫోన్ చేయండి. నేనీ ఊళ్ళో ఇంకొక నాలుగు రోజులుంటాను." ఫోన్ నెంబరు రాసిన కాగితం అతని చేతిలో పెట్టి లేచాను కోపంగా.

నేను తలుపు దగ్గరకి చేరుకునేలోగా అతనే వచ్చాడు నాదగ్గరకి.

"సార్! మీకెందుకో కోపం వచ్చినట్టుంది. చాలా రకాలైన వత్తిళ్ళల్లో ఉన్నానంతే. రండి, ప్లీజ్." పెద్ద సీన్ క్రియేట్ చేయటం ఇష్టం లేక వెళ్ళి కూర్చున్నాను.

"చెప్పండి పల్లవి ఎలా ఉంది? ఆస్ట్రేలియాలోనే ఉందా తనిప్పుడు"

"వాళ్ళు ఆస్ట్రేలియాకి వెళ్ళి పదేళ్ళ పైనే అయింది. మీ గురించి చెప్పండి. తను మిమ్మల్ని చాలా తలుచుకుంది." ఎంత ప్రయత్నించినా ఆమె చచ్చిపోవటం నాకు నిజమనిపించటంలేదు. ఆ విషయం మెల్లగా చెపుదామనుకున్నాను.

"మేమిద్దరం దాదాపు ఇరవై ఏళ్ళ కింద మంచి స్నేహితులం. గంటలు గంటలు ఏం మాట్లాడుకునే వాళ్ళమో! ఇప్పుడసలు నాకు గుర్తుకూడాలేవా కబుర్లు! ప్యూర్ టైం వేస్ట్! ఏవో ఆదర్శాలు, ఏదో ఆవేశం! ఇప్పటి జెనరేషన్ చూడండి, ఎంత ప్రాక్టికల్‌గా, తెలివిగా ఉంటారో! కాలేజీ స్నేహాలు కాలేజీలోనే సమాప్తం. బయటికొచ్చిన తరువాత నువ్వెవరో, నేనెవరో! వాళ్ళని చూసి మనం నేర్చుకోవలసిందిఎంతైనా ఉంది. దే ఆర్ సో మెటీరియలిస్టిక్! చెత్త సిద్ధాంతాలు, ఎమోషన్స్సూ, ఆదర్శాలంటూ టైం వేస్టు చేసుకోకుండా, ఎంత సేపూ జీవితంలో పైకెలా ఎగబాకాలా అనే ఆలోచనలూ ప్రణాళికలూ ఉన్న యంగర్ జనరేషన్ని చూస్తే నాకు భలే అడ్మిరేషన్. మా అబ్బాయిని చూడండి! మా ఇంట్లో ఉన్న వందల పుస్తకాల్లో ఒక్కటి కూడా చదవడు. ఎందుకు డాడీ, ఆ చెత్తంతా చదివి తలకెక్కించుకోవటం! హాయిగా ఏ మేనేజ్ మెంటు మేగజేన్ చదువుకున్నా పుణ్యం పురుషార్ధం, అంటాడు. లక్కీలీ నేను ఎక్కువ ఆలస్యం కాకుండానే మేలుకున్నాను. మాగ్రూపులో కొందరిని చూస్తే చాలా జాలేస్తుంది. ఎదుగూ బొదుగూ లేకుండా అలాగే పడివున్నారు. పల్లవిని పెళ్ళిచేసుకోనందుకు ఒకప్పుడు ఎంతో బాధపడ్డాను. నిజానికి నాకది చాలా మేలే చేసింది. బాగా డబ్బున్న అమ్మాయిని పెళ్ళాడాను. ఈ ఉద్యోగాలవీ చేత కాదని, మా మావగారి సహాయంతో బిజినెస్ స్టార్ట్ చేసాను. నౌ ఐ ఏం మింటింగ్ మనీ! చదువుకునే రోజుల్లో నేను కమ్యూనిస్టు సాహిత్యం చదివే వాణ్ణి! ఆ రోజులు తలచుకుంటే ఐ యాం అషేమ్డ్ ఆఫ్ మైసెల్ఫ్! ఇంతకీ మీరు పల్లవి గురించేదో మాట్లాడాలన్నారు!" గడియారం చూసుకుంటూ అన్నాడాయన.

"నథింగ్ స్పెషల్! బెంగుళూరు వెళితే మిమ్మల్నొకసారి పలకరించి రమ్మంది, అంతే."

"నేను బెంగుళూరులో ఉన్నట్టు తనకెలా తెలుసు?"

"అప్పుడెప్పుడో మీ సిస్టరు కనపడి చెప్పారట" రిస్కు తీసుకుని అబద్ధం ఆడాను.

"రైట్ దెన్! ఏమీ అనుకోవద్దు. కొంచెం పని తొందరలో ఉన్నాను. పల్లవినీ వాళ్ళాయననీ అడిగినట్టు చెప్పండి. ఈసారొచ్చినప్పుడు వీ విల్ హేవ్ డిన్నర్ టుగెదర్."

ఆయన వెళ్ళిపోయినా అలాగే కూర్చుండిపోయాను. పల్లవి మరణం కూడా నా మనసులో ఇంత శూన్యాన్ని మిగల్చలేదు. చల్లని పిల్లగాలి కోసం షికారెళ్ళి మురికి గుంటలో పడ్డ భావన!

* * *

అడిలైడ్ తిరిగొచ్చేసాను. ఒకరోజు గుళ్ళో శ్రీనివాస్ కనిపించారు. మనిషి కొంచెం చిక్కాడు.

"అలా కొంచెం సేపు కూర్చుందాం రండీ, ప్లీజ్!" నా చేయందుకుని బేలగా అడిగాడు. ఇద్దరం వెళ్ళి మంటపంలో కూర్చునాం.

"మీరా రోజు పల్లవితో ఏం మాట్లాడారు? తనేమంది? మీరు నాకెపుడూ చెప్పలేదు." ఒక్కసారే ఆయన ప్రశ్న విని తడబడ్డాను. కింద పెరిగిన గడ్డివైపు తదేకంగా చూస్తూ చెప్పాను.

"అవును, ఆ రోజు చాలా మాట్లాడాను. నేననుకునట్టే, ఆవిడ మీ గురించి బాగా బెంగపడ్డారు!"

"వాట్?"

"అవును. మీకు తనంటే పంచప్రాణాలనీ, తను లేకుండా మీరెలా ఉండగలుగుతారోననీ తల్లడిల్లిపోయారు." నా గొంతులో ఏదో ఇంతలావు ఉండ అడ్డుపడుతుంది.

"ఓగాడ్!" ఆయన చాలా సేపు మోకాళ్ళ మీద తల పెట్టుకుని కూర్చుడిపోయారు. ఆయన్ని అలా వదిలేసి నేను కార్ పార్క్ దగ్గరకెళ్ళిపోయాను.

ఇప్పటికీ నాకు సంజె చీకట్లోనుంచి, మసక వెన్నెలలోంచి, ఆ అమాయక ప్రేమికురాలి గొంతు వినపడుతునట్టే ఉంటుంది.

## ఏడుకొండలవాడిని ఏమి కోరేను? - భాగవతుల రామారావు

**నిరుడు నవంబర్లో** మా మనవరాలు పెళ్ళయాక నూతన వధూవరుల్ని తీసుకుని పెళ్ళివారం ఏడుకొండలవాడి దర్శనానికి తిరుపతి వెళ్ళాం. వధూవరులిద్దరూ మనవడూ, మనవరాళ్ళే - కూతురి కొడుకూ, కొడుకు కూతురూ.

పెళ్ళివారం అంటే అంతా కలిపి నాలుగుజంటలు - పెళ్ళి కూతురూ, పెళ్ళికొడుకు, ఆడపెళ్ళివారు (కొడుకూ కోడలు), మగ పెళ్ళివారు (కూతురూ, అల్లుడు).. ఈ మూడు జంటల మధ్య పానకంలో పుడకలా నేనూ, మా ఆవిడా.

ఏక కుటుంబం అవడం చేత మగపెళ్ళివారూ, ఆడపెళ్ళివారూ అన్న మొహమాటాలూ, మన్నించుకోవడాలూ బెడద లేకుండా చాలా సందడిగా గడిచింది మా తిరుపతి యాత్ర. వరాహ స్వామి గెస్ట్ హౌస్‌లో గ్రౌండ్ ఫ్లోర్లో రెండు రూములు పక్క పక్కన రిజర్వు చేయించుకున్నాం. ఏడుకొండలవాడి కళ్యాణానికి నాలుగు జంటలకీ కళ్యాణం టిక్కెట్లు కూడా ముందుగానే రిజర్వు చేయించుకున్నాం.

రూముల్లో ఫ్రెషప్ అయాక జీపు మాట్లాడుకుని పాపనాశనం, ఆకాశగంగ, మ్యూజియం, శంఖల మెట్ట, గీతోపదేశం పార్కు, నర్సరీ అన్నీ చుట్టబెట్టాం. రాత్రి హోటల్లో భోజనం చేసి వచ్చాక అందరం కూర్చుని కబుర్లలో పడ్డాం. అదీ, ఇదీ మాట్లాడుకున్నాక మర్నాటి దర్శనం ప్రోగ్రాం గురించి నేను అందరికీ ఓ అన్‌సొలిసిటెడ్ ఎడ్వైస్ ఇచ్చాను.

నాకున్న తిరుపతి అనుభవం వాళ్ళెవరికీ లేదు. నేను, మా ఆవిడ 1961 నుంచీ ఇంచుమించు ప్రతీ ఏటా తిరుపతి వస్తున్నాం. అప్పటికి మాకు పెళ్ళయి ఆరేళ్ళయినా సంతానం కలగకపోవడంతో మా అమ్మ కోరిక పాటించి 1961 ఫిబ్రవరిలో మొదటిసారి అందరం తిరుపతి వచ్చాం. యాత్రనుంచి ఇంటికి రాగానే మా ఆవిడ నెల తప్పడం, అదే నవంబర్లో మా పెద్దమ్మాయి పుట్టడం జరిగింది. మా ఆవిడ పిల్లల్ని కనడం మొదలు పెట్టాక ఇక వెను తిరిగి చూడలేదు - వరుసగా అరడజను పిల్లల్ని కనేసింది. అందులో ఐదు మైనస్సులూ, ఒక ప్లస్సూ. అంటే ఐదుగురు ఆడపిల్లలూ, ఒక్క మొగనలుసూ.

అప్పట్నుంచీ ప్రతి ఏటా తిరుపతి వస్తూ ఇక్కడి చేదు అనుభవాల్ని జీర్ణించుకున్నవాణ్ణి గనక ఆ అనుభవాలకి నా వయస్సూ, పెద్దరికం జోడించి మావాళ్ళకి సలహా రూపంలో ఒక హెచ్చరిక చెయ్యడం నా బాధ్యతగా భావించాను.

తిరుమలలో ఎంత డబ్బు పెట్టి ఏ టిక్కెట్టు కొన్నా, ఏ టిక్కెట్టూ కొనకుండా 'ఫ్రీ' సుదర్శన చక్రం ధరించి సర్వదర్శనం చేసుకున్నా ఏడుకొండలవాడి దర్శనం అయేది అరక్షణంలో అరసగం సేపు కూడా ఉండదు!

గర్భగుడి ప్రవేశ ప్రాంగణంలో అన్ని రకాల 'క్యూ'లనీ కలిపేసి ఒకే క్యూ చేసేస్తారు. అక్కణ్ణుంచి గర్భగుడిలో దూరేదాకా ఒకటే తోపులాట, తొక్కిసలాట. మన ప్రమేయం లేకుండా ముందుకు తోసుకుపోతాం ప్రవాహంలో కొట్టుకు పోతున్నట్టు. గర్భగుడిలోకి కొట్టుకొచ్చాక ఆలయం వాలంటీర్ల స్వైర్యవిహారం తట్టుకుని ఆ తోపులాటలో 'వెంకన్నని' కళ్ళారా చూసామన్న తృప్తితో బయటకి నెట్టబడవాళ్ళు ఒక్కరేనా ఉన్నారంటే అతిశయోక్తే అనాలి! గర్భగుడిలోంచి బయటకి వచ్చినవాళ్ళు దేవుడి దర్శనం చేసుకుని వచ్చినవాళ్ళలా కాక మల్ల యుద్ధం చేసి వచ్చిన వాళ్ళలా ఉంటారు.

తిరుమలలో వి.ఐ.పీలకు తప్ప యాత్రికులకు తృప్తి తీరా వెంకన్న దర్శనం అవడం అసంభవం. అక్కడి పరిస్థితి అలాంటిది.

ఈ చేదు అనుభవాలు దృష్టిలో పెట్టుకుని, "రేపు మనం దేవుడి కళ్యాణం అయాక 'క్యూ' ప్రవాహంలో గర్భగుడి ద్వారం దగ్గరికి కొట్టుకు వచ్చాక అల్లంత దూరంనుంచే కనిపించీ కనిపించనట్టు వెంకన్న విగ్రహం కనిపించగానే మీరు కళ్ళు మూసుకుని స్వామికి మీ కోరికల నివేదనలో పడక, కళ్ళు తెరుచుకుని దూరంనుంచే దేవుణ్ణి చూస్తూ జన ప్రవాహంలో ముందుకు నడవండి. లేకపోతే దేవుడి దర్శనం దేవుడెరుగు, వాలంటీర్ల అజమాయిషీలో మీరు కళ్ళు మూసి తెరిచేలోగా 'రైట్ ఎ బౌట్ టర్న్' - తిరుముఖం - అయిపోయి బయటికి నెట్టి వేయబడతారు!" అని మా వాళ్ళని హెచ్చరించాను.

ఇంతలా మా వాళ్ళని హెచ్చరించి నన్ను నేను దిగ్బంధంలో ఇరికించుకుంటున్నానని నాకు తట్టలేదు.

మర్నాడు దేవుడి కళ్యాణం అయిపోయాక క్యూలో కుమ్మా కుమ్మీల మధ్య ఎలాగో తిరుమలేశుని దర్శనం అయిందనిపించుకుని గర్భగుడిలోంచి బయటపడ్డాం. ఆలస్యం చెయ్యకుండా పక్కనే ఉన్న హుండీ దగ్గర ఎవరి ముడుపులు వాళ్ళు చెల్లించుకున్నాం. హుండీ క్యూలోంచి బయటికొచ్చాక మనవరాలు - పెళ్ళికూతురు - నన్నడిగింది. "తాతా! హుండీలో అందరూ ముడుపులూ, కానుకలూ డబ్బూ ఎవరు మొక్కుకున్నవి వాళ్ళు వేస్తుంటే నాయనమ్మ మీ చేతిలో నోట్లు పెట్టి హుండీలో వెయ్యమంటే అప్పుడు వేసారు. దేవుడికి హుండీలో వేస్తానని మీరేమీ మొక్కుకోలేదా?"

"నేను దేవుణ్ణి సాధారణంగా ఎప్పుడూ ఏమీ కోరను. పని చేయించుకోడానికి మనుషులకి లంచం ఇచ్చినట్టు మన కోరికలు తీర్చడానికి దేవుడికి డబ్బు 'ఆఫర్' చెయ్యడమేమిటి? హుండీలో అందరూ అలా ముడుపులూ, డబ్బూ, కానుకలూ వెయ్యడం - మన పాపాల్ని ముడుపుల మూటగట్టుకుని వచ్చి, దాన్ని ఆ హుండీలో వెయ్యడమే అనిపిస్తుంది నాకు. దేవుడికే లంచాలు ఆఫర్ చేస్తున్న మనం పాపాల్ని మూటగట్టుకుంటున్నాం తప్ప తిరుపతి వచ్చి కూడా పాపప్రక్షాళనం చేసుకోవడం లేదు. కోరికల్తోనే వస్తున్నాం తప్ప, ఇచ్చిందానికి తృప్తిపడి, స్వామికి కృతజ్ఞతలు చెప్పుకుందికి రావడంలేదు. వెంకన్నని 'ఆపదమొక్కులవాడి' స్థాయికి దిగజారుస్తున్నాం"

"ఆ మాట నిజమే తాతా! ఈ హుండీ తతంగం చూస్తే మనుషులు దేవుణ్ణి కేవలం తమ కోర్కెలు తీర్చమని కొలుస్తున్నారే తప్ప నిస్వార్థంగా దేవుణ్ణి దర్శించడానికి రావడం లేదు. అయితే మీరు దేవుణ్ణి ఏమీ కోరనన్నారే - అది మాత్రం ... నిజం కాదు!"

మనవరాలు ఆఖర్న అన్న మాటలకి నేను గతుక్కుమన్నాను. అమ్మాయి అతిస్మార్ట్. అకారణంగా అలా అడిగి ఉండదు. ఏం చెప్పడమో తోచక తికమక పడ్డాను. ఇంతలో మా ఆవిడ " తాతా మనవరాలూ తీరిగ్గా కబుర్లాడుకుందికి ఇదా సమయం? ఇప్పటికే టైము 20.20 అయింది, ఇంకా లేటు చేస్తే ఏ హోటల్లోనూ భోజనం దొరకదని అవతల అబ్బాయి తొందరపెడుతున్నాడు. పదండి వేగిరం" అంది, మనవరాలి చెయ్యి పట్టుకుని ముందుకి నడుస్తూ.

బతుకు జీవుడా అనుకున్నాను. అప్పటికి గండం గట్టెంది.

ఆ రాత్రి అందరం కూచుని మర్నాడు దిగువ తిరుపతిలో ఏమేమి చూడదల్చుకునామో ప్రోగ్రాం నిఖరం చేసుకుని ఇక పడుకుందామని లేవబోతుంటే మనవరాలు "ఒక్క నిమషం" అని నావేపు తిరిగి, " తాతా! మధ్యాహ్నం హుండీ దగ్గర నాతో మీరు దేవుణ్ణి ఎప్పుడూ ఏమీ కోరనన్నారు. పైగా, నిన్న రాత్రి మా అందర్నీ గర్భగుడిలో ఉన్నప్పుడు కోరికల లిస్టు వల్లిస్తూ కళ్ళు మూసుకుని దేవుణ్ణి చూసే అవకాశం కాస్తా చేజార్చుకో వద్దని హెచ్చరించారు కూడా. కాని అందుకు విరుద్ధంగా ఇవాళ గర్భగుడిలో మీరే రెండు చేతులూ జోడించి, కళ్ళు మూసుకుని దేవుణ్ణి ప్రార్థిస్తుండగా నేను చూసాను! తాతా! మీకూ ఈ వయసులో ఇంకా తీరని కోరికలు మిగిలిపోయాయా? ఎప్పుడూ దేవుణ్ణి ఏమీ కోరనన్న మీరు ఇవాళ అంత భక్తి శ్రద్ధలతో దేవుణ్ణి ఏమి కోరారు?" అని అడిగింది.

నేను తెల్లబోయాను. ఇవాళ రెడ్ హేన్డెడ్‌గా మనవరాలికి దొరికిపోయాను.

నేను జవాబిచ్చేలోగా అందరూ అమ్మాయిని దుయ్యబట్టారు. " నీ ప్రశ్న మరీ విడ్డూరంగా ఉందే! దేవుడి ముందు కళ్ళు మూసుకుంటే కోరుకుంటున్నట్టే లెఖ్ఖా? దేవుణ్ణి ధ్యానించుకోకూడదా! ఏమిటా అర్థం పర్థం లేని మాటలు, పెద్దా చిన్నా లేకుండా?"

"తాతగారు దేవుణ్ణి ప్రార్థిస్తుండగా నేను చూసాను మొర్రో అంటే మీరు నమ్మరేమిటి? కావలిస్తే తాతనే అడగండి నిజమో కాదో!" మనవరాలు వదిలిపెట్టే ఘటం కాదు.

అందరూ ఇబ్బందిగా నావేపు చూసారు. మా ఆవిడైతే నన్ను ఏనాడో నాస్తికుడిగా జమ కట్టేసిందేమో, ఇప్పుడు మనవరాలి నోట విన్నది 'కలయా? వైష్ణవ మాయా?' అన్నట్టు విస్తుపోయి నావేపు చూడసాగింది. వాళ్ళందరినీ గర్భగుడిలో ఏం చెయ్యొద్దని హెచ్చరించానో అదే నేను చేసి మనవరాలి కళ్ళపడ్డాను. అమ్మాయి నోరు మూయించాలంటే నాకు ఒక్కటే ఉపాయం తట్టింది.

"ఓస్! ఇదా నీ ధర్మ సందేహం? నువ్వన్నట్టు, ఈ వయస్సులో నాకు తీరని కోరికలు ఇంకా ఏమిటి ఉంటాయి చెప్పు? నీ పెళ్ళి కూడా ఐపోయింది. అయితే ఇవాళ గర్భగుడిలో నువ్వు చూసింది నిజమే! ఎన్నో ఏళ్ళ తర్వాత ఇవాళ మొదటిసారి నేను ఏడుకొండలవాడిని ఒక కోరిక కోరాను. అది అప్పటికప్పుడు నాకు హఠాత్తుగా తట్టిన కోరిక. మీ అందరికీ తెలుసు – నేను హార్ట్‌పేషెంటునని. ఇవాళ గర్భగుడిలోకి రాగానే సడన్‌గా అనిపించింది – వచ్చే ఏడాది రాగలనో లేదో ఉంటానో ఉండనో. 44 ఏళ్ళ కిందట నేనూ మీ నాయనమ్మా మొదటిసారి తిరుపతి వచ్చినప్పుడు ఏం కోరుకున్నామో జ్ఞాపక వచ్చింది. ఆ కోరిక ఫలవంతం అవడం వల్లే ఇవాళ నేను పదముగ్గురు మనమలకు తాతనయ్యాను. వాళ్ళల్లో కూతురి పెద్దకొడుకు, కొడుకు పెద్ద కూతురూ ఇవాళ దంపతులై స్వామి దర్శనానికి వచ్చారు. వాళ్ళ బాహ్య రూపాలు వేరుకాని జన్యు శాస్త్రప్రకారం వాళ్ళూ మా అంశాలే, మా ప్రతిరూపాలే. నేనూ, మీ నాయనమ్మా నవ వధూవరుల రూపంలో వచ్చామన్నమాట! ఈ ఆలోచన రాగనే నేను వర్తమానంలోంచి 44 ఏళ్ళు వెనక్కి వెళ్ళిపోయాను. వెంటనే అప్రయత్నంగా కళ్ళు మూసుకుని, చేతులు జోడించి ఆ రోజులాగే, 'ఏడాది తిరక్కుండా నా మనవరాలి కడుపు పండించి, బిడ్డనెత్తుకుని వీళ్ళిద్దరూ వచ్చి నీ దర్శనం చేసుకునేటట్టు వీళ్ళని దీవించు!' అని. నువ్వు చూసింది ఈ దృశ్యమే. అంత సబ్ కాన్షస్‌గా 'ఆన్ ది స్పర్ ఆఫ్ ది మూమెంట్' జరిగిపోయింది."

నా సంజాయిషీ విన్నాక, నన్ను కార్నర్ చేద్దామనుకున్న పెళ్ళికూతురు మరి మాట రాక, సిగ్గు దొంతరలు పోయి ముద్దరాల్లాగ ముణుచుకు కూచుంది. మిగతా వాళ్ళందరి కళ్ళూ చెమర్చాయి. మా ఆవిడ నన్ను మెచ్చుకోలుగా చూసింది.

మనవరాలు అడిగిన ప్రశ్నకు నా దగ్గిర మరో జవాబు లేదు. ఇంతకీ నిజం చెపితే ఇప్పుడు ఆర్ద్రమైన కళ్ళతో ఆరాధనా పూర్వకంగా నావేపు చూస్తున్న వీళ్ళే, నన్ను 'ఛీ' కొట్టేవారు. ఈ ముసలాడి బుర్రలో ఇంత అమానుషమైన ఆలోచనలున్నాయా అని అసహ్యించుకునేవారు. అంచేత అబద్ధం చెప్పక తప్పలేదు. తిరుమల కొండమీద అంతటి అబద్ధం చెప్పినందుకు ఏడుకొండలవాడికి మనసులోనే శతకోటి క్షమాపణలు చెప్పుకున్నాను.

మర్నాడు పొద్దున్న జీపులో కొండదిగి, అదే జీపులో దిగువ తిరుపతిలో చూడవలసినవన్నీ, అలివేలు మంగాపురంతో సహా, అన్నీ చుట్టబెట్టి, సాయంత్రం హోటల్లో నైట్ టిఫిన్ చేసి, తిరుమల ఎక్స్‌ప్రెస్ వేళకి రైల్వే స్టేషన్ చేరుకున్నాం. రైల్లో అందరం ఎవరి బెర్తుల మీద వాళ్ళ పక్కలు పరుచుకుని నడుం వాల్చాం. రైలు కదిలింది. రేణిగుంట దాటి రైలు ఇంకా కాళహస్తే చేరుకోలేదు, మావాళ్ళందరూ అలిసి ఉన్నారేమో, అప్పుడే గుర్రులు పెట్టసాగారు - నేను తప్ప. నా మనస్సంతా అశాంతితో నిండి ఉంది.

నా ఎదురు లోయర్ బెర్త్ మీద మా ఆవిడ నిశ్చింతగా నిద్రపోతున్నది. ఆమె మొహంలోని ప్రశాంతతని చూస్తే నాకు జాలివేసింది. నిన్న ఏడుకొండలవాడిని నేను కోరిన కోరిక నన్ను దహించి వేస్తున్నది. నిద్దర పట్టడం లేదు. మళ్ళీ మళ్ళీ అదే జ్ఞాపకం వస్తున్నది.

ఇంతకీ నిన్న గర్భగుడిలో ఏడుకొండలవాడిని నేను ఏమి కోరాను?....

నా ఈ 76 ఏళ్ళ జీవితం పూలబాట మీద పరుగులా కాక పల్లేరు ముళ్ళమీద నడకలాగే బతుకు బండిని లాక్కువచ్చాను. ఈ బండికి ఒక ఎద్దును నేనయితే, రెండో ఎద్దు నా శ్రీమతి. కుచేలుడిలాంటి పెద్ద కుటుంబ బారాన్ని ఇద్దరం నెట్టుకొచ్చాం. పిల్లలందరికీ డిగ్రీలుదాకా చదువు చెప్పించాం. అయిదుగురు ఆడపిల్లలూ, అబ్బాయీ పెళ్ళిళ్ళయి పిల్లాపాపల్తో, పచ్చగా కాపరాలు చేసుకుంటున్నారు. ఆస్తులు వెనకెయ్యకపోయినా, కుటుంబం ఏనాడూ అవస్థలు, అభావం అనుభవించలేదు.

అందరూ అంటారు నన్ను - " అదృష్టవంతుడు - బాధ్యతలన్నీ తీర్చుకుని, రిటైరయ్యాక చీకూ చింతాలేకుండా వృద్ధాప్యంలో కొడుకు దగ్గర రామాకృష్ణా అనుకుంటూ నిష్పూచీగా బతుకుతున్నాడు." అని.

అయితే ఈ సాఫల్యం నాది కాదు. జీవితంలో నాతో సుఖాలకంటే కష్టాల్నే ఎక్కువ పంచుకున 'కార్యేషుదాసీ, కరణేషు మంత్రీ' అయిన నా శ్రీమతిది. నేను నిమ్మిత్తమాత్రుణ్ణి. అన్నీ ఆమే ఇనిషియేటివ్ తీసుకుని బాధ్యతలన్నీ నెరవేర్చింది. ఆ ఘనత నాకు దక్కింది.

నా 'షష్టిపూర్తి' ఘనంగా జరుపుకుందామని మా ఆవిడకు మనసులో ఉబలాటంగా ఉండేది. కాని నేను ఇలాంటి ఆర్భాటాలకి వ్యతిరేకినని ఆమె తన కోరిక బయట పెట్టలేదు. అది గ్రహించి ఆమెను తీసుకుని తిరుపతి వెళ్ళి, మా షష్టిపూర్తినాడే తిరుమల స్వామి కళ్యాణం చేయించాను. అల్ప సంతోషి. పొంగిపోయింది. ఇంటి దగ్గర షష్టిపూర్తి కేవలం వేడుకే ఔతుంది. దేవుడి కళ్యాణం సాటి రాదని తృప్తిపడింది.

అంతకు ముందు మా వివాహ రజతోత్సవం మా పెద్దమ్మాయి పెళ్ళితో కావడం చేత ఆ విషయమే మేం పట్టించుకోలేదు. ఇంతకంటే పెద్ద మైలు రాయి - మా వివాహ స్వర్ణోత్సవం - వృద్ధ దంపతులం మా ఇద్దరికీ తప్ప మా కుటుంబంలో ఎవరికీ దాని గుర్తులేదు. వివాహ స్వర్ణోత్సవం చాలా అరుదైన ఈవెంట్. ఏ కొద్దిమంది దంపతులకో దీన్ని 'సెలబ్రేట్' చేసుకునే అదృష్టం కలుగుతుంది. నిరుడు అన్ని నెలల్లాగే 'మార్చి' వచ్చింది, వెళ్ళిపోయింది. స్వర్ణోత్సవం, రజతోత్సవం, షష్టిపూర్తి - ఇవి కొడుకులూ కోడళ్ళు. కూతుళ్ళు అల్లుళ్ళు, అన్నదమ్ములు, ఆత్మీయులు చెయ్యవలసినవి. మా వాళ్ళెవళ్ళకీ వీటి విషయమే ఎరుకలేదు. మేం ఎప్పుడైనా మేరేజ్ డే, బర్త్‌డే చేసుకుంటే కదా వాళ్ళకి ఇవి గుర్తుండడానికి? మేం నోరు విడిచి పిల్లలకి చెప్పి, చేయించుకోవడం మాకిష్టంలేదు.

నేను ఈ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ మా ఆవిడ తీవ్ర అసంతృప్తికి లోనయింది - నా స్వర్ణోత్సవ దినం దాటిన మూడో రోజునే, నిరుడు మార్చిలో, ఆమె మాసివ్ హార్ట్ ఎటాక్‌కి గురై, ఐ.సి. యు లో పెట్టాం. దేవుడు చల్లగా చూసి బతికి బయటపడింది. అందుకనే మనవరాలు మనవడి పెళ్ళి సందర్భంగా వాళ్ళతో మా ఆవిణ్ణి కూడా తిరుపతి యాత్రకి తీసుకొచ్చి, మా వాళ్ళతో పాటు దేవుడి కళ్యాణం చేయించాం. మా వైవాహిక స్వర్ణోత్సవం కంటే అదే సంవత్సరంలో దేవుడి కళ్యాణం చేయించడం మహత్తరమైనది కద!

నిన్న గర్భగుడిలో క్యూలో నాకు ముందున్న మా ఆవిడ ముఖంలో సంతృప్తి, సంతోషం చూసాక నాకు అప్పటికప్పుడు ఒక ఆలోచన తట్టింది. మా జీవితం ఆఖరి మజిలీ , చేరుకుందని దానికి అప్పుడే 'కౌంట్ డౌన్' ప్రారంభం అయిందని ఇద్దరికీ తెలుసు. అయితే ఇద్దరం కలిసి ఏభైయేళ్ళు సహజీవనం చేసినా ఇద్దరం కలిసి ఒకేమారు 'పోలేము'కద? ఒకరు ముందూ ఒకరు వెనకా 'పోక' తప్పదు. మా ఇద్దరిలో ఎవరు ముందు 'పోవాలి'? - నేనా? మా ఆవిడా?

వృద్ధాప్యంలో నా కంటే ముందు మా ఆవిడ'పోతే'ఆమె లేకుండా, ఏభై ఏళ్ళగా ఆమెనే ఆలంబనగా బతికిన నేను, ఒడ్డున పడ్డ చేపలా విలవిల్లాడిపోతాను. తర్వాత అట్టేకాలం బతకను. కాని నేనే ముందు 'పోతే' ఆమెకు వైధవ్యం తప్పదు. భర్త పోయాక ఆడది చావుకి సిద్ధపడుతుంది కాని వైధవ్యాన్ని కోరదు. ఆడది జీవితాంతం దీర్ఘాయుష్మంతుడైన భర్త కోసమే పూజలు, నోములు, వ్రతాలు, చేస్తుంది. తన ఆయుష్షు గురించి పాకులాడదు. సుమంగళిగా భర్త చేతుల మీదుగా తన దినం తీరాలని కోరుకుంటుంది.

పెళ్ళిలో లాజహోమం చేసేటప్పుడు వదువు లాజల్ని (పేలాలు) అగ్నిహోత్రుడికి అర్పిస్తూ "దీర్ఘాయురస్తు మే పతిర్జీవాతు శరదశ్శతమ్ - నా భర్తకు దీర్ఘాయుష్యం కలగాలి. ఆయన నిండుగా నూరేళ్ళు బతకాలి" అని కోరుతుంది. అలాగే వరుడు కూడ "ఈ వదువు సుమంగళిగా, సౌభాగ్యవతిగా వర్ధిల్లాలని ఆశీర్వదించి, మీమీ ఇళ్ళకు వెళ్ళండి" అని ఆహుతుల్ని అర్థిస్తాడు.

పెళ్ళిలో చేసిన ఈ బాసలు నిజం కావాలంటే నాతో ఏభైయేళ్ళు సహచర్యం చేసిన నా భార్య వైధవ్యం బారి పడకుండా, ఆమె నుదిటిమీది రూపాయి కాసంత ఆ బొట్టు చెరిగి పోకుండా సుమంగళిగా నా చేతుల మీదుగా 'పోవాలంటే' ఏడుకొండల వాడిని ప్రార్థించడం తప్ప నాకు గత్యంతరం తోచలేదు.

అంచేత నేను నిన్న గర్భగుడిలో ఏడుకొండలవాడిని, "నాకంటే ముందు నా శ్రీమతిని, 50 ఏళ్ళకిందట సౌభాగ్యవతిగా ఎలా నా వద్దకు వచ్చిందో తిరిగి అలా పచ్చగా పసుపు కుంకుమలతో, నీ వద్దకు తీసుకుపో!" అని ప్రార్థించాను...

ఇదీ నిన్న ఏడుకొండలవాడిని నేను కోరిన కోరిక.

నేను కోరింది తప్పా? ఒప్పా?

తప్పని నా మనస్సు ఒప్పుకోవడం లేదు. నాతో అర్ధశతాబ్ది జీవితం పంచుకున్న సహధర్మచారిణి ఆమె చరమ దశలో విధవను చేసి, ఒంటరిగా వదిలి పెట్టి, నేను 'ముందు పోవాలని' కోరుకుంటే, పెళ్ళినాటి 'నాతిచరామి' ప్రమాణాన్ని అతిక్రమించడమే కద?

'ఒప్పే' అని కూడ మనస్సు ఒప్పుకోడం లేదు. ఏభై ఏళ్ళ సహచరిని 'ముందు తీసుకు పొమ్మని' దేవుణ్ణి అర్థించడం అమానుషం కాదా?

ఈ అంతర్మథనంతో నిద్రపట్టలేదు. కోరికలకు అతీతంగా ఉంటున్నవాణ్ణి దేవుణ్ణి ఏది 'కోరినా' తప్పే! "క్షమించు స్వామీ! మాలో ఎవర్ని ముందు 'తీసుకుపోవాలో' అది నీ ఇష్టం. యధా యోగ్యం తథాకురు!"

నిర్ణయం దేవుడికే వదిలిపెట్టాక మనస్సు కుదుట పడి, రైలు కుదుపుకి ఎప్పుడు నిద్రపట్టేసిందో నాకు తెలియదు.

# ఒక ప్రేమలేఖ - వారణాసి నాగలక్ష్మి

**అలసిన శరీరం,** వాడిపోయిన మొహంతో బస్సు దిగిన సరోజకి, పెరటి గుమ్మంలో కూర్చుని తాగబోయే వేడి టీ తాలూకు ఆలోచన కాస్త ఊరటనిచ్చింది. తనకన్నా పిల్లలు ముందే ఇల్లు చేరి గుమ్మంలో వెర్రి మొహాలేసుకుని కూర్చుంటే ఏమిటో బాధగా ఉంటుంది అనుకుంది. పోస్టు బాక్స్‌లో చూసేసరికి లేత పసుపు రంగు కవరు కనిపించింది. తీయగా ఎవరో పలకరించినట్టనిపించింది! ఎవరబ్బా అన్నట్టు చిరునామా చూసింది. అత్తగారి చేతిరాత! గుండె గుభిల్లుమంది. మెట్ల మీద కూలబడి, కవరు చింపింది. లోపలి కాగితం తీసి, ఆదుర్దాగా చదివింది. చిరంజీవి సౌభాగ్యవతి వగైరాలన్నీ త్వరగా దాటేసి, అసలు విషయానికి వచ్చేసరికి

'సరస్వతి కూతురు సరోజ పెళ్ళి శుభలేఖ మీకూ వచ్చే ఉంటుంది. హైదరాబాదులోనే పెళ్ళి. పెళ్ళి తర్వాత మూడు వారాల్లోనే అన్నయ్యగారి మనవడి ఉపనయనం. ఇద్దరూ ఫోను చేసి మరీ మరీ అడిగారు ముందుగా రమ్మని. పొలంలో టొమాటో పంట మీదుంది. మీ మామగారికి రావడానికి కుదరదు. నేనే హాజరు కావాలి. జానకినీ, రామాన్నీ పంపుదామంటే సుమకి క్వార్టర్లీ పరీక్షలు. వాళ్ళమ్మ దగ్గరుంటేనే బావుంటుంది పాపం దానికి. అందుకే అంతా నన్ను ప్రయాణం కమ్మన్నారు. తొమ్మిదో తారీకు రాత్రి బస్సుకి టిక్కెట్టు తీసుకున్నారు. ఇల్లు వదిలి ఇన్నాళ్ళు ఉండాలంటే ఎలాగో ఉన్నా మీతో, మనవలతో నెలరోజులపాటు గడపవచ్చునని తలుచుకుంటే చాలా సంతోషంగా ఉంది.''

ఉత్తరం పూర్తి చేస్తూనే గాలి తీసిన బెలూనులా అయిపోయింది సరోజ. పిన్నత్తగారి కూతురు పెళ్ళికి వచ్చి, అన్న మనవడి ఉపనయనం వరకూ తమతో ఉంటారన్నమాట అత్తగారు. ఇప్పటికే ఈ స్కూల్లో ఉద్యోగం, పిల్లలిద్దరి పనీ, తగ్గిన ఆరోగ్యం.... వీటికి తోడు మడి ఆచారాలతో తన ప్రాణం తీయడానికి ఈవిడ. మనసంతా చికాకైపోయింది సరోజకి. ఏ రోజైనా కొంచెం ఒంట్లో బావుండకపోతే లేటుగా లేవడం, అవసరమైతే ఎపుడేనా పనిమనిషిని పంపి టిఫిన్ సెంటర్ నుంచి ఏ ఇడ్లీనో తెప్పించుకోవడం, పేపరు కరెక్షన్ పనులు ఎక్కువగా ఉంటే కుక్కర్‌లో అన్నం, ఆకు కూర పప్పులతో వంట కానిచ్చేసి, సెలవు పెట్టకుండా బండి నడిపేయడం అలవాటైందీ మధ్య. చిన్నిగాడు పుట్టాక తన ఆరోగ్యంలో బాగా తేడా వచ్చింది. ఆపరేషన్ పురుడు కావడం, భార్య ఒంట్లో బావున్నా, బాగోలేకపోయినా ఇంటి విషయాలు పట్టించుకోని భర్త కావడంతో అన్ని పనులూ తనే చేసుకోవలసి రావడం.... సారహీనంగా అనిపిస్తున్న సంసారాన్ని తలుచుకుని నిట్టూరుస్తుంటే గేటు చప్పుడైంది. పిల్లలిద్దరూ స్కూలు బ్యాగులతో నీరసం మొహాలతో, ఇల్లు కనిపించగానే కలిగే ఉత్సాహంతో పరుగెడుతూ సరోజ దగ్గరకి వచ్చారు.

పిల్లలిద్దరూ షూస్ అటూ ఇటూ విసిరేసి, పదేసి కిలోల బరువున్న స్కూలు పుస్తకాల సంచులు హాల్లో కిందపడేసి టీవీ పెట్టుక్కూచున్నారు. వాళ్ళ మీద అరిచే ఓపిక లేనట్టనిపించింది. పాలూ, బిస్కెట్లూ, వాళ్ళకోసం టేబులు మీద పెట్టి, తను టీ కలుపుకుని, పెరటి గుమ్మంలో కూర్చుని ఆలోచిస్తూ టీ తాగింది.

జనార్ధనం ఒక కంపెనీలో పనిచేస్తున్నాడు. మితభాషి. భార్యా పిల్లల మీద ఎంతో ప్రేమ ఉన్నా మాటల్లో చేతల్లో బయటపెట్టడం చేతకాని మనిషి. ప్రైవేటు కంపెనీ కావడం వల్ల ఆఫీసులో చాకిరీ ఎక్కువే. తర్వాతయినా తిన్నగా ఇంటికి రాకుండా ఏవో ఎల్.ఐ.సి పాలసీలనీ, వ్యాపారాలనీ తిరిగి తిరిగి రాత్రి తొమ్మిది దాటితే గాని ఇల్లు చేరడు. పిల్లల చదువులూ, భావి అవసరాలకి సరిపడా

సంపాదించాలనీ, తమకన్నా పిల్లలు ఉన్నత స్థితిలో ఉండాలనీ కోరిక. వ్యవసాయదారుడి కొడుకుగా అతని చదువు సంధ్యలూ ఆర్ధిక ఇబ్బందులతో గడిచాయి. మధ్య తరగతి జీవితం తమ ఇద్దరి సంపాదనతో బాగానే గడుస్తున్నా, వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు అంటూ దొరికే ఖాళీ సమయమంతా ఏవో వ్యాపారాలు నడిపిస్తూ రాత్రికి ఇల్లు చేరతాడు. సరదాగా కబుర్లు చెప్పుకోవడం, ఓ పుస్తకం గురించో, ఓ సినిమా గురించో చర్చించుకోవడం, వారానికి ఒకసారైనా కలిసి ఎక్కడికైనా వెళ్ళడం లేకపోవడంతో సరోజకి అసంతృప్తి.

రోజంతా అలిసిపోయి పీల్చేసిన చెరకు పిప్పిలా ఇల్లు చేరే జనార్ధనానికి బట్టలు మార్చడానికి కూడా శ్రద్ధా, ఓపికా ఉండవు. అలాగే మొహం, కాళ్ళూ, చేతులూ కడిగాననిపించి, ఓ లుంగీ తగిలించుకుని, చల్లారిపోయిన అన్నం ఆకలి చల్లారాలి కనుక తినేసి, పక్కమీద వాలిపోతాడు. ఆ గిన్నెలవీ సర్దుకుని సరోజ వచ్చేసరికి అతను గుర్రుపెడుతూ నిద్రపోతుంటాడు. అతన్నించి చిన్నా చితకా ప్రేమ నిండిన పలకరింపునూ స్పర్శనూ ఆశించే ఆమెకెపుడూ ఆశాభంగమే. ఎపుడో ఒకసారి ఏ జాములోనో నిద్రా, మెలుకువా కాని స్థితిలో అతను భౌతికమైన తోడు కోరుకుంటే ఆమె విసుక్కుంటుంది. అతడి నుంచి ఏదో సాంత్వననాశించి, అది అందని స్థితిలో కలిగే నిస్సహాయత, ఉక్రోషాల మధ్య ఊగిసలాడి, మెల్లగా నిద్రలోకి జారుకున్నాక, ఎదురు చూడని వేళ అతని శరీరపు పిలుపు ఆమెకు చిరాకు తెప్పిస్తుంది. స్కూటరు మీద దుమ్ము ధూళితో ఊరంతా తిరిగిన అతని శరీరపు వాసన, తన మానసిక అవసరాల పట్ల ధ్యాసలేని అతని తీరూ ఆమెకి వెగటు కలిగిస్తాయి. ఇద్దరిలో ఎవరికో ఒకరికి తీవ్రమైన అసంతృప్తితో ఆ 'నీలి జాబిలి' (0nece in a blue moon) గడిచిపోతుంది.

తెల్లవారుతూనే సరోజ రోజువారీ పనుల్లో పరుగుల్లో పడిపోతుంది. జనార్దనం శరీరం ఉదయం పూట త్వరగా కదలదు. ఆమె దినచర్యతో సంబంధం లేనట్టు అతను తీరిగ్గా లేస్తాడు. అతనికి కాఫీ ఇచ్చి, పిల్లల్ని తయారు చేసి, వంట పూర్తి చేసి, తను రెడీ అయేసరికి అతనూ తయారవుతాడు.

పిల్లల్ని స్కూలు బస్సెక్కించి అతనొచ్చేసరికి ఇల్లు తాళం పెట్టి బయట నిలుచుని ఉంటుంది సరోజ. ఆమెని స్కూల్లో దింపి, అదే దారిలో తన ఆఫీసుకి వెళ్ళిపోతాడు జనార్ధనం. అలా ఎలాగో ఒకలా రోజులు గడుస్తుంటే ఇపుడు అత్తగారి ఆగమన వార్త సరోజలో అలజడి రేపింది. చిన్న ఇల్లు.... భర్తని విసుక్కున్నా, కసురుకున్నా, స్నానానికి ముందే కుక్కర్ పెట్టేసి, అటూ ఇటూగా వంట పూర్తిచేసినా, ఏ రోజన్నా పొద్దున మిగిలినవే రాత్రిపూట తినేసి పడుకున్నా సరిపోతోంది. ఒకరోజూ రెండు రోజులూ కాకుండా ఏకంగా నెలరోజులు అత్తగారికి నచ్చేలా ఉండాలంటే, ఆ మడీదడీ తట్టుకోవాలంటే భయం పట్టుకుంది సరోజకి.

ఆలోచనలతో సతమవుతూ ఇంటిపనులు పూర్తికానిచ్చి, హోమ్ వర్కులు సగంలో వదిలేసి పిల్లలు నిద్రపోతే వాళ్ళని సరిగా పడుకోబెట్టింది సరోజ. స్కూలు తాలూకు రాతపనేదో ఉంటే చేసుకుంటూ కూర్చుంది. తొమ్మిదిన్నరకి జనార్ధనం వచ్చాడు.

టేబుల్ మీద అన్నం వడ్డించి అతను భోజనం చేస్తుంటే మెల్లిగా అత్తగారి ఉత్తరం గురించి చెప్పింది.

ఒక్కసారిగా జనార్దనం మొహం వెలిగింది. "మా అమ్మ వస్తోందా? ఇన్నాళ్ళకి ఆ అడవి వదిలి మనింట్లో ఉండడానికి వస్తోందా? గ్రేట్... అమ్మని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలి!" అన్నాడు సంతోషంగా.

ఛరున కోపం వచ్చింది సరోజకి.

"ఆఁ.... మీరు రాత్రి పదింటికి వచ్చేటపుడు గంపెడు పూలు తెండి. రోజంతా ఆ పువ్వుల్లో కూర్చోపెడతా" అంది వెటకారంగా.

అతను దెబ్బ తిన్నట్టు చూశాడు.

"ఏమిటది సరోజా? ఇన్నేళ్ళకి మా అమ్మ మనింటికి వస్తుంటే?"

"నేనావిడని రావద్దన్నానా? నేనెంత ఉరుకులు పరుగులు పెడుతుంటే ఇల్లు నడుస్తోంది? పొద్దున ఇల్లు వదిలిన మనిషి అర్ధరాత్రి కొంపకి చేరతారు. ఆదివారం కూడా పనికి మాలిన పనులు పట్టుకుని, ఇంటి పట్టున ఉండరు. ఎన్నని నేను చూసుకోను? ఎపుడేనా

కూరలు తేవడమో, పిల్లల హోమ్ వర్క్ చేయించడమో, ఓ సినిమాకో, షికారుకో తీసుకెళ్ళడమో... ఏం పట్టించుకున్నారు మీరు? మీ అమ్మగారొస్తే 'పువ్వుల్లో చూసుకో' అని ఆర్డరు పారేస్తే మీ పని అయిపోతుంది" కసిగా కటువుగా అంది సరోజ.

"ఛీ... ఛీ." అని కంచంలో చెయ్యి కడుక్కుని లేచిపోయాడు జనార్ధనం.

"కోపం వస్తే అన్నం మానేస్తే నడుస్తుంది మీకు. కంచంలో చెయ్యి కడిగేసి పోయి పడుకుంటారు. వచ్చినట్టు ఆ పారేసినవన్నీ చెత్తబుట్టలో వేసి, టేబుల్ శుభ్రం చేసే పని నా వంతే! తింటారో తినరో తెలీకపోయినా, నాకు తినాలని లేకపోయినా వంటా తప్పదు, చాకిరీ తప్పదు" రుసరుసలాడుతూ ఎప్పుడూ లేనిది టేబుల్ అలాగే వదిలేసి పోయి పడుకుంది సరోజ. **వేరుకి పురుగుపడితే ఆకులు రాలిపోయినట్టు ఒక విషయంలో కలిగిన అసంతృప్తి ఇంకో చోట బహిర్గతమైంది.**

మనసులో అత్తగారి మడి ఆచారాలు పల్లెటూరి పద్ధతులు భయపెడుతుంటే చాలా సేపు నిద్రపట్టలేదు సరోజకి. పెళ్ళయినప్పటి నుంచి పొలాల మధ్య పల్లెటూళ్ళో అత్తగారింటికి తాము వెళ్ళడమే గాని వాళ్ళు వచ్చి తమతో ఉన్నది లేదు. ఒకటి రెండూ సార్లు వాళ్ళు తమింటికి వచ్చినా రెండూ రోజులకి మించి ఉండలేదు. బావగారి కుటుంబం వాళ్ళతో ఉండడంతో తామే వేసవి సెలవుల్లో కొద్ది రోజులకి గడపడానికి వెళ్ళేవారు. రోజంతా ఆ పనీ, ఈ పనీ చేసుకుంటూ గడపడం, పల్లెటూరి గాలీ, చిక్కని పాల కాఫీ, పొలాల్లో షికార్లూ నచ్చినా అత్తగారి మడి ఒకటే తలుచుకుంటే భయం సరోజకి. ఏం చేస్తే తప్పో అనే బెరుకువల్ల కూరలు తరిగివ్వడం, గిన్నెలు తొలిచి వంటింటి పనులు చేస్తూ వంటదాకా రాకుండా తప్పించుకుంటూ గడిపింది అపుడు! ఇప్పుడెలాగో ఏమిటో! ఆలోచిస్తూ ఎప్పటికో కలత నిద్రలోకి జారింది.

✡ ✡ ✡

చూస్తుండగానే పదో తారీకు వచ్చింది. సరోజా పిల్లలూ స్కూళ్ళకి బయలుదేరే సమయానికి తల్లిని రిసీవ్ చేసుకోడానికి వెళ్ళిన జనార్ధనం ఇంకా ఇంటికి రాలేదు.

'పొద్దున్న అత్తగారు ఇల్లు చేరు ఉంటారు. ఆవిడని దింపి ఆఫీసుకి వెళ్ళి ఉంటాడు జనార్ధనం. తను ఆదరాబాదరగా వండిన వంట తిని ఆవిడ ఏమనుకున్నారో' ఆలోచిస్తూ సరోజ ఇల్లు చేరేసరికి లోపల్నించి పిల్లల కేరింతలు, అత్తగారి మాటలు వినిపించాయి. పిల్లలు మామ్మ దగ్గర కబుర్లలో ఉన్నారు. ఆవిడ పెట్టె తెరిచి వాళ్ళ కోసం తెచ్చినవేవో చూపిస్తున్నారు. సరోజ గది గుమ్మంలోంచి ఆవిడని పలకరించి కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చింది. ఇద్దరికీ కాఫీ కలుపుతుంటే ఆవిడ వంటింట్లోకి వచ్చింది "అలిసి పోయి వచ్చావేమిటి? నే కలపనా కాఫీ?" అంటూ.

"అలసటేం లేదత్తయ్యా. ఇవన్నీ మీకు కొత్త."

ఇద్దరూ కాఫీ తాగారు. వంటింట్లో ఆవిడ తెచ్చిన కూరలూ, పళ్ళూ, పచ్చళ్ళూ కనిపిస్తుంటే "ఇవన్నీ మోసుకొచ్చారా?" అంది మొహమాటంగా.

కమలమ్మ నవ్వి, "నేనేం మోశానే? అక్కడ రామం బస్సులో పెట్టాడు. ఇక్కడ వీడు దింపాడు. లేత వంకాయలూ, జామకాయలూ, టొమాటోలు మన పొలంలోవే" అంది. ఊరి విశేషాలూ, పిల్లల చదువులూ, పెద్దల ఆరోగ్యాలూ ముచ్చట్లాడుకుంటూ కాఫీ తాగారు. కమలమ్మ కాఫీ గ్లాసు సింకులో పెట్టి చెయ్యి కడుక్కుంటే మరి కాసేపు కాళ్ళు చాచుకుని కూర్చోవాలని ఉన్నా లేచి తన గ్లాసు కూడా సింకులో పెట్టి చెయ్యి కడుక్కుంది సరోజ.

"నా మడీ దడీ నావరకేనే. కాఫీ ముట్టుకున్నపుడల్లా చెయ్యి కడుక్కోవాలంటే మీకు అలవాటు లేదుగా. జన్నా కడుక్కోడుగా. నీకు మాత్రం ఎందుకీ మడి" అంది కమలమ్మ. సరోజకి కొడుక్కి ఒక రూలు, కోడలికి ఇంకో రూలు పెట్టే తల్లి జ్ఞాపకం వచ్చింది.

మామ్మ తెచ్చినవేవో తిని ఆడుకుంటున్న పిల్లల్ని హోమ్ వర్కు చేసుకోమని తరిమి, స్నానానికి వెళ్ళింది, స్నానం చెయ్యకుండా వండితే ఆవిడ తినదని.

వేడి నీళ్ళ స్నానం చేసి, ఉతికిన నూలు చీర కట్టుకుని, దేవుడి దగ్గర సంధ్య దీపం వెలిగించింది పద్ధతిలో. చిరు చీకట్లు కమ్ముకునే వేళ వెలుగుతున్న అరుణ దీపం ఏదో మనశ్శాంతిని కలిగించినట్టనిపించింది. ఏదో కొత్త శక్తి శరీరంలోకి వచ్చినట్టయింది. వంటింట్లోకి వచ్చే సరికి లేత వంకాయలు నీళ్ళలోకి తరిగి ఉంచింది కమలమ్మ. మిక్సీ జార్‌లో తరిగిన అల్లం పచ్చి మిర్చి, చిన్న పళ్ళెంలోకి తీసి పెట్టిన పోపు గింజలు కనిపించాయి.

"వచ్చావుటే... పిల్లల్నడిగితే వంకాయ తింటామన్నారు. వీటిని ఆ ఫ్రిజ్‌లో పడేసి కసరెక్కించడమెందుకని తరిగేశా" అంది కమలమ్మ.

నవ్వుతూ తలూపి కూర ఒక స్టవ్ మీదా, అన్నం మరో స్టవ్ మీదా పడేసి, రెండు టమోటాలతో చారుకి సిద్ధం చేసింది. "రేపటి నుంచి సాయంత్రం వంట నే చేస్తానే. హాయిగా నీ స్కూలు పనుంటే అదీ, పిల్లల చదువులో నువ్వు చూసుకుందువుగాని" అంటూ కమలమ్మ పిల్లల దగ్గరకెళ్ళి కూర్చుంది.

"మీకు బోరు కొడుతుందేమో వాళ్ళు హోం వర్కు చేసుకుంటుంటే! టివీ చూస్తారా?" అంది సరోజ టీవీ పెడితే వాళ్ళు డిస్టర్బ్ అవుతారని తెలిసినా.

"అబ్బే ! నాకేమీ 'బోరు' లేదే పిల్లలు స్కూలు పని చేసుకుంటుంటే ఎంతో ముచ్చట నాకు" అంది కమలమ్మ.

సరోజ వంట పూర్తి చేసి అన్నీ టేబుల్ మీద సర్దేసరికి పిల్లల హోం వర్కు పూర్తయింది. మధ్యలో ఒకటి రెండు సార్లు చిన్నవాడు సోమూ టీవీ పెట్టబోతే ప్రేమగా వాడిని వారించి, వాడి హోం వర్కులో ఎంతో కుతూహలం ఉన్నట్టు ఏవో ప్రశ్నలడిగింది కమలమ్మ. వాడు గొప్పగా ఆవిడకి వివరిస్తూ హోం వర్కు పూర్తి చేశాడు.

"మీకు కింద వడ్డించనా అత్తయ్యా?" అడిగింది సరోజ.

"అబ్బే... ఎందుకే... టేబుల్ మీద తినకూడదనేం లేదు నా పద్దతులన్నీ అక్కడే ఇక్కడ మీతోపాటే" అంటూ వచ్చింది. పిల్లలకీ ఆవిడకీ వడ్డించబోతుంటే కాదని సరోజని కూడా కూర్చోమని బలవంతపెట్టిందావిడ. జనార్ధనం వచ్చాక తింటానంటే "వాడొచ్చేసరికి పదవుతుందన్నాడు కదే అప్పటిదాకా తినకుండా ఉండి పొద్దున్నే స్కూలుకి తయారై వెళ్ళద్దూ? అన్నపానాలు టైం ప్రకారం జరగాలి. వాడికి దగ్గరుండి వడ్డిద్దువులే... దా" అంది కమలమ్మ.

సరేనని నలుగురూ కలిసి భోజనం చేశారు. పిల్లలు గట్టిగా మాట్లాడబోతే భోజనాల దగ్గర మాట్లాడకూడదనీ, టీవీ చూస్తూ తింటామంటే తర్వాత కలిసి చూద్దామనీ వారించిందావిడ. దాదాపు మౌనంగా భోజనాలయ్యాయి. తిన్నాక చేతులు కడుక్కుంటే తను కూడా వాళ్ళతో వాష్ బేసిన్లో చెయ్యి కడుక్కుని మంచి నీళ్ళతో నోరు బాగా పుక్కిలించుకోవాలని చెప్పి వాళ్ళ చేత చేయించింది. తను మొత్తుకుంటేగాని చెయ్యని పనులు ఆవిడ చెబితే చేయడం చూసి, 'ఏదో కొత్త కనక వింటున్నార్లే... ఏదో ఒకటి' అని సంతోషించింది సరోజ.

చెయ్యి తుడుచుకోగానే 'టీవీ పెడతా బామ్మా' అన్నాడు సోమూ. "మీ ఇష్టం..." అంటూనే "అరగంట చూశాక ఆపెయ్యాలి. మంచి కథ చెపుతాను తర్వాత" అని ఊరించింది.

వాళ్ళు పడుకుంటుంటుంటే జనార్ధనం వచ్చాడు.

పిల్లల మధ్య పడుకుని కథ చెపుతున్న ఆవిడ దగ్గరకెళ్ళి పలకరించగానే ఆవిడ లేచి "స్నానం చేసిరా నాన్నా! భోం చేద్దువుగాని" అంది.

"నువు పడుకో అమ్మా! పొద్దున్నే మాట్లాడుకుందాంలే" అన్నాడు.

"అబ్బే.. నాకింకా నిద్రరావడం లేదురా. నువ్వు స్నానం చేసిరా నాన్నా" అంది లేచి బయటికి వస్తూ. తల్లి మాటలకి స్నానం చేసి, శుభ్రమైన బట్టలు కట్టుకుని వచ్చాడు జనార్ధనం. తల్లితో కబుర్లు చెపుతూ భార్య వడ్డిస్తుంటే భోజనం చేశాడు. అతని భోజనం అవగానే అన్నీ సర్దేసి సరోజ వెళ్ళి పడుకుంది. వేడి నీటి స్నానం తర్వాత తల్లి సమక్షంలో రుచికరమైన భోజనం చేసిన జనార్ధనం తృప్తిగా వీధి వాకిలి మెట్ల మీద కూర్చున్నాడు చల్లగాలి ఆస్వాదిస్తూ. కమలమ్మ కూడా వచ్చి అతని పక్కన కూర్చుంది. చిక్కినట్టున్న దవడలు, పలచబడిన జుట్టూ చూస్తూ ప్రేమగా తలనిమిరింది. చెమర్చిన కళ్ళతో మూగబోయిన గొంతుతో అలాగే కూర్చుని ఉండిపోయాడు జనార్ధనం.

"జన్నా! సమయానికి నిద్రా తిండీ మనిషి ఆరోగ్యానికి చాలా ముఖ్యం నాన్నా! నువ్వెంత సంపాదించినా, పిల్లల కోసం ఎంత కూడబెట్టినా, నువ్వు ఏం కోల్పోతే ఆ డబ్బు ఇంటికి వచ్చిందో వాళ్ళ కేం అర్ధమవుతుంది చెప్పు? నువ్వు వాళ్ళతో గడిపిన సమయం వాళ్ళకి పంచిచ్చిన ప్రేమ, వాళ్ళతో కలిసి నవ్వుకున్న నవ్వులు... ఇవే వాళ్ళకి రేపు గుర్తుండేవి. మనం ఎంత సంపాదించినా దానికి తగ్గట్టు ఖర్చు పెరుగుతుంది. పెరగనిదీ తరగనిదీ రోజులో ఉండే ఇరవై నాలుగ్గంటలే..." మౌనంగా వింటున్న కొడుకుతో మెల్లగా అంది కమలమ్మ.

తల్లి గొంతులో ఉట్టిపడుతున్న ఆపేక్ష అతనికి తన బాల్యాన్ని గుర్తుచేసింది. వీధి బడిలో ఆడుతూ పాడుతూ చదువుకోవడం, రాత్రి ఆరుబయట తండ్రి పక్కన పడుకోవడం, కథలు చెప్పమని మారాం చేయడం, ఇప్పటికీ ఊరు వెళితే తల్లి, తండ్రి, అన్నా వదినా పిల్లలూ కలిసి భోజనాలు చేయడం, రోజూ కొంతసేపైనా పిచ్చాపాటీ మాట్లాడుకోవడం గుర్తొచ్చి మాట పెగలలేదు.

అతని మనసు చదివిన కమలమ్మ మాట మార్చి పొలం గురించీ, సుమ పరీక్షలు చదువూ గురించీ, ఊళ్ళో పరిచయస్తుల గురించీ కాసేపు మాట్లాడి "ఇంక పడుకుందాం నాన్నా! పొద్దుపోయింది" అంది.

పక్కమీద వాలిన జనార్ధనం ఆపేక్ష తొణికిసలాడే తల్లి గొంతునీ, ఎపుడు చూసినా నిరసన ధ్వనించే భార్య కంఠాన్నీ పోల్చి 'రోజంతా కుటుంబం కోసం కష్టపడి పనిచేసే మొగుడి పట్ల ఎంత చులకన!' అనుకున్నాడు. గాయపడ్డ మనసుతో గోడవైపు తిరిగి పడుకుని, తలమీద తల్లి స్పర్శని గుర్తుచేసుకుంటూ నిద్రపోయాడు.

మర్నాడు పొద్దున్న సరోజ లేచేసరికే కమలమ్మ స్నానం పూర్తై పూజలో ఉంది. అగరువత్తి సన్నని పరిమళం ఇల్లంతా అలుముకుంది.

ఏదో తప్పు చేసిన భావంతో సరోజ మళ్ళీ గదిలోకి వెళ్ళిపోయి కాఫీ కూడా తాగకుండానే స్నానం చేసేసి వచ్చింది. ఈలోపు పూజ పూర్తయిన కమలమ్మ కాఫీ కలుపుతోంది. స్నానమై వచ్చిన సరోజని చూస్తూ "అదేమిటే? కాఫీ తాగకుండా స్నానానికి వెళ్ళిపోయావేం?" అనడిగింది.

ఇబ్బందిగా చూస్తున్న సరోజని చూసి "నువ్వు రోజూ ఎలా చేసుకుంటావో అలాగే ఉండాలే వెర్రిపిల్లా. నేనొచ్చానని ఇంకోలా ఉండకూడదు. అపుడు నీకూ ఇబ్బందే నాకూ ఇబ్బందే. నారాకతో మీ దినచర్య మారాల్సిన అవసరం లేదు" అంటూ సరోజకి కాగీ ఇచ్చి, తనొక గ్లాసులో పోసుకుని పెరటి గుమ్మంలో కూర్చుంది.

సరోజ కాఫీ తాగి, పిల్లలిద్దర్నీ లేపి వంట మొదలు పెట్టింది. మామ్మ పలకరింపులూ పొగడ్తలతో పిల్లలిద్దరూ త్వరగానే తెలిలారు. కమలమ్మ కూరలు తరిగిస్తే సరోజ పోపులో వేసి వంట ముగించింది. రొటీన్‌లో కొద్దిపాటి మార్పులవల్ల సరోజకి స్కూలుకి ఆలస్యమైంది.

"ఇలాకాదే అమ్మాయ్! రేపట్నించి పొద్దుటి వంట నే చేసేస్తాను. పిల్లల్ని నువు తయారు చేసుకో. మీరెళ్ళాక ప్రశాంతంగా పూజ చేసుకుంటా" అంది కమలమ్మ.

"అయ్యో! మరి అప్పటిదాకా కాఫీ తాగరా? అలా ఏం వద్దు. పదినిముషాలు ముందు లేస్తే చాలు నాకు" అంది సరోజ.

"కాఫీ తాగేస్తాలేవే. అక్కడ పిల్లల స్కూలు తొమ్మిదింటికి కదా. మళ్ళీ మధ్యాహ్నం ఇంటికొచ్చి తింటారు. అందుకే తీరుబాటుగా వంట అలవాటు. అక్కడలాగ ఉంటాం అని ఇక్కడా అలాగే ఉండక్కరలేదు. నా పిల్లలే నాకు దేవుడు!" అంది నవ్వుతూ.

స్కూల్లో ఖాళీ టైంలో ఆవిడ మాటలే గుర్తొచ్చాయి సరోజకి. మర్నాటి నుంచి స్కూలు నుంచి ఇంటికిరాగానే వేడిగా కమలమ్మ ఇచ్చే కాఫీ తాగి స్కూలు కబుర్లు ఆవిడతో పంచుకుని, పిల్లలకి స్నానాలు చేయించి, హోమ్‌వర్కు దగ్గర కూర్చోపెట్టడం, తను స్నానం చేసొచ్చి వంట మొదలు పెడితే ఆవిడ సమక్షంలో పిల్లలు రాతపని పూర్తి చేసుకుని ఆటకు వెళ్ళడం అలవాటైంది. కమలమ్మ మృదువుగా చెప్పడంతో ఎనిమిదింటికి ఇల్లు చేరడం మొదలెట్టాడు జనార్ధనం. కలిసి భోజనం చెయ్యడం, తర్వాత ఓ గంట కబుర్లు చెప్పుకోవడంతో తల్లికీ, భార్యకీ మధ్య సరదా సంభాషణలూ, ఆప్యాయత నిండిన పలకరింపులూ అర్థమై అతని మనసు కొంత తేలికపడింది. అయినా తల్లి ఉత్తరం వచ్చిన రోజు సరోజ మాట్లాడిన మాటల్ని అతను క్షమించలేకపోయాడు. చాలా రోజులుగా ఇద్దరిమధ్యా ఏర్పడుతున్న దూరం అతనిలో కూడా ఏదో మానసిక క్లేశాన్ని మిగిల్చింది.

మంచిరోజని తొమ్మిదో తారీకునే బయలుదేరి వచ్చిన కమలమ్మని పదమూడో తారీకున బాబాయి గారింట్లో దింపాడు జనార్ధనం. ఆరోజు పెళ్ళి కూతుర్ని చేసే రోజు. సరోజనీ పిల్లల్ని సాయంత్రం తీసుకు రమ్మని చెప్పి, పొద్దున్న వాళ్ళు స్కూలుకి వెళ్ళగానే బయలుదేరింది కమలమ్మ. తల్లిని దింపి, ఓ గంట సేపుండి అక్కడి నుంచి ఆఫీసుకి వెళ్ళాడు జనార్ధనం.

దారిలో తామిద్దరూ ఆటోలో మాట్లాడుకున్న మాటలు జనార్ధనం మనసులో చాలా సేపు కదలాడాయి. ఎపుడూ వంటగది గుమ్మం దాకా కూడా రాని తండ్రినీ, అత్తగారి వెంట వంటలూ, వడ్డనలతో ఉమ్మడి కుటుంబపు బాధ్యతలు నవ్వు మొహంతో నెరవేర్చిన తల్లినీ గుర్తుకు తెచ్చుకున్నాడు. 'ఇంటి తీరుని బట్టి, ఇంటి పనులూ వంట పనులూ తేలిగ్గానో, కష్టంగానో ఉండొచ్చు. పంచుకుని చేసుకుందుకు మరో మనిషి ఉంటే పని ఇంకా తేలికవుతుంది. మీ మామ్మ ఉన్నన్నాళ్ళూ నాకు ఒంటరిగా అనిపించేది కాదు ఇంటిపని ఎంతున్నా ఆవిడ పోయాక రామం పెళ్ళై జానకి మన ఇంటికి వచ్చేవరకూ నేనెక్కువగా తిరిగే పెరటి ఆవరణంతా బోసిగా అనిపించేది. అప్పటికి నువ్వు ఉద్యోగస్తుడివై హైదరాబాద్ వచ్చేశావు. శారీరకమైన చిన్న చిన్న అనారోగ్యాలకి కూడా తొందరగా డీలా పడిపోయేదాన్ని. అపుడు మీ నాన్నగారికేం తోచిందో మరి ఇంట్లో ఉన్నంత సేపు చీటికీ మాటికీ వచ్చి పలకరించడం, ఏదో ఒకటి అడిగి చేయించుకోవడం, వంట మధ్యలో వచ్చి ఇంకా ఎంతసేపు పడుతుందని అడగడం...' అంటూ నవ్వేసిన తల్లి నవ్వూ, ఆ ముక్కుపుడక మెరుపూ మనసులో మెదిలి అతని పెదవులు విచ్చుకున్నాయి. అతనికి తెలియకుండానే ఆవిడకు చెప్పకుండా వదిలేసిన సందేశం అతని మనసులోకి చేరింది.

పెళ్ళి చాలా బాగా జరిగింది. భార్యా పిల్లలతో పెళ్ళికి వెళ్ళి తల్లిని వెనక్కి తీసుకొచ్చాడు జనార్ధనం.

"జన్నా! రామానికి చేసుకుంటామని అడిగితే ఆ పల్లెటూరి సంబంధం నాకొద్దంది గుర్తుందా? వెంకట్రామయ్యగారమ్మాయి గిరజ! చూశావో ఎలా ఉందో?" ఓ రోజు రాత్రి అడిగింది కమలమ్మ.

"ఆఁ చూశాను. పెద్దకారూ, ఒంటినిండా నగలు... బానే ఉందిగా?" యధాలాపంగా అన్నాడు.

"అయితే సరిగ్గా గమనించలేదన్నమాట. మొగుడి ప్రేమానురాగాలు పూర్తిగా పొందే పెళ్ళాం మొహంలో ఒక కళ, ఒక సంతృప్తి, అదో రకమైన ధీమా ఉంటాయిరా. అవేమీ దాని మొహంలో నాక్కనపడలేదు!"

"పోమ్మా! నీ కొడుకుని కాదందని నీక్కోపం!" నవ్వాడు జనార్ధనం. సురేషూ, గిరిజల వివాహం విడాకులకి దగ్గరలో ఉందని తెలిసినా తల్లికి చెప్పదలచలేదు.

"ఓరినీ! నాకెందుకురా కోపం?! నా కొడుకూ, కోడలూ హాయిగా ఉంటే ఎవరి గొడవో నాకెందుకు? అయినా లోకంలో మొగుడూ పెళ్ళాలందరూ చిలకా గోరింకల్లా ఉండాలనుంటుంది నాకు''. కమలమ్మ పక్కన కూర్చుని కమలాపండు తొనలు ఒలుస్తున్న

సరోజ మొహంలో నీలి నీడలు కదలాడాయి. గిరిజ మొహంలో ఆవిడ చదవగలిగిన భావాలు, అంతకు ముందే తన మొహంలో చదివేసిందని సరోజకి తెలుసు.

"అయినా ఏ జంటయినా హాయిగా ఉండక పోవడానికి కారణాలేమిటి చెప్పు? ప్రపంచంలో సగం మంది మొగుడూ పెళ్ళాలు అక్కర్లేని విషయాల గురించి గొడవపడి, వాళ్ళ జీవితాల్ని పాడుచేసుకుంటారంటాను. చిన్న చిన్న సర్దుబాట్లు ఒకరి కోసం ఒకరు చేసుకుంటే చాలదూ? ఇంతా చేసి ఉమ్మడి కుటుంబాలా? తట్టుకోలేని బాధ్యతలా? ఇంతోటి సంసారంలోనూ గొడవలెందుకు చెప్పు. హాయిగా బతకడానికి అంత పెద్దకారు, అన్ని నగలు అవసరమా? చెవులకి ధగధలాడే రవ్వలు కొన్నాడుగాని పెళ్ళాం మొహంలో మెరిసిపోయే నవ్వులు తేగలడా? హూఁ" నిరసనగా అంది.

"అయితే తప్పంతా సురేష్‌దే అంటావా అమ్మా? సంతృప్తి లేని పెళ్ళాన్ని ఏ మొగుడూ సంతోషపెట్టలేడు! గిరిజ అతనితో ఎలా ఉంటుందో మనకేం తెలుసు?"

"ఎవరిది తప్పో నేను చర్చించటం లేదు నాన్నా! చాలా మంది తన ఒడిలో ఉన్నదాన్ని గమనించకుండా అందీ అందకుండా పోయేదాని వెంట పరుగులు తీస్తూ జీవితాన్ని గడిపేస్తారు. జీవితం చివరి దశలో వెనక్కి చూసుకుని కోల్పోయినదాన్ని తలుచుకుని దుఃఖపడతారు! కొంతమందికైతే ఏం కోల్పోయారో, ఎవరు బాధ్యులో కూడా తెలుసుకునే జ్ఞానం ఉండదు..... ఎవరినో నిందిస్తూ లేదా తలారాతని తిట్టుకుంటూ మిగిలిన జీవితం వెళ్ళదీస్తారు! ఎన్నో అలాంటి నిరర్ధక జీవితాలు! ఎందరితోనో సర్దుకోందే రోజు గడవదు. భర్తతోనో భార్యతోనో చిన్న చిన్న విషయాల్లో రాజీపడి సంతోషంగా గడపడానికి ఎందుకంత పట్టుదల?" మంద్రస్థాయిలో నచ్చచెపుతున్నట్టు అంటున్న తల్లి మాటలకి అవునన్నట్టు తలూపాడు జనార్ధనం.

చూస్తుండగానే ఉపనయనం కూడా పూర్తై కమలమ్మ తిరుగు ప్రయాణం దగ్గరపడింది. ఆ రోజు కూడా రోజూలాగే కొడుకు తెచ్చిన పూలమాల సగం తుంపి దేవుడికి అలంకరించి, రెండూ మొగ్గలు తన ముడిలో దోపుకుంది. మిగిలిన దండ కోడలి జడలో పెడుతూ "ఆరోగ్యం జాగ్రత్త! ఇల్లంతా నీ మీద ఆధారపడి ఉంది!" అంది నవ్వుతూ. ముందురోజు రాత్రి పూలగాలి పీలుస్తూ జనార్ధనం చెప్పిన  మాటలు గుర్తొచ్చాయి సరోజకి. ఆమె గొంతుకేదో అడ్డుపడ్డట్టయింది. సంకోచాలన్నీ వదిలేసి, ఆవిడని గాఢంగా హత్తుకుని, "మీరు వెళ్ళద్దు అత్తయ్యా! మాతో ఉండిపోండి ప్లీజ్!" అంది గద్గదంగా.

"వెర్రిపిల్లా! మళ్ళీ వస్తాగా. వేసవిలో మీరెలాగూ వస్తారయ్యే" అంది కమలమ్మ.

"మామ్మా! వెళ్ళొద్దూ" అంటూ పిల్లలు ఏడ్చి రాగాలు పెట్టారు. మర్నాడు రాత్రి అత్తగారికి రాస్తూ 'సాయంత్రం రాగానే ఆవిడ కాఫీ ఎంత అలవాటైపోయిందో, ఇల్లెంత ఖాళీగా అనిపించిందో, పిల్లలెంత మారాం చేశారో' వర్ణించింది సరోజ. ఆ కాగితం కవర్లో పెడుతుంటే నెల క్రితం వచ్చిన అత్తగారి ఉత్తరం గుర్తొచ్చిందామెకి.

✡ ✡ ✡

'స్వప్న' వారపత్రిక నుంచి పునర్ముద్రితం - రచయిత్రీ, సంపాదకవర్గం ప్రత్యేక అనుమతితో

# నా నేపథ్యం ఖరీదు

- చింతలచెరువు సువర్చల

రంజని - నందివాడ భీమారావు కథల పోటీల్లో(౨౦౦౮) ప్రత్యేక బహుమతి పొందిన కథ

నగరశివార్లలో ఉన్న ఇళ్ళస్థలాల వేటలో ఉన్నాను. నిజానికి, నగరంలో మేము ఒక్క ఫ్లాట్ కూడా కొనలేమని ఈ మధ్య కాలంలో తెలిసి వచ్చింది. అందుకే ఊరిచివర లే-ఔట్ల సమాచారాన్ని సేకరిస్తున్నానీమధ్య. ఊరి చివర చిన్న కుటీరమైనా కట్టుకుని ప్రశాంతంగా గ్రామీణ జీవితాన్ని గడపొచ్చుకదా!

'మా పల్లెలో మా తాతగారి హయాంలోని జీవన విధానాన్ని తిరిగి పొందొచ్చు కదా' అన్న ఆలోచన. అవును..ఈ ఆధునిక పోకడలు..నగర జీవనం ..ఈ మధ్య బొత్తిగా నాకు నచ్చకుండా పోతోంది. ఈ హంగులూ, ఆర్భాటాల నడుమ..నా మనసు తెగ నలిగి పోయింది. ఒక్కోసారి..నాకే అనిపిస్తుంది, పురోగమనానికి నేను వ్యతిరేకినా అని!?

'హడావుడి, ఉరుకులు-పరుగుల జీవితమే పురోగమనం' అని నన్ను నేను ప్రశ్నించుకుని సమాధానపడ్డ రోజులూ ఉన్నాయి. నాకీ మధ్య కొన్ని పనులు చేయడానికి బొత్తిగా మనస్కరించడం లేదు. ముఖ్యంగా డైనింగ్ టేబిల్ దగ్గర భోజనం చేయాలనిపించదు. ఎంచక్కా - యిత్తడి పొన్నులు పొదిగిన చెక్కపీటలు కావాలనిపిస్తుంది. మధ్యాహ్నం పూట మధ్య హాలు గుమ్మంలో పమిటచెంగు పరచుకుని, చెయ్యి తలగడగా సేదతీరుతూ పుస్తకాలు చదవుకోవాలనిపిస్తుంది. సాయంకాలం లాంతరు గ్లాసు ముగ్గుతో అద్దాల్లా తుడుచు కొని దీపాలు పెట్టే వేళ వెలిగించుకోవాలనిపిస్తుంది. ఉదయం ముగ్గే కాదు, సంధ్య ముగ్గూ పెట్టాలనిపిస్తుంది. సాయంకాలం స్కూలు నుంచి వచ్చిన పిల్లలకి చిరుతిండ్లు పెట్టి, ఆడుకోటానికి బయటికి పంపించాలనిపిస్తుంది. తిరిగొచ్చాక స్నానాలవీ చేయించి, కబుర్లూ - కథలూ చెప్తూ గోరుముద్దలు తినిపిస్తూ, ఆరుబయట కూర్చోవాలనిపిస్తుంది. గుడిలో హరికథాకాలక్షేపానికి వెళ్ళాలనిపిస్తుంది. ఎవరి పేరంటాలకైనా తీరిగ్గా వెళ్ళి రావాలనిపిస్తుంది. 'పేరంటం' అంటే.. ఈ రోజుల్లోనూ పిలిస్తున్నారు. అయితే ..మనం తయారైనంత సేపు పట్టట్లేదు. మనం వెళ్ళాక కూర్చోమని చెప్పి, వెంటనే బొట్టూ - తాంబూలం ఇచ్చేసి ఇక మీదే ఆలస్యం వెళ్ళండన్నట్లు చూస్తారు. అందరూ పేరంటాళ్ళు వచ్చేదాకా ఆగరు సరికదా, ఎవరు వస్తే వారిని తరిమెయ్యడమే.

'పేరంటం అనేది స్నేహ సంబంధాల్ని పెంచేందుకు, మానవ సంబంధాల్ని నిలిపేందుకు' అన్న విషయాన్ని విస్మరిస్తారు.

ఇలా.. నా చిన్నప్పటి వాతావరణాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ, నేను వెనక్కి వెళుతున్నానేమో..అందరిలా ముందుకు..ఎందుకు పరుగులు తీయలేకపోతున్నానో అనిపిస్తుంది.

బహుశా నా లాంటి వాళ్ళు కూడా బోలెడుమంది వుండొచ్చని కాబోలు ఓ రియల్ ఎస్టేట్ వాళ్ళ ప్రకటన న్యూస్ పేపర్లో పడింది.

*"గ్రామీణ సంస్కృతిని మీ సొంతం చేస్తాం..*
*మీ సంప్రదాయబద్ధ కలలను సాకారం చేస్తాం..*
*నేటి నుంచే బుకింగ్స్ ప్రారంభం..*
*- జానపద రియల్ ఎస్టేట్స్"*

దాన్ని చూసి నేను ఆనందంతో మూర్ఛ పోయానంటే నమ్మండి. మా వారికి చూపించి ఆయన్ని ఒకటే తొందరపెట్టాను వెళ్దాం పదమని. చెవిలో 'ఇల్లు కట్టి' మరీ పోరాను, అది మనలాంటి మధ్యతరగతి వాళ్ళకోసం కాదని ఆయన వాదన.

"ఎవరు చూడొచ్చారు? నగర శివార్లలో కూడా కాదట. నగరానికి నలభై కిలోమీటర్ల దూరం అన్నారు. భూమి ధర అక్కడ తక్కువగానే ఉండొచ్చు కదా! కనీసం ఓ రెండువందల గజాలైనా కొనుక్కొని ఓ చిన్న పొదరిల్లు, చుట్టూ మొక్కలు వేసుకుని..ప్రశాంతంగా పల్లెల్లో లా గడుపుదాం. అక్కడ అన్ని సదుపాయాలతో వెంచర్లు అంటున్నారు. కాలనీ తయారవుతుందట. చుట్టుపక్కల మనలాంటి వాళ్ళు బోలెడంత మందితో కాలక్షేపం. ఓ అయిదేళ్ళ తర్వాత చక్కటి కాలనీ సిద్ధం అంటున్నారు, అయిదేళ్ళ తర్వాత మనం అక్కడ కూడా కొనలేకపోవచ్చు. ఈ లోపు మన పిల్లల చదువులు అయిపోతాయి. అప్పుడు ఎంచక్కా కావాలంటే వాలంటరీ-రిటైర్మెంట్ తీసుకుని..మనం అక్కడే ఉండిపోవచ్చు. మీరు పుస్తకాలు చదువుకుంటూ, పజిల్స్ పూర్తి చేసుకుంటూ..నేను సంగీతం వింటూ, కూనిరాగాలు తీసుకుంటూ జీవితాన్ని గడిపెయ్యొచ్చు. మన పిల్లలు.. మన పిల్లల పిల్లలతో ఇల్లంతా సందడిగా. ఇరుగు పొరుగు వారితో సత్సంబంధాలు మెయిన్‌టెయిన్ చేస్తూ.. ఇంట్లో అప్పుడప్పుడూ బంధువుల రాకపోకలతో కళకళలాడుతూ ఎంత చక్కటి జీవితం!?" (అప్పుడే ఆ ఇంటి ముందు ముగ్గు వేయటం కూడా మొదలు పెట్టాను మనసులో)

నా గోలంతా విన్నాక ఆయన "సర్లే ఉండు. అదేదో నువ్వు చూస్తేనే కానీ, నీకు అర్థమై చావదు" అని గొణుక్కుంటూ ఆ రియల్ ఎస్టేట్ వాళ్ళకి ఫోన్ చేశారు. వాళ్ళు వెంటనే ప్రతి స్పందించి ' మా రెంటింటికి ' (అద్దె ఇంటి) అడ్రసు కనుక్కుని తక్షణం 'ఇన్నోవా' కారు పంపించారు. ఇద్దరం రెడీ అయి, ఆ కారులో కూర్చున్నాం. ఆ డ్రైవరు మాకు విష్ చేసి, మధ్యలో ఆఫీసు దగ్గర మేనేజర్ని ఎక్కించుకుని నగరాన్ని వదిలే దారివైపు కారు నడిపించాడు.

దారి పొడవునా నా ఆలోచనల సమాహారం, సమారోహం చెప్పలేను. ఎన్నెన్నో సరికొత్త ఊహలు, జీవితాన్ని నిదానంగా గడపొచ్చనే ధీమా, తీరదనుకున్న కోరిక..యిలా అచ్చు మనసులో ఉన్నదున్నట్లుగా తీరబోతోందన్న ఆనందం! ఆ కట్టబోయే ఇంట్లో నేను ఏమేం చేయాలో ప్రణాళిక వేసుకోవటం మొదలు పెట్టేశా. ఇంతలో లే-అవుట్లు గీసిన స్థలాలన్నీ రానే వచ్చాయి.

అతను వెంచరు తాలూకు వివరాలు చెప్పటం మొదలు పెట్టాడు. "ఇక్కడ పార్కు, ఇక్కడ కోవెల, ఇక్కడ లైబ్రరీ, ఇక్కడ స్కూల్, ఇక్కడ యోగా బిల్డింగ్, ఇక్కడ ఈత కొలను, ఇవన్నీ ఒక ఎత్తు, రచ్చబండ మరొక ఎత్తూనూ. "మఱ్ఱి చెట్టు - రచ్చబండ" ప్లాన్ ఎప్పుడో సిద్ధం చేశాం. ఆ తర్వాత అసలు ప్లానంతా ఇల్లు - ఇంటి ఆవరణ మీదనే. మరిక్కడ కనిసం వెయ్యి గజాలు తీసుకోవాలి. అవన్నీ వెయ్యి గజాలవి. ఆ వెనకంతా రెండువేల గజాలవి. అవన్నీ ఎప్పుడో అమ్ముడై పోయాయి. ఎన్నారైలు తీసేసుకున్నారు. ఈ వెయ్యి గజాలలో నాలుగొందల గజాలు ఇల్లు కడతాము. ఇంటి మెయిన్ డోర్ రోజ్ వుడ్ ది. నగిషీ చేసి, ఇత్తడి గుబ్బలు రింగులతో చేయిస్తాము. హాల్లో ఉయ్యాల బల్ల చేయిస్తాం. పూజగది స్పెషల్‌గా డిజైన్ చేశాం. గంటల తలుపులు, దేవుడి మండపం రోజ్ వుడ్‌తో చేయిస్తాం. ఇత్తడి దీపస్తంభాలు నాలుగడుగులవి రెండూ, హాల్లోకి కూడా పంచలోహాల వెడల్పాటి గంగాళం నీళ్ళు, పూలతో అలంకరించుకోడానికి ఇస్తాం.

భోజనాల గదిలో ఓ పది పీటలు, ఇక వంటింటి కొస్తే మీకు పది రాచ్చిప్పలు, నాలుగు ఇనుప మూకుళ్ళూ, నాలుగు ఇత్తడి బిందెలు, రెండు రాగి బిందెలు, నాలుగేసి ఇత్తడి గుండిగలు, గంగాళాలు - రెండు వంటింట్లో , మరో రెండు స్నానాల గదిలో. అన్నట్లు పెరట్లో ఈశాన్యమూలన బావి తవ్విస్తాం. బావి చుట్టూ గట్టు, బావి గోడకి ముగ్గులు, పెరట్లో వేపచెట్టు, దాని చుట్టూ అరుగు - అరుగుకు కూడా ముగ్గులు. మీకు కావాలంటే ఓ ఆవు కూడా ఇస్తాం. ఆ ఆవుని చూసుకునేందుకు పాలేరుని మేమే ఏర్పాటు చేస్తాం. ఆవు, ఆవుదూడకి ప్రత్యేకంగా కొష్టం ఈ వైపున కట్టిస్తాం.

ఇక ఇంటిముందు ఆవరణలో సపోటా, మామిడి, కొబ్బరి, జామ మొక్కలన్నీ నాటుతాం. డ్రిప్ ఇరిగేషన్ ఫెసిలిటీ ఉంది. ఇక మీరు గృహప్రవేశం అయ్యాక అరటి పిలకలు నాటుతాం. మరో వైపు చిన్నమడులు తీసుంచి మీకు కూరగాయలు, ఆకు కూరలు పండించేందుకు వీలుగా ఏర్పాటు చేస్తాం.

అటు చూడండి ఆ చివర ఓ చిన్న ఔట్ హౌస్ అంటే చిన్న పెంకుటిల్లు కట్టిస్తాం. ఆ పెంకుటింటి ముందు పూల మొక్కలకోసం కొంత స్థలం వదిలేస్తాం. అంటే మల్లె, సన్నజాజి తీగల పందిళ్ళు వేసుకోవచ్చన్న మాట. "

ఇంతలో అతని సెల్ ఫోన్ మోగింది. అవతల ఎవరో మాలాంటి వాళ్ళలా ఉన్నారు. ఏవో పూలమొక్కల వివరాలు అడుగుతున్నారు.

" అబ్బే గులాబీలు మా ఎజెండాలో లేవండి. వాటివల్ల విలేజ్ లుక్ ఉండదు కదండీ..ముద్దబంతి మందారం లాంటివే నాటుతాం. "

ఆ ఫోన్ అవుతూనే మరో ఫోన్..

"ఏంటండీ..గేదెలు కావాలా? అలాగే అలాగే నండీ..ఎలాగూ బియ్యం సంవత్సరానికి సరిపడా కొనుక్కుంటారు కదా! అవునవును..అవునవును అలాగే. ఆ..ఆ.. నులకమంచమా..అలాగే అది కూడా మా వెంచర్లో ఉంది. మీ కింకా కావాలంటే ఎద్దులబండి అంటే ఎద్దులు లేకుండా నన్నమాట. అది కూడా ఆవరణలోనే ఏర్పాటు చేస్తాం.ఆ..ఆ.. చిక్కం, నాగలికూడా. ఓ చిన్న మట్టి మిద్దెలా కట్టించి ఆ వస్తువులన్నీ పెట్టిస్తాం.ఆ..ఏంటండీ.ఆ..ఆ.. ఓ రోలు రెండు రోకళ్ళూ, చిన్న రోలు, పచ్చడి బండ, రుబ్బుడు పాత్రం..ఇవి పెరట్లో వేపచెట్టు తిన్నె దగ్గర పెట్టొచ్చు. అలాగే మీ ఇష్టం. మీరు కావాలంటే తప్పకుండా.."

అతను మాతో చెప్పినవి, ఈ ఫోన్లోవి డైరెక్టుగా , ఇన్‌డైరెక్టుగా నా హృదయాన్ని హత్తుకున్న మాట వాస్తవం. నా పిచ్చి గానీ, నేను వేసుకున్న ప్రణాళికల కంటే వాళ్ళే ముందున్నారు. మేమేమీ శ్రమ పడక్కరలేదు.

మా వారు చాలా కూల్‌గా కనపడుతున్నారు. నేనేమో విపరీతంగా ఎగ్జయిట్ అవుతున్నాను. ఎందుకో ఏ మూలో భయం కూడా వేయకపోలేదు.

అతను చెప్పుకు పోతున్నాడు.

"మీరలా వచ్చి, ఇలా గృహప్రవేశం చేసుకోవటమేనండీ. ఈ ఇంటిని మీ చేతుల్లో అలా పెట్టేస్తాం, ఈ వెంచర్ తాలుకు డెవలప్ మెంట్స్ అంతా మా ప్రొప్రయిటర్ గారే చూసుకుంటారు..".

మా వారు గ్రహించినా..మాట వరసకు అడుగుతున్నట్లు అడిగారు " ఎప్రాక్సిమేట్..ఎంతుండొచ్చు?" అని.

"రెండు కోట్లు సార్. ఇది నిజంగా చీపే. ఎందుకంటే అటు చూడండి. జురాలస్ హౌసెస్ కడుతున్నారు. అవైతే రెండున్నరకోట్లు. పూర్తి సింగపూర్ టైపు. దానికున్న అడ్వాంటేజ్ బీచ్ ఒక్కటే. మనకి పొలాలు, చుట్టూ పంట పొలాలుండి దూరంగా కొండలు కనిపిస్తూ, ఓ పల్లెవాతావరణాన్ని పూర్తిగా చూపిస్తాయి.

మీరు ఒక్క ఫర్నిచర్ కొనక్కర్లేదు. అద్దాల బీరువాలు, టేకు తలుపులు - కిటికీలు మన పల్లెల్లోని పాతకాలపు భవనాల్ని గుర్తుకు తెప్పిస్తాయంటే నమ్మండి. పైగా ఇంటిని పాతకాలపు కట్టుబడితో కట్టిస్తున్నాం. సున్నపురాయితో అంటే - ప్రకృతికి అనుకూలమైన వాతావరణంలో అన్నమాట. అందువల్ల ఆ ఇంట్లో మీకు ఎ.సి. ల, ఫ్యాన్ల అవసరమే ఉండదు. ఇల్లంతా చల్లగా ఉంటుంది. గాలి, వెలుతురు ధారాళంగా వస్తుంది. పూర్తి సహజసిద్ధ వాతావరణం అన్నమాట".

ఒక్కసారిగా నా గొంతు గుండెలోకి జారిపోయింది. చిన్నప్పుడు నేను పుట్టి పెరిగిన వాతావరణం, ఇల్లు కావాలంటే రెండు కోట్లు పెట్టాలన్న మాట. ఇంత ఖరీదైన బాల్యం గడిపానని నాకిప్పుడే తెల్సింది. పోనీలే.. కనీసం అలాంటి ఇంట్లో పుట్టి పెరిగాను. ఆ విలువలు నాకు తెల్సు నాకు. జ్ఞాపకాలు చాలు నాకు. నా చిన్నప్పటి జీవన చిత్రాన్ని కొనలేను నేను.

అయితే ఒకందుకు సంతోషం. 'ఇప్పటిదాకా నేను వెనుకపడుతున్నానని అనుకున్నా. ఈ అనుభవంతో కాదని తెలిసింది. చాలా ముందున్నానన్నమాట'. కాకపోతే వెనుకటి జీవితాన్ని ముందుకి తెచ్చుకోలేను.

పట్టణంలో గ్రామీణ సంస్కృతి ప్రతిబింబించడం నేటి ఫ్యాషన్..

ఫామ్ టూరిజమ్ అస్వాదించడం నేటి ట్రెండ్..మరి..వ్యయం కోట్లలోనే వుంటుంది.!

కానీ గ్రామం పాట్లు పడుతూనే ఉంటుంది.!!

***

## నీలిమ - ఆర్.శర్మ దంతుర్తి

లండన్ హీత్రో ఎయిర్ పోర్ట్‌లో ఓ వార ఖాళీ కుర్చీ చూసుకుని బేగ్ కింద పెట్టి కూర్చున్నాడు విష్ణుమూర్తి. ఓ గంట ముందే మియామీ నుంచి ఇండియా వెళుతూ ఇక్కడ ప్లేన్ మారడానికి దిగాడు. ఎకానమీ క్లాసులో రాత్రంతా కూచోడం వల్ల, వయోభారం వల్ల కానీ కాళ్ళు పీకుతున్నాయి. ఇంకో ఆరుగంటల తర్వాత కానీ తన కనెక్షన్ ప్లేన్ హైదరాబాదుకి బయలుదేరదు. ఇప్పుడైతే చాలా నయంకానీ ఈ హైదరాబాదు ఎయిర్ పోర్టు రాకముందు తప్పనిసరిగా బొంబాయ్ వెళ్ళి ఇంకో కనెక్షన్ ఎక్కవలసొచ్చేది. పేరుకి విమాన ప్రయాణమే అయినా దీన్లో ఎనిమిది గంటలు కాళ్ళు మునగదీసుకుని కూర్చోడం కన్నా, కాకినాడ - తిరుపతి పాసింజర్ జనరల్ కంపార్ట్‌మెంట్లో కాళ్ళు జాపుకుని వేరుశెనక్కాయలు తింటూ సుఖంగా ప్రయాణం చెయ్యొచ్చు. ఇరవై ఏళ్ళ క్రితం మొదటిసారి అమెరికా వచ్చినప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా! చాలా మంది ముందు తరం ఎన్నారైలలాగానే తాను కూడా మొదటి ఇరవై అయిదేళ్ళూ ఇండియాలోనూ, తరువాతి ఇరవై అమెరికాలోనూ గడిపాడు కదూ? వచ్చిన కొత్తలో పెళ్ళిళ్ళకీ, పుట్టిన పిల్లల్ని బంధువులకి చూపించడానికి వెళితే తర్వాత్తర్వాత పోయిన వాళ్ళకి ఖర్మ చేయడానికి మిగిలిన వాళ్ళని పరామర్శించటానికి వెళ్ళాడు. ఎప్పటికప్పుడు ఇదే ఆఖరి ట్రిప్పు అనుకుంటూ వెళ్ళడమే. పోయిన వాళ్ళు పోగా తనకిప్పుడు పెద్దగా బంధుకోటి ఏమీ లేదు చూడ్డానికి. బీరకాయ పీచులెవరైనా ఉన్నా, వాళ్ళింటికి వెళితే అమెరికా నుంచి ఏం తెచ్చావురా అనే తప్ప తనెలా ఉన్నాడో ఒక్కడికీ అక్ఖరలేదు. వాళ్ళందరి దగ్గరా ఒకటే సమాధానం - 'వాడికేంరా, వాడమెరికాలో ఉన్నాడూ' అని.

ఆలోచనల్నుంచి తప్పించుకోడానికి బేగ్‌లోంచి పుస్తకం తీసాడు. కొత్తలో తాను ఒంటరిగా ప్రయాణం చేసినప్పుడు సిడ్నీ షెల్డన్, జాన్ గ్రిషామ్, మైకేల్ క్రిక్టన్ పుస్తకాలు ఉండేవి కూడా. ఆ వయస్సు వేడి తగ్గాక ఆ మధ్య తెలుగు సాహిత్యంలో పడి కొంతకాలం మునిగున్నాడు. తర్వాత తెలిసొచ్చింది. ఈ సాహిత్యం ఎంత చదివినా, రాసినా తనకి మనఃశ్శాంతి మాత్రం అక్కడ దొరకలేదు. అప్పుడే మనస్సు మన పురాణాలమీదకి, భగవద్గీత మీదకి మళ్ళింది. భగవద్గీత పుస్తకం తీసి వచ్చిన పేజీ చూసి మెల్లగా చదవడం మొదలుపెట్టాడు. అర్జునుడు అడుగుతున్నాడు భగవంతుడ్ని... పరమేశ్వరా ఈ మనస్సు అతి చంచలమైంది కదా? దీన్ని కంట్రోల్ చేయడం అసలు కుదురుతుందా? శ్రీ భగవానువాచః అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం......

"హల్లో" అన్నట్టు వినపడి మొహం ఎత్తకుండా పుస్తకంలోంచి పక్కకి చూసాడు విష్ణుమూర్తి. మొదట కాళ్ళు, వేసుకునున్న లేడీస్ షూస్, తల మెల్లిగా ఎత్తుతూ పోతే ఆవిడ వేసుకున్న నీలం పంజాబీ డ్రెస్సు, మెడలో మంగళ సూత్రం, కళ్ళద్దాలూ, బొట్టూ కనపడుతుంటే చూసి పోల్చుకోవడానికి ప్రయత్నం చేసాడు. ఆవిడకి తెలిసిపోయినట్టుంది విష్ణుమూర్తి వాలకం. 'నన్ను గుర్తుపట్టేరా?' అంది నవ్వుతూ. సన్నగానే ఉంది, వయసు నలభై - యాభైల మధ్య ఉండొచ్చేమో. మన తెలుగు వాళ్ళే కాబోలు. ఎక్కడ చూసానబ్బా... అనుకుంటుంటే ఆవిడకి పూర్తిగా అర్థం అయిపోయింది.

"నేను కల్పననండి. దాదాపు ఇరవై ఏళ్ళ క్రితం బాంబేలో కలిసి పనిచేసాం. గుర్తుందా? "

లేచి నుంచుని సిగ్గుపడ్డాడు విష్ణుమూర్తి ఆవిడ ముందు.

"సారీ ఏమీ అనుకోకండి, నేను మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయాను. మన కొలీగ్స్, ఇంకెవరి పేర్లైనా చెపితే మిమ్మల్ని గుర్తుతెచ్చుకోగలనేమో " అన్నాడు.

ఆవిడ పేర్లు చెప్పడం మొదలు పెట్టింది.

"హేమ రాంచంద్రన్? సంజీవ్ మహాజన్? సంగీతా మల్హోత్రా? రవి రెడ్డీ, అఘుతోష్ చక్రవర్తీ? " విష్ణు మూర్తి మొహం చూసి ఆవిడే అడిగింది మళ్ళీ అనుమానంగా.. "మీ పేరు విష్ణుమూర్తి అవునా కాదా? "

ఒక్కసారి ఫెళ్ళున నవ్వేడు విష్ణుమూర్తి.

"అవునండి, కానీ ఈ పేర్లు బుర్రలోంచి మాయం అయిపోయేయి" అన్నాడు ఈసారి ఏమీ జంకు లేకుండా ఓటమి ఒప్పుకుంటూ.

"సరే అయితే, మీకు నచ్చిన పేరు చెపుతాను ఉండండి... నీలిమా పరంజపే?" అంది.

చెళ్ళున కొరడాతో కొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు విష్ణుమూర్తి.

"నీలిమా? నీలిమా పరంజపే? " అన్నాడు గొణుక్కుంటున్నట్టు.

"మీరు నీలిమ కలిసి ఒకే ప్రాజెక్ట్‌లో పనిచేసారు కదూ... ఇప్పుడు గుర్తొచ్చింది. ఎస్ ఎస్ మీరు గుర్తున్నారు కల్పనగారు. అన్నట్లు మనం నిలబడే మాట్లాడుతున్నాం?" అన్నాడు విష్ణుమూర్తి. ఈ మరాఠీ ఆవిడని, మొహమ్మీద బొట్టు చూసి తెలుగువారనుకుని పొరపడ్డానని అర్థం అయ్యింది విష్ణుమూర్తికి. మొత్తమ్మీద ఈయన తనని మర్చిపోయినా, నీలిమని ఇంకా మర్చిపోలేదన్నమాట అనుకుంది కల్పన లోపల.

"కల్పనా ఇక్కడున్నావా? ఇంక వెళదామా?" అంటూ సామానుతో వచ్చాడు ఒకాయన.

"ఈయన, సురేష్, మై హజ్బెండ్ ఇప్పుడు మళ్ళీ ఇండియా వెళుతున్నాం. మా ఫ్లైట్‌కి ఇంకా మూడు గంటల టైము ఉందిలెండి. సురేష్, ఈయన విష్ణుమూర్తిగారనీ, మాతో కొంతకాలం పనిచేసారు ఇండియాలో" అంది కల్పన పరిచయాలు ముగిస్తూ.

"ఓ మీరు పాత ఫ్రెండ్స్ అన్నమాట. సరే అయితే నేను ఈ ఎయిర్‌పోర్ట్‌లో షాపులు చూసి వస్తా మీరు మాట్లాడుకుంటూ ఉండండి. ఇంకా మనకి చాలా టైముంది కదా" అని ఓ షేక్‌హేండు విష్ణు మూర్తికిచ్చి సామాను కల్పన దగ్గిర పడేసి ఎంత కంగారుగా వచ్చాడో అంతే కంగారుగా వెళ్ళిపోయాడు సురేష్

ఇద్దరూ కూర్చున్నాక మొదలు పెట్టాడు విష్ణుమూర్తి. "నేను ఫ్లోరిడాలో ఒక కంపెనీలో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నాను. నేను ఇండియాలో ఆ ఉద్యోగం వదిలేసి రీసెర్చ్ కోసం అమెరికా వచ్చానని మీకూ తెలుసుకదా? మీరెక్కడున్నారు ఇప్పుడు? మీ పూర్తి వివరాలు చెప్పండి."

"నేను మీ దగ్గిర పనిచేసిన రెండేళ్ళకి పెళ్ళయ్యింది. కాలిఫోర్నియా వచ్చేసాం. అప్పట్నుంచి ఇప్పటిదాకా అక్కడే ఉన్నాం. మా ఆయనకున్న కంప్యూటర్ బిజినెస్‌లో ఏదో నేను వేణ్ణీళ్ళకి చన్నీళ్ళన్నట్టు చిన్న హెల్ప్ చేస్తూ ఉంటాను. ఇద్దరు అబ్బాయిలూ పెద్దయ్యారు. పెద్దవాడు మెడికల్ స్కూల్లో ఉన్నాడు రెండోవాడు ఇంకా కాలేజీలో ఉన్నాడు. ఇంకా సబ్జెక్ట్ డివైడ్ చేసుకోలేదు వాడు. మేం ఇద్దరమే బయలుదేరాం ఇప్పుడు. మీ సంగతి చెప్పండి. మీకు పిల్లలున్నారా? మీ శ్రీమతి ఏం చేస్తుంటారూ? " అంది కల్పన నవ్వుతూ.

"నాకు అంత సీన్ లేదమ్మా. ఓ అమ్మాయి ఉంది. నా తిరుగుడు వల్ల, అస్తమానూ ఉద్యోగాలు మారడం వల్లా నాకు బాగా లేటుగా పెళ్ళయ్యింది. మా ఆవిడ ఇంట్లోనే పాపని చూస్తూ ఉంటుంది. ఆ పాప ఇప్పుడు టెంత్ క్లాసులో ఉంది. నేను పనిచేసే స్కూల్లోనే మా ఆవిడ అప్పుడప్పుడూ ఒకట్రెండు కోర్సులు చేస్తూ ఉంటుంది కాలక్షేపానికి. " అని బదులిచ్చాడు విష్ణుమూర్తి.

కొంతసేపు నిశ్శబ్దం రాజ్యమేలాక సడన్‌గా అన్నాడు విష్ణుమూర్తి 'ఇప్పుడెలా ఉన్నారావిడ? ఎక్కడున్నారు?' బుర్ర వంచుకుని చేతిలో పుస్తకం కేసి చూస్తూ. అడగలేక అడుగుతున్నట్టూ, నూతిలోంచి వస్తున్నట్టూ ఉంది విష్ణుమూర్తి గొంతులోంచి మాట.

"ఎవరు నీలిమేనా?" అడుగుతోంది కల్పన. మౌనంగా తల పంకించాడు విష్ణుమూర్తి.

చెప్పటం మొదలు పెట్టింది కల్పన, "మీరు జాబ్ రిజైన్ చేసి వెళ్ళిపోయాక మాకు వేరే మళయాళీ సూపర్ వైజర్ వచ్చారు. ఆయన ఇంతకు ముందు ఆర్మీలో పనిచేసేవాడట. నెల జీతం రాగానే ఆర్మీకాంటినులో చవకగా దొరికే మందు సీసాలు తెచ్చుకుని అవన్నీ ఒకే వారంలో తాగేసేవాడు. అంచేత ప్రతి నెలా మాకు మొదటివారం ఆటవిడుపే. అలాగే మేము ట్రైనింగ్ పూర్తిచేసాము. ఆ తర్వాత పెళ్ళయ్యి అమెరికా వచ్చేసాను. నీలిమకి సీమెన్స్‌లో ఉద్యోగం వచ్చింది. అక్కడ రెండేళ్ళు పనిచేసాక దానిక్కూడా పెళ్ళయింది..." వివర్ణమైన విష్ణుమూర్తి మొహంలోకి చూస్తూ చెప్పడం ఆపింది కల్పన.

"చెప్పండి ఫర్వాలేదు. ఎప్పటికైనా ఈ ఫీలింగ్స్ బయటికి రావాల్సిందే కదా?" అన్నాడు విష్ణుమూర్తి.

"పెళ్ళికి నేనూ వెళ్ళాను. వాళ్ళాయనతో కలిసి నీలిమ పూనే వెళ్ళిపోయింది. తరువాత ఇద్దరమ్మాయిలు పుట్టారట. నేను చూడలేదు, ఇప్పుడు ఈ ఐ.టి ప్రభంజనంలో వాళ్ళాయన కంప్యూటర్ బిజినెస్ స్టార్ట్ చేసి పూనే, మిగతా మహారాష్ట్ర అంతా బ్రాంచ్‌లు ఓపెన్ చేసారు అని చెప్పారు. పిల్లలు ఈ పాటికి పెద్దవాళ్ళై ఉంటారు. ఉద్యోగాలు చేస్తున్నారేమో కూడా. మీకు నీలిమ ఇంకా గుర్తున్నందుకు సంతోషం."

"ఎంత మాటన్నారు? నేను మిమ్మల్ని గుర్తుపట్టడానికైనా, దేనికైనా నీలిమే కదా కారణం? ఎంత ఈజీగా అంటున్నారు నాకు నీలిమ గుర్తున్నందుకు సంతోషం అని? నేను నీలిమని ఒక్క రోజైనా మర్చిపోగలనా? నీలిమ ఎప్పుడూ ఇక్కడే ఉంది" అంటూ తన ఛాతీ కేసి చూపిస్తూ మళ్ళీ అడిగాడు విష్ణుమూర్తి "నీలిమ నాన్నగారు బాగున్నారా?" ఈసారి విష్ణుమూర్తి మొహంలో కోపం కల్పనకి స్పష్టంగా కనబడింది.

"కొన్ని విషయాలు మర్చిపోవాలండి విష్ణుమూర్తిగారు; ఎంతైనా ఆ రోజుల్లో నీలిమ ఇరవై రెండేళ్ళది. నీలిమ నాన్నగారు అందరి ఆడపిల్లల తండ్రిలాగానే బిహేవ్ చేసారు కదా?"

"నేను వాళ్ళమ్మాయిని అమెరికా ఎత్తుకుపోయి ఎవరికో అమ్మేస్తానని అందరి ముందూ, ఆఫీసులో నన్ను చెప్పుచ్చుకు కొట్టి నా పరువు తీసాడు ఆయన. నేను మళ్ళీ వెళ్ళి ఆ కంపెనీలో మొహం చూపించగలనా? అమెరికా వెళుతున్నావా? ఏదీ ప్రూఫ్ అనడిగే నా సర్టిఫికెట్లు అన్నీ చూపించాను. నా డిగ్రీ కాయితాలు, నా పాస్‌పోర్ట్ అన్నీ చించి పారేసి కంపెనీలో అందరికీ నేనెంత వెధవనో పనిగట్టుకు చెప్పి రెండ్రోజులు తన పరపతి అంతా ఉపయోగించి ఈవ్ టీజింగ్ కేసు పేరుతో జైల్లో పెట్టించాడు నన్ను. అక్కడితో నీలిమని వదలకపోతే సెక్సువల్ హరాస్‌మెంట్ కేసు వేస్తానని బెదిరించాడు కూడా. నాకు నీలిమంటే ఇంత ఇష్టమో మీకు తెలిసిందే కదా? ఎప్పుడూ నెమ్మదిగా, తుళ్ళుతూ, నవ్వుతూ ఉండే నీలిమకి అలాంటి ఫాదర్ ఉన్నారని నేను కలలో కూడా అనుకోలేదు. ఆఖరికి నేను

యమయాతన పడ్డాను ఆయన చింపేసిన కాయితాలు, పాస్‌పోర్టు అవీ మళ్ళీ సంపాదించి, సమయానికి అమెరికా రావడానికి. ఆ రోజు నీలిమ అడ్డుకున్నా, పరమేశ్వరుడు అడ్డుకున్నా ఆయన అపర దుర్వాసుడులాగా ప్రవర్తించాడు. ఎంతమంది ఆడపిల్లలకి తండ్రులు లేరూ? అందరూ ఇలాగే ఉంటారా? నేను ఒక్కసారైనా మీ టీములో ఎవ్వరితోనైనా మిస్ బిహేవ్ చేసానా? నేను చేసిన తప్పల్లా, ఆయన దగ్గరకి మర్యాదగా వెళ్ళి నీలిమని పెళ్ళిచేసుకుంటాననడం. మేము ఉత్తరాదివాళ్ళమనీ, మీ మద్రాసీలతో మాకు ఎప్పటికీ కతకదనీ చెప్పడానికి ఇంత రాద్ధాంతం చెయ్యక్కర్లేదు. నా పాస్ పోర్టు చింపక్కర్లేదు. అయినా నేను ఆయన్ని అడగటానికి ముందే నీలిమని అడిగాను. నీలిమ కూడా సరే అన్నాకే కదా నేను ఆయన్ని అడిగింది? ఎంత గవర్నమెంట్ ఆఫీసరైనా మరీ అంతగా నన్ను అవమానించక్కర్లేదు కదా? మీరందరూ చూసారు ఈ భాగోతం. నీలిమ కన్నీళ్ళు పెట్టుకుని వాళ్ళ నాన్నగారి చేతులు పట్టుకుని బతిమాలింది. కంపెనీ ఎమ్.డి బయటికొచ్చి గొడవచేయొద్దని బతిమాలాడు. తన ఆఫీస్ బలగంతో, పోలీసులతో వచ్చి నన్ను ఎంతలేసి మాటలన్నాడు? నేను నీలిమని కాక ఇంకెంతమందికి ప్రపోజ్ చేసానో అనీ, ఇంకెంతమంది అమ్మాయిల్ని మోసం చేసానో అనీ... ఇంకెందుకులెండి... ఎవరు చెప్పినా వినిపించుకున్నాడా? ఆఖరికి ఎవరో కల్పించుకుని నన్ను విడిపించారు. మీలో ఒక్కరైనా గుండెలమీద చేయి వేసుకుని, 'విష్ణుమూర్తి మోసగాడు, మాకు చాలా అన్యాయం చేసాడు అని చెప్పగలరా?" అడిగాడు విష్ణుమూర్తి వణుకుతున్న గొంతుకతో.

"ఊరుకోండి. ఇప్పుడెందుకవన్నీ?"

"ఎంత ఈజీగా చెప్పారు? నేనెంతగా నీలిమని ప్రేమించానో మీకు తెలుసా? వాళ్ళ నాన్నగారు నన్ను ఆ రోజు ఎన్ని మాటలన్నా, నేనెప్పుడూ నీలిమ సంతోషాన్నే కోరుకున్నాను. నీలిమ ఆల్రెడీ మేజరనీ, సొంతంగా పెళ్ళిచేసుకోవడానికి స్వతంత్రం ఉందనీ తెలిసి కూడా నేను నీలిమని నాకూడా వచ్చేయమని అడగలేదు. చాలా మంది అడగమని ఎంకరేజ్ చేసారు. నీలిమ దాదాపు ఒప్పుకుంటుందని నాకు తెలుసు. కానీ వాళ్ళ ఫేమిలీని విడిచి నాతో సంతోషంగా ఉండగలదా? ఆ సంతోషం నేను నీలిమకి ఇవ్వలేనప్పుడు ఇదంతా ఎందుకూ? ప్రేమించడం అంటే మీరందరూ పెళ్ళి, సెక్సూ, పిల్లల్ని కనడం అనుకున్నారేమో నాకు తెలియదు కానీ, నా దృష్టిలో నీలిమ ఎంతకాలమైనా ఎప్పుడూ సంతోషంగా, నవ్వుతూ ఉండగలిగితే అదే చాలు. ఇన్నేళ్ళలో నేను ఒక్కరోజు కూడా నీలిమ గురించి ఆలోచించకుండా లేనంటే నమ్మగలరా? ఆ రోజు నుంచి ఈ రోజు దాకా ఎప్పుడో ఓ రోజు నాకు నీలిమ కనపడుతుందని, ట్రాఫిక్ లైట్ దగ్గర పక్కనే ఆగిన కారులోంచి హల్లో అంటుందనీ నేను తుళ్ళిపడుతూ ఉంటాను. ఇప్పటి దాకా ఏ రోజూ నేను నీలిమని మర్చిపోకుండా గడపలేదంటే నమ్మగలరా?"

"మీరంతగా చెపుతుంటే నమ్ముతాను. ఆయన చేసింది తప్పే కానీ ఆయనకి అంత కోపం అని మాకెవ్వరికీ తెలియదు. ఎప్పుడైనా నీలిమ మీద అరిచినా నీలిమ కూడా వాళ్ళ నాన్నగారు అంత అసహ్యంగా బిహేవ్ చేస్తారని ఊహించలేకపోయిందనుకుంటా."

"ఈ శ్లోకం చూసారా? 'అసంశయం మహాబాహో మనో దుర్నిగహం చలం. అభ్యాసేతు కౌంతేయా, వైరాగ్యేణచ గృహ్యతే,' అంటే, మనస్సుని నియంత్రించడం ఎంతో కష్టం. కానీ ప్రాక్టీస్ చేస్తే కంట్రోల్ చేయొచ్చని కృష్ణుడు చెపుతున్నాడు. ఇప్పటి దాకా నీలిమని మర్చిపోవడానికి కోటానుకోట్ల సార్లు ట్రై చేసి అన్ని సార్లూ ఓడిపోయాను నేను." విష్ణుమూర్తి కంఠం బొంగురు పోయింది మాట రాక. కాస్సేపు మౌనంగా ఉండి తనని తాను కంట్రోల్ చేసుకున్నాక అన్నాడు విష్ణుమూర్తే మళ్ళీ, "ఇప్పుడు నీలిమ హాయిగా సంతోషంగా ఉందా? నేను ఓసారి నీలిమని కాంటాక్ట్ చేయడం కుదురుతుందా?" విష్ణుమూర్తి మాటల్లో క్యూరియాసిటీ.

"మీ ఎడ్రస్సూ డిటైల్స్ అన్నీ ఇవ్వండి. నేను నీలిమ గురించి కనుక్కుని ఆవిడకి ఇవ్వటానికి ట్రై చేస్తాను. కానీ నేను ఏమీ గారెంటీ ఇవ్వలేను. ఇన్నేళ్ళ తర్వాత కనుక్కోవడం కష్టం కదా? సరేనంటే ఇవ్వండి."

జేబులోంచి పెన్ను తీసి దొరికిన కాయితం మీద పేరూ, ఎడ్రస్సు, ఫోనూ రాసిచ్చాడు విష్ణుమూర్తి.

ఆ కాయితం తీసుకుని హేండ్ బాగ్‌లో పెట్టుకుని 'మీరు చదువుకుంటున్నట్టున్నారు. డిస్టర్బ్ చేసానేమో మిమ్మల్ని?" అంది కల్పన.

"లేదు, లేదు మిమ్మల్ని కలుసుకున్నందుకు సంతోషం. మిమ్మల్ని చూస్తుంటే నీలిమని చూస్తున్నట్టే ఉంది. ఈ వయస్సులో ఈ బుక్కే నాకు మనఃశ్శాంతి నిచ్చేది. మీరూ చూడండి" అంటూ పుస్తకం ఇచ్చాడు ఆవిడకి.

"ఓ, ఇలాంటివి ఏదో కొంచమే అర్థం అవుతాయంతే నాకు. నాకు సంస్కృతం అంత బాగా రాదండీ."

మాటల్లో ఉండగా సురేష్ వచ్చాడు మళ్ళీ, "కల్పనా, మాట్లాడ్డం అయిందా? ఇంక వెళదామా? మనకి టైమవుతోంది," అంటూ. ఇంకోసారి విష్ణుమూర్తికి షేక్ హాండిచ్చి కల్పనతో వెళ్ళిపోయాడు సురేష్.

ప్లేన్ ఎక్కడానికి లైన్లో నుంచున్నప్పుడు అడిగాడు సురేష్ కల్పనని, "ఏమిటి మీ పాత ఫ్రెండ్ సంగతి?" అంటూ.

"ఆయనో వెర్రి మాలోకం. నాకొలీగ్ నీలిమ అనే ఒకావిడని ఈయన ప్రేమించాడు మేము కలిసి పనిచేసే రోజుల్లో. నీలిమ నాన్నగారు ఈయన్ని కంపెనీలో అందరి ముందూ దులిపేసి, చెప్పుతో కొట్టి జైల్లో పెట్టించాడు, నీలిమని పెళ్ళి చేసుకుంటానని అడిగితే. ఇన్నేళ్ళ తర్వాత కూడా ఈయనకి నీలిమ మీద ప్రేమ ఏమాత్రం తగ్గలేదు. నేను నీలిమని ఎలా మర్చిపోగలను అంటూ మాట్లాడాడు. ఆయన అడ్రస్సు అదీ ఇచ్చాడు నీలిమకి ఇవ్వమని. ఓసారి మళ్ళీ నీలిమని చూడాలని ఉందట," అంటూ మొత్తం కథంతా మెల్లిగా కళ్ళకి కట్టినట్లు చెప్పింది కల్పన లైన్లో ముందుకు కదులుతూ, ప్లేన్ ఎక్కేదాకా.

సామానంతా సర్దుకుని కూర్చుని సీట్ బెల్ట్ పెట్టుకున్నాక అడిగాడు సురేష్, "ఇండియా వెళ్ళిన ప్రతీసారీ నువ్వు నీలిమని కలుస్తావా? అయితే ఈసారి నువ్వు నీలిమని కలిసినప్పుడు ఈయన ఎడ్రస్సూ అవీ ఇవ్వాలా? మొత్తమ్మీద ఈయన మాంచి రొమాంటిక్ లవర్ అన్నమాట."

"నీలిమని కలుస్తానని చెప్పలేదు. కనుక్కుంటానని అబద్ధం ఆడాను. ఆయనిచ్చి ఎడ్రస్ కాయితం ఇందాక బాత్రూం కెళ్ళినప్పుడు అక్కడే పడేసాను. ఇంకా ఈయనకెందుకో నీలిమ గురించి?"

"అయ్యో, పాపం ఆయన నీలిమ తనని కాంటాక్ట్ చేస్తుందేమో అని చూస్తూ కూర్చోడూ?"

"ఊరుకో సురేష్, నీకేం తెలియదు. ఈయన పెళ్ళి కూడా చేసుకుని పెళ్ళాం, పిల్లతో కాలక్షేపం చేస్తున్నాడు. ఇప్పుడు ఈయనకి ఇరవై అయిదేళ్ళ క్రితం తాను ప్రేమించిన అమ్మాయి గురించి తెలియకపోవడమే మంచిది. తెలిస్తే ఎప్పుడో అప్పుడు వాళ్ళావిడ దగ్గరో ఇంకో చోటో నోరుజారుతాడు. అదీకాక ఈయన నీలిమ గురించి మాట్లాడుతూంటే గమనించాను, ఈయన గొంతు, చేతులు వణుకుతున్నాయి. ఈయనకి ఏమి హెల్త్‌ప్రోబ్లమ్స్ ఉన్నాయో? నీలిమ న్యూస్ ఈయనకి చెపితే ఆయన హెల్త్ పాడవ్వొచ్చేమో? మనకెందుకొచ్చినగోల?"

అప్పుడే రన్‌వే మీదకి కదులుతున్న విమానంలో సురేష్ అంటున్నాడు కల్పనతో ఆశ్చర్యంగా 'బాప్‌రే మీ ఆడవాళ్ళు ఎంత విచిత్రంగా ఆలోచిస్తారు! ఈసారి నీలిమని కలుసుకుంటే మాటవరసకైనా చెప్పవా ఈయన గురించి?"

సీట్ బెల్టు బిగించుకుంటూ, సీరియస్‌గా అంది కల్పన "నో, నో. నేను నీలిమ గురించి చిన్న అబ్ధం ఆడానని చెప్పాను కదా?"

"ఎందుకూ అబద్ధం చెప్పడం?"

"ఎందుకా? నీలిమ ఆర్నెల్ల క్రితం పోయింది. బ్రెయిన్ ట్యూమర్ అని చెప్పారు."

పక్కలో బాంబు పడ్డట్టు చూసాడు సురేష్, "మరి ఆ మాట ఆయనకి చెప్పావా?"

"లేదు. ఈ ఏజ్‌లో ఆయనకి తెలియడం ఎందుకూ? ఆయన నీలిమని ఎంతగా ప్రేమించాడంటే ఇన్నేళ్ళ తర్వాత కూడా, నాతో నీలిమ గురించి మాట్లాడుతున్నప్పుడు కూడా ఆయన చాలా ఉద్విగ్నంగా మాట్లాడాడు. నీలిమకి ఇంకా అయిందని ఇప్పుడు వింటే

ఆయనకేం హెల్త్ ప్రోబ్లం వస్తుందో? నాకూ నిజం చెప్పాలనిపించలేదు. అందుకే చిన్న అబద్దం ఆడేసి తప్పించుకున్నాను. మనం చెప్పకపోతే, నీలిమ ఎక్కడో సుఖంగా ఉందీ అనే ఆలోచనతో అయినా బానే ఉంటాడు, ఏమంటావ్?'' అడుగుతోంది కల్పన.

ఫ్లైట్ ఇంజన్ గోలలో, కల్పన కేసి చూసి మౌనంగా అవును కాబోలన్నట్టు తల పంకించాడు సురేష్.

## సంయుక్త - డి. సూర్యనారాయణ శాస్త్రి

**ముఖ్య అతిథిగా** విచ్చేసిన ఆయన జెండా ఊపారు. సన్నగా పడుతున్న వానని లెక్కచేయకుండా, అందరూ బయలుదేరారు.

కాంతివంతమై మిరుమిట్లు కొలుపుతూ మెరుపు! సరిగ్గా బయలుదేరే సమయంలో, అప్పుడే చివరగా వచ్చి మమ్మల్ని చేరిన ఆ అమ్మాయి ముఖాన్ని ఆ మెరుపు కాంతిలో చూసాను. విద్యార్థినిలా ఉంది. తనని ముఖ్యంగా ఆ ముఖాన్ని ఎక్కడో చూసినట్టుగా అనిపించింది. ఆమెకు తటిల్లత అని నేను పేరు పెట్టుకున్నాను.

అందరమూ లైనుగా వెళుతున్నాము. నిర్వాహక సంస్థకు చెందిన ఒకాయన లెక్కపెడుతున్నాడు. ఆఖరుగా తటిల్లత. మొత్తం మీద మూడు పదుల సంఖ్య. అందులో పదిమంది స్త్రీలని తరువాత తెలిసింది.

బీచ్ ఒడ్డుకు రాగానే అందరమూ గుంపులు గుంపులుగా లేదా ఇద్దరు ముగ్గురిగా విడిపోయాము. నడక ప్రారంభించాము. వాన తీవ్రత ఎక్కువైంది. అయినా ఎవరూ వెనుతిరగలేదు. వారం రోజుల క్రితం పేపరులో చదివాను. పాత దీపస్థంభం దగ్గరనుంచి ఋషి కొండదాకా నడిచి వెళ్ళి, అక్కడ కాసేపు గడిపి, మళ్ళీ తిరిగి దీపస్తంభం దాకా నడుచుకురావడం. ఆ రోజు పౌర్ణమి రాత్రి. పౌర్ణమి పాదయాత్ర! శనివారం రాత్రి వచ్చింది..

ఈపాద యాత్రలో పాల్గొంటుంటే ఒక నాటి జ్ఞాపకాలు చుట్టుముట్టాయి.

***

చాలా ఏళ్ళ క్రితం ...'అగ్ని'తో భీమిలి చూడటానికి బస్సులో వెళ్ళిన మేము, భీమిలి దగ్గర, భీమిలీ నుంచి పాత దీపస్తంభం దాకా తీరం వెంబడి నడిచి వెళ్ళాలని ఆకస్మిక నిర్ణయానికి వచ్చాము. మాలో ఎవరు అలా ప్రపోజ్ చేసారో నాకు గుర్తులేదు. ఆ నడక దూరం ముందు ఈ రోజు దూరం లెక్కలోకి రాదు.

ఒకరికొకరం మంచి కంపెనీ. అప్పుడు వయస్సులో ఉన్నాము. అగ్నితో సమయం గడపటం నాకు భలే ఇష్టం. అగ్ని మిత సాంత్రా! ఆ రోజుల్లో అతనికి స్నేహితులు ముఖ్యంగా బెంగాలీ వాళ్ళు ఎవరూ తగలలేదు. మా కంపెనీలోనే అతని తొలి ఉద్యోగం. అంతకు ముందు కలకత్తా విడిచి ఎప్పుడూ ఉండలేదు. అతని 'సిటీ సిక్‌నెస్‌ని' నేను దూరం చేశాను.

అతనికి నాకు చాలా అభిరుచులూ కలిసాయి. త్వరలోనే ఆప్త స్నేహితులయ్యాము. అతనికి ఉన్న అలవాటులలో ధూమ పానం ముఖ్యమైనది. రోజుకి చాలా సిగరెట్లు కాలుస్తాడు. ఎక్కువగానే కాలుస్తాడనిపించినా, నేను ఎప్పుడూ చెప్పలేదు. అతనికి ధూమపానం చాలా ఇష్టమని నాకు తెలుసు.

మానాన్న, చిన్నాన్నలూ తాతయ్య అందరూ స్మోకర్సే. నాకు మటుకు అలవాటు కాలేదు. నేనొకసారి విజయవాడ వెళ్ళినప్పుడు, అక్కడ నాన్నగారికి, కజిన్, మార్ల్బరో రెండు కార్టనులిచ్చినప్పుడు ఆయనని అడిగి ఒకటి తీసుకుని విశాఖపట్నం వచ్చినప్పుడు అగ్నికి ఇచ్చాను కూడా!

ఆ భీమిలి తిరుగు నడక, మరిచిపోలేని సంఘటన దీపస్తంభం దగ్గరకు రాగానే మేము ఆశ్చర్యపోయాము. ఎక్కడా అలుపనిపించలేదు. సమయం తేలికగా గడిచిపోయింది. ఆ రోజునే నాకు రవీంద్రనాథ్ టాగోర్ సంగీతం గీతాంజలిలోనే కాక, సంచయిత అన్న ఇంకో పుస్తకంలో కూడా ఉందని తెలిసింది. ఆ పుస్తకం గురించీ, అందులోని కవితా గీతికల గురించి అగ్ని నాకు బోలెడు వివరించాడు. నడుస్తూ కొన్ని పాడి వినిపించాడు.

ఆ రోజు మేము ఎప్పుడూ లేనిది, ప్రేమ వివాహం, శృంగారం గురించి చాలా చర్చించుకున్నాము. ఒకసారి దుర్గాపూజా సెలవురోజుల్లో మహానవమిరోజున, అతని జీవితంలో జరిగిన శృంగార సంఘటన గురించి అతను నాకు చెప్పాడు నాకు. అప్పుడు, కించిత్ అసూయ కూడా కలిగింది. ఈ సంఘటన గురించి ఇంకెవరికీ చెప్పలేదన్నాడు.

ప్రేమ వివాహం గురించి ఇంతకు ముందు మిగతా స్నేహితులతో చర్చించాను, కాని శృంగారం చర్చలు మటుకు ఇతనితోనే. అదీ ఆ రోజే. వెళ్ళి వస్తోంది భీమిలీ నుంచి కనుక చలంగారి నవల జీవితాదర్శం గుర్తుకు వచ్చింది. ఆ నవల గురించి అగ్నికి చెప్పాను. ఆ నవల నాయిక లాలస గురించి, ఇద్దరి మధ్య వేడి వేడి చర్చలు మాతోపాటే నడిచాయి.

ఆ తర్వాత నాకొకసారి సంచయిత పుస్తకాన్ని నాకు చూపించాడు. బెంగాలీలోనే ఉన్న ఆ పుస్తకం పేజీలు తిప్పుతుంటే పుస్తకంలోంచి వేళ్ళలోకి, వేళ్ళద్వారా శరీరంలోకి రవీంద్ర సంగీతం పాకినట్టుగా అనుభూతి!

అగ్నికి మటుకు గీతాంజలి కన్నా సంచయితనే బాగా నచ్చిందట. నా పెళ్ళి అయిపోవడంతో, ఇద్దరం కలిసి తిరగడం తగ్గింది. కొత్త జంట మధ్యలో తన డిస్టబెన్స్ ఎందుకనుకున్నాడో రాకపోకలు తగ్గించాడు. ఈలోగా కలకత్తాలో మంచి ఉద్యోగం దొరకడంతో వెళ్ళిపోయాడు.

***

అగ్ని జ్ఞాపకాలని మళ్ళీంచి, ఆగి వెనక్కి తిరిగి చూసేసరికి నేనే అందరికన్నా ముందుగా ఉన్నాను. నాకు దగ్గరలో తండ్రీ కొడుకులు. కొడుకు చిన్నవాడు, శ్యామ్ అతని పేరు. వాళ్ళు రాగానే మిగతా వాళ్ళు వచ్చేదాకా ఆగుదామన్నాను. స్త్రీలందరూ ఒక గుంపుగా నడిచి వస్తున్నారు. ఆఖరున సంయుక్త, ఆమె వెనకాల  నిర్వాహకులు. కావాలనే అందరికన్నా వెనకగా నడుస్తున్నారు.

శ్యామ్‌తో ఈలోగా కబుర్లు కలిసాయి. ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అందరమూ కలవగానే, వాళ్ళు కూడా కాస్త విరామం తీసుకున్నాక బయలుదేరాము. నేనూ, శ్యామ్ అందరికన్నా ముందు. శ్యామ్‌కు పుస్తకపఠనం మీద ఆసక్తి అని తెలిసింది. ఎడ్వంచర్స్ ఆఫ్ టిన్ టిన్ అతని అభిమాన కామిక్స్ అని చెప్పాడు. లైబ్రెరీ నుంచీ తెచ్చుకుని చదువుతాడట. ఆ పుస్తకాలలోని కొన్ని హాస్య సన్నివేశాలు చెప్పాడు. "ద డెస్టినేషన్ మూన్" తర్వాతి భాగం ఎక్కడా దొరకలేదని బాధపడ్డాడు. అదినా దగ్గర ఉందని, అతనికి పంపే ఏర్పాటు చేస్తానని చెప్పినప్పుడు ఆనందపడ్డాడు. నా దగ్గర, మా అబ్బాయి చిన్నప్పుడు కొన్న కొన్ని టిన్ టిన్ పుస్తకాలు కూడా ఇస్తానని చెప్పాను. మన మూలంగా పిల్లల కళ్ళల్లో, ఆ లెక్కకి పోతే ఇతరుల కళ్ళల్లో కలిగిన, ఆనందాన్ని చూడటం ఎంత సంతోషకరమైన విషయం!

వాన అడపాదడపా తన ప్రతాపాన్ని చూపిస్తోంది. మధ్య వయస్సులో ఉన్న ఒకావిడ, గొడుగువేసుకున్నా, వేగంగా నడుస్తూ వచ్చి మమ్మల్ని కలుసుకుని మాతో నడవసాగింది. ఆమె పేరు గాయత్రి. సైకాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. ఛామన ఛాయ. ఆమెలో ఏదో ఆకర్షణ ఉంది. లెక్చరర్‌గా పనిచేస్తోంది. నాగురించి, కుటుంబ సభ్యుల గురించి చెప్పినా, ఆమెకుటుంబ సభ్యుల గురించి చెప్పలేదు.

ఇప్పుడు అందరికన్నా మేమిద్దరం ముందున్నాము. సైకాలజీలో అంశాల గురించి తను కొన్ని పరిశ్రమలలోని హెచ్. ఆర్. డి. సెంటర్లలో నిర్వహించిన అంశాలగురించి ఆమె చెప్పింది.

పున్నమి అందాలని మిస్ అయ్యానని నేను వాపోతే వానమూలంగా, ఈ నడక ఇంకా మజా వచ్చిందని ఆమె అభిప్రాయపడింది.

తటిల్లత ఇంకా ఆఖరులోనే ఆమె నడవటానికి కష్టపడుతోందా అని అని అనిపిస్తోంది. కంపెనీ ఇద్దామా అనుకున్నా కాని గాయత్రి కబుర్ల పారవశ్యం నన్ను లొంగతీసింది.

వానక్రమేపీ తగ్గు ముఖం పట్టింది. ఋషి కొండ దగ్గరికి వచ్చేసరికి పూర్తిగా తగ్గిపోయినా ఆకాశం మేఘావృత్తంగానే ఉంది. వాన ఈదురుగాలి సంయుక్తంగా మమ్మల్ని ఆక్రమించడంతో, తమాషా ఏమిటంటే తడిసాముగాని, తడిసి ముద్దయిన అనుభవం లేదు.

ఋషి కొండ దగ్గర ఉన్న ఒక హోటల్ ఆవరణలో, అందరమూ సమావేశమయ్యాం నిర్వాహకుల వ్యాన్ దగ్గరలో ఉన్న రోడ్ దగ్గరకు అప్పటికే వచ్చి ఉంది. వాళ్ళు బిస్కట్స్, సమోసాలు అందరికీ పంచారు.

దగ్గరలో ఉన్న ఒక స్థలం దగ్గరకు వెళ్ళాను. అక్కడే అగ్ని నాకు సంచయితలో, ఉద్భవన్ అన్న గీతాన్ని పాడి వినిపించాడు. నాకు బెంగాలీ రాకపోయినా ఏదో అర్థం అయినట్టు అనుభూతి. అక్కడికి వెళ్ళి, జ్ఞాపకాలతో సముద్రం ముందు కాసేపు నిలబడ్డాను.

తిరిగి వచ్చేసరికి, పరిచయ కార్యక్రమం జరుగుతోంది. ఒక్కక్రమంలో పరిచయాలవుతున్నాయి. దానిని బట్టి నేను గ్రహించింది - తటిల్లత పరిచయం అప్పటికే చేసేసుకుంది. విభిన్న వృత్తుల వాళ్ళు, విద్యార్థులు ఈ గ్రూపులో ఉన్నారు. ఆ తర్వాత వినోద కార్యక్రమం అరగంటసేపు జరిగింది. తిరుగు ప్రయాణం ప్రారంభం. ఈసారి వాన జాడలేనే లేదు.

## 2

నీరజ స్పీచ్ థెరపిస్ట్. ఆమెని కలుసుకుని, థెరపీ గురించి ప్రశించాను. పిల్లలకి మాటలు రాకపోవడం, సరిగ్గా పలకలేకపోవడం వంటి రుగ్మతలకి, ఆమె అవలంబించే పద్ధతులు గురించి చెప్పింది. పిల్లలలో మగవాళ్ళతోనే స్పీచ్ సమస్యలు ఎక్కువని, దానికి సంబంధించిన కారణాలు ఆమెద్వారా తెలుసుకున్నా.

తటిల్లతకి ఈసారి తోడు దొరికింది. సందీప్‌తో కలిసి, నడుస్తోంది. సందీప్ గీతమ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి. ఆమెని చూపించి నీరజగారి ద్వారా, ఆమె పేరు సంయుక్త అని తెలుసుకున్నా రవి ఐ - బ్యాంక్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని ద్వారా కొన్ని విషయాలు తెలుసుకోవడానికి వీళ్ళని క్రాస్ చేస్తూ వెళుతున్నాను.

సందీప్ సిగరెట్టు తాగేదాకా కాసేపు కూర్చుని వెళదామని సంయుక్తతో చెప్పగానే, తనకి ధూమపానం ఇష్టం లేదని, దయచేసి కాల్చరాదని అభ్యంతరం చెప్పింది. అమ్మో కాల్చకపోతే, మిగతా దూరం నడవటం నావల్ల కాదు అని సందీప్ అనగానే నేనందుకున్నా. ''ఇంత అందమైన అమ్మాయి పక్కనే కబుర్లు చెబుతూ నడుస్తుంటే, ఎంత దూరమైనా ఇట్టే నడవగలవు. సిగరెట్టు సహాయం అక్కరలేదు.'' అంటూ అతనితో నేనగానే ఆమె బుగ్గలో సిగ్గు తొంగి చూసింది. అతను అకస్మాత్తుగా, సిగరెట్టు ప్యాకెట్‌లో పెట్టి, ''సరే మీ ఇద్దరి మాట వింటున్నా'' అని నవ్వాడు మాకు ఆనందం కలిగింది.

రవిని కలుసుకుని ఐ - బ్యాంక్ గురించి అడిగాను. నేత్రదానం అంటే, కార్నియాని తీసుకుని, కావల్సిన వాళ్ళకి, ఆ కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ చెయ్యడమని నాకు పొడే తెలిసింది. అతను కార్నియా మార్పిడి గురించి, నాకు బాగా ఆసక్తితో వివరించాడు. ఐ -బ్యాంక్ వాళ్ళ విధులు తెలిసి వచ్చాయి.

సందీప్, సంయుక్త ఇద్దరూ కూర్చునారు. సందీప్ తన జేబులోంచి, సిగరెట్టు ప్యాకెట్ తీసి, సముద్రంలోకి విసిరేసాడు.

గాయత్రిని కలుసుకున్నాను. ఆమె తనతో నడుస్తున్న రావుగారితో తన పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లోని ప్రాజెక్ట్ వర్క్ గురించి చెబుతోంది. ఫ్యామిలీ థెరఫీ... తనకు పరిచయస్తుల కుటుంబంతోని ఒక అబ్బాయి విషయంలో ఏవో సమస్యలుండటంతో, ఆ కుటుంబంలో ఆ థెరపీ ఎన్నుకుని విజయవంతం అవ్వడం, ప్రాజెక్టులో ఈ కేసు వివరించడం - ఇవన్నీ చాలా ఆసక్తికరంగా తను చెప్పింది.

ఆమె దృష్టి సంయుక్త మీద పడినప్పుడు, "సంయుక్త సాంత్రా. సాంత్రా ఇంటిపేరుగా విలక్షణంగా ఉంది, చాలా బెంగాలీ ఇంటి పేర్లు విన్నాను కాని 'సాంత్రా' వినడం మొదటిసారి, మీరెప్పుడైనా విన్నారా?" అని నన్నడిగింది.

ఆమెకి సమాధానమివ్వకుండా, సంయుక్త దగ్గరికి వేగంగా వెళ్ళాను. తనతో సంభాషణ మొదలుపెట్టిన కొద్ది సేపటికే ఆమె అగ్ని కూతురేనని తెలిసింది. నేను ఆయన స్నేహితుడినని తెలియగానే ఆమెలో మిశ్రమ భావాలు.

"సారీ అంకుల్! నాన్నగారు ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో, నాలుగేళ్ళ క్రితం మరణించారు" అని పిడుగుపాటి లాంటి వార్త చెప్పగానే నేను స్తబ్దుడ్ని అయ్యాను.

అగ్ని తనకి భీమిలీ నడక గురించి గొప్పగా చెప్పాడట. నా గురించి పొగుడుతూ చాలా చెప్పాడట. విశాఖపట్నంలోని బంధువుల ఇంటికి వచ్చినప్పుడు, ఈ పున్నమి నడక గురించి తెలియడంతో, నాన్న చెప్పింది గుర్తుకు వచ్చి, తనకూ నడకకూ పొసగదని తెలిసినా, పాల్గొందుకు నిర్ణయించుకుంది. నన్ను కలుసుకునందుకు సంతోషం ప్రకటించింది. కాని నా సంగతి వేరు! అగ్ని మరణ వార్త తెలియడంతో నా మనస్సు అదోలా అయిపోయింది.

మా సంభాషణలో సందీప్ కలగచేసుకుంటూ మాట్లాడాడు. "తన నాన్న దుర్భర మరణం గురించి నాకు వివరించింది. కిమోథెరపీలు విఫలమయ్యి, ఇక మరణం ఏరోజైనా అన్న పరిస్థితిలో ఆయన గడిపిన బాధాకరమైన చివరిరోజులు, తన తండ్రి పట్ల ఉన్న అపారమైన ప్రేమ, ఆయన దూరం కావడం ఇవన్ని చెప్పింది. నన్ను ధూమపానం మానెయ్యమని కోరింది. ఆ సమయంలో ఇవన్నీ విన్న తర్వాత నాకే ఉద్రేకం వచ్చి, సిగరెట్టు ప్యాకెట్, సముద్ర తరంగాల్లోకి విసిరేసి, ఆమెకు ప్రమాణం చేసి మరీ, ధూమపానం మానేస్తున్నానని చెప్పా.

ఆమె చదువు పూర్తయిన తరువాత "ధూమపాన రహిత కోల్ -కత్తా" నినాదంతో పొగాకు విరుద్ధ సంఘస్థాపన చెయ్యాలని ధ్యేయం నా వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చాను. ఒకరికొకరు ఉత్తేజితులయ్యాము. మా నడకలో, మూడు పోస్టర్ల రూపకల్పన కూడా చేసాము. "

నాకు, విషాదంలో ఆనందం! దేశంలో ఇలాంటి ఉద్యమం, ప్రచారం అంతగా లేదు. ఎయిడ్స్ మీద అవగాహనా సదస్సుకు, ర్యాలీకు జరగడం విన్నాను. కాని ధూమపానం, గురించి అలాంటివి వినలేదు. దారిలో ఒకచోట, కొద్దిదూరంలో ఉన్న తాటిచెట్టు కాండం మీద అగ్ని తన పేరు నా పేరు చెక్కినట్టు గుర్తు. ఆ ప్రదేశంరాగానే, ఆమెకు ఆ చెట్టు చూపించాను. పేర్లు ఉన్నాయి. అగ్ని తన పెట్‌నేమ్ చంద్య అని రాశాడు. అదికూడా తను గమనించి, తాను సంతోషపడింది.

"నీధ్యేయానికి, ఒకరిని ఆదర్శంగా, తీసుకో! ప్యాట్రిక్ రేనాల్డ్స్ ఆయన, తన తండ్రిని, అన్నను బలితీసుకున్న హంతక సిగరెట్లకి విరుద్ధంగా ప్రచారం చేసాడు. ఎంతో లాభాలు గడిస్తున్న తన 'కేమిల్' సిగరెట్టు కంపెనీ మూసేసాడు. " అంటూ ఆ చెట్టు దగ్గర సంయుక్తకి చెప్పాను. ఆ చెట్టు దగ్గర ఆమె ప్రతిన కూడా చేసింది.

మర్నాటి మధ్యాహ్నం ఆమెను ఇంటికి భోజనానికి ఆహ్వానించాను.

"సారీ అంకుల్! సందీప్, హోటల్ గ్రీన్ పార్క్‌లో లంచ్ ఇస్తానన్నాడు. రాత్రే కోరమాండల్‌కి వెళ్ళిపోతున్నా" అని ఆమె అనగానే ఒకరి అడ్రస్, ఇంకొకరం తీసుకున్నాము.

పున్నమి నడక, 'వెన్నెల' లేకుండానే, రకరకాల మబ్బులతో గడిచిపోయింది.

అందరమూ ఒకరినొకరు వీడ్కోలు తీసుకున్నాము. సంయుక్త తను తెచ్చుకున పెప్‌ప్లస్ ఎక్కి, నాకు చెయ్యి ఊపి, వెళ్ళిపోసాగింది. ఆమెతోపాటే సందీప్ బైక్ స్టార్ట్ చేసాడు.

వాళ్ళిద్దరూ కనుమరుగయిందాకా చూస్తూ నిలబడ్డాను.

ఆమ్రా చంచల్

ఆమ్రా అద్భుత్

ఆమ్రా నబయుగ్ దూతా

అన్న గీత భాగం, సంచయితలోది. అగ్ని పాడింది గుర్తుకు వచ్చింది.

ధూమ పాన విరుద్ధ ప్రచారోద్యమానికి వాళ్ళు నిజంగా నూతన దూతలు కావాలని మనసారా కోరుకున్నాను.

అగ్ని జ్ఞాపకాలు మళ్ళీ...

అదే సమయంలో, అక్కడ అగ్ని కాల్చే సిగరెట్టు బ్రాండ్ ఎవరైనా కాలుస్తున్నా, పాన్ షాపు తెరిచి ఉండి, ఆ బ్రాండ్ దొరికినా, ఒక సిగరెట్టు తీసుకుని, ఎంత దగ్గువచ్చినా, ఎంత పడకపోయినా, కనీసం మూడు, నాలుగు పఫ్స్ వదలాలని విచిత్రమైన కోరిక!

కాని ఒక వేళ సిగరెట్టు దొరికి చేతిలో తీసుకున్నా, సంయుక్త మొహం గుర్తుకు వచ్చి ఆ పనిని చేయలేను.

దూరంగా బంగాళాఖాతపు తరంగాలు మృదుమధురంగా, రవీంద్ర సంగీతం ఆలాపిస్తున్నట్టు విచిత్రమైన అనుభూతి!

## చివరకు మిగిలేది - తాటిపాముల మృత్యుంజయుడు

కౌముది-రచన పోటీల్లో తెలుగుపీపుల్.కామ్ వారి విశిష్ట పురస్కారం పొందిన కథ

"**అంకుల్!** నాన్న మిమ్మల్ని చూడాలనుకుంటున్నాడు. మీరు ఒకరోజు సెలవు తీసుకుని మన ఊరు వెళ్ళగలరా? వీలైతే అదీ ఈ రోజే" అంటూ ఉదయం ఫోను చేసి చెప్పిన ఫణీంద్ర మాటలు పదేపదే చెవుల్లో వినిపిస్తున్నాయి.

ఫణీంద్ర రామం కొడుకు. హైదరాబాద్‌లో ఈ మధ్యనే ఉద్యోగం మొదలెట్టాడు. నేను, రామం చిన్ననాటి స్నేహితులం. ఒకే ఊళ్ళో పుట్టి పెరిగి హైస్కూల్ వరకు కలిసి చదువుకున్నాం. పెరిగి పెద్దయి దారులు వేరైనా మా స్నేహం నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. రామం హైస్కూల్లో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేసేవాడు. ఈ మధ్యనే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని శేషజీవితాన్ని సొంత ఊరిలో గడుపుతున్నాడు. అమ్మానాన్నలు గతించిన తర్వాత నేను ఉన్న కాస్తంత ఆస్తిపాస్తులు అమ్మేసి హైదరాబాదులో సెటిల్ అయ్యాను. రామం ఏదైనా పనిమీద హైదరాబాదు వచ్చినప్పుడు నన్ను కలుస్తుంటాడు. నేను వీలు చూసుకుని అతను పనిచేసే ఊరికి వెళుతుండేవాణ్ణి.

"ఏమిటో ఈసారి అంత అర్జంటు?" స్వగతంగా మరోసారి అనుకుంటూ పరిగెడుతున్న బస్సులోనుండి బయటకు చూసాను. మరుసటి రోజు పౌర్ణమి. మబ్బుల్లేని స్వచ్ఛమైన ఆకాశంలో నెలరాజు వెండిపళ్ళెంలా వెలుగుతున్నాడు. రోడ్డుకు ఇరుపక్కలా చెట్లమీద పిండారబోసినట్లు వెన్నెల పడుతున్నది. వేగంగా పరిగెడుతున్న బస్సులో నుండి నిండు చంద్రుణ్ణి చూస్తూ అలాగే ఉండిపోయాను.

ఇంతలో ఓ చల్లగాలి తెమ్మెర విసురుగా వచ్చి ముఖానికి తగిలింది. కిటికీ అద్దాన్ని లాగి మూసాను. గబగబ అరచేతుల్ని రాచుకుని వేడిని చెంపలకు అద్దుకున్నాను. కప్పుకుందామంటే దుప్పటి లేదు. ప్రయాణపు హడావుడిలో ఓ జతబట్టలు, లుంగీ, తువ్వాలు మాత్రమే సర్దుకున్నాను. ఒళ్ళంతా దగ్గరకు ముడుచుకుని చేతులను మోకాళ్ళ మధ్యలో దాచాను. చలి కొద్దిగా తగ్గింది. కొద్దిసేపటికి మగతగా నిద్రపట్టింది..

❀ ❀ ❀

తెల్లారేసరికి బస్సు ఊరికి చేరుకుంది. తూర్పుకొండలు సూర్యుణ్ణి బలవంతంగా ప్రసవిస్తున్నట్టున్నాయి. ఆకాశంలో నారింజవర్ణం నిండుకుంది. రామం ఇల్లు బస్ స్టాండుకు దగ్గరలో ఉంది కాబట్టి నడవటం మొదలుపెట్టాను.

చిన్నప్పటినుండి తెలిసిన పరిసరాలే. కాని ప్రతిసారీ ఏదో మార్పులు కనిపిస్తున్నాయి. పాతకట్టడాలు అదృశ్యమవుతున్నాయి. వాటిస్థానే కొత్త కట్టడాలు ప్రత్యక్షమవుతున్నాయి. "రామానికి అంత అగత్యం ఏమొచ్చి ఉంటుంది?" అనుకుంటూ గబగబా నడిచాను.

ఇంటిముందు గేటూ తెరుచుకుని లోపలికి నడిచాను. అతని పూర్వీకులు కట్టిన ఇల్లు అది. తల్లితండ్రుల తదనంతరం అతను ఆ ఇంటిలోనే ఉంటున్నాడు.

ఇంటిముందు అరుగుమీద కూర్చుని ఉన్నాడు రామ. తెల్లటి లుంగీ కట్టుకున్నాడు. అప్పుడే ప్రాతః సంధ్య చేసినట్టున్నాడు. నుదుటి మీద విభూది రేఖలు తెల్లగా అగుపడుతున్నాయి. ఎంతకాలమైనా సంధ్యావందనం చేయడం మాత్రం మానుకోలేదు రామం.

నన్ను చూడగానే "హలో, సుదర్శన్!" అంటూ లేచి ఎదురొచ్చాడు. చేతిలో చేయి కలిపి ఆలింగనం చేసుకున్నాడు. వెళ్ళి అరుగుమీద కూర్చున్నాను. నిద్రమత్తు వదిలించుకోటానికి ఒళ్ళు విరుచుకున్నాను. ప్రయాణపు బడలిక నెమ్మదిగా వదిలినట్టయింది.

రామం ఉద్దరిణిలో నీళ్ళను అరుగు పక్కనున్న గులాబీ మొక్కలకు పోసాడు. కొద్ది రోజుల క్రితమే నాటినట్లున్నాయి. వాటికి రంగు రంగుల మొగ్గలు తొడుగుతున్నాయి.

"మొగ్గలు చాలా అందంగా ఉన్నాయి కదూ.... మొక్కలకు నీళ్ళు పోసి ప్రేమగా పెంచితే అవి బదులుగా పూలతో మనల్ని పలకరిస్తాయి."

'నన్ను అర్జంటుగా రమ్మని ఇతను ఇంత నింపాదిగా మాట్లాడుతున్నాడేమిటి?' నాకు ఆశ్చర్యం కలిగింది. రామానికి ఇలా మొక్కలు పెంచే అలవాటు ఇంతకు ముందు లేదు.

"ఇదుగో లక్ష్మి! సుదర్శనం వచ్చాడు. కాఫీ సంగతి చూడు" అంటూ ఇంట్లోకి కేకేశాడు.

రామం భార్య లక్ష్మి. "ప్రయాణం బాగా జరిగిందా, అన్నయ్యా" బయటికొచ్చి పలకరించింది. నవ్వు స్థానే లక్ష్మి ముఖంలో గంభీరత కనిపించింది. రామం, లక్ష్మి ముఖాల్లో ఉన్న తేడా స్పష్టంగా కనిపిస్తోంది. నేను కలవరపడ్డాను. 'బాగానే జరిగింది' అంటూ ముక్తసరిగా సమాధానం చెప్పి ముఖం కడుక్కోటానికి లేచాను, కాలకృత్యాలు తీర్చుకుని వచ్చేసరికి కాఫీ సిద్ధంగా ఉంది.

కాఫీలు తాగిన తర్వాత "పద. అలా తోటవరకు వెళ్ళి వద్దాం" రామం ప్రతిపాదించాడు.

"పద" అంటూ లేచాను.

నేను ఎప్పుడు వచ్చినా ఉండే కార్యక్రమం ఇదే రాత్రి బస్సులో ప్రయాణం చేసి ఉదయాన్నే రామం ఊరు చేరుకుంటాను. కాఫీలు పూర్తయ్యాక పిచ్చాపాటి మాట్లాడుతూ అలా తోటవరకు వెళ్ళొస్తాం. మధ్యాహ్నం భోజనాలు పూర్తయ్యాక ఊళ్ళోని పరిచయస్తుల్ని కలవడం, తిరిగి రాత్రి బస్సెక్కి ఉదయంలోగా హైదరాబాదుకు చేరుకుంటాను.

ఊరి బయటకు నడవటం మొదలుపెట్టాం. దారి మధ్యలో పరిచయస్తులు కలిస్తే వాళ్ళను పలకరించుకుంటూ ముందుకు సాగి తోటలోకి అడుగుపెట్టాం. ఒక పక్క నిమ్మచెట్లు ఆకులతో, విరగ్గాసిన కాయలతో ఆకుపచ్చని వస్త్రాలు కట్టుకున్న ముత్తైదువుల్లా నిండుగా ఉన్నాయి. మరోపక్క ఏపుగా ఎదిగిన కాయలతో మామిడి చెట్ల కొమ్మలు భారంగా కిందకి వంగి, "ఇక ఈ భారం మోయలేము" అంటున్నట్టు గాలికి అటు ఇటు నెమ్మదిగా ఊగుతున్నాయి. మా మధ్య ఇంకా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. అప్పుడు నాకు తెలిసొచ్చింది, నిశ్శబ్దం ప్రశాంతంగానే కాకుండా, మోయలేనంత భారంగా కూడా అనిపిస్తుందని.

రామం అసలు విషయం మొదలెడతాడేమోనని ఎదురుచూస్తున్నాను. అతను ఎంతకూ పెదవి కదపకపోతే నేనే మొదలెట్టాను.

"రిటైర్మెంట్ జీవితం ఎలా ఉంది, రామం" నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అడిగాను.

"ఇదుగో రోజులు లెక్కబెడుతున్నాను" ఠకీమని సమాధానం చెప్పాడు రామం. అంత వేగంగా సమాధానం చెప్పిన అతని ముఖంలోకి చూశాను. చాలా గంభీరంగా ఉన్నాడు.

ఆ మాటలకు ఖంగు తిన్న నేను "నువ్వు గమ్మత్తుగా మాట్లాడుతున్నావు" అంటూ అతని మాటల్ని తేలిక చేయటానికి ప్రయత్నించాను.

రామం ముఖంలో కళలేని నవ్వు వెలిసింది.

"రోజు రోజుకూ ఆయుర్దాయం తరిగి పోతుంటే 'ఎలా ఉన్నావు?' అని అడిగితే ఏమి చెప్పాలి, సుదర్శన్!"

అతని మాటలు విన్న నేను ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుని, "ఓ అదా నువ్వనేది. నిజమే, కాలం గడుస్తుంటే మనమంతా ముసలివాళ్ళం అవుతాం గాని తిరిగి యవ్వనం వస్తుందా ఏమిటీ" నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అన్నాను.

"అది కాదు నేననేది. నాకు నిజంగానే కౌంట్ డౌన్ మొదలయ్యింది. డాక్టర్లు ఈ మధ్యనే చెప్పారు.. నేను ఇంకా కొద్దినెలలకంటే ఎక్కువగా బతకనని" శూన్యంలోకి చూస్తూ చెప్పాడు.

నా వెన్ను ఒక్కసారిగా జలదరించింది. నడుస్తున్న నేను అక్కడే ఆగిపోయాను. కొన్ని క్షణాలు నేను వింటున్నది నిజమా అని సంశయించాను.

"ఈ విషయం చెప్పటానికే నిన్ను రమ్మన్నాను. గత కొన్ని నెలలుగా నీరసంగా ఉంటూ, తొందరగా అలసిపోతుంటే వయసుపైబడుతుంది కదా, విటమిన్ల లోపమేమో అనుకున్నాను. విటమిన్ల టాబ్లెట్లు వాడటం మొదలెట్టాను. కాని రోజు రోజుకూ బలహీనత ఎక్కువౌతుంటే డాక్టరు వద్దకు వెళ్ళాను. రక్తపరీక్షలు జరిపి నాకు లుకేమియా కాన్సరుందని తేల్చేసారు."

రామం మాటలు వింటుంటే నా గుండె వేగంగా కొట్టుకోవటం ప్రారంభించింది. అతని ముఖంలోకి చూడటానికి నాకు ధైర్యం చాలటం లేదు. నేలకేసి చూస్తూ రామం చెప్పే మాటలు వినటం మొదలుపెట్టాను.

"నాకు వచ్చింది అక్యూట్ లుకేమియా. ఈ వ్యాధి త్వరత్వరగా రక్తం ద్వారా శరీరమంతా వ్యాపిస్తుంది. మందులవల్ల దీన్ని నిర్మూలించటం వీలుకాని పని. ఈ మహమ్మారి శరీరాన్ని క్రమంగా లోబరుచుకుంటుంది. మరణమే దీనికున్న ఒకే ఒక్క సమాధానం."

రామం చాలా నింపాదిగా చెప్పుకు పోతున్నాడు. ముఖంలో ఏమాత్రం ఆందోళన కనిపించటం లేదు. నిర్ఘాంతపోయి వింటున్న నాకు కాళ్ళలో ప్రకంపనాలు మొదలయ్యాయి. నోట మాటలు పెగలటం లేదు. ఆసరాకు పక్కనే పాదుకోసం పాతివున్న కట్టెను పట్టుకున్నాను.

ఈ విషాద సందర్భంలో ఎలా స్పందించాలో నాకు ఊహక్కూడా అందడం లేదు. ఇదే వేరే సమయాల్లో, వేరే విషయాల్లో అయితే నేను, రామం అనర్గళంగా మాట్లాడుకునేవాళ్ళం. కాని 'ఇక నేను కొద్దిరోజులు మాత్రమే బతికేది' అంటున్న మనిషితో ఏం మాట్లాడాలి. అందునా ఉన్నట్టుండి ఘోరమైన వార్త వెల్లడిస్తే నోట మాట రాక మౌనంగా ఉండిపోయాను.

చిన్నప్పుడు కలిసి మెలిసి పెరిగిన వాళ్ళం. రోజంతా చదువులతో, ఆటపాటలతో గడిపిన వాళ్ళం, బ్రతుకు తెరువు కోసం దారులు వేరైనా ప్రతి సంవత్సరం ఒక్కసారైనా తప్పకుండా కలుస్తూ యోగక్షేమాలు విచారించుకునే వాళ్ళం, కుటుంబాల మంచి చెడ్డలు అడిగి తెలుసుకునేవాళ్ళం, చేదోడువాదోడుగా ఉండేవాళ్ళం, మా మధ్య పెంచుకున్న అనుభూతులు ఎన్నెన్నో, దాచుకున్న జ్ఞాపకాలు మరెన్నో. అలాంటిది రామం ఇప్పుడు 'నేను వీడ్కోలు తీసుకుంటున్నాను. ఇక తిరిగి రాను' అంటుంటే ఏమీ మాట్లాడలేని అశక్తతతో కొట్టుమిట్టాడుతున్నాను.

రామం చెప్పిన మాటలు నా మీద స్లోపాయిజన్‌లా పని చేసి తలకెక్కడం మొదలెట్టాయి. హృదయంలో విషాదం ముంచెత్తగా, నా కళ్ళలో నీళ్ళు ఉబికాయి.

"రంగయ్యా, ఈ రోజు కూరలోకి కొన్ని టమాటాలు, బెండకాయలు కోసివ్వు" పాలేరుతో చెపుతున్నాడు రామం.

రామానికున్న వ్యాధి గురించి ఇంకా అందరికి తెలిసినట్టు లేదు. రంగయ్య మాములుగానే సాగు గురించి రామంతో మాట్లాడుతున్నాడు. రామం కూడా రంగయ్యతో ఎప్పటిలాగే వ్యవసాయం మీది రాబడి, ఖర్చుల గురించి మాట్లాడుతున్నాడు. నిశ్చలంగా మాట్లాడుతున్న రామాన్ని చూస్తూ నేను విస్మయం చెందాను. రంగయ్య కూరగాయలు కోయటానికి వెళ్ళాడు.

చిరునవ్వుతో నా వద్దకు వచ్చి నా భుజం మీద చెయ్యి వేసాడు రామం. అతన్ని చూస్తుంటే ఎందుకో ఆ క్షణంలో భయమేసింది.

"నీకు చావంటే భయం వెయ్యటం లేదా?" ధైర్యం తెచ్చుకుని అడిగాను.

"ఎందుకు భయం! ఐ విల్ స్లీప్ వెన్ ఐయాం డెడ్ రోజూ నిద్రపోవడం లేదు. ఇదీ అలాగే అనుకుంటాను. కాని ఒక్కటే తేడా. తిరిగి లేవని దీర్ఘ నిద్రే మరణం." తేలిగ్గా చెప్పాడు.

'ఎలాగూ చావు తప్పదు' అని తెలిసి తెచ్చి పెట్టుకున్న మొండి ధైర్యం కాదని నాకు తెలుసు. రామం రోజూ క్రమం తప్పకుండా గ్రంధాలయానికి వెడతాడు. ఎన్నెన్నో గ్రంధాలను తిరగేసాడు. తెలుగు, ఇంగ్లీషు భాషలలో మహామహుల రచనలను చదివాడు. ఆ అలవాటువల్ల అబ్బిన జ్ఞానం అతని మాటల్లో ఎప్పుడూ కనిపిస్తుంది.

కాని, ఇప్పుడు మాట్లాడేది మరణం గురించి. అందునా తన చావు గురించి. అంత సులభంగా మాట్లాడడం సాధ్యమా?

"అయినా మనిషికి చావంటే ఎందుకో అంత భయం. తనకు ఇప్పట్లో మరణం లేదనే భ్రమలో ప్రతిరోజూ బ్రతకటం వలన అనుకుంటాను. జీవి పుట్టిన క్షణం నుండి ఎల్లవేళలా చావు నీడలా వెన్నంటే ఉంటుంది. తెలిసో తెలియకో కొన్ని సార్లు దాని అంచులవరకు వెళ్ళివస్తాడు. ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు నూకలు చెల్లి ఈ లోక నుండి నిష్క్రమించేవారే. ఏమంటావు?"

పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగటానికి ప్రయత్నిస్తే గొంతులో బాధ వెలిసింది. రామం అంత ధైర్యంగా ఉండి మాట్లాడుతుంటే నేను కూడా ఏదో ఒకటి మాట్లాడాలి. ఈ పరిస్థితుల్లో నేను డీలాపడి అతని అశక్తుడ్ని చేయకూడదు.

"నీవనేది నిజమే, రామం! కాని మరి మనిషి ఈ భూమ్మీద ఒంటరిగా జీవించడం లేదుకదా. కాలక్రమేణ అతను ఎన్నో బంధాలను పెంచుకుంటాడు. వాటన్నింటిని తెంపుకుని శాశ్వతంగా వెళ్ళటం బాధాకరం."

"అక్కడే మనిషి వివేకం ఇంకా పెరగవలసింది, సుదర్శన్! ఈ ప్రపంచంలో సర్వకాల సర్వావస్థలయందు తథ్యం అని చెప్పుకోబడే విషయం ఒక్కటే. అదే మరణం. ఆ సత్యం తెలిసుండి కూడా ప్రతిమనిషి తనది మృత్యువులేని జీవనం అనుకుంటూ జీవిస్తాడు. తథ్యమైన మరణం నుండి తప్పించుకునే వృథాప్రయాస చెయ్యడం కన్నా దాన్ని నవ్వుతూ ఆహ్వానించే అలవాటును నేర్చుకోవచ్చుగదా?"

నాలో ఎన్నో భావాల కలగలుపుగా రేగుతున్నాయి. ఏదో మాట్లాడాలనుకుంటున్నాను. కాని మాటలు అందటం లేదు. మళ్ళీ పాతమాటే అందుకున్నాను.

"నువ్వెన్నైనా చెప్పు. పెంచుకున్న కోరికలను, ఆశలను, ఆప్యాయతలను వదిలివెళ్ళటం అంత సులువుకాదు."

"మనిషి పుట్టినప్పటినుండి శారీరకంగా, మానసికంగా దినదినాభివృద్ధి చెందుతుంటాడుగా. మరణం కూడా ఆ పరిణితిలోని ఒక భాగమే అని అంగీకరిస్తే ఇక ఏ సమస్యా ఉండదు కదా, సుదర్శనం." అంటూ రంగయ్య ఇచ్చిన కూరగాయలు తీసుకుని ఇంటికి దారి తీసాడు రామం. అతని పక్కన నడవాలంటే ఎందుకో సంకోచించాను. రెండడుగులు వెనకగా నడవటం మొదలు పెట్టాను.

"సారీ సుదర్శన్! నిన్ను పిలిపించుకుని ఇలా కృంగదీసే వార్త చెప్తున్నందుకు. కాని, నేను చనిపోయేముందు నాకు ప్రియమైన వాళ్ళను కలుసుకుని ఆఖరుసారిగా మాట్లాడుకోవాలని నా కోరిక. అందుకే నిన్ను రమ్మని చెప్పింది."

ఆ మాటలు విన్న నాకు ఆపుకోలేనంత ఏడుపొచ్చేసింది. ఏడ్పుతో గొంతు పెగలగా ముందుకెళ్ళి రామం భుజంమ్మీద చెయ్యి వేసి ఆపాను.

"సుదర్శన్, చిన్నపిల్లవాడిలా ఏంటా ఏడుపు?" నా కన్నీటిని తుడిచాడు.

"ఐ యాం వెరీ సారీ, రామం! నీకు ఇలాంటి వ్యాధి వస్తుందని అనుకోలేదు. యూ ఆర్ మై బెస్ట్ ఫ్రెండ్ ఐ విల్ మిస్ యూ" అంటుంటే నా గొంతు గాద్గదికమైంది.

రామం భుజం మీద ముఖం పెట్టి వెక్కి వెక్కి ఏడ్చాను.

"ఊరుకో సుదర్శన్, ఎవరైనా చూస్తే బావుండదు. నేనింకా ఈ విషయం ఊళ్ళో వాళ్ళకి ఎవ్వరికి చెప్పలేదు" అంటూ నన్ను అనునయించాడు.

తోటలో నుండి బయటపడి రోడ్డు మీదకు వచ్చాం. ఈసారి నేను రామంతో సమానంగా నడవడం మొదలెట్టాను. కొద్ది కాలం తర్వాత శాశ్వతంగా విడిచిపెట్టి పోయే మిత్రునితో మిగిలిన అమూల్యమైన సమయాన్ని నిస్సంకోచంగా గడపాలికదా.

"నిజంగా దేవుడనే వాడుంటే ఇప్పుడే నిలదీసి అడుగుతాను. నీకు ఇంతటి ఆపద తీసుకొచ్చినందుకు. ఆ కాన్సర్ వ్యాధి నీకే రావాలా?" నా అసహాయతకి నన్ను నేనే నిందించుకుంటూ ఉద్రేకంగా మాట్లాడాను.

నా ఆక్రోశాన్ని చూసి "ప్రతీ చావుకి ఓ కారణం ఉండాలి. మూడొందల ఏళ్ళ క్రితం మనిషి చావుకు వంద కారణాలే ఉండేవట. కానీ ఇప్పుడు మూడు వేలకు పైగా కారణాలున్నాయట. అంటే మనిషి ఒక ప్రక్క అభివృద్ధి చెందుతూనే, మానవాళి క్షేమాన్ని ఆకాంక్షిస్తూనే ఇంకో పక్క తనకు తెలియకుండానే చావుకి కొత్త దారులు కనుక్కుంటున్నాడన్న మాట." ముఖంలో చిరునవ్వుతో అన్నాడు.

రామం స్థానంలో వేరొకరుంటే నేను ఓదార్చవలసి వచ్చేది. కాని విచిత్రం, బేలపడిన నన్ను రామం ఉపశమింపజేస్తున్నాడు.

"యుద్ధంలో పర్వతంలా ఉండే రావణుడు రాముని శరఘాతానికి కుప్పకూలి మరణిస్తే, అతన్ని చూసి మండోదరి 'కామాంధుడివైన నీకు తగిన శాస్తే జరిగింది. సీత నీ మృత్యువుకు కారణమైంది. అయినా సీత నాకంటే ఏమంత అందగత్తే కాదుకదా' అని మనసులో అనుకుందట" అంటూ ఫక్కున నవ్వాడు. గంభీరంగా ఉన్న వాతావరణాన్ని తేలికపరుస్తున్న రామాన్ని మనసులో అభినందించాను.

రామం ఇంటి దరిదాపుల్లోకి వచ్చాము. ఇంటికి వెడితే వాతావరణం మారుతుంది. అక్కడ లక్ష్మి ఉంటుంది. ఈ సున్నిత విషయాన్ని లక్ష్మితో ఏం మాట్లాడాలా, ఎలా వ్యవహరించాలో తెలియని తికమకలో పడ్డాను.

అప్రయత్నంగా నా అడుగులు వెనకపడ్డాయి. రామాన్ని అనుసరించాను.

"చివరగా ఓ మాట సుదర్శన్! ఇప్పటివరకు అన్నీ కృంగదీసే మాటలు మాట్లాడాను. కాని ఈ మరణవార్త వల్ల నాకు కొంత మేలుకూడా జరిగింది. గత నెలరోజులుగా నేను ప్రతినిమిషం నిండుగా జీవించడానికి ప్రయత్నిస్తున్నాను. నాకు ఈ విషయం నలభై సంవత్సరాల క్రితమే తెలిసుంటే ఇంకెంత పరిపూర్ణంగా జీవించే వాడినో కదా అని ఇప్పుడూ అనిపిస్తోంది."

వేదాంతిలా మాట్లాడుతున్న రామాన్ని చూచి నివ్వెరపోయాను. 'ఈ భవబంధాలను అంటీముట్టనట్టుగా తీసుకోవడం ఒక మనిషికి సాధ్యమేనా? అసలు స్థితప్రజ్ఞుడనే వాడుంటాడా? ఉండొచ్చు. నా కళ్ళెదుటే నిలుచున్నాడుగా. ఇంతకుముందు తెలిసిన రామంకంటే వందరెట్ల వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తున్నాదు. మరణం చాలా శక్తివంతమైంది. జీవిని ఎల్లప్పుడు పొంచి ఉంటూ, ఎప్పుడెప్పుడు కబళిద్దామా అని ఎదురు చేసే మరణం తన సమయాన్ని ముందే వెల్లడిస్తే మనిషికి మరింత జ్ఞానోదయమవుతుంది.'

మేమిద్దరం ఈ విషాదాన్ని మరిచేసి ఉల్లాసంగా ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం. ఎప్పటిలాగే ఊర్లోకి వెళ్ళి తెలిసిన వాళ్ళను ఆప్యాయంగా పలకరించాం.

రామం తాను చేయబోయే పనుల గురించి టూకీగా వివరించాడు. రోజూ రాత్రి చదువురాని కూలీలకు చదువు నేర్పుతున్నాడట. ఓ పెద్ద గులాబీతోటను పెంచి ఊళ్ళోని పిల్లలకు రోజూ పూలను పంచుతాడట. తనకు తెలిసిన దూరపు బంధువుల ఊళ్ళకు వెళ్ళి ఓసారి పలకరించి వస్తాడట.

చీకటి కమ్ముకొస్తుంటే నేను లేచి 'ఇక నేను వెళ్ళొస్తాను... వెళతాను...' తటపటాయిస్తూ అన్నాను. హైదరాబాదు వెళ్ళటానికి అదే ఆఖరి బస్సు. బ్యాగులోకి లుంగీ, తుండు సర్దుకున్నాను.

'పద నేను కూడా బస్ స్టాండు వరకు వస్తాను' అంటూ లేచాడు రామం.

మౌనం తోడుకాగా మేమిద్దరం నడవటం మొదలు పెట్టాము. రాత్రి తొమ్మిదయింది. పొలాల్లో రోజంతా కష్టపడ్డ ఊరు నిద్రకు ఉపక్రమించింది. వీధుల్లో మనిషి అలికిడి లేదు.

బస్స్టాండులో బస్సు నిలబడి ఉంది. బడ్డీకొట్లు, హోటళ్ళు మూసివేసారు. వాటి తాలూకు మనుషులు బెంచీల మీద, బల్లమీద దుప్పట్లు లాగి నిద్రపోతున్నారు. అక్కడక్కడ విసిరేసినట్టుగా ఉన్నారు ప్రయాణీకులు.

బస్సు బయలుదేరటానికి ఇంకా టైం ఉన్నట్టుంది. కొద్ది దూరంలో డ్రైవర్, కండక్టర్ సిగరెట్లు కాలుస్తూ పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. నేను లోనికెళ్ళి ఓ కిటికీ పక్కన కూర్చున్నాను. బయట కిటికీ దగ్గరకు వచ్చి నిలబడ్డాడు రామం. 'బై అనాలా? మళ్ళీ కలుద్దాం అనాలా?'... ఏమో, నోట మాట పెగలని పరిస్థితి.

హైదరాబాద్ వెళ్ళిన తర్వాత భార్యతో మాట్లాడాలి. ఈ కష్టకాలంలో రామానికి, అతని కుటుంబానికి మా తరపున ఏం సహాయం చెయ్యవచ్చో చర్చించుకోవాలి. అప్పుడు కుటుంబసమేతంతా వచ్చి రామాన్ని చూడవచ్చు. ఆలోచిస్తున్న నాకు ఎవరో సన్నగా ఏడుస్తున్నట్టు వినిపించింది.

తలెత్తి రామం వైపు చూసాను. ఆశ్చర్యం! రామం కళ్ళలో కన్నీరు. దూరంగా లైట్ స్థంభం నుండి వస్తున్న కాంతిలో కన్నీరు తళుక్కుమని మెరుస్తున్నది.

ఇప్పటి వరకు తామరాకు మీది నీటిబొట్టులా మసలిన రామం ఏడుస్తున్నాడా?. ఇప్పటివరకు స్థితప్రజ్ఞుడిలా మాట్లాడిన రామం కంటి తడికి కారణం ఏమిటో?

"రామం! నువ్వు ఏడుస్తున్నావా? ఇప్పటివరకు నాకు ఎన్నో మంచి విషయాలు చెప్పి అకస్మాత్తుగా రోదిస్తున్నావేమిటి?" కంగారుపడుతూ ప్రశ్నించాను.

"కరక్టే! ఇప్పటివరకు నర్మగర్భంగా ఎన్నో సంగతులు మాట్లాడాను. ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించాను. కాని నాలో కుమ్మరి పురుగులా తొలుస్తున్న ఒక విషయాన్ని మాత్రం పైకి ప్రదర్శించకుండా ఎంతో జాగర్తపడ్డాను" అంటూ ఉబికి వస్తున్న కన్నీటిని భుజం పైనున్న కండువాతో తుడుచుకున్నాడు.

పైన పూర్ణచంద్రుడు తళతళా మెరిసిపోతున్నాడు. కన్నీటితో తడిసిన రామం చెంపలు వెన్నెల్లో తళుక్కుమని మెరుస్తున్నాయి. కాంతి నీటి మీద పడి పరావర్తనం చెందినపుడు వచ్చేదే తళుకు. అంతేకాని అవి ఆనందబాష్పాలా, లేక విషాదపు కన్నీళ్ళా అని కిరణాలకేం తెలుసు. ఒకసారిగా చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తున్న రామం ముఖంలోకి అలాగే చూస్తూ ఉండిపోయాను. ఏం చెపుతాడో విందామని ఎదురు చూసాను.

"నేను మాట్లాడేది లక్ష్మి గురించి, సుదర్శన్! నా బాధంతా ఆవిడ గురించే. నేను చనిపోతున్నానే బాధ నాకు ఏ కోశానా లేదు. కాని ఇప్పటివరకు నాతో కలిసి ముప్పై సంవత్సరాలు జీవితాన్ని పంచుకున్న లక్ష్మిని ఒంటరిని చేసి వెళుతున్నాననే భావన నన్ను కలిచివేస్తున్నది." మనసులోని లోతైన పొరలనుండి బయటకు తన్ను కొస్తున్న బాధను చెప్పుకుపోతున్నాడు.

"తనకు పద్దెనిమిది ఏళ్ళున్నప్పుడు పసుపు బట్టలతో పెళ్ళి పీటల మీద కూర్చున్న లక్ష్మి ముఖం నాకు ఇప్పటికీ చెక్కుచెదరకుండా గుర్తుంది. అమాయకమైన ముఖం. పెళ్ళిని, పెళ్ళి తంతుని ఆటపాటల్లా ఎంతో సంతోషంగా చేసుకుంది. ఉద్యోగరీత్యా నేనెలాంటి మారుమూల పల్లె వెళ్ళినా అభ్యంతరం చెప్పకూండా వచ్చేది. కొత్త ప్రదేశం, కొత్త మనుషులను తన కోమల స్వభావంతో ఇట్టే కలుపుకుని పోయేది. నోరు మంచిదైతే ఊరు మంచిది అవుతుందంటారు. తన మృదువైన మాటలతో చుట్టుపక్కల వారిని మంచి చేసుకునేది. వాళ్ళు తనకు 'టీచరమ్మ' హోదా కలిపించేవారు."

"ఎప్పుడు నన్ను వదిలి ఆవిడ భోజనం చెయ్యటం నేనెరగను. ఎప్పుడూ కష్టసుఖాల్లో నా హితాన్నే కోరేది. నా జీవితం ఇప్పటివరకు ప్రశాంతంగా గడిచిందంటే దాని వెనకాల లక్ష్మి పడ్డ శ్రమ ఎంతో ఉంది. " కన్నీళ్ళు నిండిన ముఖంతో చెప్పుకుపోతున్నాడు రామం. "అలాంటి లక్ష్మిని ఒంటరిదాన్ని చేస్తున్నానంటే నాకు గుండెకోతగా ఉంది, సుదర్శన్! ఆడైనా, మగైనా మనిషికి వైధవ్యాన్ని మించిన దుఃఖం మరొకటి లేదు" కన్నీళ్ళు నిండిన ముఖంతో చెప్పుకుపోతున్నాడు రామం.

డ్రైవర్, కండక్టర్ బస్సులోకి వచ్చారు. బస్సు కదిలింది. చివరిసారిగా రామంతో చేయికలిపి 'బై.. రామం' అన్నాను. బస్సు వెడుతుంటే చీకట్లోకి అదృశ్యమయ్యాడు రామం. కాని రామం మాటలు పదేపదే చెవుల్లోకి వినవస్తున్నాయి.

నిజం! వివాహబంధం ఎంత విచిత్రమైంది. ఇద్దరు మనుషులు ఒకటై, భార్యాభర్తల్లాగా స్నేహితుల్లాగా, శ్రేయోభిలాషుల్లాగా ఒకే జీవితాన్ని గడుపుతూ ఒకరికొకరు ఇంకొకరు సమయాన్ని, శక్తిని వెచ్చిస్తూ బతుకుతారు. ఇంతకంటే బలమైన బంధం ఇంకొకటి లేదు.

జీవితం కాల్రక్రమేణ ఎన్నో మార్పులు చెందుతుంది. ఎన్నో సుఖదుఃఖాలకు లోనౌతుంది. కాలం తన శక్తితో వాటన్నింటిని మరపింపజేస్తుంది. కాని మనిషికి ఆఖరి నిమిషం వరకు మెరుపు తగ్గకుండా నిలిచేది తనతో సాంగత్యం చేసిన మనిషి జ్ఞాపకాలే.

"మరి ఇంతకూ రామం మరణాన్ని నవ్వుతూ ఆహ్వానిస్తున్నట్టా? లేనట్టా?" అన్న ఆలోచనలో పడ్డాను.

ఇంతలో ఓ చల్లగాలి తెమ్మెర విసురుగా వచ్చి ముఖానికి తగిలింది. కిటికీ అద్దాన్ని లాగి మూసాను. కప్పుకోటానికి దుప్పటి లేదని గుర్తుకొచ్చింది. గబగబ అరచేతుల్ని రాచుకుని వేడిని చెంపలకు అద్దుకున్నాను. ఒళ్ళంతా దగ్గరకు ముడుచుకుని చేతులను మోకాళ్ళ మధ్యలో దాచాను. చలి కొద్దిగా తగ్గింది.

కిటికీలో నుండి బయటకు చూసాను. ఆకాశంలో పున్నమి చంద్రుడు వెలిగిపోతున్నాడు. కాని ఇంతలో ఓ కారు మేఘం వేగంగా వచ్చి చంద్రుణ్ణి ముంచేసింది. మానసికంగా అలసిన నేను కళ్ళు మూసుకుని సీట్లో వెనక్కి వాలాను.

❀ ❀ ❀

వరంగల్ జిల్లా ఇనుగుర్తి గ్రామంలో పుట్టిపెరిగిన తాటిపాముల మృత్యుంజయుడు , భార్య జయమాల, కుమారుడు శ్రీదత్తలతో మిల్పిటాస్, కాలిఫోర్నియాలో నివాసం. ఆంధ్రప్రదేశ్‌లో సివిల్ ఇంజినీర్‌గా ఆరేళ్ళు పనిచేసి అటు తర్వాత అమెరికాలో రెండు మాస్టర్స్ డిగ్రీలు చదివారు. గతపదేళ్ళుగా ఫైనాన్షియల్ సాఫ్ట్‌వేర్ రంగంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. భార్య ఎలిమెంటరీ స్కూల్లో టీచర్. కుమారుడు హైస్కూలు విద్యార్థి.

తెలుగు సాహితీ కృషి: -2006 సంవత్సరం సిలికానాంధ్ర-రచన సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కథలపోటీలో 'అందమైన పువ్వు' కథకి ప్రోత్సాహక బహుమతి లభించింది. - 'సుజనరంజని' వెబ్ మాసపత్రికలో 2006 సంవత్సరంలో 'నవ్వులనదిలో' శీర్షికన నెలనెలా ఒక హాస్యనాటికని రాశారు. ఈ నాటికలని అమెరికాలోని పలు సంస్థలు రంగస్థలమ్మీద ప్రదర్శించాయి. - 2007 సంవత్సరంలో 'పరదేశీ కతలు' శీర్షికన ప్రవాసాంధ్ర జీవన ఇతివృత్తాలతో నెలనెలా ఒక గల్పిక రాసారు. - సుజనరంజని ప్రత్యేక వార్షిక సంచికలకు సంపాదకునిగా పనిచేసారు. - ఈమాట, తెలుగుజ్యోతి మొదలైన వెబ్ మాసపత్రికల్లో, కాలిఫోర్నియా సాహితీ సదస్సు ప్రత్యేక సంచికల్లో కొన్ని కథలు, కవితలు ప్రచురించబడ్డాయి.



## సజీవబంధాలు

- డా.కె.వి.రమణ రావు

### కౌముది-రచన పోటీల్లో ఉత్తమ కథగా ఎంపికైన కథ

"ఈ వీకెండ్‌లో నువ్వోసారి మా ఊరు వెళ్ళాలి. మా నాన్నతో మాట్లాడి రావాలి" అన్నాడు పతి న్యూయార్క్ నుండి ఫోన్లో ఆ రాత్రి. శతాబ్దాల తెలుగు సంస్కృతి వేళ్ళు తెగి చరిత్ర పుటల్లోకి వెళ్ళిపోయి అక్కడక్కడా అవశేషాలుగా మాత్రమే మిగిలి చెన్నైగా మారిన మద్రాసు రోడ్ల మీద జారుతున్న కారులో ఆఫీసునుంచి ఇంటికెళుతున్నాను.

"మామయ్యతో నేను మాట్లాడాలా, దేని గురించి?" అన్నాను కొంత ఆశ్చర్యంగా. మామయ్య సంతానం ముగ్గుర్లో పతి పెద్దవాడు. ముగ్గురూ తమ సంసారాలతో అమెరికాలో స్థిరపడ్డారు.

"నీకు తెలియనిదేముంది, మా నాన్న మా ఊరొదిలి రానని భీష్మించుకున్నాడు. అమ్మ ఈ వయసులో అటూ ఇటూ తిరగలేక అవస్థపడుతూంది. డాక్టర్లింక ఆమెను ప్రయాణాలు చెయ్యొద్దన్నారు. అక్కడ మనవాళ్ళెవరూ లేరు. నేను రేపు నెల్లో ఇండియా వస్తున్నాను. మరీ అమెరికా రానని మొండికేస్తే ఏ హైదరాబాదులోనో వృద్ధాశ్రమంలో చేర్పిస్తాను. నీకాయనతో చనువుందిగదా, నువ్వు చెబితే వింటాడని." పతి దీర్ఘంగా వివరించాడు.

ఈ సమస్య ఈ మధ్య చాలా ఇళ్ళలో ఉన్నదే. సంధి యుగపు క్రైసిస్. 'నువ్వు చెపితే' అనే పెద్దరికం నా అహాన్ని కాస్త కదిలించి పెదవులపై చిరునవ్వుని వెలిగించింది.

"సరే, ఈ శనివారం వెళతాను. నువ్వు మళ్ళీ సోమవారం ఫోన్ చెయ్యి" అన్నాను. పతి కాస్సేపు మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

శనివారం పొద్దున్నే చెన్నైనుంచి మామయ్య వాళ్ళ ఊరికి బస్సులో బయలుదేరాను. కిటికీలోంచి సన్నటి చలిగాలి వస్తోంది. కళ్ళుమూసుకున్నాను.

"ఏ ఊరెళుతున్నారు" పక్క సీట్లోని పెద్దాయన పలకరించాడు. చెప్పాను.

"ఏం చేస్తున్నారు" రెండో ప్రశ్న. కళ్ళు తెరిచి ఆయన వైపు చూశాను. కంపెని పేరు చెప్పి "చెన్నైలోనే హెచ్.ఆర్.వింగ్ కి హెడ్‌గా ఉన్నాను" అన్నాను.

"మీ స్వంత ఊరు" మూడో ప్రశ్న

"లేదు" ముక్తసరిగా చెప్పి సీట్లో వెనక్కి జారగిలబడి కళ్ళుమూసుకున్నాను. ఆయన కొంచెం తత్తరపడినట్టుగా అనిపించింది. నిజం పదునుగా ఉంటుంది. తెగిన గాలిపటానికి స్వంత ఊరుండదు. ఎక్కడెక్కడో ఎగురుతూ రాలుతూ ఉంటుంది. మా ఊరితో సంబంధాలు మా నాన్న తరంలోనే తెగిపోయాయి. మా స్వంత ఊరు మాకో జ్ఞాపకం మాత్రమే. మా మామయ్య ఊరే నయం.

"నీకాయనతో చనువుంది కదా" అంటాడు పతి. ఏనాటి మాట. నేనాయన్ని చూసి కొన్నేళ్ళయ్యింది. ఆ ఊరెళ్ళి చాలా కాలమైంది. చిన్నప్పుడు సెలవులకి అమ్మతో వెళ్ళేవాళ్ళం. ఆ ఊరి జ్ఞాపకాన్ని ఊహాచిత్రంగా మలచుకోవడానికి ప్రయత్నించాను. 'చక్కని వీధి, పెద్ద పెంకుటిల్లు, ఎప్పుడూ పెద్ద ముగ్గు, ముందున అరుగులు, పెద్ద హాలు, అటూ ఇటూ గదులు, దాటాక ఎడమవైపున పూజ అది, కుడివైపున విశాలమైన వంటిల్లు, వెనక పెద్ద వరండా, పెరట్లో బావి, ఓ పక్కగా స్నానాల గదులు. అంతటా పూల చెట్లు. ఇంకా వెనక్కి వెళితే పెద్ద పెద్ద చెట్లు, ముఖ్యంగా అద్భుతమైన చిన్న రసాల మామిడి చెట్టు. చిలకలు, పక్షులు. చివరగా ప్రహరీ గోడ అదెక్కి కూర్చుంటే కనపడే చెరువు. అలలు అలలుగా అస్తమించే సూర్యుని ఎర్రదనం.'

'ఇంట్లో, పెరట్లో, పొలాల్లో తిరుగుతూ మామయ్య. నిలువెత్తు మనిషి, ఎత్తుకు తగ్గ లావు. ఇల్లంతా తిరుగుతూ, పనిచేస్తూ మనుషులు. వంటింట్లో సతమతమయ్యే అత్తయ్య, అమ్మ, పిన్నిలు. సాయంకాలం మల్లెపువ్వుల దండలు కడుతూ, నవ్వుతూ కులాసాగా

వాళ్ళే. ఇంకా పక్కయిళ్ళ ఆడవాళ్ళు, పేరంటాలు. ఎవరో ఎవరెవరో, గుర్తు తెలియని మనుషులు తిరుగుతూ, నవ్వుతూ' ఊహా చిత్రాన్ని భగ్నం చేస్తూ పెద్ద రొదగా బస్సు హారన్.

'మామయ్య గతం నుంచి వర్తమానంలోకి రావడం లేదంటాడు పతి. ఉన్న ఊరు, ప్రాంతం ఒక్కసారిగా వదిలేయడం అంత సులువుకాదు. ఉద్యోగుల్లో చాలామంది దూరప్రాంతాలకు వెళ్ళడానికి ఇష్టపడరు. కౌన్సిలింగ్ చేసి, ఆశ చూపి వేళ్ళు తెగ్గొట్టి వాళ్ళని దూరాలకు పంపడం నా వృత్తిలో భాగం. ఊరు మారినప్పుడంతా గాలిపటానికి కొత్త దారం కట్టుకోవడం, ఇప్పుడు డెబ్బైయేళ్ళ మామ్మయ్యకి కౌన్సిలింగ్ చేయాలి'. క్రమంగా నిద్రలోకి జారుకున్నాను.

రెండు బస్సులు మారి అరకిలోమీటరు నడిచి మామయ్య వాళ్ళ ఊరు చేరేసరికి సాయంకాలం నాలుగయింది. ఇంకా చలి మొదలవలేదు. ఊళ్ళో మార్పేమీ లేదు. కొన్ని పెంకుటిళ్ళ స్థానంలో మిద్దెలు. మరికొన్ని నివాసంలేక పాడుబడుతున్నవి. ఊరి మొదట్లో కొత్తగా  వెలిసిన సాయిబాబా గుడి, మామయ్యవాళ్ళ వీధీ అలాగే ఉంది. మధ్యలో ఉన్న శివాలయం ఆదరణ కరువై దిగాలుగా ఉంది. ఇల్లు దగ్గర పడే కొద్దీ నా ఊహ చిత్రంలోని లోపాల్ని నిజరూపం సవరిస్తోంది. ఊహాచిత్రాని కంటే నిజరూపం పాతగా, వెలిసిపోయినట్టుంది.

ఇంటిముందు అరుగుమీద ఓ ముసలామె కూర్చుని వాడిపోయిన తమలపాకులని వాటి పూర్వరూపంలోకి తీసుకురావడానికి సాగదీస్తోంది. ఆమె శరీరం తమలపాకు కంటే ఎక్కువగా వడలిపోయి ఉంది. నేను మెట్లెక్కడం చూసి "ఎవరయ్యా" అంది.

నేనెవరో చెప్పాను. ఆమె నెమ్మదిగా లేచి నిలబడి నవ్వుతూ నా మొహంలోకి చూస్తూ "బావున్నావాయ్యా?" అంది. నోట్లో ఉన్న నాలుగు పళ్ళూ గారపట్టి ఉన్నాయి. ఆమె ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తోంది. ఆమె మొహంలో ఏదో సంబరం.

"నువ్వెవరమ్మా?" అన్నాను తడబడి.

"నేనయ్యా రంగమ్మను, దాసరామెను గుర్తురాలా?" ఆమెవరో చప్పున గుర్తొచ్చింది. ఓ పెద్ద సంచిలో బొట్టూ, కాటుక, గాజులు, పిన్నులు లాంటి ఫ్యాన్సీ సామాను భుజాన వేసుకుని ఊరూరా తిరిగి అమ్ముకునేది. పట్నానికి, ఆ ఊరికి ఆమె అప్పుడు ఏకైక లింకు. ఈ ఊరొచ్చినపుడు ఇంట్లో మనిషిలాగుండేది. ఆమె సంచి మాకో గ్యాలరి. ఆసక్తిగా చూసేవాళ్ళం. అరుగుమీద చూశాను. సంచీ లేదు. ఆ ప్రదేశం ఖాళీగా ఉంది.

ఆమెను పలకరించి మెట్లెక్కి హాల్లోకి నడిచాను.

"అయ్య దొడ్లో ఉన్నాడు" అంటూ నిదానంగా వెనకాలే వచ్చింది రంగమ్మ.

బ్యాగ్ హాల్లో బల్లమీద ఉంచి, షూస్ విప్పుకుని పెరట్లోకి నడిచాను. పెరట్లో మామయ్య కనపడలేదు. వరండాలో ఓ పక్కన ఓ పదహారేళ్ళ అమ్మాయి కుంపటి మీద పాలు కాస్తోంది. మల్లె చెట్టుకి పాదులేస్తున్న ఓ ముసలాయనతో రంగమ్మ నా గురించి చెపుతోంది. అతను వెంటనే లేచి చేతులు రుద్దుకుంటూ నవ్వుతూ నా కెదురుగా వచ్చి "నేను గుర్తున్నానా అయ్యా? అంతా బాగున్నారా?" అనడిగాడు. కొంచెం ఒంగిన బక్క పల్చటి మనిషి. తలమీద జుట్టు చాలావరకు రాలిపోయింది. ఎండలో నల్లగా కమిలిన శరీరం. అతన్ని గుర్తుపట్టాను. మామయ్య పొలాల్లో పనిచేసే నాగయ్య. ఎలాంటి బలమైన మనిషి ఎలా అయిపోయాడు. అతను మా చిన్నప్పటి హీరో. ఏనుగుల్లాంటి ఎద్దుల్ని ముక్కుతాడు పట్టుకుని ఆడించేవాడు. చెరువుని ఇటునించి అటు అవలీలగా ఈదేవాడు. నేను కుశలప్రశ్నలు వేశాను.

"మామయ్య వెనకాల ఆవులకొట్టంలో ఉన్నాడు రా" అంటూ నా చెయ్యి పట్టుకుని నడిచాడు. మట్టి అంటిన అతని గరుకు చేతిలో మెత్తటి స్పర్శ.

మేం వెళ్ళేసరికి మామయ్య పశువుల కొట్టంలో గట్టుమీద కూర్చుని ఆవుకి పచ్చగడ్డి తినిపిస్తున్నాడు. పక్కన కుడితి తొట్టిలోకి ఓ ముసలావిడ నీళ్ళు పడుతోంది.

"రా .. రా... హరీ, ఇదేనా రావడం. చాలా ఏళ్ళయింది నిన్ను చూసి. నీ భార్య పిల్లలు ఎలా ఉన్నారు. ఫోన్ చేస్తే మనిషిని పంపేవాణ్ణిగా" మామయ్యలో ఆశ్చర్యం, ఆనందం, నిష్ఠూరం.

"ముందుగా అనుకోలేదు, ఇటువైపొచ్చే పనొకటి తగిలింది, తెలిసిన ఊరేకదా" అన్నాను. కారణం లేకుండా మనుషుల్ని చూసే రోజులు అంతరించిపోయాయి. మరో గట్టుపై కూర్చున్నాను. కుశల సమాచారం మాట్లాడుకుంటుండగా తొట్టిలో నీరు నింపడం పూర్తి చేసి పైపును చెట్ల మొదట్లో ఉంచి ముసలామె నేరుగా నాదగ్గరకొచ్చి సూటిగా నా మొహంలోకి చూస్తూ నవ్వుతూ నిలబడింది. ఆమె జుట్టంతా తెల్లని కాడలుగా వేళ్ళాడుతోంది. ఆమె కళ్ళు, బోసినోరు ఏకకాలంలో నవ్వుతున్నాయి. ఆ చూపు నా అస్తిత్వపు మూలాల్లో ఎక్కడో ఏదో వెతుకుతూంది. క్షణం సేపు నాకే నేను లేనట్టనిపించింది.

"ఈమెవరో గుర్తుపట్టావురా?" అన్నాడు మామయ్య నవ్వుతూ

"హుస్సేని అని... మనకు గేద పాలు పోసేది. ఇంట్లో ధ్యాన్యపు పనులు చేసేది... వీళ్ళ మనుమడు రఫీ అనీ...." గుర్తుతెచ్చుకుంటున్నాను.

"అంతే కాదు నీవు పుట్టినప్పుడు మీ అమ్మకు కాన్పు చేసిన మంత్రసాని కూడా ఈమే. ఆస్పత్రి కెళ్ళేంత వరకూ్కడా ఉండలేక పోయావు నువ్వు" పెద్దగా నవ్వాడు మామయ్య.

ఆమె చూపులు నా అస్తిత్వాన్ని దాటి వెనక్కి ఎందుకెళ్ళాయో బోధపడి ఒళ్ళు గగుర్పొడిచింది. ఇందాక పాలు కాస్తున్న పిల్ల నాకూ, మామయ్యకు కాఫీలు తెచ్చింది. మిగతా వాళ్ళందరినీ అక్కడికే రమ్మని పిలిచింది. ఆ అమ్మాయి 'ఇదివరకు మనింట్లో పనిచేసే నర్సమ్మ మనుమరాలు రత్న'గా పరిచయం చేశాడు మామయ్య. అందరూ లేచి ఇంటివైపు వెళ్ళారు.

"ఒళ్ళు వెచ్చబడిందన్నావు ఇంట్లో కూర్చోగూడదేమయ్యా" అంది రత్న.

"మా స్నేహితుడికి ఒంట్లో బాగలేకపోతే పక్కవూరెళ్ళొచ్చాను. కాస్త ఎండ దెబ్బ తగిలిందంతే" నన్నుద్దేశించి చెప్పి 'ఫర్వాలేదు నువ్వెళ్ళవే' అన్నాడు మామయ్య రత్నతో.

కాసేపు అవీ ఇవీ మాట్లాడాక "ఈ ఆవు పాలిస్తోందా మామయ్యా?" అన్నాను.

"నేను కూడా ముసలివాణ్ణైపోయాను" అన్నాడాయన నిర్వికారంగా ఆవు నుదుటి మీద రాస్తూ. ఛెళ్ళున తగిలిందామాట. సంస్కారంలోని లోపాలు అప్పుడప్పుడూ తెరతొలగించుకుని పైకొస్తుంటాయి తెలియకుండానే. తేరుకుని 'డామేజి కంట్రోల్' మాటలేవో మాట్లాడాను.

చిరు చీకటి అలుముకుంది. ఇద్దరం లేచి బయటికొచ్చాము. గోడ అవతల చీకట్లోకి ఇంకిపోతూ మసక బారుతున్న బూడిద రంగు చెరువు అలలు, ధ్యానంలోకి జారుకుంటున్న చెట్లు. వాటి తపస్సుని భగ్నం చేయడానికి ఆకాశం నుంచి వచ్చిన దేవతల్లాంటి పక్షుల కిలకిలలు.

మామయ్య చెట్లగురించి చెబుతున్నాడు. స్వగతంలాగ మాట్లాడుతున్నాడు. మామిడి చెట్టు దగ్గరకొచ్చాం. దాని బెరడుని చేత్తో ఆప్యాయంగా రాశాడు. " ఈ చెట్టు ఎన్ని తరాలకి పళ్ళిచ్చిందో. మాతాత వేశాట్ట. చిన్న పళ్ళు.. తియ్యటి రసాలు", అన్నాడు. వాటి రుచి గుర్తొచ్చి 'ఈ చెట్టు ఇంకా కాస్తోందా' అని అడగబోయి తమాయించుకున్నాను.

ముందు పెరట్లోకి వచ్చాం పూలచెట్ల గురించి, బావి గురించి ఏదో చెబుతున్నాడు. వరండాలోంచి వస్తున్న కాంతిలో మనిషి బలహీనంగా, నలతగా కనపడ్డాడు. వరండాలో ఇంకా కొందరు మనుషులు చేరారు. అందర్నీ పరిచయం చేశాడు. వాళ్ళంతా ఇదివరకు

నాకు తెలిసినవాళ్ళే. ఇంట్లోనో, పొలాల్లోనో పనిచేసిన వాళ్ళు. వాళ్ళంతా నన్ను ఆప్యాయంగా పలకరించడం నన్ను ఇబ్బంది పెట్టింది. కాలప్రభావం వాళ్ళ మీద లేదు. అలా ఎవరైనా ఉండగలగడం ఇంతవరకూ నా అనుభవంలో లేని నిజం.

స్నానాలు చేశాక అందరం వెనక వరండాలో భోంచేశాము. ఇవాళ్టి వంటంతా రత్నదే వాళ్ళమ్మ ఎక్కడికో వెళ్ళిందట. మామయ్య భోంచేయలేదు. పాలు మాత్రం పుచ్చుకున్నాడు. భోజనాలయ్యాక చలిమంట వేసుకుని చుట్టూ చేరి అందరూ చాలాసేపు మాట్లాడుకున్నారు. కొన్ని పాత సంగతులు, కొన్ని ఇప్పటివి. మధ్య మధ్యలో ఎవరో నాకు తెలియని కొత్తవాళ్ళు వచ్చి మామయ్యతో ఊరి విషయాలు, పొల విషయాలు మాట్లాడి వెళ్ళారు.

చలిమంట చుట్టూ ఉన్న మనుషుల ప్రపంచానికి నాకూ దూరం స్ఫుటంగా తెలుస్తోంది. లేచి కాస్సేపు అటూ ఇటూ తిరిగాను. పూలవాసన నింపుకుని గాఢమైన రాత్రి గాలి మత్తుగా మా మధ్య సంచరిస్తోంది. సమయం గడిచే కొద్దీ 'నిద్రొస్తోందంటూ' ఒకొక్కరే లేచి ముందు అరుగుల మీదకో, వెనక వరండా చివరకో హాల్లోకో పడుకోవడానికెళ్ళిపోయారు. చివరికి మామయ్య, నేను మిగిలాం. చలి మంట ఆరిపోయింది. ఇద్దరం లేచి లోపలికి మామయ్య బెడ్‌రూంలోకి వెళ్ళాం. మామయ్య ఇంకా నలతగా కనపడ్డాడు. చేయి పట్టుకు చూశాను. వేడిగా ఉంది. 'ఫరవాలేదు కూర్చోమని' ఆయన మంచం మీద పడుకున్నాడు.

కొద్దిసేపు ఇతర విషయాలు మాట్లాడాక అసలు విషయంలో కొచ్చాను. ఆయనా, భార్యా, పిల్లల దగ్గరికెళ్ళాల్సిన అవసరం గురించి వివరంగా రకరకాలుగా చెప్పాను.

అంతా మౌనంగా విన్నాడు. కాస్సేపు ఏమీ మాట్లాడలేదు.

"నేనీ క్షణంలో అన్నీ వదిలేసి నా పిల్లల దగ్గరకి వెళ్ళిపోగలను" అన్నాడు హఠాత్తుగా.

"మరి" అన్నాను ఉత్సాహంగా

"కాని వెళ్ళను... ఎలా వెళతాను ఇక్కడ వీళ్ళందరు, ఇల్లు అన్నీ ఉన్నాయి"

"వీళ్ళా" అన్నాను విస్మయంగా.

"వీళ్ళు నీకు మనుషులుగా కనబడ్డంలేదా" అన్నాడు పక్కకి ఒత్తిగిలి.

తడబడ్డాను. ఏదో సర్దిచెప్పబోయాను. ఈసారి కుదర్లేదు.

"నాకు ఊహ తెలిసిందగ్గర్నుంచీ వీళ్ళే. వీళ్ళంతా లేకపోతే ఇవన్నీ ఎక్కడివి. నిజం చెప్పు వీళ్ళంతా తమ సర్వస్వం ధారపోస్తే కదా వాళ్ళు అమెరికా వెళ్ళగలిగారు".

"ఇది భూస్వామ్య వ్యవస్థ అవశేషం. నువ్వొక్కడివే ఏం చెయ్యగలవు"

"నేనూ అవశేషంలోని భాగమే కదా. ఇప్పుడు పారిపొమ్మంటావా?" నీరసంగా నవ్వాడు.

"వాళ్ళకేదో ఏర్పాటు చేస్తే సరిపోతుంది కదా",

"వాళ్ళు కేవలం జరుగుబాటు కోసం ఇక్కడున్నారనుకుంటున్నావా.? నాకూ వాళ్ళకి డెబ్బైయ్యేళ్ళగా ఇదో సమాజం. ఇది తప్ప మరోటి తెలియదు. ఇదంతా నా ఒక్కడిదేనా"

"ఇలా ఎంతకాలం... ఈ "పాత" ఇంట్లో?" నా ఆఖరు ప్రశ్న

సమాధానంగా ఆయన 'తెలియదు' అన్నట్టు చెయ్యూడించాడు. మాట్లాడలేదు.

కాస్సేపు మౌనం తర్వాత ప్రయత్నం మీదట కష్టంగా లేచాడు.

"వీళ్ళే కాదు, ఇలారా... ఇది 'పాత' ఇల్లన్నావ్ కదూ..." అంటూ బరువుగా నడుస్తూ హాల్లోకెళ్ళాడు నేనూ వెనకాలే వెళ్ళాను. వంట గదిలోకి దారి తీశాడు. లైటు వేశాడు. కుకింగ్ ప్లాట్ ఫాం, గ్యాస్ స్టవ్ తప్ప అంతా పాతగానే ఉంది.

"ఇది ఎందరికో అన్నం పెట్టిన అన్నపూర్ణ నిలయం" అంటూ మరో గదికి తీసుకెళ్ళాడు. అందులో మధ్యలో రెండు గుండ్రటి చెక్క స్థంభాలున్నాయి. "ఇదేంటో తెలుసా... ప్రసూతి గది. నువ్వు భూమ్మీదికొచ్చి కళ్ళు తెరిచిందిక్కడే నువ్వేకాదు.... మీ అమ్మ, నేను, మా నాన్న ఇక్కడే పుట్టాం. ఇంకా నాకు మీ ఏడుపులు, కేరింతలూ వినిపిస్తున్నాయి. అదుగో ఆ స్థంభాలకి చీర ఉయ్యాల కట్టేవాళ్ళం. నాకింకా ఈ గదిలోని బాలింత పథ్యం, వెల్లుల్లి ఘాటు తెలుస్తూనే ఉన్నాయి".... అంటూ ఒక్కొక్క గదికీ, హాలుకీ తీసుకెళ్ళి ఎన్నో పాత సంఘటనలు నెమరేసుకున్నాడు. ఎవరెవర్నో గుర్తుకు తెచ్చుకున్నాడు. అప్పుడప్పుడూ స్వగంతంలా మాట్లాడుతూ ఏదేదో చెప్పాడు. అది తనకి కేవలం ఇల్లు మాత్రమే కాదన్నాడు. ఆఖర్న పూజగదిలోకి తీసుకెళ్ళాడు. దీపం కొడిగట్టుతోంది.

"మా నాన్న ప్రతిరోజూ పొలం నుంచి వచ్చి రెండు గంటలు పూజ చేసి హారతి ఇచ్చాక గానీ భోజనం చేసేవాడు కాదు.... ఆయన కొట్టే గంట ఈ వీధంతా వినపడేది... నాకు ఇప్పటికీ వినపడుతూనే ఉంది. ఓ రోజేమైందో తెలుసా.. చాలాసేపు దేవీ పూజ చేస్తూ మంత్రాలు చదువుతూండిపోయాడు.... ఒంటిగంటైంది. రెండైంది... వెనక కూర్చున్న మా అమ్మ గట్టిగా కేక వేసి సొమ్మసిల్లిపోయింది.... ఇక్కడే.. నువ్వు నిలబడ్డ చోటే..." మామయ్యగోడకానుకుని చెప్పుకుపోతున్నాడు, మరో లోకంలో ఉన్నట్టుగా, క్రమంగా మాటలాగిపోయాయి. నేను తీసుకెళ్ళి పడుకోబెట్టాను. ఒళ్ళు వేడిగా ఉంది. పలుచటి దుప్పటి కప్పి లైటార్పివేశాను. కిటికీలో సన్నగా హరికేన్ లాంతరు వెలుగుతోంది. నేను నాగదిలో కొచ్చి పడుకున్నాను. ఆలోచనలతో చాలాసేపు నిద్రరాలేదు. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

❀ ❀ ❀

ఎవరో తట్టి లేపినట్టయి మెలుకువ వచ్చింది. ఎదురుగా హరికేన్ లాంతరు పట్టుకుని నుంచున్న మామయ్య. కరెంటు పోయినట్టుంది. లాంతరు వెలుగుతప్ప అంతా చీకటి. ఏ అర్ధరాత్రో అయినట్టుంది. ఎక్కడో చాలా దూరంలో డప్పుచప్పుడు తప్ప అంతా నిశ్శబ్దం.

"ఒరేయ్ హరీ లేరా.... అమ్మవారు కూర్చున్నచోటు చూపిస్తాను...రా" అంటూ హాల్లోకి వెళ్ళారు... ఓ క్షణం నాకేమీ అర్థం కాలేదు. దిగ్గున లేచి హాల్లోకొచ్చాను. అప్పటికే ఆయన పూజగది ముందు నిలబడి తలుపులు తెరుస్తున్నాడు. నేను వెళ్ళి ఆయన పక్కన నుంచున్నాను. మనిషి సన్నగా వణుకుతున్నాడు, కళ్ళు సగం తెరుచుకుని ఎటో చూస్తున్నట్టున్నాయి, మొహంలో ఏదో సంభ్రమం, డెలీరియంలో మరో లోకంలో ఉన్నట్టున్నాడు. నా వైపు తిరిగి గుసగుసగా చెప్పాడు.

"మొదటగా అమ్మే చూసింది. ఆమే చెప్పింది. నేనప్పుడు చాలా చిన్నవాణ్ణి... ఆ రాత్రి ఊరేగింపు నిదానమైంది..... మనింటి దగ్గరికొచ్చేసరికి దుర్ముహూర్తమొచ్చేసింది.... అమ్మవారి రథం గుడికి ఇంకా దూరంలో ఉంది.... వెనకాల నుంచి రాక్షసుడొచ్చేస్తున్నాడు..... తానేమో శాంతరూపంలో ఉంది.... శివయ్యకేసి చూసింది... ధ్యానంలో ఉన్నాడు...... ఉలకడు..... పలకడు... పోనీ రౌద్రరూపం దాలుద్దామా అంటే వీధినిండా భక్తులు, పిల్లలు.... సరిగ్గా రథం మనింటి ముందుకొచ్చింది.... మా అమ్మ తలుపు దగ్గరనుంచుని చూస్తోంది..... అమ్మవారు ఇటుకేసి చూసింది. చప్పున రథం దిగి వేగంగా మన ఇంటిలోకొచ్చి తిన్నగా పూజ గదిలోకెళ్ళిపోయింది. మా అమ్మ వెనకాలే పరుగెత్తింది... అప్పటికే అమ్మవారు పూజగదిలో మాయమైపోయింది... ఇదిగో... ఇక్కడే.." మామయ్య కొంచెం ఆయాసపడుతున్నాడు. కాస్సేపు మౌనం తర్వాత ఆయన నెమ్మదిగా నడుస్తూ తన గదిలోకి వెళ్ళిపోయాడు. అమ్మవారి మీదకంటే అమ్మ మాట మీద ఉన్న నమ్మకం ఆయన మొహంలో ప్రతిఫలించింది. చాలాసేపు అక్కడే నుంచుండిపోయి తర్వాత వెళ్ళిపడుకున్నాను.

❀ ❀ ❀

ఆ మర్నాడు ఆదివారం మధ్యాహ్నానికి మామయ్య జ్వరం తగ్గి మామూలు మనిషయ్యాడు. ఆ రాత్రి జరిగిన విషయాలేవీ ప్రస్తావనకు రాలేదు. నాలో ఏదో చిన్న కదలిక. ఆరోజు అందరితో కలిసిపోయి మాట్లాడుతూ గడిపాను. ఆ సాయంకాలమే చెన్నైకి బయలుదేరాను.

అనుకున్నట్టే సోమవారం రాత్రి పతి ఫోన్ చేశాడు. ఓపిగ్గా అతనికి నా అనుభవాలు వివరించి చివరగా చెప్పాను.

"మనం అనుకున్నట్టు మీ నాన్న అక్కడ ఒంటరివాడు కాదు. అతని చుట్టూ పిల్లా, పెద్దా అన్ని వయసులువాళ్ళు ఆడా, మగా ఎంతోమంది సన్నిహితంగా ఉన్నారు. అదో ప్రపంచం. వాళ్ళ ప్రపంచం. దాన్ని నిర్మించుకుందీ వాళ్ళే. వాళ్ళతో ఆయనకి విడదీయరాని ప్రేమానుబంధాలున్నాయి. మనుషులే కాదు పశువులు, చెట్లు, ఇళ్ళు, పరిసరాలు... అన్నింటితో, తరాలుగా ఉన్న స్థిర జీవనంలో కొన్ని విలువల్ని పెంచుకున్నారు. ఆయన వాటిని బాధ్యతలుగా కూడా గుర్తించాడు. మనం వేళ్ళు తెగ్గొట్టుకుని ఊర్లు దేశాల వెంబడి తిరుగుతూ వీటిని నిర్లక్ష్యం చేశాం. నిజానికి తెగిన గాలిపటాన్నయిన నాకు ఆ ఊరితో ఇంకా ఉన్న 'అంబ్లికల్ కార్డ్' మొన్ననే అనుభవంలోకి వచ్చింది. ఒక్కరోజున్న నాకే అలావుంది.

ఆయన గతంలో లేడు. వర్తమానంలోనే ఉన్నాడు. పెద్దవాళ్ళ అనుభవాల్నీ, వర్తమానాన్ని మనం గుర్తించలేక తిరస్కరిస్తున్నాం. ఆయన జ్ఞాపకాలు గతం కాదు, సజీవం, ఆయన్లో ఓ భాగం. ఆయన వచ్చేస్తే ఆ 'ఇల్లు' ఏమవుతుందో ఆయనకి తెలుసు. మీరు అమెరికా రమ్మని బలవంతం చేయడం ఆయన్ని బాగా ఒత్తిడికి గురిచేస్తోంది. గతిస్తున్న వ్యవస్థ విలువల్లోని మంచి చెడులు పక్కన పెడితే... కొత్త విలువలు ఇంకా సరిగ్గా ఏర్పడకముందే... పాతవాళ్ళని వాళ్ళ పరిసరాల్నుంచీ బలవంతంగా పెకిలించడం అంత సబబు కాదేమో.... ఆలోచించు. అందులోనూ పూర్తి కొత్త పరిసరాల్లోకి కేవలం జీవితం కొనసాగింపు కోసం..........

ఆయన ఆలోచనలని గౌరవించడం, అత్తయ్యను ఎక్కువగా ఆయనతోనే ఉండనీయడం, ఆయన తన బాధ్యతలనుకుంటున్న వాటిని నిర్వహించడంలో మీరు ఇంకా అవసరమైతే సహాయపడడం.. నా దృష్టిలో ఇవీ, మీరు ప్రస్తుతానికి చేయతగ్గవి. చెట్టు గుళ్ళో ధ్వజ స్థంబంగా ఉండడానికంటే, చెట్టుగా ఉండటానికే ఇష్టపడుతుంది."

## గృహప్రవేశం

– పింగళి భట్టిప్రోలు బాలాదేవి

స్కూలు నుంచి అప్పుడే ఇంటికి వచ్చింది ఆనంద. "వంశీ మామయ్య గృహప్రవేశానికి రమ్మని ఫోన్ చేసాడు" చెప్పింది చిన్నకూతురు సరిత. వంశీ తన పెద్ద తమ్ముడు. గృహప్రవేశం అన్న మాట వినే సరికి తండ్రి మురళీకృష్ణ గుర్తొచ్చాడు ఆనందకి..

ఇరవై ఏళ్ళ క్రిందట. అయిదవ తారీకు. నవంబర్ నెల. ఆరోజే నాన్న ఇంటికి గృహప్రవేశం. నలుగురు మొగపిల్లలూ, ముగ్గురు ఆడపిల్లలూ ఉన్నా, ఒక్క బి.ఎస్సీ చదువుతున్న ఆఖరి తమ్ముడు బాలకృష్ణ తప్ప ఇంకెవ్వరూ నాన్నవాళ్ళతో ఉండడంలేదు... ఐతే సరిగ్గా ముహూర్తం సమయానికి బాలకృష్ణకి పరీక్షలు అవుతున్నాయి. అమ్మా నాన్న పీటల మీద కూర్చునేటప్పుడు తనూ అక్కడలేడు.. పెద్దన్నయ్యలిద్దరూ పెద్ద పెద్ద ఉద్యోగస్తులు. అత్తవారిళ్ళకు వెళ్ళడానికి, దేశపర్యటనకూ, ఎవరెవరో బంధువుల ఇళ్ళకీ వెళ్ళడానికీ, శలవులన్నీ ఖర్చు పెట్టేసుకోవడం వల్ల, వాళ్ళకీ గృహప్రవేశానికి వెళ్ళడానికి తీరుబడి కాలేదు. అక్క శ్యామలకి నెలలు నిండబోతున్నాయి. బావ అమెరికా

వెళ్ళాడు. చిన బావ చిన్నక్క డాక్టర్లు. సెలవు దొరకలేదు. అది వెళ్ళడానికీ వీలు కాలేదు. అధమం తానన్నా వెళ్ళాలనుకుంది. కాని తన భర్త పని చేస్తున్న జూట్ మిల్‌లో స్ట్రైక్ వల్ల అక్కడే డ్యూటీ, భోజనం, నిద్రతో ఇంటికి రావడానికి కూడా వీలు కాలేదు మూడు రోజుల నుంచీ, తనకేమో నెలల చంటి పిల్లవాడు. అత్తగారు జబ్బుమనిషి, మామగారు ఎప్పుడూ సంఘసేవతో తిరుగుతూ ఇంటి వ్యవహారలే పట్టించుకోడు. దాంతో తానూ వెళ్ళలేకపోయింది. మూడో తమ్ముడు రెసిడెంటు డాక్టరు వాడూ వెళ్ళలేక పోయాడు..

అది నాన్న ఇల్లు అనడం కన్న హౌసింగ్ బోర్డ్ వాళ్ళ ఇల్లు అనడం సబబు. స్టేట్‌గవర్నమెంట్‌లో పెద్ద ఉద్యోగం చేసినా నీతీ నిజాయితీ ఉన్న మనిషి నాన్న. ఉద్యోగం చేసినంత కాలం పిల్లల చదువులతో, కుమార్తెల పెళ్ళిళ్ళతో తన సిగరెట్ల అలవాటుతో ఎప్పుడూ ఎర్రని ఏగానీ బాంక్‌బేలన్స్ లేకుండా రిటైరయ్యారు.

అమ్మ "మనం ఇల్లు కట్టుకుందామండి" అంటే,

"మనకిల్లెందుకు? మన ఏడుగురి పిల్లలకి ఇళ్ళుంటాయి. ఒక్కొక్కరి దగ్గర కొన్ని నెలలు గడిపేస్తే సరిపోతుంది. పెన్షన్ ఎలాగూ వస్తుంది మనకి - అప్పటికి ఈలోకంలో నేనుంటే. లేక ఫామిలీ పెన్షన్ అన్నా వస్తుంది, గ్రాట్యుయిటీ, గ్రూప్ ఇన్సూరెన్స్‌తో పాటు. అయినా తెలివి తక్కువ వాళ్ళు ఇళ్ళు కట్టుకుంటారు. తలివైనవాళ్ళు అందులో బ్రతుకుతారు" అనేవారు.

అమ్మకి కోపం వచ్చేది." అంటే మన పిల్లలు తెలివి తక్కువ వాళ్ళనా మీ ఉద్దేశం?" అనేది.

అమ్మకు మటుకు ఎవళ్ళ దగ్గరా వారం పదిరోజులకన్నా ఎక్కువ రోజులు ఉండడం ఇష్టం లేదు. తన వంటిల్లూ, గాస్ స్టవ్, ఫ్రిజ్జు, కుక్కరూ వగైరాలతో ఎప్పుడూ సతమతమవుతుండేది ఆమె. పనిమనుషులు దొరక్క అంట్లు తోమడం దగ్గరనుండీ అన్నీ తానే చేసుకోవలసి వస్తుంది. ఐతే నాన్న ఉద్యోగం చేసేటప్పుడు కూడా ఇద్దరు ముగ్గురు బంట్రోతులూ, పనిమనుషులూ ఉన్నా, ఏదో కూరలు తరిగి పెట్టడం, బజారు సామాన్లు తేవడం, బియ్యం, పప్పులూ, గోధుమ నూకా చెరిగించడం తప్ప ఇంకే పనులు వాళ్ళను చెయ్యనిచ్చేది కాదు. కోడళ్ళూ మంచి వాళ్ళే. ఎప్పుడన్నా వాళ్ళ దగ్గరకి వెళ్ళినప్పుడు కూడా "మీ కెందుకు శ్రమ అత్తయ్యగారూ, మేగజైన్లు చదువుకుంటూ రెస్ట్ తీసుకోండి." అని తమ వంటింట్లోకి ఆమెని అడుగుపెట్టనిచ్చేవాళ్ళు కాదు. తన పనులు తాను చేసుకోవడం అలవాటయిన ఆమెకి వాళ్ళ ఇళ్ళల్లో ఉన్నన్నాళ్ళూ ముళ్ళమీద ఉన్నట్లుండేది. అందువల్లనే అప్పుడప్పుడూ "ఎక్కడో ఒక రెండు గదులూ, వంటిల్లూ, డైనింగ్ హాలూ ఉన్న ఇల్లైనా మనకుంటే బావుంటుంది" అని తన పద్ధతిలో నెమ్మదిగా నాన్నతో కదిలించేది. ఆయన నవ్వి "చూద్దాంలే. ఇదిగో ఏ లాటరీనో తగిలి డబ్బు వస్తే ఆ పని చేద్దాం." అనేవారు.

రిటైరయ్యేముందు హౌసింగ్ బోర్డు వాళ్ళు అడ్వర్టయిజు మెంటు పేపర్లో చూసి, అప్లికేషను పెట్టి ముందుగా కట్టవలసిన ఎర్నస్ట్ మనీ డిపాజిట్టు కోసం ప్రావిడెంటు ఫండ్ నుండి అప్పు తెచ్చి కట్టేసారు. ఏదో రూల్సు చూపించి, "నువ్వు మిడిల్ క్లాస్ ఇన్‌కమ్ గ్రూప్‌కి పనికిరావు, నీ జీతం ఎక్కువ..." అన్న వంకతో ఆయన దరఖాస్తును తిరస్కరించి డబ్బు వాపసు చేసేవాళ్ళు. ఆయన చేతికి డబ్బు వస్తే ఉంటుందా? ఏమనవడికో సైకిలు, మొగపిల్లలకి వాచీలు కొనిపెట్టడానికో, ఏ బంధువులు ఇచ్చింది తీర్చడానికో ఖర్చు పెట్టేసేవాళ్ళు - తెచ్చిన అప్పు తీర్చడానికి జీ.పీ.ఎఫ్.లో ప్రతీనెలా ఎక్కువ డబ్బు కట్టవలసి వచ్చి నానా బాధలూ పడ్డారు.

రిటైర్మెంట్ ముందుగా ఎరన్డ్‌లీవ్ ఎన్‌కేష్ మెంటు చేసుకున్న డబ్బు పదమూడువేలు వచ్చింది. సహజంగానే నెలనెలా వచ్చే పెన్షను డబ్బు జీతంకంటే చాలా తక్కువైంది. అప్పటికి ఎం.ఐ.జి ఇంటికి అర్హత వచ్చింది. హౌసింగ్ బోర్డువారు ఎర్నస్టు మనీ డిపాజిట్టు ఉంచేసుకుని అంగీకారంగా మరో అయిదువేలు ముందుగా కట్టమన్నారు. ఇల్లు అలాట్ మెంటు అయ్యాక మరో పదివేలు కట్టాలనీ, మిగతా ఇంటి ఖరీదు ఇన్‌స్టాల్ మెంట్సుగా కట్టాలనీ తాఖీదు పంపారు.

ఎక్కడో అస్సాంలో పనిచేస్తున్న బావగారు అక్కకి సాయంగా కొన్నాళ్ళుండమని అడగడంతో అక్కడికి వెళ్ళడానికి, రెండో అన్నయ్య ఏదో ఆపరేషనుకని ఒకసారీ, జాండీసు వచ్చిందని మరోసారి, తనకేదో ఊరికి బదిలీ అయిందని లగేజి పాకింగ్‌కి సాయం రమ్మని

ఒకసారీ, మనవళ్ళ, మనుమరాళ్ళ బారసాలఖర్చులకీ, తన పెళ్ళిచూపుల కోసం చెప్పులరిగిపోయేటట్లు హైదరాబాద్‌లో ఈ చివర సైదాబాద్ నుంచి ఆ చివర మౌలాలీ వరకు ఉన్న అన్ని బస్తీలు తిరగడమే కాకుండా ఢిల్లీ, మద్రాసు, రాజమండ్రి కాకినాడ మొదలైన చోట్లకి అమ్మతో పాటు తిరగిరావటం వీటితో ఎరర్న్ లీవ్ సరెండర్ డబ్బు ఖర్చయిపోయి, అప్పటికి నాన్న చేతిలో రెండువేల చిల్లరే ఉంది.

మూడవ వాడు నాన్న రిటైరయిన సంవత్సరమే ఎం.బి.బి.యస్. మొదటి సంవత్సరంలో చేరడంతో వచ్చిన పెన్షన్ డబ్బు సుమారు సగం పైగా వాడికే ఖర్చయింది..

రకరకాల సిల్లీ కారణాలవల్ల అప్పటికింకా గ్రాట్యుయిటీ డబ్బు చేతికందలేదు. అన్ని ఆఫీసుల్లోనూ రెడ్ టేపిజం వల్ల పెన్షనులో అడ్వాన్సుగా తీసుకుందామనుకున్న కమ్యుటేషన్ మొత్తం కూడా మంజూరు కాలేదు.

ఉద్యోగాలు చేస్తున్న అన్నలిద్దరికీ ఉత్తరాలు రాశారు నాన్న 'ఏమైనా సహాయం చేస్తారా?" అని.. పెద్దన్న మద్రాస్‌లో ఏదో హౌవుసింగ్ కాంప్లెక్సులో డబ్బు కట్టడానికి అప్పు తీసుకోవడం వల్ల ప్రస్తుతం వస్తున్న జీతం తనకే చాలటం లేదని, డబ్బు పంపడానికి వీలు కాదనీ వ్రాశాడు. రెండో అన్న తాము కొన్న ఫ్రిజ్, టీవీ, టూ ఇన్ - వన్ వగైరాల హైర్ పర్చేజ్ డబ్బు ఇన్‌స్టాల్ మెంట్లు కట్టడంలో తనకూ చాలా ఇబ్బందిగా నడుస్తుందనీ ఒక రెండువందలు మటుకు పంపాడు.

చివరకు నాన్న ఏదీ తోచక, తనదగ్గరున్న మొత్తం కట్టేసారు. ఎలాగైతేనేం తమకొక సొంత ఇల్లు వస్తుందనీ, తన వంటిల్లు ప్రత్యేకంగా కావలసినరకంగా గట్లూ అవీ కట్టించుకోవచ్చనీ, దేవుడి కోసం అందంగా పూజా మందిరం తయారు చేసుకోవచ్చనీ కంటున్న కలలతో నాన్న అడగగానే అదీ శుక్రవారం పూట అయినా నాన్న అడగడమే తర్వాయిగా దేవదారు చెక్కల్తో తయారు చేసిన, అద్దె ఇంట్లో పెట్టిన, పూజామందిరంలోని ఇత్తడి సింహాసనంలోని ఇత్తడీ, రాగి, వెండి దేవతా విగ్రహాలకు, గంగా చెంబులకూ నమస్కారాలు పెట్టి, గొలుసు, గాజులూ నాన్నకు ఇచ్చేసింది అమ్మ. ఎంత అమాయకురాలు అమ్మ! పిల్లలకోసం. అదికావాలి, ఇదికావాలి అని తప్ప తనకోసం ఏదీ కావాలని ఏనాడూ నోరు తెరిచి అడగదు. ఉద్యోగాలు చేస్తున్న కొడుకులు నాన్నకు ఏదో తమకు బుద్ధిపుట్టినప్పుడు డబ్బు పంపుతున్నామన్న వంక మీద ఆమె చేతిలో ఎప్పుడూ ఒక వందరూపాయలన్నా పెట్టి ఎరగరు - అయినా పిల్లలమీద ఈగవాలనివ్వదు. నాన్న ఎప్పుడన్నా విసుక్కుంటే పిల్లలనే సమర్ధిస్తుంది, మృదువుగా మాట్లాడుతూనే.

బోర్డు వాళ్ళు ఆ తరువాత రెండేళ్ళ వరకూ ఇంటి అలాట్ మెంట్ ఆర్డర్ పంపలేదు. నాన్న ఎన్ని ఉత్తరాలు రాసినా దేనికీ జవాబు లేదు, ఎప్పుడూ అనవసరపు అల్లర్లు పడడం ఇష్టంలేని నాన్న రిటైరయిన రాత్రే గవర్నమెంట్ బంగళా ఖాళీ చేసేసి, సామాన్లు అక్కడా ఇక్కడా పడేసి అప్పుడప్పుడు పిల్లల ఇళ్ళకి వెళ్ళి గడపడమూ, తనూ, భార్యా, ఆఖరి తమ్ముడు ఉండడానికి ఎక్కడో అద్దె ఇళ్ళు మారుస్తుండడమూ చేస్తూ ఎపటికప్పుడు చిరునామా మార్పుల గురించి బోర్డు వాళ్ళకి మామూలు ఉత్తరాలు కొన్ని రిజిష్టరు పోస్టులో కొన్ని ఉత్తరాలు రాసినా ఏ ఒక్క ఉత్తరమూ బోర్డులో పని చేసే ఒక బద్ధకస్తురాలయిన అమ్మాయి చాకచక్యం వల్ల ఫైలులోకి వెళ్ళక మొట్టమొదట నాన్న ఇ.యం.డి. కట్టినప్పుడు, నాన్న ఇచ్చిన ఆ పాత అడ్రస్సే ఉండేది ఆ ఫైల్‌లో.

ఎలాగో మొత్తం మీద, ఆయనంతట ఆయనే వెళ్ళి, ఆ ఇంటి ఎలాట్ మెంటు ఆర్డరు తెచ్చుకుని, ఇన్నాళ్ళకి అతికష్టం మీద అక్కడ తను ఇంట్లో గృహప్రవేశం చేసుకుంటున్నారు ఆరోజు.

ఆయన ఉద్యోగం చేస్తున్న రోజులనుంచి ఉన్న ఒక స్నేహితుడు ఆయన భార్యా పిల్లలూ నలుగురూ మాత్రమే వచ్చారు ఆ రోజుకి. ఆ స్నేహితుడికి వచ్చే జీతంలో నలుగురు పిల్లలని పోషించుకోలేని అవస్థలో 'ఒకరోజు భోజనం ఎక్కడయినా ఉంటే చాలనుకునే' ఆ మనిషి, ఆ రోజుకి సుష్టుగా భోజనం చేశాడు పెళ్ళాం పిల్లలతో. అలా ఎంత మందికో ఏదో విధంగా సాయం చేసేవారు నాన్న, తనపింతల్లి పిల్లలకి, సొంత అన్నయ్యలకి, వాళ్ళ పిల్లలకి, తన అక్కయకి ఏదో ఒక విధంగా డబ్బు పంపుతూనే ఉండేవారు రిటైరయ్యాక కూడా, తనకి చాలకపోయినా.

ఈ పరిస్థితుల్లో ఆయనకి ఇంటికి ఇన్‌స్టాల్ మెంట్లు కట్టడం గగనంగానే ఉండేది, ఆ సమయంలో పెద్దక్క శ్యామల, బావగారు శివరాం ఆయన్ని ఆదుకున్నారు. ముందేం ఉత్తరం రాశారోగాని, ఆయన రాసిన రెండవ ఉత్తరం ఒకటి పెద్దక్క దగ్గర తను చూసింది అనుకోకుండా దాన్ని బట్టి తనకి తెలిసిందేమంటే, ఆ ఇంటికి ఇన్‌స్టాల్ మెంట్లు అక్క బావగారే క్రమం తప్పకుండా కట్టేవారని, ఎప్పుడు ఏ డబ్బు వాళ్ళు ఎందుకు ఎప్పుడు పంపారో అకౌంటంతా రాసి, చివర్న ఆయన రాశారు, "మేమిద్దరం మీకు ఇద్దరికీ ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడం లేదు. మీరేగాని ముందుకు వచ్చి ఆ సమయంలో ఆ ఇంటి బాధ్యత తీసుకోకపోతే, నేనీపాటికి ఆ ఇల్లు అమ్మేసి, మిగిలిన హౌసింగ్ బోర్డ్ వాళ్ళ లోనంత కట్టేసి, మిగిలిన డబ్బు ఏదో విధంగా ఎందుకో విధంగా ఎందుకో ఒక దానికి ఖర్చయిపోయి ఉండేది. అంతేకాకుండా నా కొడుకుల మీద ఎల్లకాలం ఆధారపడాల్సి వచ్చేది. మీ ఇంట్లో ఉన్నంత స్వేచ్ఛగా మరెక్కడా ఉండలేం మేము. తక్కిన పిల్లల చదువులకి కూడా మీరు సాయం చేశారు. మీ కుటుంబాన్ని దేవుడు పోషిస్తూ ఉండాలని. అన్ని విధాల ఆయురారోగ్యా ఐశ్వర్యాల్తో సుఖశాంతుల్తో ఉంచాలని ప్రార్థిస్తున్నాను."

ఆ గృహ ప్రవేశం తర్వాత ఆ ఇంట్లో వాళ్ళు ఒక ఆరేళ్ళున్నారేమో. ఉన్నన్నాళ్ళూ సంతోషంగానే ఉన్నారు వాళ్ళిద్దరూ, తమ ఇల్లన్న ఆనందంతో చిన్న ఇల్లయినా ముచ్చటగా ఉండేది ఆఇల్లు, అమ్మ అనుకున్నట్లుగానే ఒక బెడ్‌రూం, డ్రాయింగ్ రూం, డైనింగ్ స్పేస్, బాత్, టాయిలెట్, ముందర ఒక వరండారో. ఇంటికంటే పక్కనున్న పెద్ద జాగా ఆకర్షణీయంగా ఉండేది. అందులో మరో పెద్ద ఇల్లుకట్టుకోవచ్చు. ముందర తులసికోటకట్టుకున్నారు ఆ జాగాలో. ఆ తర్వాత ఆ జాగాలో మామిడిచెట్టు, జామచెట్టు పనస చెట్టు, నేరేడు చెట్టు, అరటి చెట్లు వేసుకున్నారు. ఎక్కడెక్కడో, ఎవరెవరి ఇళ్ళ దగ్గర్నించో, నర్సరీలో కొనో రకరకాల రంగుల మందారపూలు, నంది వర్ధనం పూలు, బంతిపూలు, పారిజాతం పూలు, మల్లెపూలు వగైరా మొక్కలు కూడా వేసుకున్నారు. చిన్న కిచెన్ గార్డెను కూడా. పచ్చిమిరపకాయలు, టమాటాలు, కాకరకాయలు, చిక్కుడు కాయలు, కరివేపాకు చెట్టు, ఏ సీజను కా సీజను మొక్కలు వేసుకునేవాళ్ళు.

పంచంతా మట్టి కొట్టుకుని, తోటలో పని చేసేవారు నాన్న. ఆ మట్టి సబ్బుతో గీరి గీరి వదలకపోతే, విసుక్కునేది అమ్మ - " ఎంత మట్టి చేస్తారో ఆ పంచ" అంటూ. నీళ్ళు పైకి ఎక్కడానికి టాంకు కట్టలేదప్పుడు. నీళ్ళు రావడానికి సమయమంటూ ఉండేది కాదు. మూడు నుంచి అయిదు దాకా ఏ తెల్లవారగట్లో నీళ్ళు పట్టడానికి నాన్న లేచేవారు. ముందర పెద్ద సిమెంట్ తొట్టిలోనూ, ఇంట్లో బాల్చీలు, బిందెలు నింపుకునేవాళ్ళు నీళ్ళు బాల్చీతో మోసి మోసి ఇల్లంతా తడిపేసి, చిన్న చిన్న గిన్నెల్లో కూడా నీళ్ళు పడితే "గ్లాసుల్లోనూ చెమ్బాల్లోనూ పట్టలేకపోయరా అప్పు తెచ్చినట్లు అలా నింపేస్తారేమిటి?" అని అమ్మంటే నాన్నకి కోపం వచ్చేది " కష్టపడి నీళ్ళు పడితే చిరాకు పడతావేమిటి? మెచ్చుకోవడం పోయి" అనే వారు ఆయన. మేం ఎవరం వెళ్ళినా మమ్మల్ని సాయం చేయనిచ్చేవరు కాదు. ఆయనే పట్టాలి నీళ్ళు.

పొద్దున్నే కాఫీ తాగే అలవాటు ఆయనకి. అమ్మలేవలేదని ఒకోరోజు పాలనుకొని, తోడుపెట్టిన పాలతో కాఫీ కలుపుకుని, ఆయన తాగేసిన రోజులు కూడా ఉన్నాయి. సాయంత్రం వార్తలు అవగానే "లక్ష్మీ - వార్తలయిపోయాయి" అని ఆయనంటే కాఫీవేళయిందన్నమాట. కోడళ్ళ ఇళ్ళల్లో తనకి కావలసినన్నిసార్లు కాఫీ వేళయిందన్నమాట. కోడళ్ళ ఇళ్ళల్లో తనకి కావలసినన్ని సార్లు కాఫీ వేళయిందన్నమాట. కోడళ్ళ ఇళ్ళల్లో తనకి కావలసినన్ని సార్లు కాఫీ అడగాలంటే ఆయనకి మొహమాటం అడ్డువచ్చేది.

రిటైరయ్యాక సామాన్లు ఎక్కడెక్కడో పెట్టేసి, వదిలేశాక, తనకి కొన్ని ఇచ్చాక, ఫర్నిచరు లేకపోతే కొత్తమంచాలు రెండూ, ఒక ఫేము సోఫా సెట్టు స్టీలు పుస్తకాల రాక్ చిన్న టీ.వి. గాద్రెజ్ బీరువా కొని పెట్టుకున్నారా ఇంట్లో తన పెన్షన్ డబ్బులతోనే. అన్నలు పంపే డబ్బు అక్కలకి, తనకి, అన్నగార్ల పిల్లలకి, మనుమరాళ్ళు, మనవలకీ మళ్ళీ ఖర్చుపెట్టేసేవాళ్ళు, చీరకని, బొమ్మలకని, వాళ్ళు ఆ ఇంటికి వెళ్ళిన కొత్తలో ఏ నలుగురయిదుగురో వచ్చారు ఇళ్ళల్లోకి. ఆ ఇంట్లో ఎప్పుడు శలవలు వచ్చినా పాతికమంది పైగా ఉండేవాళ్ళం. వరండాలో, డ్రాయింగ్ రూములో డైనింగ్ హాల్లో ఎక్కడ పడితే అక్కడ పడుకునే వాళ్ళం, బెడ్ రూం చాలకపోతే. అందరు కోడళ్ళు,

కొడుకులు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళతో ఇల్లు కలకళ్ళాడుతూ ఉండేది. తర్వాత్తర్వాత అమ్మకి గాజులు గొలుసు కూడా చేయించారు నాన్న. ఆఖరి తమ్ముడు దుబాయినుంచి పెద్ద గొలుసుకూడా పంపించాడు. పెద్దక్క బావగారూ రిటైరయ్యాక, అమ్మా నాన్నకి దగ్గరే ఒక పెద్ద ఇల్లు కొనుక్కున్నారు. వాళ్ళ గృహప్రవేశానికి ముందర మూడు నెలలు పైగా అమ్మా నాన్నల దగ్గర అక్క బావగారు, వాళ్ళమ్మాయిలు ఇద్దరూ ఉంటే నాన్న ఎంత సంతోషపడ్డారో! ఎండలో నడిచి వెళ్ళి, అక్కకి ఏ పచ్చడీ, కూరో, మిఠాయిలో తను చేసినవి ఇచ్చి వస్తేగాని అమ్మకి కడుపునిండేది కాదు.

ఆ తర్వాత ఆయన కాన్సర్ తో బాధపడుతూకూడా ఎవరికి ఏ కష్టం ఉండకూడదని, అక్క ఆఖరి ఇన్‌స్టాల్ మెంటు కట్టాక, ఆ ఊరికి వచ్చి ఆ ఇంటి రిజిస్ట్రేషను కూడా కట్టి, సేల్ డీడ్ వగైరాలు పూర్తి చేశారు. కారులో పడుకుని వెళ్ళి, కోర్టు ముందర చెట్లక్రింద గట్టు మీద కూర్చోలేక కూర్చుని సంతకాల పని పూర్తిచేశారు. అప్పుడు చిన్నన్నయ్య హైదరాబాద్‌లోనే ఉండేవాడు. అన్నయ్యకి అప్పుడు ఉత్తరం తన కళ్ళముందర కనిపిస్తూంటుందిప్పటికీ - "నువ్వు సేల్ డీడ్ పని మొదలు పెట్టేవని తలుస్తాను నా పరిస్థితి రోజురోజుకీ దిగజారిపోతోంది. ఒక రోజు ఆలస్యం కూడా మనకి సేల్ డీడ్ దొరకడంలో ఇబ్బంది కలిగిస్తుంది. స్టాంప్ డ్యూటీ ఎంత కట్టాలి, సేల్ డీడ్ స్టాంప్ పేపర్ల మీద టైప్ చేయించడం, వగైరా కనుక్కోవాలి. సెక్రటరీనో, ఛైర్మన్ నో కలుసుకుని, ఒక తారీకు "ఫిక్స్" చేయించుకోవాళి. నువ్వు నాకు ఏ సంగతీ ఫోనులో చెపితే, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో గాని, ఫ్లయిట్ లో గాని వస్తాను, నా ఒకనెల పెన్షన్ ఖర్చుపెట్టుకుని, ఎలాగో సీనియర్ సిటిజన్స్‌కి సగం ఫేర్ కనుక.

ఈ పనులన్నీ నేను.... లోపలే పూర్తి చేస్తే శాంతిగా ఉంటుంది నాకు. ఇంక నాకేమీ మిగిలింది లేదు. చావు భయమూ లేదు. నా బాధ్యతలన్నీ నెరవేర్చాను - మీరందరూ స్థిరపడ్డారు ఒక్క ఆనంద తప్ప. పేరయితే పట్టాను కాని, ఆనందం ఇవ్వలేకపోయాను దానికి, నేనేం చేయలేక పోయాను. ఈ నా బాధని మీరెవరూ తీర్చలేరు, నాతోపాటు బాధపడటం తప్ప. దేవుడే దాన్ని రక్షించాలి.

మీ అందరి దగ్గరకి వచ్చి కొన్నాళ్ళుండాలని ఉంది. శ్యామల, శైలజ, ఆనంద, హరి, నువ్వు, బాలకృష్ణ, పిల్లలు అందరూ జ్ఞాపకం వస్తున్నారు. కాని నాకున్న సమయం చాలా తక్కువ. మొదటి సంవత్సరం వరకూ బాగానే ఉన్నాను కాని హఠాత్తుగా పరిస్థితి దిగజారిపోవడం మొదలు పెట్టింది. రోజూ ఏదో ఒక బాధ. ఎక్కువ కాలం మంచం మీదే ఉంటున్నాను. నా పదో సంవత్సరం నుంచి నేను కష్టపడుతున్నాను. ఇప్పటికి మీరందరూ నన్నుచూసుకునే వేళకి నేను అలసిపోయాను. ఇప్పుడింక పూర్తివిశ్రాంతికావాలని పిస్తోంది."

అప్పటికి ఆయన ఢిల్లీలో పెద్ద సర్జయిన మూడో తమ్ముడు దగ్గర ఉండేవారు - పదేళ్ళుగా, ఆఖరి రోజుల్లో రాశారా ఉత్తరం. అక్కడే పోయారాయన. మరో నాలుగేళ్ళకి అమ్మ - పెద్దన్నయ్య దగ్గర పోయింది. నాన్నరాసినట్లు తన జీవితం ఒకటే ఇలా అయింది. తన భర్త పోయి పదేళ్ళయింది. ఒక్కర్తీ స్కూల్లో పని చేస్తూ పిల్లలిద్దర్నీ పెంచింది. కొడుకు బాంక్ లోన్ తో మేనేజ్‌మెంటు చదువుతున్నాడు. రెండోది ఇంటరు పరీక్షలిచ్చింది. అమ్మానాన్నల ఆ ఇల్లిప్పుడు తనదిగా అందరూ వదిలేశారు. అక్కడ ఉండలేక, అద్దెకిచ్చింది. అమ్మా నాన్నా వేసిన ఆ మామిడి చెట్టు, నేరేడు చెట్టు (నాన్న కర్మలు దానికిందనే చేశారు) పెద్ద తుఫానులో పడిపోయింది. చిన్న గేటు పక్కన పెద్దముద్ద మందారం చెట్టు మాత్రం పెద్దమానుతో గుబురుగా అలాగే ఉంది.

ఆయన కోరుకున్నట్లు అన్నలూ, అక్కలూ, తమ్ముళ్ళు అందరూ ఇళ్ళు కట్టుకున్నారు తనకి అత్తవారిచ్చిన ఇంటిజాగా ఉన్నా, ఇల్లు ఎప్పుడు కట్టుకుంటుందో తెలీదు. కొడుకే ఉద్యోగం చేసి కట్టాలి.

డాక్టరు తమ్ముడు ఢిల్లీ పోష్‌లొకాలిటీలో అయిదుగదులున్న, ఆధునిక హంగుల్తో, పెద్ద ఇల్లు కట్టుకుని, ఇవాళ గృహప్రవేశానికి రమ్మని ఫోన్ చేశాడు.

తనకి తెలుసు - ఆ గృహప్రవేశం అమ్మా నాన్నల గృహప్రవేశంలాగ కాక, ఎంతో ఘనంగా అందరూ వచ్చి, కన్నుల పండువుగా అవుతుందని ఫోన్‌లో ఎంత బాధపడ్డాడు వాడూ అమ్మా నాన్నలని తల్చుకుని - వాళ్ళుంటే ఇంత పెద్ద ఇల్లు చూసి ఎంతో

ఆనందపడేవాళ్ళో అనీ!

ఆనందంతో కన్నీళ్ళు కారాయి ఆనందకి.

సరిత వచ్చి, "పెద్దనాన్నగారు ఫోన్ చేశారు, టిక్కట్లయి పోయాయి ఢిల్లీకి. నువ్వు, నేను, దొడ్డమ్మా, పెద్దనాన్నగారు, అక్క వెళుతున్నాం" అని అంటూంటే, కళ్ళు తుడుచుకుని లేచింది ఆనంద.

## జడబిళ్ళ - అచ్యుతుని మురళీకృష్ణ

"నాన్నా..చూడూ...నాజడ... జడబిళ్ళ బాగుందా?" అని మురిపెంగా అడుగుతోంది నా కూతురు 'అమ్మలు'

"చాలా బావుంది తల్లీ..." నేను అమ్మల్ని ఒళ్ళో కూర్చోపెట్టుకుంటూ అన్నాను.

"మరి నాన్నా...ఇదీ... బామ్మ నాకిచ్చిందటగా? అమ్మ చెప్పింది"

అవునని తలూపుతూ 'అలా చెప్పమని నేనే చెప్పాను' మనసులో గొణుక్కున్నాను.

మనసంతా బోసిపోయినట్లుగా ఉంది. ఈ జడబిళ్ళ గుర్తొచ్చినప్పుడల్లా చివుక్కుమంటుంది.

ఇంతలో నా పుత్రరత్నం " మరి బామ్మ నాకేమిచ్చింది? " అని అడిగాడు.

"మీ బామ్మ నీకు ఈ గోలీలు ఇచ్చింది. అవి చిన్నప్పుడు నాన్న ఆడుకున్నవి. నీకోసమే.. దాచి మరీ ఉంచింది తెలుసా? " మా ఆవిడ చెపుతోంది.

అమ్మ..నా బాల్యాన్ని నా కొడుకుకి పరిచయం చేసిన అమ్మ!!

ఎంత ముందు చూపు!? అలాంటి అమ్మకి కంటి చూపు సరిగ్గా లేనప్పుడు... నేనేం చేశాను? ఒక చిన్న అబద్ధం ఆడాను... అందులో నా స్వార్థం ఏమన్నా ఉందా అంటే... ఉందనే చెప్పాలి... అదీ... అమ్మ కళ్ళల్లో సంతృప్తిని చూడాలనే!

***

నాకిప్పటికీ గుర్తు.... ఎర్రరాయి చుట్టూ తెల్లరాళ్ళతో పొదిగిన బంగారు జడబిళ్ళ. మా అమ్మ జడను అల్లుకుని ముడిలా చుట్టుకునేది. ఆ రాళ్ళ బిళ్ళని ఆ ముడిలో అమర్చుకుంటే చూసేందుకు నీలాకాశంలో ఎర్రని చంద్రుడి చుట్టూ నక్షత్రాలు కుప్పలుగా ఒక చోట కూర్చినట్లుండేది. స్నానం చేసిరాగానే అంత కుంకుమ నుదుటన దిద్దుకొని..జడల్లుకోవటం... ముడెట్టుకోవటం.. ఆ జడబిళ్ళని పొందికగా అలంకరించుకోవటం... మడికట్టుకుని, కుంపటి ముందు కూర్చుని వంటకుపక్రమించేది. సుప్రభాతాన్ని వల్లె వేసుకుంటూ విసనకర్రతో కుంపటి రాజేసుకుంటూ వంట చేశాక కమ్మటి భోజనాన్ని వడ్డించటం పరిపాటి.

ఉదయం దువ్వుకున్న తల అస్సలు చెదిరేదికాదు. ఆ జడబిళ్ళ నిద్రపోయేముందుకానీ తీసేది కాదు. ఎప్పుడూ దాన్ని వాళ్ళ నాయనమ్మ ఇచ్చిందని మురిపెంగా చెప్పుకుంటుండేది. తన చిన్నప్పుడు బిన్నీగుడ్డతో పావడాలు, రవికెలు కుట్టించేవారని, అవి తొడుక్కుని,

వాలుజడ వేసుకుని... జడగంటలు పెట్టుకుని ఈ జడబిళ్ళని పెట్టుకునేదాన్నని ఎప్పుడూ చెపుతుండేది. అదీ.... తాను కూడా తన పెద్ద మనమరాలికే ఇవ్వాలనుకుంటున్నానని పదే పదే అంటుండేది.

ఇక మా కుటుంబ నేపథ్యానికి వస్తే మా నాన్నగారు ఉభయభాషాపండితుడు. అష్టావధానంలో అందెవేసిన చెయ్యి. అన్నింటినీ మించి చాలా అభిమానవంతుడు ఎన్ని ఇబ్బందులున్నా బయటపడే తత్వం కాదు.

ఆయన తెలుగు ఉపాధ్యాయులుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేశారు. ఆయన సర్వీసులో ఉన్నప్పుడు తమ్ముళ్ళ చదువులు, ఇంటి బాధ్యతలతో పైసా వెనకేసుకోలేదు. ఆయన పదవీ విరమణనాటికి మేము పుట్టాం. నాకు ఊహ వచ్చేనాటికి.. మా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమేనని అర్థమైంది. చాలీచాలని ఫించను, ఉదయం, సాయంకాలాలు పిల్లలకి ప్రైవేట్లు చెప్పి జీవితాన్ని నెట్టుకొచ్చేవాడు. మాతోపాటే వారాలబ్బాయిలూనూ. `ఎప్పుడైనా ఎవరైనా వారాల ఇళ్ళవాళ్ళు ఊరికి వెళితే పస్తులుండకండి నాయనా...మనింటికి వచ్చేయండి` అని అమ్మా నాన్నా ఇద్దరూ చెపుతుండేవాళ్ళు వాళ్ళకి.

తనకెంత పాండిత్యమున్నా... పాండితీ ప్రకర్షతో తమ బతుకు గడవదన్న నగ్నసత్యం మా నాన్నకు తెలుసు. కీర్తి ప్రతిష్ఠల తాలూకు గుంజాటన ప్రతి పండితుడికీ, కళాకారుడికీ, ఉండి తీరుతుంది. కానీ ఆయన తన ప్రతిభ, గుర్తింపు ముఖ్యమనుకోలేదు. ఆ ఉరవడిలో పడటం బాధ్యతలనుంచి తప్పించుకోవటంగా, అదొక వంకగా, పూర్తి స్వార్థంగా తోచిందాయనకు.

అదే ఆయన మాకోసం చేసిన పెద్ద త్యాగం.

ఎదిగీ ఎదగని పిల్లలు... వాళ్ళ చదువులు.. ఆడపిల్లల పెళ్ళిళ్ళు - కట్నాలు చాలా భారమని ఆయనకు తెలుసు. అలాగని నిరాశతో కుంగిపోయి మూల కూర్చోలేదు. పిల్లల్ని ఈ లోకంలోకి తెచ్చినందుకు వారిని ప్రయోజకులుగా చేయాలనే ఆయన ఆలోచన. ఆ ఆలోచనతో ఆయనేం పెద్ద పెద్ద ప్రణాళికలు వెయ్యలేదు. ఓహో ఆలోచించలేదు.

"ఈ రోజు గడిస్తే చాలు. రేపు తప్పకుండా గడిచి తీరుతుంది. ఆ తరువాత సంగతి తరువాత" అనే ఓ చిరు ఆశ... చిరు బేలత్వంలో.. బోలెడంత ధీమా. అలాగే నెట్టుకుంటూ తోసుకుంటూ బతుకు బండిని నడిపించుకుంటూ వస్తుండేవారు. ఇలా గడిచిపోతున్నప్పుడు... ఇలా గడిపించబడుతున్నపుడు లాస్ట్ స్ట్రా లా సీతాపతి బాబాయి మా ఇంటికి వచ్చాడు... భార్యా గంపెడు పిల్లలతో. ఆయన ఓ రకమైన అమాయకుడు. చదువు అబ్బలేదు. పైసా సంపాదన లేదు. ఉన్న ఆస్తంతా కరిగిపోనిచ్చాడు. అలా అప్పుడప్పుడు దగ్గర బంధువుల ఇళ్ళకి వెళ్ళటం, రోజులు గడపటం ఇదీ ఆయన వాలకం. ఆ బాబాయి అంటే నాన్నకు వల్లమాలిన ఆపేక్ష. చిన్నప్పుడు కలిసి పెరిగిన అనుబంధం కావొచ్చు. వచ్చినవాళ్ళు నెలరోజులపైనే ఉన్నారు. వెళుతూ, వెళుతూ నాన్న అందించిన టిక్కెట్టు డబ్బులు తీసుకుని మరీ వెళ్ళిపోయారు. ఆ మరుసటిరోజు అమ్మ వత్తుల పెట్టెలో స్నానానికి వెళ్ళబోతూ పెట్టిన జడబిళ్ళ వెతుక్కుంటున్నది 'ఏదీ ఎక్కడ పెట్టాను... అనుకుంటూ.... హడావుడిగా ఇల్లంతా వెతకటం మొదలు పెట్టింది. నాకు తోచినట్లు నేనూ వెతికాను. కనిపించలేదు.
అమ్మ ఆ రోజు బోసి ముడితో... బోసి మదితో వంటచేసింది.

ఇంతలో నాన్న బయటనుంచి వచ్చారు. "నా జడబిళ్ళండీ.. నా జడబిళ్ళ... కనిపించటం లేదు. మీరుగానీ చూశారా? ఎక్కడ పెట్టానో ఏమిటో.." అని అడిగింది. నాన్న "నాకు తెలియద`ని గొణుగుతూ తలదించుకుని అవతలకి వెళ్ళిపోయారు. అమ్మ ఆరోజు భోజనం చేయలేదు. నాన్నకూడా భోజనం చేయలేదు. ఆయన కళ్ళలో అపరాధ భావన! అది నాకు మాత్రమే తెలుసు.... ఉదయం అమ్మ స్నానానికి వెళ్ళినప్పుడు ఆ జడబిళ్ళని నాన్న తీయటం చూశాను. నేను అమ్మకి ఆ విషయం కావాలనే చెప్పలేదు. నాన్న ఎటువంటి నిస్సహాయ పరిస్థితుల్లో ఆ పని చేశారో నేనామాత్రం గ్రహించగలను. నాన్న మీద అమ్మకు తక్కువ భావం రావటం నాకిష్టం లేదు. ఇంతలో నా ఇంటర్ పరీక్షలు... ఫలితాలు... ఫస్ట్ క్లాసులో పాసయ్యాను. ఆ తర్వాత నేను ఇంటినుంచి బయటకు వచ్చేశాను ఇంజనీరింగ్ చదవాలన్న నా కలను పక్కకు నెట్టేశాను. చిన్న ఉద్యోగంలో కుదురుకుని ఇంటికి కొంత డబ్బు పంపించే వాడిని. కొంత నా ఖర్చులకి

సరిపోయేది. గ్రాడ్యుయేషన్ ప్రైవేటుగా పూర్తిచేసుకుని... కొన్ని పోటీ పరీక్షల్లో నెగ్గి ఉన్నతోద్యోగం సంపాయించాను. కుటుంబ బాధ్యతల్ని పూర్తిగా స్వీకరించాను.

ఈ క్రమంలో నేనేమీ అమ్మ జడబిళ్ళని మర్చిపోలేదు. నేనిప్పుడు జడబిళ్ళ చేయించి అమ్మకు ఇస్తే ఎలా ఉంటుంది? అన్న ఆలోచన నన్ను నిలవనీయలేదు. కానీ అమ్మకు నేను చేయించి ఇస్తే తృప్తిగా ఉంటుందా? ఆమె ఆనందపడుతుందా? లేదు. కాబట్టి నేను అమ్మ దగ్గర చిన్న అబద్ధం ఆడక తప్పలేదు. పాత పెట్టె వెతుకుతుంటే.... ఇన్నాళ్ళూ పోయిందనుకున్న జడబిళ్ళ దొరికిందని తడబడుతూ చెప్పాను. పిచ్చి అమ్మ. నిజమేనని నమ్మింది. కళ్ళు సరిగా కనబడవు... అయినా తడిమి తడిమి చూసింది.

"మధ్యలో ఎర్రరాయేనంటావురా? చుట్టూ తెలుపు రాళ్ళుకదూ? రాళ్ళేమీ ఊడిపోలేదు కదూ? మెరుపు తగ్గిందంటా? అంత బరువు లేదురా ఇది పెట్టుకోకున్నా అరిగిపోతుందంటావా?" ఇట్లాంటి ప్రశ్నలతో నన్ను తోచనీయకుండా చేసింది. "పోనీలే నాయనా.. దొరికింది అది చాలు... ఎన్ని రోజులు... ఎన్ని చోట్ల వెతికాను... ఇల్లంతా గాలించాను. ఈ పాతపెట్టెలో కూడా చూశా. కంగారుగా వెతకటంలో కనపడివుండదు. పొరపాటున ఇంకెక్కడన్నా పడిపోయిందా అని పిచ్చిదానిలా అయిపోయేదాన్ని. ఒక్కోసారి నాయనా... మీనాన్నగారి మీద కూడా అనుమానం వచ్చేది. ఈయన కానీ... సంసారం ఖర్చులకి అమ్మేయలేదు కదా.... అని వెంటనే లెంపలు వేసుకునేదాన్ని. ఆయన్ని అనుమానిస్తున్నా... ఎంత పాపిష్టిదాన్నని, నామీద నాకే కోపం వచ్చేది. మహానుభావులు... ఎంత కష్టం తానే పడ్డారు కానీ... వెలితిపడ్డారా!? మనల్ని వెలితిపడనిచ్చారా? ఒక్కపూటైనా నేతిబొట్టు ఇంట్లో నిండిపోనిచ్చారా? పిల్లలకి లోటు రానిచ్చారా? ఎంత ఆత్మాభిమానం!? అలాంటివారి మీదకి నా అనుమానం పోవడమేమిటి నాయనా? నేనెంత దుర్మార్గంగా ఆలోచించాను? నాకిప్పటికీ గుర్తు... నేను వస్తువు పోయిందని అన్నం తినకపోతే... ఆయనా ఒక్క మెతుకూ ఎంగిలిపడలేదానాడు. సరేలే నాయనా... ఇప్పుడవన్నీ ఎందుకు? మన వస్తువు గట్టిది. దొరికింది. అది మనకు ప్రాప్తం ఉంది. నేను మా నాయనమ్మిచ్చిన వస్తువుని కాపాడుకోలేకపోయానన్న చింత నన్ను ఇన్నాళ్ళూ వేధించేది. నిజానికి.... అది మా నాయనమ్మ నా మనుమరాలికిమ్మని ఆనాడు నాకు చెప్పింది. చూశావా.... ఇన్నాళ్ళూ అనవసరంగా బెంగపడ్డా, ఇంట్లో వస్తువుని పెట్టుకుని... అందుకే అన్నారు, వస్తువు ఒకచోట.... అనుమానం మరోచోటా...అని.

ఇప్పుడు దీన్ని నేను నా మనుమరాలికి ఇచ్చుకుంటా. అది వాలుజడ వేసుకుని... ఈ జడబిళ్ళ పెట్టుకోవాలి మరి!!" మా బారసాలనాడూ మా అమ్మ, పిల్లదాని బుగ్గలు పుణికి... దాని చేతిలో 'జడబిళ్ళ' పెట్టింది.

ఆ రోజు ఆమె చత్వారం కళ్ళలోని నీటి చెమ్మ... నాకళ్ళకి కనిపించలేదు. కారణం గుండెను తడిపేంతలా.... నా కంటినిండా నీళ్ళేమరి!!

***

"నాన్నా! చెప్పవేం.. గోలీలాట ఎలా ఆడాలో?" మావాడు నన్ను కదుపుతూ అడుగుతున్నాడు.

"పద నాన్నా..." అంటూ నేను గోలీలను అందుకుని.... బయటకు నడిచాను. వాడు నన్ను అనుసరించాడు.



మురళీకృష్ణగారు హైదరాబాదులో సిండికేట్ బాంక్ మేనేజర్ గా పనిచేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషు సాహిత్య పఠనం హాబీ. ఇంగ్లీషులో కవిత్వం వ్రాస్తుంటారు.

## ఓ భామా! - వసుంధర

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

మాది పెద్ద స్థలంలో పది గదులున్న పెద్ద ఇల్లు. తాతయ్య, బామ్మ ఆ ఇంటి పెద్దలు. ఇద్దరత్తలకి పెళ్ళిళ్ళై కాపురాలకి వెడితే - నాన్న, ఇద్దరు బాబాయిలూ సకుటుంబంగా కలిసుంటున్న ఉమ్మడి కుటుంబం మాది. ముగ్గురన్నదమ్ములకీ - ఒక్కొక్కరికి ఓ కొడుకూ, కూతురూ చొప్పున - మొత్తం ఆరుగురు పిల్లలు. అందరిలోకీ పెద్దవాణ్ణి నేను.

మా ఇంట్లో పెద్దా చిన్నా అందరికీ జీవిత లక్ష్యాలున్నాయి. ప్రతి ఒక్కరికీ ఉన్నత శిఖరాలందుకోవాలన్న తాపత్రయముంది. అందుకోసం తగిన కృషి చేస్తూనే ఒకర్నొకరు అభిమానిస్తాం. ఐనా ఎందుకో మా అందరికీ రేపంటే భయం. మాకృషి ఫలితాలపై అపనమ్మకం. ధరలు పెరిగితే బెంగ. స్టాక్ మార్కెట్ కూలితే కలవరం. చిన్న అనారోగ్యమొస్తే దిగులు. ఎదుగుదలపై అసంతృప్తి. పిన్నలంతా పెద్దల్ని గౌరవించినా, ఎవరికీ దురలవాట్లు లేకున్నా, స్వార్థం - కక్ష - కార్పణ్యాలని ఆమడ దూరంలో ఉంచగలిగినా - మీద పడుతున్న బాధ్యతల గురించి వ్యథ. అలాగని కొత్త బాధ్యతలకి విముఖులమూ కాము. అందుకు ఉదాహరణ వసంత. ఆ ఇంట్లో మొత్తం పదనాలుగురమున్నామా - ఈ కథ మాలో ఎవ్వరిదీ కాదు. నాలుగేళ్ళ క్రితం మా ఇంటికి అనాథగా వచ్చింది నాకంటే నాలుగేళ్ళు చిన్నదైన వసంత. ఆమె కథ ఇది.

వసంత తండ్రిది చిన్న ఉద్యోగం. తల్లి ఉత్త ఇల్లాలు. కూతుర్నీ, కొడుకునీ పెంచి పెద్ద చేయడమే వాళ్ళ జీవితాశయం. అది నెరవేర్చమని దేవుణ్ణి వేడుకుందుకు సకుటుంబంగా ట్రయిన్లో తిరుపతి బయల్దేరారు. తనని కలుసుకోవాలన్న వాళ్ళ తొందర గ్రహించాడో ఏమో - తిరుపతి చేరేలోగా ట్రయిన్‌కి యాక్సిడెంట్ చేసి - దేవుడు వాళ్ళని తన దగ్గరకి రప్పించుకున్నాడు. అలా అనాథలయ్యారు పదమూడేళ్ళ వసంత, ఏడేళ్ళ కుమార్. మరి దేవుడి దగ్గరున్న తలిదండ్రుల రికమెండేషనేమో - వసంత పెద్దమ్మ తనకి మగపిల్లలు లేరని కుమార్‌ని దత్తత తీసుకుంది. ఎవరూ ఆసక్తి చూపక, ఏమీలేక, దిక్కుతోచని పరిస్థితులో ఉన్న ఆడకూతురు వసంతని దూరపు బంధుత్వపు మిషమీద దగ్గరకి తెచ్చుకున్నారు - ఇంటికేకాక మనసుకీ పెద్దే అయిన మా తాతయ్య, బామ్మ. ఆ చర్యని ఇంటిల్లిపాదీ మనస్ఫూర్తిగా ఆమోదించారు.

వసంతది గొప్ప వ్యక్తిత్వం. అవసరం నేర్పిందేమో ఈడుకి మించిన తెలివి, తన అవసరాలు చెప్పదు.తనకి అవసరమని కాక మాకు అవసరమని అందరికీ అన్ని పనుల్లోనూ సాయం చేస్తుంది. పొగిడితే పొంగిపోదు. తెగిడితే కృంగిపోదు. తనూ ఇంట్లో మనిషేనని అంతా అన్నా - అలా మసలదు. వసంత మా ఇంట్లో మనిషేనని నాకూ అనిపించదు. మా అందరికీ వేడన్నం, తనకి చద్దన్నం. మాకు కొత్త బట్టలు, తనకి పాతవి. మాది ఇంగ్లీషు మీడియం చదువు, తనది తెలుగు మీడియం. మాకు తీరుబడిలో ఆటలు, తనకి తీరుబడిలేకుండా పనులు. ఒకోసారి తనకంటే మా పనిపిల్ల సత్య పనే నయమనిస్తుంది. 'మంచెద్దుకో దెబ్బ మంచి మనిషికో మాట' అంటారు కదా - మా ఇంట్లో అందరం అందర్నీ మాటలతోనే ట్రీట్ చేస్తాం. పని చేసేవాళ్ళని వర్కింగ్, చేయని వాళ్ళని నాన్ వర్కింగ్ - అనడానికి -ఆంగ్లపదాల్లోని మొదటి రెండక్షరాలూ ఉపయోగించి వో, నో అనడం మాకు రివాజు. బామ్మ ఊరికే కూర్చుని మంచి

నీళ్ళడిగిందనుకోండి - ఇంద 'నోబామ్మ' అంటాం. తను పనిలో ఉండి నీళ్ళడిగితే - ఇంద 'వోబామ్మా' అంటాం. బామ్మకే కాదు - తాతయ్యతో మొదలెట్టి మా చిన్న బాబాయి ఆఖరి కూతురిదాకా ఈ ఆచారం వర్తిస్తుంది. పెద్దా చిన్నా అంతా వో అనిపించుకుందుకు కృషి చేస్తాం. నో అనిపించుకుందుకు భయపడి నిరంతరం అప్రమత్తంగా ఉంటాం. ఐనా ఒక్కసారి కూడా నో అనిపించుకోకుండా ఎప్పుడూ వో అనిపించుకునేది - పనిపిల్ల సత్య కూడా కాదు, వసంత ఒక్కతే!

అంతే కాదు సత్యకూడా ఒకోసారి ఎవర్నైనా వో అనో, నో అనో మాతో కలుస్తుందేమో కానీ - వసంత సరదాకి కూడా ఎవర్నీ వో, నో అనదు. పిల్లలమందరం కలిసి కబుర్లాడుకునేటప్పుడు సత్య, తనూ కూడా జాయినౌతారు. మా అందరితోనూ ఆరిందాలా మాట్లాడే వసంత - సత్యతో మాత్రం తనీడు వాళ్ళలా మసలుతుంది. అలాగే కబుర్లకి తన ప్రిఫరెన్స్ కూడా సత్యే !

ఒకసారి మేమంతా కబుర్లలో ఉండగా, "నువ్వీ ఇంట్లో చాలా శ్రమిస్తున్నావ్" అన్నాను. వసంత దాన్ని కాంప్లిమెంటుగా తీసుకోలేదు. "జీవితంలో పైకి రావాలని కృషిచేస్తున్నా. కృషి - శ్రమ కాదు" అంటూ నన్ను సరిచేసింది.

ఊహించని ఈ సమాధానానికి ఆశ్చర్యపడ్డాను. అంతలో నా చెల్లెలు అందుకుని, "ఐతే మా అందరికంటే ఎక్కువ కృషి చేస్తున్నావు. మమ్మల్ని మించిపోవాలనా?" అంది.

"మీది పై మెట్టు. నాది అట్టడుగు మెట్టు. నాలో సగం కృషి చేసినా మీరెప్పుడూ నాకంటే చాలాపైనే ఉంటారు" అంది వసంత తడుముకోకుండా.

మా కృషి ఫలితం మీద మాకే నమ్మకంలేదు. ఐతే అందుకని కాక, "నువ్వలా అనుకోవడం నాకు నచ్చదు. మనమంతా ఒకే మెట్టుమీదున్నామని నా ఉద్దేశ్యం" అన్నాను.

వసంత నవ్వి, "మెట్టు ఒకటే ఐనా మీది రక్తసంబంధం. నాది భక్తసంబంధం. రెండూ ఒకటి కాలేవ్" అంది.

"భక్త సంబంధమా - అంటే?" అన్నాను అర్థంకాక. నా ప్రశ్న మిగతావాళ్ళ కళ్ళలోనూ ప్రతిఫలించింది.

"ఉద్యోగ రీత్యానో, పెళ్ళి చేసుకునో - మీరంతా ఏదో రోజున ఇల్లొదిలి వెళ్ళిపోవచ్చు. ఐనా - రక్తబంధంతో మీరొకర్నొకరు గుర్తుంచుకుంటారు. నా విషయమలా కాదు - నేను మీ అందరికీ గుర్తుండాలంటే - భక్తి ఒక్కటే మార్గం. మీరంతా నా దేవుళ్ళు. దేవుళ్ళకి సేవలుంటాయి. ఆ సేవల్లో భక్తి ఉంటుంది" అంది వసంత. వసంత ఇంత తెలివిగా, లోతుగా మాట్లాడుతుందా - ఆ తెలివి, లోతు చదువులో అంతగా కనిపించవు. క్లాసులో తన రాంక్ పదికి ఎగువన ఉండడం నాకు తెలియదు. సాటివారమైన మమ్మల్ని కాదని పనిపిల్ల సత్యని కబుర్లకి ప్రిఫర్ చేయడమే అందుకు కారణమని నేననుకుంటాను.

అలాగని పరిధి బాగా చిన్నది. అందులో ఇమడాలంటే - జీవితంలో బాగా పైకి రావాలనుకునే వసంత ప్రయత్నాలకి కృంగుబాటు తప్పదు. అలా సత్య సాహచర్యం వసంత తెలివిని హరించేస్తోందనుకుంటాను. సత్యదీ వసంత వయసే. ఇంచుమించు వసంత వచ్చినప్పుడే మా ఇంట్లో చేరింది. పదమూడేళ్ళ పిల్లని పనికి పెట్టుకోవడం చట్టవిరుద్ధమని సంకోచించాడు తాతయ్య. డబ్బవసరమని వాళ్ళమ్మ కాళ్ళావేళ్ళాపడితే - బామ్మ మెత్తబడి దాన్ని పనికి తీసుకుంది. అంట్లు తోమడం, బట్టలుతకడం, ఇల్లు తుడవడం వగైరా బరువు పన్లకి వేరే ఇద్దరు పనిమనుషులున్నారు కాబట్టి - చిన్నా చితకా పనులకి అందుబాటులో ఉండడమే సత్యపని. చెప్పకుండా తనిఖీకొచ్చినా - అది ఇంట్లో మనిషనుకునేలా చూసుకుంటారు దాన్ని మావాళ్ళు. సత్య ఇంగ్లీషు మీడియంలో ఏడు ప్యాసయ్యానంటుంది కానీ - దానికి తెలుగు చదవడమే సరిగ్గా రాదు. రోజంతా ఇంట్లోనే ఉంటుంది, ఇంట్లో పని తక్కువ - అని తాతయ్య దాన్ని ప్రైవేటుగా మెట్రిక్ పరీక్ష రాయిద్దామనుకున్నాడు కానీ దానికి కబుర్లమీద ఉన్న ఆసక్తి చదువుమీద లేదు. ఆ కబుర్లనిండా భవిష్యత్తు గురించిన కలలు. దానిచేత పిల్లలు, పెద్దలు బాగా వాగించి వినోదిస్తుంటారు.

సత్య బావ గణేష్ దానికంటే ఏడేళ్ళు పెద్దట. దుబాయ్‌లో ఉన్నాట్ట. అక్కడ లక్షలు పోగేసి వచ్చి దాన్ని పెళ్ళిచేసుకుంటాట్ట. తర్వాత అది మేడల్లో ఉంటుందిట. కార్లలో తిరుగుతుందట. రోజుకో డ్రెస్సు మారుస్తుందట. దుబాయ్‌లో అతడి ఉద్యోగమేమిటో కానీ - అది మాత్రం అతడో సినిమా హీరో అన్నట్లు మాట్లాడుతుంది. చదువుకుంటే ఆడపిల్లలు చెడిపోతారని గణేష్ దాన్ని చదువు మానేయమన్నాట్ట.

"మరి మా ఇళ్ళలో చదువుకున్నవారంతా చెడిపోతున్నారా?" అనడిగింది నా చెల్లి.

"మొదటినుంచీ అన్నీ ఉన్న మీరు వేరు, ఇప్పటిదాకా ఏమీలేని మేము వేరు. మా వాళ్ళ దగ్గిర నాలుగు డబ్బులు చేరితే మందు కొడతారు. మందెక్కువైతే ఆడాళ్ళని కొడతారు. ఆడాళ్ళేమో చదువుకుంటే తిరుగుళ్ళు మరుగుతారు. మావాళ్ళ గురించి బావకి తెలిసినట్లు ఇంకెవ్వరికీ తెలియదు" అంది సత్య.

బావంటే దానికి ఆరాధన. "మరి మీ బావ సంగతేమిటి?" అంది అప్పుడే అలా వచ్చిన పిన్ని.

"మనుషుల్లో మీరు వేరు. మా వాళ్ళలో బావ వేరు" అంది సత్య గొప్పగా. రాత్రిళ్ళు డైనింగ్ టేబుల్ దగ్గిర దాని కబుర్లో హాట్ టాపిక్ మా అందరికీ. దాని కబుర్లలో గణేష్ - ఓ వెంకటేష్, నాగార్జు, జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు, అల్లు అర్జున్, ఇటీవలే రామ్ కూడా అయ్యాడు. సత్య తండ్రి మేస్త్రి, తల్లి పనిమనిషి, అన్న డ్రైవరు, వదిన పనిమనిషి, బావ దుబాయ్‌లో ఉంటున్నా - సత్య కూడా పనిమనిషే. మగాళ్ళెంత సంపాదించినా ఆడాళ్ళు పనిమనుషులైతే తప్ప ఇల్లు గడవని జీవనవిధానం, అలవాట్లు వాళ్ళవి. బావని పెళ్ళాడాక తన బ్రతుకు మారిపోతుందనుకుంటుంది. కానీ చేతిలో డబ్బులుంటే ఖరీదైన బట్టలు కొంటుంది. డీవీడీలు కొని ఇంట్లో సినిమాలు చూస్తుంది. తనకో లక్ష్యముందనీ - అది సాధించాలంటే కొంత ప్రయత్నమూ కొన్ని త్యాగాలు అవసరమనీ ఎంత చెప్పినా దానికి అర్థంకాదు. ఉన్నట్లుండీ దానంతటదే తన జాతకం మారిపోతుందని నమ్ముతుందది.

సత్య అనాకారి కాదు కానీ గొప్ప అందగత్తె కూడా కాదు. కానీ అది ఓ సినిమా హీరోయిన్ లెవెల్లో ఫీలైపోతుంటుంది. రాత్రి డైనింగ్ టేబుల్ దగ్గిర దాని విశేషాలే మాకు గొప్ప కామెడీ సీరియల్.

ఒకసారి మా పక్కింటికి చుట్టాలొచ్చి పని సాయానికి సత్యని పిలిచారు. ఒక పూట పని చేసి - మరి వెళ్ళనందది. కారణం - వాళ్ళింట్లో ఉన్న ఓ అమెరికా అబ్బాయి దాన్ని ప్రత్యేకంగా పిలిచి - తను చెప్పింది చేస్తే చాలా గొప్పదైపోతుందన్నాట్ట. అతడి పద్ధతి నచ్చక - చెప్పేది వినకుండా వచ్చేసిందిట.

"నిన్ను నిజంగా గొప్పదాన్ని చేయాలనుకుంటునాడేమో - చెప్పేది వినాల్సింది" అందట అమ్మ.

సత్య ఒప్పుకోలేదు. ఆ ఇంట్లో అతడికీడైన మరదలుందట. ఇంటికా మరదలి స్నేహితురాళ్ళు ముగ్గురొచ్చి - గొప్ప వాళ్ళు కావడానికి సలహాలు చెప్పమని అతణ్ణి వేధిస్తున్నారట. అతడు వాళ్ళకేం చెప్పకుండా - ఏమీ అడగని సత్య వెంటబడ్డాట్ట. అతడికి వేరే ఉద్దేశ్యముందని సత్య అనుమానం.

ఆ ఇంట్లో కూడా దాన్ని ఆటపట్టించి ఉంటారని అంతా గ్రహించినా, "ఆ అబ్బాయి నిన్నుకానీ ప్రేమించాడేమోనే - పెళ్ళి చేసుకుని హాయిగా అమెరికా వెళ్ళిపో" అందిట పిన్ని అదేమంటుందోనని.

సత్య ఆ మాటలు వేళాకోళంగా తీసుకోలేదు, "అలా చేస్తే బావ గుండె బద్దలైపోతుంది. బావ సంతోషంగా ఉంటే దుబాయే నాకు అమెరికా" అందిట.

"ఔన్లే - అంతగా ప్రేమించిన బావకోసం నువ్వు అమెరికాని త్యాగం చేసి - దుబాయ్‌లో సర్దుకుపోవడం సబబే!" అని అమ్మ మెచ్చుకుంటే అది - అమ్మ తనని సరిగ్గా అర్థం చేసుకుందని పొంగిపోయిందిట. మరోసారి మా ఇంటికి నాలుగిళ్ళవతల టీవీ షూటింగ్ జరిగితే చూడ్డానికెళ్ళింది సత్య. అక్కడ డైరెక్టరు దాన్ని పనిమనిషి వేషం వేయమని - పావుగంట షూటింగ్‌కి నూటయాభై ఇస్తానన్నాట్ట.

ఒప్పుకోలేదది. "ఏదో గుట్టుగా పని చేసుకుని బ్రతుకుతున్నాను. సీరియల్లో పనిమనిషిలా కనపడితే - దేశమంతా చూస్తారు బావకెంత చిన్నతనం?" అంది సత్య మావాళ్ళతో.

పిన్ని ఊరుకుంటుందా - "పోనీ హీరోయిన్ వేషమడక్కపోయావా?" అంది.

సత్య ఏ మాత్రం చలించలేదు, "మాట కలపడానికి అలా అడిగాడు కానీ ఆ బాబు ఉద్దేశ్యం నన్ను హీరోయిన్ని చేయాలనే. కానీ అందులో హీరోయిన్ వేస్తున్న అమ్మాయి నాకు తెలుసమ్మా! ఒకప్పుడు బాగా బ్రతికి చితికిపోయిన సంసారం వాళ్ళది. ఇప్పుడా అమ్మాయి సంపాదనే వాళ్ళకి జీవనాధారం. నేనైతే నాలుగిళ్ళలో పాచిపని చేసి నాలుగు రాళ్ళు సంపాదించుకోగలను. తనా పని చేయలేదు కదా! ఆమె పొట్టకొట్టడం న్యాయం కాదు కదమ్మా!" అంది.

*దయనీయమైన స్థితిలో ఉన్న సత్యకి తన విషయమై స్పృహలేదు. పైగా ఇతరుల దయనీయ పరిస్థితికి జాలిపడుతోంది. అందుక్కారణం భవిష్యత్తు గురించి తను కనే రంగుల కలలు.*

అప్పటికి నవ్వుకున్నా - ఆ తర్వాత నవ్వుకున్నందుకు కూడా మనసు చివుక్కుమంటుంది నాకు -సత్య కన్న కలల్లో ఒక్కటీ నిజమయ్యే అవకాశం లేదని తెలిసి. పనిమనిషిగా స్థిరపడడమే దాని భవిష్యత్తనీ నాకు తెలుసు. ఎటొచ్చీ అప్పుడు దానికి కలలుండవు. కలలు కనే కూతురుంటుంది.

ఇదంతా సత్యకి వివరించి చెప్పాలనుంటుంది. కానీ అప్పుడది నన్ను కూడా ఆ అమెరికా అబ్బాయిలాగా ప్రేమించి వెంటబడ్డాననుకుంటే - ఇంట్లో నా పరువు గంగపాలౌతుంది. అందుకే అది మాట్లాడేటప్పుడు నేను వినడమే తప్ప కలుగజేసుకోను. అదీకాక సత్య నడిసంద్రంలో నిరాధారంగా ఈతకొడుతున్న మనిషి. నావలోంచీ చేయందించడానికి భయపడను నేను. కానీ వసంత సత్యతో కల్సి ఈత కొడుతోంది. అలా ఈతకొడుతూ - చేయూత లభించే నావల్ని పట్టించుకోవడంలేదు.

జీవితమంతా అలాగే గడిచిపోయినా సత్యకి ఈత కొట్టగల దమ్ముంది. వసంత కనుక నీటిలోంచి బయటపడకపోతే - ఏదో ఒకరోజున అలసిపోయి మునిగిపోతుంది. అదీ నా భయం!

వసంతని సత్య విషయమై హెచ్చరించాలనుంటుంది. కానీ ఆమె నొచ్చుకుంటుందని భయం. అదీకాక ఆమె నడిసంద్రంలో ఈత కొడుతోందని నేననుకుంటున్నాను కానీ - తను మాత్రం ఈ ప్రపంచంలో సంతోషమంతా తనదే అన్నట్లు ఉత్సాహంగా ఉంటుంది. చెప్పాలంటే ఆమెకున్న ఉత్సాహం నాకుగానీ, మా ఇంట్లో మరెవ్వరికిగానీ లేదు.

అన్నింటికీ మించి వసంత వ్యక్తిత్వం కూడా నన్ను భయపెడుతుంది. ఆమె అమ్మని అత్తయ్యా అంటుంది కాబట్టి వరసకు నాకు మరదలు. పెద్ద అందగత్తె కాకపోయినా వయసువల్ల సొగసు కత్తె. ఆమెతో ఎక్కువగా మాట్లాడితే నలుగురి దృష్టి నా మీద పడుతుంది. తక్కువగా మాట్లాడితే మాటలకందదు. జీవితంలో స్థిరపడ్డాక ఆమెని పెళ్ళి చేసుకుంటే ఎలాగుంటుందీ అని కూడా అప్పుడప్పుడు నాకు అనిపిస్తుంటుంది. కానీ వసంత ఇంటర్ ఫైనలియర్ పరీక్షలు వ్రాసే సమయానికి మావాళ్ళామెకి జవహర్ అనే ఓ స్కూల్ టీచర్ సంబంధం చూసారు. ఆ విషయమై వసంత ఏమంటుందోనని మా చెల్లెళ్ళని లోపాయికారీగా వాకబు చేయమన్నారు. నేను చాటుగా వాళ్ళ సంభాషణ విన్నాను.

"గ్రాడుయేటునయ్యాకే నా పెళ్ళి. అప్పుడైనా స్కూలు టీచర్నైతే చేసుకోను" అంది వసంత వాళ్ళతో.

"గ్రాడ్యుయేషన్‌తో ముడి ఎందుకు? పెళ్ళయ్యాక కూడా గ్రాడ్యుయేట్ కావచ్చుగా" అంది పెద్ద చెల్లెలు.

"ఏ ఆడపిల్లకినా పెళ్ళయ్యాక - మేడల్లో ఉండాలనీ, కార్లలో తిరగాలనీ, రోజుకో డ్రెస్సు మార్చాలనీ - కలలుంటాయి. ఇప్పుడే పెళ్ళి చేసుకుంటే ఆ కలలు ఇప్పుడే చచ్చిపోతాయి. మరో మూడేళ్ళు వాటికి ఆయువు పోయడానికే గ్రాడ్యుయేషన్" నవ్వింది వసంత.

"మరి గ్రాడ్యుయేటయ్యాక కూడా స్కూల్ టీచర్ దొరికితే పెళ్ళి చేసుకుందుకు సిద్ధమేనా?"

"ఊఁ" అంది వసంత.

"అదిప్పుడే చేసుకుంటే తేడా ఏమిట్ట?"

"ఇప్పుడు చేసుకుంటే అది పెద్దలకి భారం, బాధ్యత. అప్పుడు చేసుకుంటే ఆ భారం, బాధ్యత నావి"

"అంటే?"

"నా అభిప్రాయంలో ఈ కాలపు ఆడపిల్లలందరూ ఆలోచించాల్సిన పద్ధతి ఇది" అంది వసంత.

ఇంజినీరో డాక్టరో అవాలని కలలు కంటున్న నా చెల్లెళ్ళే పెళ్ళి గురించి ఇలా ఆలోచించినట్లు లేదు. జీవితంలో పైకి రావడం వరకూ తమ బాధ్యతనీ, పెళ్ళి పెద్దల బాధ్యతనీ అనుకునే వాళ్ళలో కనిపించని - ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం ఆమె గొంతులో ధ్వనించి నన్ను విచలితుణ్ణి చేసాయి. కానీ నాలో ఓ మూల అనుమానం. ఆమె నమ్మకానికి కారణం - సత్య సాహచర్యం ప్రభావమని.

వసంత దృక్పథం పెద్దలకి తెలిసింది. ఐనా ఆమె పెళ్ళి తమ బాధ్యతగా భావించిన వాళ్ళకి - మున్ముందు తమకది భారంగా మారగలదని భయపడుతున్న సమయంలో తెలిసిన సంబంధమిది.

జవహర్ నాకంటే మూడేళ్ళు పెద్ద. అతడి తండ్రి కూడా స్కూలు టీచరు. ఆదర్శవాది. తల్లి సంప్రదాయం పాటించే గృహిణి. అతడికో అక్క, చెల్లి ఉన్నారు. ఇద్దరికీ పెళ్ళిళ్ళైపోయాయి. వాటికైన అప్పులు అతడు, తండ్రి తీర్చాల్సి ఉంది. ఐనా వాళ్ళు జవహర్ పెళ్ళికి కట్నకానుకలు, లాంఛనాలు ఆశించడంలేదు. వధువు పక్షంవారికి అభ్యంతరం లేకపోతే గుళ్ళో పెళ్ళి చాలంటున్నారు.

తల్లీ తండ్రీలేని ఆడపిల్లకిది చాలా మంచి సంబంధం. ఆమె బాధ్యత తీసుకున్న మావాళ్ళకిది మంచి అవకాశం. అన్ని విధాలా అదృష్టం కలిసివచ్చిందని అందరి ఉద్దేశ్యం.

పెళ్ళిచూపులు జరిగాయి. జవహర్ తరఫు వారందరికీ వసంత నచ్చింది. జవహర్, వసంత కాసేపు విడిగా వెళ్ళి మాట్లాడుకునొచ్చారు. తర్వాత జవహర్, "అమ్మాయి డిగ్రీ చేసాక పెళ్ళి చేసుకుంటాననంటోంది" అన్నాడు తలితండ్రులతో.

జవహర్ తల్లి వెంటనే, "ఆడపిల్ల చదివేదే పెళ్ళికోసం కాదా?" అంది ఆశ్చర్యంగా.

వసంత దృక్పథం ముందే తెలిసిన బామ్మ, "అంతగా చదువుకోవాలనుంటే - పెళ్ళయ్యాక చదువుకోవచ్చు. మొగుడి సాయం కూడా ఉంటుంది" అంటూ విషయాన్ని తేలిక చేయబోయింది.

జవహర్ తలితండ్రులు ఔననలేదు. కాదనలేదు. వచ్చిన దారినే వెళ్ళారు. మరి కబురు లేదు.

వసంత నిశ్చింతగా ఉంది కానీ - ఆ సంబంధం చేజారిపోవడం గ్లోబల్ మెల్ట్‌డౌన్ కంటే ఎక్కువగా కలవరపర్చింది ఇంట్లో అందరినీ. వసంతని ఇంట్లోంచి పొమ్మంటే అభద్రతాభావంతోనైనా ఈ పెళ్ళికి ఒప్పుకుంటుందన్న ఆలోచన కూడా వారికొచ్చింది కానీ - మా కుటుంబం సంస్కారం అందుకు సహకరించలేదు.

"చిన్నపిల్ల. దూరాలోచన లేదు. మెత్తగా చెబితే వినదు బలవంతాన కాళ్ళూ చేతులూ కట్టి పెళ్ళి చేయలేం. ఎవరైనా దానికి నచ్చచెబితే బాగుణ్ణు" అంది బామ్మ ఆ సంబంధం ఇంకా చేజారిపోలేదన్నట్లు.

వసంత పెళ్ళి వాయిదా పడితే నాకు సంతోషమే కానీ - జవహర్ని కాదని ఆమె తప్పు చేస్తోందేమోనని అనుమానం. అబ్బాయిని కాబట్టి నాదింకా పెళ్ళీడు కాదు. అమ్మాయి కాబట్టి నాకంటే నాలుగేళ్ళు చిన్నదైనా వసంతది పెళ్ళీడే మరి. అలాంటప్పుడు పెద్దలవల్లకాని పని పిల్లలే చేయాలని, "వసంతకి నచ్చచెప్పాలని కాదు - సత్య ప్రభావంలో పడి తప్పటడుగేయొద్దని హెచ్చరించి చూద్దాం" అన్నాను తమ్ముళ్ళతో, చెల్లెళ్ళతో. ఓ సెలవు రోజు సాయంత్రం మేమందరం వసంతకి బ్రెయిన్ వాష్ కార్యక్రమానికి పూనుకున్నాం.

"జవహర్ ఈ రోజుల్లో పుట్టాల్సినవాడు కాదట, బామ్మ చెప్పింది" అంది చిట్టి చెల్లి.

"కానీ నేను ఈ రోజుల్లో పుట్టాల్సినదాన్ని. అందుకే మాకు పొసగదు" అంది వసంత వెంటనే.

సమయస్ఫూర్తిలో ఎవరైనా వసంత తర్వాతే. అందుకని రూటు మార్చి, "నీకు జవహర్ నచ్చినట్లు లేదు. ఎందుకో చెబితే - ఇక్కడ ముగ్గురాడపిల్లలకి ప్రయోజనం" అన్నాను.

"భవిష్యత్తు గురించి నేను కనే కలలకీ, జవహర్ భావాలకీ బొత్తిగా పొసగదు. తండ్రిలాగే తనూ స్కూల్ టీచర్ కావాలనుకున్నాడు, అయ్యాడు. పెళ్ళయ్యాక కూడా తండ్రిలాగే ప్రశాంతంగా జీవిస్తూ స్కూల్ టీచరుగానే రిటైరవాలనుకుంటున్నాడు. అతడికి తన జీవితం పట్ల అసంతృప్తి లేదు. ***కలలంటే అతడికి నిద్ర మనిషికిచ్చే కాలక్షేపం.*** కలల్లోంచి లక్ష్యాలేర్పరచుకోవడం ఇమ్మెచ్యూర్ అంటాడతడు" అంది.

"సంతృప్తికి మించిన సంపద లేదని సూక్తి. చిన్నప్పుడే అంత సంతృప్తి - రేర్ మెచ్యూరిటీ. అతడితో ఉంటే అది నీకూ అబ్బవచ్చు" అన్నాను నేను.

***"అతడి సంతృప్తివల్ల అతడికి మాత్రమే ప్రయోజనం. ఉన్నత లక్ష్యాలతో - నిరంతరం ఎదుగుదల కోరుకునే వారి అసంతృప్తిలోప్రగతి, సమాజహితం ఉంటాయని నేననుకుంటాను"*** అంది వసంత.

"ఐతే స్కూల్ టీచరు కావాలనుకోవడం ఉన్నత లక్ష్యం కాదంటావా?" అడిగాను.

"స్కూలు టీచరు గొప్పతనాన్నీ, గృహిణి విశిష్టతనీ - మాటల్లోనే తప్ప చేతల్లో గుర్తించని సమాజం మనది. అందుకే నేను గృహిణిగా స్థిరపడను. నా భర్త స్కూల్ టీచరుగా స్థిరపడాలనుకోను" అంది వసంత.

ఆమె చెప్పేదకా ఆ చేదు నిజం నాకు స్ఫురించకపోవడంలో ఆశ్చర్యం లేదు. వయసులోనూ, చదువు లోనూ పెద్దవాణ్ణైనా - ఆలోచనల లోతు, జీవితానుభవం ఆమెకే పెద్దరికాన్నిచ్చింది.

"కానీ ఈ పెళ్ళి చేసుకోకపోతే - ఇంట్లో పెద్దవాళ్ళకి కోపం రావచ్చు. ఆ కోపంలో నీపట్ల ఊహించనంత కఠినంగా వ్యవహరించవచ్చు" చివరి బాణం వేసాను.

"వాళ్ళు నా మేలు కోరేవాళ్ళు. నాలుగేళ్ళుగా నన్ను కంటికి రెప్పలా చూసుకుంటున్నవాళ్ళు. కోపమొస్తే రావచ్చు. కానీ మేడల్లో ఉండాలనీ, కార్లలో తిరగాలనీ, రోజుకో డ్రెస్సు మార్చాలనీ, సినిమా హీరోలాంటివాణ్ణి భర్తగా పొందాలనీ - కోరుకునే నా ఆశలు భగ్నం చేయాలనుకోరు" వసంత గొంతులో నమ్మకం. ఉలిక్కిపడ్డాను. అవన్నీ సత్యకలలు. వసంతపై సత్య ప్రభావానికి నిదర్శనమా మాటలు. ఇక లాభం లేదని ఆ మాట కూడా చెప్పేసాను.

"ఎస్. నాకు సత్య గొప్ప ప్రేరణ. తన ఊహలనిండా ఆశే! ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా తనలో ఆశని చావనియ్యదామె" అంది వసంత.

సత్య గురించి ఈ కోణంలో ఎప్పుడూ ఆలోచించలేదేమో - వెంటనే సమాధానం స్ఫురించలేదు. తర్వాత నెమ్మదిగా, ***"ప్రేరణకి ఎన్నుకున్న మనుషుల్ని బట్టే మన ప్రగతి ఉంటుంది.*** ఆశకైనా తర్కముండాలి కదా!" అన్నాను.

"ఈ ఇంట్లో ప్రేరణకి సత్యని మించినవారెవరున్నారు? ఆమె భవిష్యత్తు కోసం తన బావ గణేష్‌నెన్నుకుంది. తన మటుకు తను కాళ్ళమీద నిలబడింది. తనకంటూ ఓ యాక్షన్ ప్లాన్ వేసుకుంది. దేనికైనా ఎస్ ఐ కెన్ అనుకుంటుంది. ***ఆమె ఆశలకి ప్రయత్నమే తప్ప తర్కముండదు. ప్రయత్నాలు విఫలమైతే మరో ప్రయత్నమే తప్ప కృంగుబాటుండదు"*** అంది వసంత.

"అక్కడికి సత్య ఏదో ఒబామా అన్నట్లు చెబుతున్నావే -" అన్నాను కాస్త విసుగ్గా, వెటకారంగా.

"అన్నట్లు మీకు తెలియదేమో - సత్య పూర్తి పేరు సత్య భామ. ఆమె పనిలో ఉన్నప్పుడల్లా నేనామెని 'వో భామా' అని పిలుస్తాను" అంది వసంత చటుక్కున. అది నా ఎగతాళికి సమాధానంలా ఉంది.

# వ్యక్తిత్వం

- కుండ్లకుంట శరత్ చంద్ర

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

"మీ అమ్మ చచ్చిపోయింది" ఫోన్‌లో చెప్పాడు శంకరం.

మా ఊళ్ళో, మా ఇంటి ప్రక్కన ...కాదు కాదు... మా అమ్మ ఇంటి(!) ప్రక్కన ఉండే కుటుంబంలో పెద్ద కొడుకు శంకరం.

ఆ మాట వినగానే .....ఆఫీసులో ఫైళ్ళు పరిశీలిస్తున్న నాకు.....కొద్దిగా బాధ కలిగింది.

'కొద్దిగా' అనే పదం వాడితే..... మీకు కోపం రావొచ్చేమో గానీ.... అది పచ్చినిజం.

అమ్మ చచ్చిపోతే.... ఎవడికి బాధా కలగదు?! అందుకే.... ఆ కొద్ది బాధ.

"మేం వెంటనే బయలుదేరి వస్తున్నాం" చెప్పి రిసీవర్ క్రెడిల్ చేసాను. వెంటనే నా భార్య పద్మకు ఫోన్ చేసి విషయం చెప్పాను.

"అలాగా!" అంది.

"అయ్యో.. నీ తల్లి చనిపోయిందా? అందుకు నా సానుభూతి" అనే భావం, "పీడ విరగడయ్యింది" అనే భావం..... ఆమె కంఠంలో ధ్వనించాయి.

"పిల్లలను ఇంటికి తీసుకొచ్చెయ్యి. వెంటనే బయలుదేరదాం." అన్నాను.

"ఊఁ" అంది.

*పెళ్ళి ఖాయమయ్యాక.. కాబోయే భార్యాభర్తల భావవ్యక్తీకరణ, సంభాషణలు ప్రబంధాల పరిమాణంలో ఉండి... పెళ్ళయ్యాక అవి నవలల పరిమాణంలోనికి మారి పిల్లలు పుట్టాక నవలికల పరిమాణంలోనికి రూపాంతరం చెంది..... ఏళ్ళు గడిచేకొద్దీ... అవి కథల పరిమాణంలోనికీ......కవితల పరిమాణంలోనికీ.... హైకూల పరిమాణంలోనికీ... వెళ్ళి స్థిరపడతాయి. చాలమంది ఈ జాబితాలోనే ఉంటారు.*

ఎక్కువగా మాట్లాడితే... వాదనలు!! అందుకే... 'ఆఁ!', 'ఊఁ!', 'అలాగా...!' 'సరే! 'వద్దు!'... ఇంతే!!

ఫైళ్ళు మూసేసి, లీవ్ పెట్టడం కోసం పై ఆఫీసర్ గదిలోనికి వెళుతుంటే... "సార్! ఒక ఫైలు కదిలించాలి. మీ బల్లమీదే ఉంది. పార్టీ... ఐదువేలు ఇస్తానన్నాడు." గుసగుసగా చెప్పాడు క్లర్క్. నేను వెంటనే నా గదిలోకి నడిచి, ఇంకో అరగంట సేపు కాలాన్ని వెచ్చించి, ఆ ఫైలు క్లియర్ చేసి, తర్వాతి సెక్షన్‌లోనికి పంపాను. అందిన ఐదువేలూ జేబులో వేసుకుని, ఆఫీసర్ గదిలోనికి నడిచాను.

ఆయన చాలా బాధపడ్డాడు. విచారాన్ని, ముఖకవళికల్లోనూ, మాటల్లోనూ వ్యక్తం చేసి, వెళ్ళమని చెప్పాడు.

జేబులోని లంచం డబ్బులు తడుముకుంటూ.... బయటకి నడిచాను.

నేను, పద్మ, ఇంటర్మీడియట్ చదువుతున్న నా పెద్దకూతురు, ఎనిమిదవ తరగతి చదువుతున్న నా చిన్నకూతురు... బస్సులో ప్రయాణిస్తున్నాం.

మా ఊరు చేరేందుకు ఇంకా గంటదాకా సమయం ఉంది. నేను కళ్ళుమూసుకున్నాను. అమ్మపై నాకు, `అమ్మ` అనే భావం ఉంది. గౌరవాన్ని బయటికి ప్రకటిస్తాను. కానీ.... మనసులో ఆమెను గౌరవించను. నా భార్యకూడా అంతే!!

నిజానికి ...మా దంపతులకూ, మా అమ్మకూ మధ్య... ఏ కురుక్షేత్రాలూ లేవు.... మాటల యుద్ధాలూ లేవు. గొడవలు అంతకంటే లేవు.

మేము గ్రామీణులమో, నిరక్షరాస్యులమో అయ్యుంటే... మా మనసులోని భావాలను, వాటి తీవ్రతతో కలిపి మరీ ధైర్యంగా మా అమ్మకు చెప్పుండేవాళ్ళం. గొడవపడి ఉండేవాళ్ళం. చదువుకున్న వాళ్ళమవడంతో.. హిపోక్రసీ ముసుగు వేసుకుని, `హ్హి హ్హి హ్హి !` అని పళ్ళికిలిస్తూ మనసులో మాత్రం ఏడ్పులూ, ద్వేషాలూ, బాధలూ, భయాలు...!!! ఇళ్ళలో, ఆఫీసుల్లో బయట... చాలా మందికి ...బంధాలు ఇలాగే ఉండడం గమనించాను. తిట్టుకోరు, కొట్టుకోరు, గంటల తరబడి వాదించుకోరు...!

కానీ ఒకరినొకరు ద్వేషిస్తూనే ఉంటారు. తమాషా ఏమిటంటే.... తనను అవతలి వ్యకి ద్వేషిస్తున్న విషయం... ఇరువైపులవారికే తెలుసు. అయినా వ్యవహారం నడిపిస్తుంటారు. నాకు పదేళ్ళ వయసునప్పుడు, మా నాన్న చనిపోయాడు. బి.ఏ చేసి ట్రైనింగ్ పూర్తిచేసిఉండడం వల్ల... ఆ ఉద్యోగం మా అమ్మకు వచ్చింది. నన్నూ, చెల్లెల్ని అమ్మే పెంచి పెద్దచేసింది. ఇక్కడివరకూ కథ బాగానే ఉంది. నా పెళ్ళిచూపులు జరిగిన రోజు... అసలు కథ మొదలయ్యింది. పెళ్ళిచూపులలో.. నేనూ, పద్మా ఒకరినొకరం ఇష్టపడ్డాక.....

"ఏరా.. అమ్మాయి బావుంది. కుటుంబం బావుంది. ఇంకా .... కట్నం తీస్కోవాలనే ఉద్దేశ్యంలోనే... ఉన్నావా?" అడిగింది అమ్మ ఇంటికి రాగానే.

"అదేమిటమ్మా! దేని వ్యవహారం దానిదే కట్నం తీసుకోకపోతే... నలుగురునవ్వుతారు."

"ఎవరు ఆ నలుగురు? ఉద్యోగం లేకపోయి... ఉందని చెప్పి కట్నం తీసుకుని పెళ్ళిచేసుకున్న నీ స్నేహితుడు సుబ్బారావు, కట్నం కోసం... అమ్మాయిని చూడనైనా చూడకుండా ఒప్పేసుకున్నా. వ్యసనపరుడు... మీ పెద్దనాన్నకొడుకు కిరీటి, కట్నం పేరుతో... అమ్మాయి తండ్రి పొలాన్ని, లాక్కున్న... నీ కొలీగ్ అచ్యుతరెడ్డి, పెళ్ళయి నాలుగేళ్ళయినా... కట్నం కోసం భార్యను సతాయిస్తున్నా సలీంగాడు... వీళ్ళేనా ఆ నలుగురు" అంది.

"అదికాదు. కట్నం ఎంత తీసుకున్నావ్... అని నా కొలీగ్స్ అడుగుతారు. తీసుకోలేదంటే నాలో ఏదో లోపం ఉందనుకుంటారు. నన్నొక దద్దమ్మలా చూస్తారు." చెప్పాను.

"ఛ ఛీ! ఎవరో ఏదో అనుకుంటారని... మనం నిర్ణయాలు తీస్కోవడం మంచిదికాదు." అంది.

"అమ్మ! ఇక మనం దీని గురించి చర్చించడం అనవసరం." నెమ్మదిగా అన్నాను.

"ఊం! సరే.... ఎంత అడగమంటావ్?" అడిగింది.

"యాభైవేలు." అన్నాను.

"మరీ... అంతా!! బావుండదేమో!?" అంది.

ఆ రోజుల్లో... నా ఉద్యోగానికి అంతే పలుకుతోంది. అంతకుముందే.. కనుక్కుని సిద్ధంగా ఉన్నాను.

"ఫరవాలేదు. అడుగు" అన్నాను.

"అదికాదురా... పద్మ తర్వాత... ఆయనకు ఇంకో ఆడపిల్ల ఉంది." అంది అమ్మ.

"ఉంటే?" అన్నాను.

అమ్మ ఇక మాట్లాడలేదు.

అనుకున్నట్లుగానే.. పద్మ తండ్రిని యాభైవేలు అడిగి, కట్నం క్రింద తీసుకుంది. పెళ్ళి ఘనంగానే జరిగింది. ఆ తర్వాత మా ఇంట్లో సత్యనారాయణ వ్రతం చేసి... ఊళ్ళో తెల్సిన వాళ్ళందరికీ ఆహ్వానం పంపి.... భోజనాలు పెట్టించాం.

రెండు నెలల తర్వాత, పెళ్ళి ఖర్చులు పోను.... కట్నం డబ్బు ఎంత మిగిలిందో చూసి.... ఇవ్వమని అడిగాను.

దానికి ఆమె నవ్వి, "డబ్బా! మిగలడమా?" అంది.

మా మధ్యనున్న అనుబంధం... బీటలు వారుతున్నట్లు అనిపించింది.

"మిగలలేదా?" అడిగాను.

"అవునురా! మిగలలేదు" అంది

"................"

"ఏమ్రిటా అలా చూస్తున్నావ్! నేనేమైనా.... ఆ డబ్బు మింగేసాననుకుంటున్నావా? వీడియో, ఫోటోలు, పురోహితుడు, బాజాభజంత్రీలు, ఒక పుస్తె, మన ఊరి నుండి... మీ మామగారి ఊరికి సర్వీస్ బస్సు... వీటన్నింటికీ.... సంప్రదాయం ప్రకారం... నేనూ, మీ మామగారూ చెరిసగం చెల్లించాం. ఆ తర్వాత... మనఊళ్ళో విందు ఏర్పాటు చేసాం కదా! మిగిలింది.... దానికి ఖర్చైపోయింది."

ఇక నేను వాదించలేదు. మా మామగారితో మాట్లాడి.... మా అమ్మ చెప్పిన వాటికి ఎంత ఖర్చయ్యిందో... చాలా నేర్పుగా అడిగి కనుక్కున్నాను. మా ఊళ్ళో భోజనాలకోసం, అమ్మ క్యాటరింగ్ మాట్లాడింది. దానికి ఎంతయ్యిందో.... క్యాటరింగ్ వాళ్ళను అడిగి కనుక్కున్నాను. మొత్తం కలిపి... ఇరవై ఎనిమిదివేలు అయ్యింది. అంటే... మిగిలిన డబ్బంతా... ఇక ఆలోచించలేకపోయాను.

"కట్నం తీసుకుంటావా?" అని ప్రశ్నించి.... ఇప్పుడిలా డబ్బును దిగమింగెయ్యడం... ఛీ...ఛీ!!

డబ్బును దాచిపెట్టడం కోసం... మా అమ్మ చాలా సాధారణ జీవితం గడిపేది. అప్పటివరకూ 'అమ్మ'లా కనిపించిన 'అమ్మ' .. ఆ తర్వాత... వ్యాపార వేత్తలా కనిపించసాగింది. బయటివారితో వ్యాపారం చేసి లాభపడొచ్చు. కానీ ఇంట్లోవాళ్ళంతో వ్యాపారం చెయ్యడం... మోసం చేసి లాభం పొందాలనుకోవడం ఎంత నీచం!!

నాకు కూతుళ్ళు పుట్టినప్పుడు... మా మామగారు... ఇద్దరి నామకరణోత్సవాల రోజు... వాళ్ళకు చిన్న చిన్న బంగారు ఉంగరాలు, గొలుసులు చేయించి వేస్తే... మా అమ్మ మాత్రం.. వందరూపాయలు ఇచ్చింది.

ఆ విషయమ్మై ....పద్మ నన్ను చాలా సార్లు హేళన చేసేది.

ఆమెకు వచ్చే జీతమంతా ఏం చేసుకుంటుందో... అర్ధమయ్యేది కాదు. మా మామగారితో ఆ విషయం చెప్పి, ఓసారి బాధపడ్డాను.

"ఆం ఆమె మాత్రం డబ్బు మిగుల్చుకుని ఏం చేసుకుంటుందయ్యా? అంతా మిగిల్చి మిగిల్చి.... మీకేగా ఇవ్వాల్సింది." అన్నాడు.

"అవును! ఇది లోకరీతేగా!!" మనసులో అనుకుని తృప్తిపడ్డాను. సాఫ్ట్‌వేర్ రంగం అప్పటికే... వేళ్ళూనుకుపోయింది.

నా పిల్లలనూ...చుట్టుప్రక్కల వారి పిల్లలతో పోటీపడేలా (!) పెంచాలి కాబట్టి... నా నెలజీతం అందుకు సరిపోదు కాబట్టి.... నెమ్మదిగా లంచాలు తీస్కోవడం మొదలుపెట్టాను.

మా శాఖలో అది సాధారణమైన విషయం!

లంచం ఇచ్చేముందు.... ప్రతివాడూ... మమ్మల్ని ఒక చూపు చూస్తాడు.

'ప్లీజ్! నా పని సక్రమంగా జరిగేటట్లు చూడండి.... సార్!' 'ఓరి....దొంగనాయాలా... విధిలేక నీదగ్గరికొచ్చాను. నువ్వు మట్టిగొట్టుకపోతావ్'...... ఈ రెండు భావాలూ... వారివారి చూపుల్లో కనిపించేవి.

మా అమ్మ రిటైరయ్యింది.

నేనూ, పద్మా వెళ్ళి... అమ్మను తీసుకురావాలనుకున్నాను.

"నువ్వెళ్ళావా? అమ్మ కొద్దిరోజులు నా దగ్గర ఉంటుందనుకున్నాను." అంది, హైదరాబాద్‌లోనే ఉంటున్న నా చెల్లెలు, నాకు ఫోన్ చేసి.

"దానిదేముంది. కొద్దిరోజులయ్యాక తీసుకెళ్ళు." అన్నాను.

"ఊఁ! సరేలే." అంది. ఆమె కంఠంలో నిరాశ.

నా చెల్లెలు ఫోన్ చేసిన విషయం, పద్మకు చెప్పాను.

పద్మ, పదినిమిషాలు ఆలోచించి, "మీ అమ్మకు..రిటైర్మెంట్ తాలూకు బెనిఫిట్స్ ఓ అయిదారు లక్షలు రావచ్చు. వాటిని చేజిక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో..... మీ అమ్మను తీసుకెళ్ళి... కాకా పట్టాలని మీ చెల్లెలి ఆలోచన" అంది.

"మా చెల్లెలు అమాయకురాలు. దానికి అంత ఆలోచనవుండదు." అన్నాను.

"ఆఁ... సర్లెండి. పెళ్ళయ్యేదాకా... 'అయ్యో.. పద్మ అమాయకురాలు! పాపం... ఎలా బ్రతుకుతుందో' అనేవారు. ఇప్పుడూ...చెప్పండి...నేను అమాయకురాలినా?"

"............"

"మీ చెల్లెలి భర్తకూడా ఉన్నాడుగా. ఆయనసలే బిజినెస్ మైండ్!" అంది.

"ఈ రోజుల్లో... బిజినెస్ మైండ్ లేనిదెవ్వరికి?"

"సరే! మా అమ్మను జాగ్రత్తగా చూసుకో. ఆవిడకు ఇష్టమైనవి వండిపెట్టు..... కాళ్ళుపట్టు...పొగుడు... ఏం చెయ్యాలో అన్నీ చెయ్యి. ఆ డబ్బు మనకే ఇస్తుంది." అన్నాను.

పద్మ తలూపింది.

ఆ రోజు గడిచిపోయింది. రాత్రి బెడ్‌రూంలోకి రాగానే చెప్పింది పద్మ, "మీ అమ్మకు సేవ చేద్దామంటే.... చెయ్యనివ్వలేదావిడ. తన పనులన్నీ తానే చకచకా చేసుకుంటోంది" అంది.

నేను నవ్వి ఊరుకున్నాను.

"నా పనులు నేను చేసుకోగలను. నేను రిటయిరయ్యింది... ఉద్యోగంనుండేగానీ... జీవితం నుండి కాదు. జీవితానికి అసలైన రిటైర్మెంట్..... చావే!' అని మా అమ్మ, సాయంత్రం పద్మతో అనడం నేనూ విన్నాను.

ఇంకో రోజు గడిచాక ... రాత్రి బెడ్రూంలోనికి వస్తూ... పద్మ, తలుపును ధడేలున వేసింది.

చాలామందికి ఇదొక అలవాటు. కోపాన్ని ........జడపదార్థాల మీద చూపిస్తారు

"ఏమైంది?" అడిగాను.

"మీ అమ్మ... ఆ డబ్బును మనకు ఇవ్వదట"

"అవునా!! మరి చెల్లెలికి ఇస్తుందా?"

"ఇవ్వదట."

"మరి! మనవరాళ్ళకు ఇస్తుందా?"

"ఊహూఁ!"

"మరి?"

"తానే ఖర్చు చేస్తుందట."

"ఖర్చా?! ఏం... ఈ వయసులో చీరలూ, నగలూ కొనుక్కుంటుందటనా!"

"లేదు. ఏం చేస్తుందో చెప్పలేదు."

"..................."

"..............."

మరో రెండు రోజుల తర్వాత, "నేను అమ్మాయిని కలిసి... మన ఊరు వెళ్ళిపోతాను." అంది.

అదేంటమ్మా! ఇక్కడే ఉండొచ్చుగా!! అని నేను అనలేదు.

"సరే!" అన్నాను.

"ఏమండీ... ఊరొచ్చింది." నా భార్య పిలుపుతో ఈ లోకంలోనికి వచ్చాను. ఊళ్ళో బస్ దిగగానే.... నా కోసం ఎదురు చూస్తున్న పక్కింటి శంకరం, నా బంధువులు నన్ను పలకరించారు.

సరాసరి ఇంటికి వెళ్ళాం. హాల్లో అమ్మ శవం ఉంది.

అగరొత్తుల సువాసన, పూలవాసన..... హాలును పరిమళభరితం చేస్తున్నాయి. మేము వెళ్ళి నమస్కరించి, ఓ ప్రక్కన కూర్చున్నాం.

ఆ తర్వాత, నా చెల్లెలు, ఆమె భర్త, అత్తమామలు, నా అత్తా మామలు, నా తల్లితండ్రుల తరపు బంధువులు దిగారు.

ఏడుపులతో అక్కడి వాతావరణం శోకసముద్రాన్ని తలపిస్తోంది.

"ఫ్చ్! మంచి మనిషి!!" అని ఊళ్ళో వాళ్ళు వచ్చి, అమ్మ గురించి మాట్లాడుతూ ఏడుస్తున్నారు.

"చచ్చినవారి కళ్ళు చారడేసి...!" అని చచ్చాక వారి గురించి అందరూ బాగానే మాట్లాడతారు. లోకరీతి!!

"డబ్బంతా మూటగట్టి ఏం చేసుకుంది? తన అన్నయ్యలకు ఇచ్చుకుందా? పొలాలేమైనా కొందా?" మనసులో అనుమానాలు తొలుస్తున్నాయి.

"చీకటిపడితే.... శవదహనం చేయకూడదంటారు. ఇక పని ప్రారంభిద్దామా.?" అన్నాడు ఓ పెద్దాయన.

కార్యక్రమం ప్రారంభమయ్యింది.

ఆ రోజు లంచం క్రింద తీసుకున్న ఐదువేలతో పాటు... మరో ఎనిమిదివేలు తెచ్చాను. బ్రతికున్నప్పుడు సరిగ్గా చూసుకోకపోయినా... చచ్చాక మాత్రం కర్మకాండలు బాగానే జరిపించాలి మరి! లేకపోతే జనం ఊరుకోరు.

శవయాత్ర, స్నాలు, శవ అలంకరణ, దింపుడు కళ్ళాలు, తలకొరివి, కపాళ - మోక్షం.... ఇవన్నీ జరిగేసరికి, రాత్రి ఏడయ్యింది.

ఇంటికి వచ్చేసాం.

"అత్తయ్యగారు... మీకు డబ్బేమైనా ఇచ్చారా?" అడిగాడు నా చెల్లెలి భర్త, మరుసటి రోజు ఉదయం.

"అంటే.. అంటే.... అమ్మ.... నాకు డబ్బు ఇచ్చే ఉంటుందని............ నా చెల్లెలూ, ఆమె భర్త............ ఇన్నేళ్ళుగా నమ్ముతూ వస్తున్నారన్నమాట!!'

నాకు వళ్ళుమండింది. అయినా తమాయించుకుని, "లేదు" అన్నాను. ఇక అతడు నన్ను కదిలించలేదు.

టిఫిన్లు ముగిసాక.... నన్నూ, పద్మనూ... నా మామగారు............ మేడ మీదకి తీసుకెళ్ళారు.

"మీ అమ్మ.. దేవత అల్లుడుగారూ!" అన్నాడాయన.

అది చెప్పడానికేనా .... ఇక్కడికి తీసుకొచ్చాడు! ఆయనవంక చిరాగ్గా చూసాను.

"నీకొక విషయం చెప్పాలి. ఆమె బ్రతికున్నంత వరకూ........... మీతో చెప్పకూడదని నాతో ఒట్టు వేయించుకుంది. అందుకే.... ఇప్పుడు చెప్పాలని తీసుకువచ్చాను."

మేమిద్దరం ఆయన వంక విచిత్రంగా చూసాం.

"కట్నం డబ్బును కుడిచేతితో తీసుకుని... ఎడమ చేతితో... మళ్ళీ నాకే ఇచ్చింది. 'మీకు ఇంకో అమ్మాయి ఉంది కదండీ..... ఆ డబ్బు వాడుకోండి' అంటూ తిరిగి ఇచ్చేసింది. మీకుగానీ, మా అమ్మాయికి గానీ.......... ఈ విషయం చెప్పకూడదని ఒట్టువేయించుకుంది."

ఇద్దరం నోళ్ళు తెరిచాము.

అంటే..!? నా పెళ్ళప్పుడూ ఖర్చయిన ఇరవై ఎనిమిదివేలు.... తన జీతంలో దాచుకున్న డబ్బన్నమాట!

"ఆమె ఈ కాలంలో పుట్టాల్సిన వ్యక్తికాదు బాబూ! నీకు కూతుళ్ళు పుట్టినప్పుడు. వాళ్ళకు చేయించి పెట్టిన ఉంగరాలు, గొలుసులు మీ అమ్మ చేయించినవే. మీకు తెలుసుగా. నేను చాలా చిన్న ఉద్యోగిని. గంపెడు సంసారం. నేనెలా కొనగలను!!

అది గ్రహించిన మీ అమ్మ, వాటిని కొని, నాకు ఇచ్చి, నేను ఇస్తున్నట్లుగా ఇవ్వమంది. 'మీరే ఇవ్వండీ. నేను అలా ఇవ్వను' అని వారిస్తే ఆమె ఒప్పుకోలేదు. 'ఫంక్షన్లకు వచ్చేవాళ్ళు ఎంతసేపూ మీరు ఏం ఇచ్చారని చూస్తారే తప్ప నన్నెవరూ పట్టించుకోరు. నేను, నా కొడుకు, కోడలు ఒకే కుటుంబసభ్యులం. అందువల్ల, నన్నెవరూ తప్పుపట్టరు.' అంది.. మీ అమ్మ" చెప్పాడాయన.

నాకు పేగుల్లో............ ఏదో కదులుతున్నట్లు భావన!!

ఆయన క్రిందకి వెళ్ళిపోయాడు.

నేనూ మౌనంగా క్రిందికి నడిచాను.

ఇంట్లో ఉండాలనిపించక కాసేపు అలా తిరిగొద్దామని బయటికి నడిచాను. అందరూ నాకు నమస్కారాలు పెడుతున్నారు.

ఎందుకో.......నాకు అర్థంకాలేదు.

ఓ పాక ముందు, ఇద్దరు దంపతులు కూర్చుని తోలుతో డోలు తయారు చేస్తున్నారు. నన్ను చూడగానే, వాళ్ళిద్దరూ నా దగ్గరికి వచ్చి విచారం వ్యక్తం చేసారు.

"రండి బాబూ...కాసేపు కూసోండి" అన్నాడతడు.

నేను తలూపాను. వాళ్ళు, తుప్పుపట్టి వున్న ఓ ఇనుప కుర్చీ తెచ్చి వేసారు. నేను కూర్చున్నాను.

"మీరు............శానా...............గొప్పోరు బాబూ!" అంది ఆమె, తోలును సాగదీస్తూ.

"ఎందుకు?" అన్నాను.

"మా అమ్మాయి పెళ్ళి జరిపించినారుగా బాబూ!" అందామె.

తోలు బాగా సాగుతోంది............. నా మనసులాగా.

"??!!"

"ప్చ్ పిల్ల పెళ్ళి కుదిరింది... సేతిలో పైకం లేక గుబులుపుడుతుంటే ఆ సంగతి తెల్సుకున్న మీ అమ్మగోరు నాకొడుకుని అడిగి తెచ్చిత్తానని సెప్పారు. మూడురోజుల తర్వాత. మీరు పోష్టులో సెక్కు పంపించారని సెప్పారు. ఆ సెక్కును బ్యాంకుల మార్చి ముప్పైయేలు మా సేతిలో పోసినారు. మీరు నిజ్జంగా దేవుడు బాబూ!"

ఛెళ్ళుమని..............చెర్నాకోలతో కొట్టినట్లయింది.

రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో నుండి కొంత డబ్బు అమ్మ ఇలా ఖర్చు చేసిందన్నమాట. పైగా ఆ డబ్బు నేను ఇచ్చానని చెప్పి, నాకు కీర్తి రావాలని ఆశపడింది. వాళ్ళు పొగుడుతూనే ఉన్నారు. ఆ పొగడ్తల నారాచాలై నన్ను చీలుస్తున్నాయి. నాకు అక్కడ ఉండబుద్ధికాలేదు. అక్కణ్ణించి ముందుకు నడిచాను.

"బాబూ! మీ కుటుంబం చలువ వల్ల ఈ రోజు, ఊళ్ళో తాగే నీళ్ళకు లోటు లేదు" అన్నారు, నాకు నీళ్ళ బిందెలతో ఎదురొచ్చిన ఇద్దరు స్త్రీలు. విషయం కనుక్కుంటే ఊళ్ళో రెండూ బోరింగులు వెయ్యించిందట, అమ్మ.

"నిరుద్యోగినైన నాకు కెమెరా కొనుక్కునేందుకు ఆర్థిక సహాయం చేసి ఈరోజు నేనొక కుటుంబాన్ని పోషించే స్థితికి వచ్చేలా చేసింది మీ కుటుంబం! చాలా చాలా థాంక్స్ సార్." మెడలో కెమెరాలతో నాకు ఎదురొచ్చిన ఫోటోగ్రాఫర్ చెప్పాడు. సహాయం చేసింది..........కుటుంబం కాదు! అమ్మ!! రహమాన్ అనే యువకుడికి, సైకిల్ షాపు పెట్టుకునేందుకు ఆర్థిక సహాయం చేసిందట..........అమ్మ!!

నా మనసులో అణ్వస్త్రాలు పేలుతున్నాయి.

"బాబూ...........ఇలారా!" పిలిచింది శాంతమ్మ టీచర్, అరుగుమీద నిల్చుని. ఆమె, మా అమ్మ కొలీగ్. తానూ రిటైరయ్యింది.

నేను లోపలికి వెళ్ళాను.

"కూర్చో!" అంది.

"మైల కదా!" అన్నాను.

"అలాంటి నమ్మకాలు లేవు, కూర్చో" అంది.

నేను కూర్చున్నాను. టి.విలో వార్తలు చూస్తున్న ఆమె భర్త.......... టి.వి స్విచ్ ఆఫ్ చేసి వచ్చి, నా దగ్గర కూర్చున్నాడు.

"మీ అమ్మ చాలా మంచిది. చాలా గొప్పది" అంది శాంతమ్మ టీచర్.

నేను, అవునన్నట్లు నిర్ద్వంద్వంగా తలూపాను.

"తాను చనిపోయాక నీకు ఒక ఉత్తరం ఇవ్వమని చెప్పి, ఇచ్చింది." అంటూ, ఆమె ఓ ఉత్తరాన్ని నా చేతిలో ఉంచింది.

కవర్ చింపి, ఉత్తరాన్ని బయటికి లాగి, ఆత్రంగా తెరిచాను.

"నీకు కోడలికీ, పిల్లలకూ ఆశీర్వాదాలు!!

సమయం వ్యర్థం చెయ్యకుండా సరాసరి అసలు విషయం మాట్లాడతాను. నువ్వు ఔనన్నా కాదన్నా ఒకటి మాత్రం నిజం. నీ కట్నం డబ్బులు, నీకు ఇవ్వలేదన్న కోపం నీకూ, నా రిటైర్మెంట్ తాలూకు బెనిఫిట్స్ నీకూ, చెల్లెలికీ ఇవ్వలేదనే కోపం మీ ఇద్దరికీ, మీ భాగస్వాములకూ ఉంది.

నీ కట్నం డబ్బు గురించి, మీ మామగారు చెపుతారు. ఇక రిటైర్మెంట్ తాలూకు బెనిఫిట్స్ నావి!! మీకెందుకివ్వాలి? ఆలోచించు!! సామాజిక సాంప్రదాయం ప్రకారం.... చట్ట ప్రకారం......... తల్లితండ్రుల డబ్బు పిల్లలదే! కానీ........ ఈ భావన నాకు నచ్చదు. ఇలాంటి భావనతో బ్రతికితే........... సమాజంలో మార్పురాదు. ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన యువతీయువకులు తయారవ్వరు.

ఒక్కొక్కరికీ ఒక్కో లక్ష్యం ఉండొచ్చు కానీ... ఎవరెన్ని చేసినా..........చివరికి సమాజాన్ని మరింత ప్రగతి పథంలో తీసుకెళ్ళాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలోనూ ఉండాలి. అందుకోసం... మనం జీవించాలి. జీవించడానికి డబ్బుకూడా కావాలి. ఈ విషయం మర్చిపోయి... మరోలా బ్రతుకుతున్నాం. అంటే....... 'డబ్బు సంపాదించాలి. అందుకోసం జీవించాలి. అందుకోసం......... సమాజాన్ని అధఃపాతాళానికి తొక్కాలి. 'ఇది కథ!!

"పనిగట్టుకుని సమాజాన్ని నాశనం చెయ్యడంలేదుగా!" అంటావా. ప్రతివాడూ వ్యక్తి గతస్వార్ధాలతో బ్రతుకుతుంటే సమాజం నాశనంగాక ఏమౌతుంది?! అలా బ్రతకడం నాకు ఇష్టంలేదు. అందుకే డబ్బును సద్వినియోగం చేసాను. ఇది మొదటి అంశం.

"ఫలానామె కొడుకు.......... తల్లిదండ్రుల ఆస్థిమీద ఆధారపడకుండా స్వయంకృషితో పైకొచ్చాడు. నలుగురినీ పైకి తెచ్చాడు.' అని, నాకొడుకు గురించి నలుగురూ మాట్లాడుకోవాలి తప్ప 'ఆ తల్లి రిటైర్మెంట్ డబ్బులతో పెళ్ళానికి నగలు తెచ్చాడు" అని చెప్పుకోకూడదు. ఈ మార్పు నీలోనే కాదు ప్రతీ కొడుకులోనూ రావాలని ఆశిస్తున్నాను.

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇవ్వగలిగే నిజమైన సంపద .....చదువు, సంస్కారం, ఆరోగ్యం, వ్యక్తిత్వం!! మొదటి రెండూ........ ఇచ్చాను. మూడవ దానికి దేవుడూ, నాలుగవ దానికి నువ్వూ సహకరించాలి. ఇది రెండవ అంశం.

"మాకు చెప్పి డబ్బును సద్వినియోగం చేస్తే మేము కాదంటామా?" అని నువ్వు అనొచ్చు. నీ చెల్లెలూ అనొచ్చు. కానీ...........ఖచ్చితంగా కాదంటారు. నేను బ్రతికున్నప్పుడు ఈ విషయం మీకు చూచాయిగా తెల్సినా, 'కన్నకొడుకుకూ, కన్నకూతురుకీ డబ్బివ్వకుండా ఊరిని ఉద్ధరిస్తావా!' అని మీరందరూ నాతో వాదనకు దిగివుండేవారు. అందుకే చెప్పలేదు. ఇది మూడవ అంశం.

నాకు, నీమీద కోపం లేదు. సగటు మనుషులా బ్రతకొద్దు. ఇంతకంటే......... ఏం చెప్పలేను.

పి.యస్:- నేనెప్పుడుపోతానో తెలియదు. నేను పోయాక..... నా కర్మకాండల ఖర్చుకోసం కనీసం పాతికవేలు............కెనరా బ్యాంకు అకౌంటులో ఎప్పుడూ ఉంటాయి. నామినీగా నీపేరే ఉంది. తీసుకో.

ఇట్లు,

అమ్మ"

నా మనసును ఆ ఉత్తరం ప్రక్షాళన చేసింది.

కెనరా బ్యాంకులో.......... అమ్మ అకౌంటులో నలభైవేలున్నాయి. వాటిని డ్రా చేసి, ఆమె పేరు మీద నిత్యాన్నదానం కోసం........... శ్రీశైలం పంపించాను.

కర్మకాండలు ముగిసాక ఎవరిళ్ళకు వాళ్ళం వచ్చేసాం. వ్యక్తిత్వం!! అమ్మ నాలో కోరుకుంది అదే అది నేర్పితే రాదు. మన చదువు, అనుభవాలు, విశ్లేషణలు, పరిశీలనలు......... వీటివల్ల వస్తుంది.

లంచాలు తీస్కోవడం మానేసాను. పద్మ కూడా ఓ ఉద్యోగంలో చేరింది. ప్రతిరోజూ రాత్రి భోంచేసాక, మా అపార్ట్‌మెట్ పైకి వెళ్ళి ప్రశాంతంగా నిల్చుని ఎంతో ఉన్నతంగా ఉన్న నక్షత్రాల వంక చూస్తుంటాను.

ఆ నక్షత్రాలలో 'అమ్మ' కనిపించదు.

ఎందుకంటే..........ఆమె వాటన్నిటికంటే ఉన్నతంగా ఉంటుంది.

మానవత్వపు టెలిస్కోపుతోనే........... ఆమె రూపం కనిపిస్తుంది!

వ్యక్తిత్వపు స్టెతస్కోపుతోనే............ ఆమె సవ్వడి వినిపిస్తుంది!!

# అయిదో గోడ

- కల్పన రెంటాల

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 14వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ

"అమ్మా! పేపర్లో ఏమిటిదంతా? నీ కేమైనా పిచ్చిపట్టిందా? మాటమాత్రమైనా ఇలా చేస్తున్నట్టు నాతో అననే లేదు" ఆర్తి గట్టిగా అరుస్తూ హాల్లోకి వచ్చి చేతిలో ఉన్న పేపర్ సోఫా మీదకు గిరాటేసింది. కోపంతో ఎరుపెక్కిన ఆర్తి వంక నింపాదిగా ఏ మాత్రం తొణక్కుండా ఇదంతా ఏదో ఒకరోజు జరుగుతుందని తాను ఊహించిందేనన్నట్టు చూసింది శారద.

"ఆర్తీ! ఏమిటా అరుపు? ఏమైందిప్పుడు?" ఆర్తి రియాక్షన్ ఎందుకో తెలిసి కూడా తనకేమీ తెలియనట్టు.

"ఏమైందా?" అంటూ తల్లిని పరికించి చూసింది ఆర్తి.

వంగపండు రంగు గద్వాల చీర, చిన్న జరీ అంచు. చెవులకు ముత్యాల దుద్దులు, మెడలో సన్నటి గొలుసు. రెండు కళ్ళమధ్య చిన్న దోసగింజ ఆకారంలో ఎర్రటి బొట్టు బిళ్ళ. కళ్ళకు కాటుక. తలంటు పోసుకుని వదులుగా అల్లుకున్న జడ. అక్కడక్కడా తెల్లటి వెంట్రుకలు వెండితీగల్లా మెరుస్తూ, కళ్ళకింద మాత్రం కాస్త నల్లటి చారలు. అయినా ఆ మొహంలో ఆత్మవిశ్వాసం తాలూకు కాంతి ఏదో కన్పిస్తూ కొత్త అందాన్ని ఇస్తోంది.

చదువుతున్న పుస్తకం పక్కన పెడుతూ కళ్ళజోడు తీసి తుడుచుకుంటూ మాట్లాడుతోంది శారద. ఆమె కట్టూ బొట్టూ కానీ, ఆమె ప్రవర్తన కానీ ఎక్కడా ఇటీవల ఆమె జీవితంలో జరిగిన ఓ ముఖ్య సంఘటనను సూచించే విధంగా లేదు.

శారద హుందాగానే ఉన్నా ఆర్తిలో తల్లి పట్ల ఏదో తెలియని వ్యతిరేక భావం కలిగింది.

"ఏం తెలియనట్టు మాట్లాడుతావేంటమ్మా, ఈ ప్రకటనేంటి? నాన్న పోయి నిండా మూడ్నెల్లు కాలేదు. ఇప్పుడు నీకు పెళ్ళా? ఇంత వెంటనే పెళ్ళి చేసుకోవడం నీకు సిగ్గనిపించ లేదా? ఇన్నేళ్ళ మీ కాపురం తర్వాత మా నాన్నకు నువ్విచ్చిన గౌరవం ఇదన్నమాట!" కోపం, వెటకారం ధ్వనింపచేస్తూ నిగ్గదీసింది ఆర్తి.

"చూడు ఆర్తి. నేను చేసినది నీకు నచ్చకపోతే అది నీ ఇష్టం. కానీ అమ్మతో ఇలాగేనా మాట్లాడాల్సింది?"

"భర్త పోగానే తగుదునమ్మా అంటూ పెళ్ళికి సిద్ధమవటం ఏ పద్ధతేమిటి? నేను చచ్చాననుకున్నావా? మాట మాత్రం నాకు చెప్పాలనిపించలేదా? అడ్రస్, ఫోన్ నెంబర్‌తో సహా పేపర్లో వేశావు కదా, ఈపాటికి ఈ విషయం మనవాళ్ళందరికీ తెలిసే ఉంటుంది. రేపటి నుంచి నేను బైటకెళితే వాళ్ళడిగే ప్రశ్నలకు నేనేం సమాధానం చెప్పాలో" ఆర్తి మాటల ప్రవాహానికి ఆపమన్నట్టు చేత్తో సైగ చేసింది శారద.

"ఇందులో సిగ్గుపడటానికేముంది? అంత పరువు తక్కువపని నేనేమి చేయలేదే? నీకెందుకు చెప్పలేదంటావా? అన్నీ నిర్ణయమైతే చెప్పచ్చులే అనుకున్నాను" అన్నది శారద.

"నీకీ వయసులో ఇప్పుడు నాన్న పోగానే వెంటనే పెళ్ళికావాల్సి వచ్చిందా? అంత కోరికలతో కాలిపోతున్నావా?" అనాలని కాకపోయినా ఇందాకట్నించి అణిచిపెట్టుకున్న మాటలోపల్నుంచి బైటకొచ్చేసింది ఆర్తికి.

అప్రయత్నంగానే ఆర్తిని చెంపదెబ్బ కొట్టింది శారద. చెంప దెబ్బ తిన్నది ఆర్తినే అయినా మానసికంగా దెబ్బతిన్న శారద కళ్ళల్లో నీళ్ళు. అయిన వాళ్ళందరి వ్యతిరేకత ఊహించినదే అయినా కూతురి నోటి వెంట ఆ మాట వినాల్సిరావటాన్ని ఆమె తట్టుకోలేకపోయింది.

"చూడు ఆర్తి. నేను పనిమీద బైటకు వెళుతున్నాను. తిరిగొచ్చాక మాట్లాడుకుందాం." చెప్పులేసుకుని బైటకు వెళ్ళిపోయింది శారద.

తెల్లబోయి చూస్తుండిపోయిన ఆర్తికి పక్కన పడేసిన పేపర్ తనను వెక్కిరిస్తున్నట్టనిపించింది. నమ్మలేనట్టు తల్లి ఇచ్చిన ప్రకటనను మరోసారి చదివింది. అది అచ్చయి రెండునెలలైందని దానిమీదున్న తారీఖుని చూస్తే తెలుస్తోంది. అంటే నాన్న పోయిన నెలకే అమ్మ ఈ పని చేసిందన్నమాట.

"తోడు కావాలి"

పెళ్ళి లాంటి ఫార్మాలిటీస్ లేకుండా కలిసి జీవితం పంచుకోవటానికి, నెలరోజుల క్రితం భర్త చనిపోయిన, వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న యాభై అయిదేళ్ళ రిటైర్డ్ ప్రిన్సిపాల్‌కి సంస్కారవంతుడై స్నేహితుడిగా మెలగగలిగే వ్యక్తి కావాలి. సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలన్న ఉత్సాహమున్న వారికి, సంగీతం, సాహిత్యమంటే అభిరుచులున్న వారికి ప్రాధాన్యత.

సంప్రదించాల్సిన చిరునామా కె.శారద. డోర్ నెంబర్ 23\10\2. చిక్కడపల్లి, హైదరాబాద్.

కింద ఇ మెయిల్ అడ్రస్, ఫోన్ నెంబర్ చూడగానే మళ్ళీ కోపమొచ్చింది ఆర్తికి. కనీసం పోస్ట్ బాక్స్‌నెంబర్ ఇవ్వచ్చు కదా! ఇన్నాళ్ళు తెలియలేదు కానీ నిజంగానే అమ్మకు ధైర్యమెక్కువ అనుకుంది మనస్సులో. పేపర్ అవతల పడేసి తాను కూర్చున్న హాలును గమనిస్తూ ఆలోచనల్లో మునిగిపోయింది ఆర్తి.

అసలీ ఇల్లు చూస్తే నిన్నకాక మొన్న ఈ ఇంట్లో నాన్న చనిపోయినట్టనిపిస్తోందా? ఎక్కడివక్కడ సర్ది ఉండటంతో ఇల్లు నీట్‌గా ఉంది. గోడల రంగులకు మాచయ్యే ఫర్నిచర్‌తో ఇంటికి ఓ ఆర్టిస్టిక్ లుక్ వచ్చింది. డైనింగ్ టేబుల్ మీద ఫ్లవర్ వాజ్‌లో తాజా గులాబీపూలు. ఉదయమే ఇంట్లో జాస్మిన్ అగర్ బత్తీ పరిమళం. హాల్లో గోడల మీద రాజస్తానీ వాల్ పెయింటింగ్స్. మరో వైపు బాతిక్ వాల్ హేంగింగ్స్ తప్ప నాన్న ఫోటో లేకపోవడం మాత్రం కాసింత వెలతిగా అనిపించింది. పోనీలే హాల్లో పెట్టుకపోయినా బెడ్ రూంలో నుండి నాన్న ఫోటో తీసెయ్యలేదు అనుకుని తృప్తి పడింది ఆర్తి.

ఆరెంజ్, గోల్డ్ కలర్ సమ్మేళనంతో కిటికీ కర్టెన్లు గాలికి నెమ్మదిగా అటూ ఇటూ ఊగుతూ మరింత మెరుస్తున్నాయి. నారింజ తనకిష్టమైన రంగుల్ని మిక్సప్ చేసి అమ్మ కిటికీ కర్టెన్లు కొన్నప్పుడు నాన్న ఎంత హేపీగా ఫీలయ్యారో కదా. అప్పుడు అమ్మకి మా మీద ఎంత ప్రేమో అనుకున్నాను. అసలు ప్రేమ ఇదన్నమాట. ఇదొక్కటేనా అమ్మ మీ సంతోషం కోసం చేసింది అంటూ అంతరాత్మ నిలదీసింది. ఆఁ ఇంకా చాలా చేసిందిలే! వంటింట్లో ఎప్పుడూ మా కిష్టమైన చేగోడీలు, కారప్పూస, సున్నుండలు, కజ్జికాయలు స్టాక్ ఉండేవి. జీన్స్ మీద టాప్స్ కానీ, చుడీదార్లు కానీ ఎప్పుడూ లేటెస్ట్ ఫ్యాషన్లు తెలుసుకుని కొనేది.

అయినా ఏం లాభం? మనకిష్టమైన పనులు చేస్తే సరిపోతుందా? అదంతా మా మీద ప్రేమే అనుకున్నాను ఇన్నాళ్ళు. ఇప్పుడేమైంది? నిజంగా నా మీద, నాన్న మీద అమ్మకు ప్రేమ ఉంటే ఇవాళ ఈ పని చేసుండేదా? ఇన్నేళ్ళు అమ్మ మా మీద చూపించిన ప్రేమ అంతా పెద్ద నటనన్నమాట. అంతే అయివుంటుంది. లేకపోతే భర్త చనిపోతే భార్య ఎంత బాధలో మునిగిపోవాలి?

అమెరికా నుండి వచ్చేటప్పుడు ఇంటిని, అమ్మని తానెలా ఊహించింది? అమ్మ తిండి తినకుండా నీరసంతో చిక్కిపోయి ఉంటుందని, మానసికంగా చాలా డిప్రెస్ అయి ఉంటుందని, ఇల్లంతా చిందరవందరగా ఉంటుందని ఏవేవో అనుకుంది. అమ్మకు మానసికంగా ధైర్యం చెప్పి కాస్త ఉత్సాహపరిచి తనతో అమెరికా తీసుకెళ్ళాలనుకుంది. కానీ ఇక్కడ చూస్తే అంతా రివర్స్‌గా ఉంది. అమ్మ హేపీగా ఉంది. ఇల్లంతా నీట్‌గా ఉంది. అమ్మలో ఎక్కడా దుఃఖఛాయలే లేవు. మామూలుగా ఉంది. మరి నేనెందుకొచ్చినట్టు ఇక్కడకు? అమ్మ పెళ్ళి ఏర్పాట్లు చేయడానికా?

అయినా అమ్మకి నిజంగా బాధే ఉంటే ఇలా నెలకే పెళ్ళికి సిద్ధమై ఉండేదా? పేపర్లో యాడ్ ఇచ్చేదా? అసలిదంతా చూస్తుంటే నాన్న ఎప్పుడూ చచ్చిపోతాడా అని అమ్మ ఎదురు చూసిందేమో అనిపిస్తోంది. అదేమిటో తనెప్పుడూ పేపర్లో చదివినదానికి, సినిమాల్లో చూసేదానికి ఈ ఇంట్లో భిన్నంగా జరుగుతోంది. నిన్ననేగా పేపర్లో ఆ వార్త చదివింది. విజయవాడలో అనుకుంటా జరిగింది. భర్త చనిపోయాడని తెలియగానే ఆ షాక్‌లో ఆయన భార్య కూడా చనిపోయిందట. ఈ వార్త సరే.

తను కాలేజీలో ఉన్నప్పుడు పేపర్లో చదివిన ఆ వార్త ఎప్పటికీ మరిచిపోలేదు. అది జరిగింది ఈ హైదరాబాద్ లోనే కదూ.

భర్తకి క్యాన్సర్ వ్యాధి అతను చనిపోతాడని అతని కంటే ముందే చనిపోవాలని ఆస్పత్రిపై అంతస్తు నుండి దూకి కిందపడి చనిపోయింది 'పుణ్యవతి' అనే ఆవిడ. అన్నీ పేపర్లు ఎంత బాగా రాశాయి ఆ వార్త గురించి. పేరుకు తగ్గట్టూ ఆవిడ నిజంగా పుణ్యవతి అని ఎంత బాగా కీర్తించాయి.

అమ్మ పెళ్ళి అనుకోగానే 'స్వాతి' సినిమా గుర్తొచ్చింది. అందులో పాపం శారద, సుహాసినిని పెంచి పెద్ద చేసినా తన జీవితం గురించి అసలు ఆలోచించుకోదు. సుహాసిని బలవంతంగా శారదను ఒప్పించి జగ్గయ్యతో పెళ్ళి చేస్తుంది. సినిమాల సంగతి సరే. కాలేజీలో సంస్కృతం క్లాసులో విన్న జయదేవుడి కథలో మాత్రం ఏమైంది? రాజుగారితో కలిసి వేటకెళ్ళిన జయదేవుడు మరణించాడని చెలికత్తె చెపుతున్న మాట చెవులపడగానే ఆయన భార్య పద్మావతి కన్నుమూసిందట.

పేపర్లు, సినిమాలు, పుస్తకాల్లో ఇలా ఉంటే అమ్మేమిటో వేరేలాగా బిహేవ్ చేస్తోంది.

అమ్మ పెళ్ళి సంగతేమో కానీ ఉదయం నుండి ఆలోచనలతో బుర్రవేడెక్కిపోయిందనుకుంటూ హఠాత్తుగా వాచీ చూసుకుంది. బాప్‌రే. పన్నెండైపోయింది. అంటే అమెరికాలో టైం రాత్రి పదైవుంటుంది. భార్గవ్ నిద్రపోయి ఉంటాడా అనుకుంటూ ఫోన్ డయల్ చేసి అటునుండి నాలుగు రింగులైనా ఫోన్ లిఫ్ట్ చేయకపోయేసరికి నిరాశగా ఫోన్ పెట్టేసింది. ఆర్తి.

సర్లే ఇంత ఆలోచనలు దేనికి? పేపర్లో యాడ్ ఇచ్చినంత మాత్రాన పెళ్ళో, ఇంకోటో జరిగిపోదు కదా! సాయంత్రమో, రేపో అమ్మతో మాట్లాడి అమెరికాకి తీసుకెళ్ళటానికి ఒప్పిస్తే సరి అనుకున్నాక ఆర్తి మనసు కాస్త తేలికపడ్డది.

సాయంత్రం ఆరుబైట బాల్కనీలో కుర్చీ వేసుకుని తనకిష్టమైన ఇలాచీ టీ తాగుతూ 'సలాం హైదరాబాద్' చదువుతోంది శారద. పక్కనే టీపాయి మీద అప్పుడే మాల కట్టిన సన్నజాజులు, విరజాజులు మంచి స్నేహితుల్లా తామున్న పరిసరాల్లో సువాసనల్ని వెదజల్లుతున్నాయి. మనకిప్పుడు రంగు రంగుల నియాన్ లైట్లతో, నెక్లెస్ రోడ్డుతో ఒంపు సొంపులతో మెరిసిపోతూ కనిపించే హైదరాబాద్ అసలు చరిత్ర చదువుతుంటే లోపల్నుంచి ఏదో తెలియని ఉద్వేగం, బాధ గుండె గొంతులోకి వస్తున్నట్టు అనిపించసాగింది శారదకు.

మధ్యాహ్నం నుండి అమ్మను ఇంకా నిలదీసి ప్రశ్నించాలనుకుంటున్న ఆర్తికి అందుకు అదే మంచి సమయమనిపించింది. పక్కనే ఉన్న కుర్చీలాక్కుని కూర్చొంటూ 'అమ్మా, సారీ. ఐ యాం రియల్లీ వెరీ సారీ. ఐకెన్ అండర్ స్టాండ్ యువర్ ఫీలింగ్స్ అండ్ యువర్

సిట్యుయేషన్. బట్ కనీసం ఏ ఏడాది ఓపికట్టలేవా? మరీ నాన్నపోయిన మూడు నెలలకే నువ్వు పెళ్ళి చేసుకుంటావంటే వినటానికి, చెప్పటానికి కూడా బావుండలేదు" అంది ఆర్తి తల్లి చేతిని నెమ్మదిగా తన చేతిలోకి తీసుకుంటూ.

"అది కాదురా. నువ్వెందుకంత ఆవేశపడుతున్నావు ఈ విషయంలో? నిదానంగా ఆలోచించి చూడు. పిన్ని పోయినప్పుడు ఏం జరిగిందో గుర్తుంది కదా" అడిగింది శారద.

గుర్తుందన్నట్టు తలూపింది ఆర్తి.

"పిన్ని క్యాన్సర్‌తో చనిపోయినప్పుడు బాబాయ్‌ని నువ్వెంత ఓదార్చావు? పిన్ని చనిపోతుందని చాలాకాలంగా అనుకుంటున్నదే పిన్ని చనిపోయిన వెంటనే నెల మాసికానికి మీ బాబాయ్ పేపర్లో పెళ్ళి సంబంధం కోసం ప్రకటన ఇస్తే నువ్వెంత హేపీ ఫీలయ్యావు. మీ ఫ్రెండ్స్ అందరితో మాట్లాడి నీకు తెలిసిన మ్యాచ్‌లు బాబాయికి చెప్పి పిన్ని పోయిన దుఃఖం తనకు తెలియకూడదని నువ్వెంత ఆరాటపడ్డావు? ఇప్పుడు నా విషయంలో ఎందుకు నీకిది అసహజంగా కనిపిస్తోంది? నేను మాత్రం మీ నాన్ననే తలుచుకుంటూ మీదగ్గర అమెరికాలో గడిపెయ్యాలని ఎందుకనుకుంటున్నావు?" అంది శారద.

"అమ్మా నువ్వేమిటి. ఉన్నట్టుండి పెద్ద ఫెమిస్టువైపోయినట్టు మాట్లాడుతున్నావు. బాబాయ్ విషయం వేరు. నీ విషయం వేరు. బాబాయికి పిన్ని లేకపోవడం పెద్ద లోటు. ఒక్క బాబాయ్ అనే ఏముంది? మగవాళ్ళందరికీ కూడా. వాళ్ళకు వంట చేసుకోవడం ఒక్కటే కాదు. రకరకాల ఇబ్బందులు. ఇంట్లో ఆడమనిషి లేకపోతే ఇక వాళ్ళ జీవితాలు అధోగతే" సమాధానమిచ్చింది.

"నిజమే. నా విషయం వేరు. ఇప్పటివరకూ నా జీవితం పెద్ద రాజీ కాదు? మీ నాన్నకిష్టమైనట్టు, ఆయనకు ఇబ్బంది కలగకుండానే కదా నేను జీవించింది. అదసలు నా జీవితమేనా? నేను కోరుకున్న లైఫ్ అదేనా అని నాలోపల ఎప్పుడూ నేనెంత అశాంతిగా బతికానో నీకెలా తెలుస్తుంది? సరే ఆర్తి. ఒక్క మాట చెప్పు. ఒకవేళ నేను చనిపోయి మీ నాన్న బతికుంటే నువ్వేమనేదానివి? ఇదే సలహా ఇచ్చేదానివా మీ నాన్నకు, ఇంట్లో ఓ వంట మనిషిని పెట్టుకోమని, కావాల్సివచ్చినప్పుడు ఫ్రెండ్స్ ఇళ్ళకెళ్ళి మాట్లాడుకోమని?" అన్నది శారద.

"అదేనమ్మా నేను చెప్పేది. నాన్న విషయం వేరు. మొదటి నుంచీ ఇంట్లో అన్ని పనులు నువ్వే చూసుకునేదానివి. అందుకే నువ్వు లేకపోతే నాన్నకు కాళ్ళు చేతులు ఆడవు. నాన్నకే ఊపిరి ఆగిపోయినట్టనిపిస్తుంది. నీకు అలా కాదే ఇవాళ నాన్న లేకపోయినా నువ్వు ఈ ఇంట్లో ఒంటరిగా అన్ని పనులు చేసుకుంటున్నావు. మరో వ్యక్తిని నీ జీవితంలోకి రానిచ్చి ఎందుకు మనసుని, శరీరాన్ని హైరాన పెట్టుకోవడం. అమెరికా రావడం ఇష్టంలేకపోతే కొన్నాళ్ళు ఇక్కడే ఉండు. హాయిగా లైఫ్ ఎంజాయ్ చేయి. ఇంకా డబ్బు కావాలంటే చెప్పు. పంపిస్తాను. వంటమనిషిని కూడా పెట్టుకో. కారు కొంటాను. డ్రైవర్‌ని పెడతాను. ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళిరా. నీ జీవితాన్ని ఎంజాయ్ చేయమనే నేను చెప్పేది." సింపుల్‌గా, సూటిగా చెప్పింది ఆర్తి.

"ఆర్తి నీకెలా చెపితే అర్థమవుతుంది? నాకు కావాల్సింది డబ్బు, నగలు, చీరలు, కారులాంటి సౌకర్యాలు కాదు.ఓ మనిషి ..నన్ను నన్నుగా అర్థం చేసుకునే మనిషి, నాకు నచ్చిన విధంగా నాతో స్నేహంగా ఆత్మీయంగా అభిమానంగా ప్రేమగా ఉండగలిగే మనిషి, అలాంటి మనిషి దొరకొచ్చు, దొరక్కపోవచ్చు. దొరకుతాడేమో నన్న ఆశ. అందుకే ఈ చిన్న ప్రయత్నం" అంది శారద.

"సరేనమ్మా. కానీ పేపర్లో ప్రకటన ఇవ్వడం వల్ల ఏమైనా ప్రయోజనం ఉంటుందా? ఎవరెవరో ఇంటికి వస్తారు? వాళ్ళతో నువ్వు మాట్లాడాలి. వాళ్ళ గురించి ఎంక్వైయిరీ చేయాలి. మన ఎరికలో ఎవరైనా ఉన్నారేమో చూడు. లేదా నీ ఫ్రెండ్స్ కి చెప్పు. ముందు నువ్వెరితోనైనా స్నేహం చెయ్యి ఆ తరువాత అన్నీ బాగుంటే పెళ్ళి గురించి ఆలోచించవచ్చు." సింపుల్‌గా తేల్చేసింది ఆర్తి.

"కాదురా, ఇప్పటికే నా జీవితంలో చాలా సమయం వృధా అయింది. ఇన్నాళ్ళ ఒంటరితనపు బతుకు చాలు. ఇక ఒక్క క్షణం కూడా ఒంటరిగా బతుకుతూ వృధా చేసుకోకూడదనిపిస్తోంది. మిగిలిన ఈ జీవితాన్ని ఎవరి సుఖసంతోషాల కోసమో కాకుండా నా కోసంగా నేను బతకాలనుకున్నాను. అందుకోసం సింపుల్‌గా పేపర్లో ప్రకటన ఇచ్చాను.

ఆ పేపర్ ప్రకటనకు చాలామందే కాంటాక్ట్ చేశారు. ఈ రెండు నెలల్లో ఎన్ని అప్లికేషన్లు వచ్చాయో తెలుసా? అవన్నీ చదివి వాళ్ళందరినీ ఇంటర్వ్యూ చేస్తుంటే నాకు నవ్వొచ్చింది. చాలా చిరాకు కూడా వేసిందనుకో. భార్యలు కావాల్సిన వాళ్ళు పాపం ఈ దేశంలో ఇంకా చాలా మందే ఉన్నారు. కొందరికి మంచి వంటలు చేసి పెట్టేందుకు, మరికొందరికి నర్సుల్లాగా సేవలు చేసేందుకు. నేను ఎలాంటి వాళ్ళకోసం వెతుకుతున్నానో క్లియర్ గానే రాశాను కదా. అయినా సరే అందరూ రాగానే నా ఆరోగ్యం పరిస్థితి ఏమిటి? నాకేమైనా క్యాన్సర్ లాంటి జబ్బులున్నాయా? ఇంటిపేరు మార్చుకుంటానా లేదా? ఆస్తి ఎంత ఉంది? ఎవరి పేరుమీద ఉంది? వంట బాగా చేయగలనా లేదా? సెక్స్‌వల్‌గా నేను యాక్టివ్‌గా ఉన్నానా లేదా ఇలాంటి ప్రశ్నలు వేసేవాళ్ళు. వాళ్ళకేం కావాలో అలా అడగడం నాకూ మంచిదే అనుకో. నా అభిరుచులకు వాళ్ళు సరిపోతారా లేదా నేను చెక్ చేసుకోగలిగాను -" అని చెప్పింది శారద.

"అసలింతకీ నీకెలాంటి వాళ్ళు కావాలి? నిజంగా సంగీతం, సాహిత్యం తెలిసున్నవాడైతే నీ జీవితం హాయిగా సాగిపోతుందనుకుంటున్నావా? అయినా ఊరికే తెలుసుకోవాలని అడుగుతున్నానమ్మా? ఇన్నాళ్ళు నాన్న, నువ్వు హాయిగా లేరా? నాకెప్పుడూ మీ ఇద్దర్నీ చూస్తే అసలు ఆ అనుమానమే రాలేదు. ఏమిటీ నాన్నకు నీకు మధ్య ఉన్న ఇబ్బంది?" ఆలస్యంగానైనా జీవితంలో మొదటిసారి తల్లి జీవితపు లోతులు తెలుసుకోవాలనుకుంది.

"నా జీవితం అని కాదు. మేమిద్దరం కలిసి ఈ జీవితాన్ని ఎలా గడిపితే బావుంటుందో మీ నాన్నకు ఎన్నోసార్లు చెప్పాను కూడా కానీ ఆయనకు తన జీవితం తనకిష్టమైనట్టు గడపటమే ఇష్టం. నాకిష్టమైనట్టు నన్ను ఉండమనేవారు. నా కిష్టమైన పనులు నేను చేసుకున్నాను. కానీ ఎలా? ఒంటరిగా నా భర్త ఏ రోజు నా అభిరుచుల్లో భాగం కాలేదు. మేమిద్దరం కలిసి పంచుకున్న దేదైనా ఉందీ అంటే అది నువ్వే. నా సంతోషాలు, నా దుఃఖాలు నావి మాత్రమే. నేనేదైనా నా బాధను చెప్పుకుంటా 'అహా అలాగా' అని ఒక్కమాటనేవారు. అంతకు మించి నేనెప్పుడూ ఆయన దగ్గర ఓదార్పు పొందినది లేదు. అభిప్రాయాల్లో కానీ అభిరుచుల్లో కానీ మేమిద్దరం తూర్పు, పడమర. కష్టమైనా, సుఖమైనా కలిసి పంచుకున్నప్పుడే కదా జీవన సాహచర్యంలోని మాధుర్యం అర్థమయ్యేది" అన్నది శారద.

"మరి ఇవన్నీ నాతో ఎందుకమ్మా ఎప్పుడూ చెప్పలేదు?" మొదటిసారి తల్లి జీవితం గురించి తెలుసుకుంటుంటే ఆమె తనకు మరింత దగ్గరగా అనిపించి నెమ్మదిగా ఆమె ఒళ్ళో తలపెట్టుకుని పడుకుని ఆమె చెప్పేది వినసాగింది ఆర్తి.

"ఎన్నిసార్లు నీతో మాట్లాడాలనుకున్నాను. కానీ నీకు తీరికేది? ఎప్పుడూ చదువు, పరీక్షలు, సంగీతం, పెయింటింగ్ రకరకాల వ్యాపకాలతో పరుగులు పెట్టేదానివి. చదువుకాగానే ఢిల్లీలో ఉద్యోగం అన్నావు. భార్గవ్‌ని ప్రేమిచాను, పెళ్ళిచేసుకుంటానన్నావు. పెళ్ళి కాగానే మీరిద్దరూ అమెరికా వెళ్ళిపోయారు. నేను, మీ నాన్న ఎలా జీవితం గడిపామో నువ్వు గమనించలేదు. నువ్వు నాన్నతో సంతోషంగా గడపలేదా అన్నావు. అది చెప్పాలంటే నీకు మొత్తం నా జీవితం తెలియాలి. పైకి కనిపించే జీవితం కాదు. నా లోపలి ప్రపంచం. మేం నలుగురం అక్కాచెల్లెళ్ళం. నేనే పెద్దదాన్ని. నా తర్వాత పెళ్ళికి ఎదిగిన చెల్లెళ్ళు ఉన్నారు కాబట్టి మా అమ్మా నాన్నల ఇష్టప్రకారం మీ నాన్నను పెళ్ళిచేసుకున్నాను. అందులో నా ఇష్టాఇష్టాలేమీ లేవు. మా అందుబాటులో ఉన్న సంబంధం. మీ నాన్న చెడ్డవాడు కాదు. కానీ భార్యను అర్థం చేసుకునే గుణం లేదు. భార్య అంటే తనకు సంబంధించిన పనులన్నింటిని జాగ్రత్తగా ఆర్గనైజ్ చేసిపెట్టగలిగే చదువుకున్న ఓ ఆడమనిషి అంతే. అయితే పెళ్ళి తరువాత నేను చదువుకున్నా, ఉద్యోగం చేసినా ఆయన ఏమీ అభ్యంతర పెట్టలేదు. కాకపోతే తన పనులకు వేటిల్లోనూ తేడారాకూడదన్నది ఆయన పెట్టిన కండిషన్.

నాకు సంగీతం, సాహిత్యమంటే అభిమానం. మీ నాన్నకు వాటి పట్ల ఇంట్రస్ట్ లేదు. మంచి పుస్తకం మార్కెట్‌లోకి రాగానే కొని చదివేసేదాన్ని. పుస్తకాల గురించో, పాటల గురించో నేను మాట్లాడబోతే 'అబ్బ! అవన్నీ బోరోయ్! నీ కాలేజీలో పిల్లల పాఠాల్లో అవి చెప్పు. నీకు మంచి టీచరుగా పేరొస్తుంది? మళ్ళీ ఇంట్లో నాకు ఈ ట్యూషన్లు ఎందుకు? అంటూ ఎగతాళి చేసేవారు. నాకు కొత్త కొత్త ప్రదేశాలు చూడాలని ఆకాంక్ష. మీ నాన్నకేమో సాయంత్రం ఆఫీసునుంది రాగానే తన స్నేహితులతో బాడ్మింటన్ ఆడుకోవడం, రిలాక్స్ కావడం ఇష్టం. నేను వంట చేస్తున్నప్పుడు మీ నాన్న నాతో పాటు మాట్లాడుతూ కూరలు తరిగివ్వడమో లేక ఒకోసారి తనే వంట చేయడమో చేస్తే బావుండనిపించేది. మీ నాన్నకు వంటింట్లోకి రావడమంటే పెద్ద బోర్. అది ఆడవాళ్ళపని అని ఆయన అభిప్రాయం. ఉల్లిపాయలు కోసివ్వడం, కుక్కర్ దించి తిరగమోత పెట్టడం ఇవన్నీ చేస్తే తన స్నేహితులు తనను వెక్కిరిస్తారేమోనని భయం. నాకు జీవితాన్ని కష్టపెట్టుకోవడం కన్నా నాకు అనుకూలంగా మార్చుకోవడమే ఇష్టం. అందుకనే మీకెవ్వరికీ ఇబ్బంది కలగకుండా మీ పనులు చేసేనే ఉన్నంతలో నా అభిరుచుల్ని ఆస్వాదించేదాన్ని."

"అంటే నాన్న పోవడం వల్ల నీకు బాధ కంటే సంతోషమే ఎక్కువ కలిగిందా?" ఆర్తి గొంతులో చిన్నపాటి కుతూహలం.

"నా జీవితంలో ఇప్పటి దాకా ఉన్న ప్రధానమైన వ్యక్తి ఇవాళ భౌతికంగా నా పక్కన లేకపోవడం లోటే. అయితే ఆయన పోయారని దిగులుపడి నా మిగిలిన జీవితమంతా ఆయన జ్ఞాపకాలతో గడిపేయాలన్న ఆలోచన మాత్రం నాకు లేదు" అని చెప్పింది శారద

"ఇన్నాళ్ళు అంటే నాన్న ఉన్నారు. నీ కిష్టమైనట్టు నువ్వు గడపలేకపోయావు. ఇప్పుడు నాన్న లేరు. హాయిగా నువ్వు నీ జీవితాన్ని నీకు నచ్చిన రీతిలో గడపవచ్చుకదా. నిన్ను కాదనే వారెవ్వరూ హాయిగా ఇంట్లో నీకు నచ్చిన పనులు చేసుకో. మళ్ళీ పెళ్ళి అనే ఈ ఉచ్చులోకి దిగడం దేనికి? ఈసారి ఎలాంటి వాడొస్తాడో?" సందేహం వెలిబుచ్చింది ఆర్తి.

"నిజమే ఆర్తి. హాయిగా ఇంట్లో కూర్చుని నాకిష్టమైనవి చదువుకోవచ్చు. మంచి పాటలు వినవచ్చు. బైటకెళ్ళవచ్చు. నాలోపలి అనుభూతుల్ని, ఉద్వేగాల్ని మనసుకు నచ్చిన మనిషితో పంచుకోకుండా ఎందుకు నేను ఒంటరిగా గడపాలి? ఇన్నాళ్ళు మీ నాన్నతో నేను కలిసి బతికున్నా నా లోపల నేను ఒంటరిదాన్నే. ఇప్పుడు కూడా నేను ఆ ఒంటరితనంతోనే బతకలేను. నాకు తోడు కావాలి. నన్ను అర్థం చేసుకునే స్నేహం కావాలి. నాలోపలి ఉద్వేగాల్ని పంచుకునే ఓ మనిషి కావాలి" ఆర్తికి స్పష్టం చేసింది శారద.

"అమ్మా, నీకు కావాల్సింది స్నేహమే అయితే ఇప్పటి వరకూ నీకు ఫ్రెండ్సే లేరా? విజయ ఆంటీ, పరిమళ ఆంటీ వీళ్ళంతా నీకు మంచి స్నేహితులే కదా. వాళ్ళను మనింటికి పిలువు. వాళ్ళతో నీ భావాలన్నింటిని షేర్ చేసుకో అది చాలదా? ఎందుకనో అమ్మా నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోవడం తప్పుడూ నిర్ణయమేమో అనిపిస్తోంది, పేపర్లో ప్రకటన ఇచ్చినంత మాత్రాన మంచివాడు నీ మనసుకు దగ్గరగా అనిపించేవాడు ఎవరైనా దొరుకుతారని ఎలా చెప్పగలవు? పైకి అందరూ నీ డబ్బు చూసి బాగానే మాట్లాడతారు. ఏమోనమ్మా నువ్వు లేని పోని చిక్కులో పడతావేమోననిపిస్తోంది. బాగా ఆలోచించు" అని సలహా ఇచ్చింది ఆర్తి.

"నా కళ్ళకు నువ్వింకా పసిపిల్లలాగానే కనిపిస్తున్నావురా, విజయ ఆంటీ, పరిమళ ఆంటీలతో స్నేహం నా మానసిక శారీరక అశాంతిని పోగొడుతుందా? ఈ మూడు నెలలు నేనెలా గడిపానో నీకు తెలుసా? నువ్వు వారానికొకసారి ఫోన్ చేసి యోగక్షేమాలడిగావే కానీ నిజంగా ఇక్కడి నా ఒంటరితనం నీకెలా చెప్పగలను? ఎన్నో సాయంత్రాలు ఇలాగే ఇక్కడే ఒంటరిగా పుస్తకాలు చదువుకుంటూ పాటలు వింటూ గడిపేసేదాన్ని. ఎంత దగ్గరి స్నేహితులైనా రోజూ మాట్లాడరు, మనింట్లో ఉండిపోరు. ఓ పదిహేను రోజులు అందరూ ఫోన్ చేసి మాట్లాడేవారు. ఏమైనా కావాలా? ఇంటికి రమ్మంటావా అని అడిగేవారు. నాకు కావాల్సింది సానుభూతి కాదు. నా మనసుకి ఓ స్వాంతన. ఇన్నాళ్ళు రకరకాల బాధ్యతలతో అలిసిపోయిన మనసుకి, శరీరానికి కాసింత విశ్రాంతి. మీ నాన్నపోయిన తరువాత నా జీవితం ముగిసిపోయిందని ఏడుస్తూ కూర్చోలేదు. ఇంతకుముందెలా గడిచిందో ఇప్పుడు నా దినచర్య అదే అయితే అందులో చిన్న తేడా. మీ

నాన్నకు అన్నీ అమర్చి పెట్టే పని తప్పింది. ఈ మూడు నెలల్లో మీ నాన్న గుర్తురాలేదా అంటే చాలా సార్లు గుర్తుకు వచ్చారు. ఆ బాధో, ఆ జ్ఞాపకాలో నా మిగిలిన జీవితాన్ని మింగేయడం నాకిష్టం లేదు. ఇన్నేళ్ళ ఒంటరితనం ఇక చాలనిపించింది. నాకు డబ్బు సమస్య లేదు. ఆరోగ్యం బావుంది. జీవితాన్ని ఆనందించాలి, అనుభవించాలి అనే కోరిక ఉంది. కాబట్టే పేపర్లో ప్రకటన ఇచ్చాను" చెప్పింది శారద.

"ఇంతకీ నీ ఇంటర్వ్యూల్లో ఎవరైనా పాస్ అయ్యారా నీ మనసుకి తగ్గ వ్యక్తి ఎవరైనా దొరికారా?" తల్లి మనసు అర్థం కావడంతో ఆమె చేస్తున్న పని పట్ల ఆర్తికి కూడా కాస్త ఉత్సాహం అనిపించింది. "రామ్మోహన్ అనే ఆయన ఆలోచనలు, అభిప్రాయాలు నాకు కాస్త దగ్గరగా ఉన్నాయనిపించింది. ఆయనకు భార్య పోయి ఏడాదైంది. భార్యతో భౌతికంగా కంటే కూడా మానసికంగా జీవితాన్ని, ఆలోచనల్ని పంచుకున్న వ్యక్తి అని నాకు అర్థమైంది. ఓ నెల రోజులుగా మేమిద్దరం తరచూ కలుస్తున్నాం. పొద్దుట నేను వెళ్ళింది తనని కలవటానికే."

"అయితే మరి పెళ్ళి చేసుకుంటున్నారా?" ఇక సస్పెన్స్ భరించలేనన్నట్టు అడిగేసింది ఆర్తి.

"మేం కలిసి బతకాలనుకుంటున్నాం. అయితే అతనికి నేను భార్య హోదాలో, అతను నాకు భర్త హోదాలో గడిపేందుకు కాదు. మా ఇద్దరి అభిరుచులకు తగ్గట్టు మా జీవితాన్ని కొత్తగా మాకు నచ్చిన విధంగా మొదలెట్టాలనుకుంటున్నాం. ఇప్పటివరకూ జీవితంలో మేమేం చేయలేకపోయామో అవన్నీ ఇప్పుడు చేయాలనుకుంటున్నాం. కొన్నాళ్ళు మనింట్లో, కొన్నాళ్ళు వాళ్ళింట్లో ఎక్కడ ఉండాలనిపిస్తే అక్కడుంటాం "అన్నది శారద

ఆ మాటలు చెపుతున్నప్పుడు తల్లి కళ్ళల్లో కొత్త జీవితం తాలూకూ ఎక్సైట్‌మెంట్ కనిపించి చూసి ఆర్తి కూడా మనస్ఫూర్తిగా సంతోషపడ్డది.

"రేపు రామ్మోహన్ వాళ్ళింటికి వెళుతున్నాను. తన దగ్గర నూర్జహన్, సురయా పాటల క్యాసెట్లు తెచ్చుకోవాలి. నీకిష్టమైతే నువ్వు కూడా రా." అన్న శారద మాటలకు తనకు అంగీకారమేనన్నట్టు తలూపింది ఆర్తి.

"నేను టీ పెట్టుకుంటున్నాను. నీకు కూడా కావాలా?" అంటూ వంటింట్లోకి వెళుతున్న శారదకు అమ్మా, నాకు అల్లం, యాలుకలు వేసి నీ స్పెషల్ ఇలాచీ టీ కావాలి కేకేసింది ఆర్తి.

ఆత్మ విశ్వాసంతో అమ్మ కొత్తగానే కాకుండా మరింత అందంగా కనిపిస్తుంటే ఆరాధనతో చూస్తూ టీపాయి మీదున్న గ్రీటింగ్ కార్డును చేతుల్లోకి తీసుకుంది. నీలాకాశంలో స్వేచ్ఛగా ఎగురుతున్న రెండూ పక్షులు.

లోపల తెరిచి చూస్తే....

ఒకవైపు ముత్యాల్లాంటి అక్షరాలతో 'ఫైజ్ ' పాట....

'ముజ్‌సే పహేలీసే మొహబ్బత్ మేరీ మెహబూబ్, నా మాంగే',

అమ్మ అదృష్టవంతురాలు అనుకుంది తృప్తిగా ఆర్తి.

***

కథని మరోసారి చదవం పూర్తి చేసింది శ్రీవిద్య. ఎక్కడైన తప్పులున్నాయేమోనని మరోసారి చూసుకుంది. కథ రాయడం పూర్తి అయినట్టే ఉంది. కానీ ఎక్కడో ఏదో ఒక అసంతృప్తి అనిపిస్తోంది ఏమిటో, ఎందుకో మాత్రం తెలియడం లేదు. కథ పూర్తి అయినట్టే అనిపిస్తోంది, కాదు అనిపిస్తోంది. చెప్పాల్సింది ఇంకా ఏదో చెప్పలేదనిపిస్తోంది. కానీ అదేమిటో మాత్రం తెలియడంలేదు.

టేబుల్ మీద ఉన్న కథ తాలూకు పేపర్లు అన్నీ కిటికీలోంచి వచ్చే చల్లటి గాలికి ఎగిరి గదంతా పరచుకున్నాయి. బైట ఎగిరిపోకుండా వాటి మీద పేపర్ వైట్ పెట్టి మళ్ళీ ఆలోచించడం మొదలు పెట్టింది శ్రీవిద్య.

"ఏమిటీ ఇంకా నీ కథ పూర్తి కాలేదా?" అంటూ లోపలకు వచ్చాడు శశి.

"కొట్టివేతలున్నాయని ఫెయిర్ చేసాను. అయిపోయినట్టే. ఒకసారి చదివి నీ అభిప్రాయం చెపుతావా? అన్నది శ్రీ విద్య.

ఊ అంటూ తలూపి కథ తీసుకుని హాల్లో సోఫా మీద కూర్చోటానికి అటువైపుకి దారి తీసాడు శశి.

కథ చదువుతున్న శశి మొహంలో రంగులు మారడం గమనించింది శ్రీవిద్య.

కథ చదవడం పూర్తికాగానే శ్రీవిద్య ఊహిస్తున్నట్టే శశి బాంబు పేల్చనే పేల్చాడు.

"ఇది కథనా? నాకైతే చాలా అసహజంగా ఉందనిపించింది" అన్నాడు శశి.

"ఏమిటి నీకు అసహజంగా అనిపించింది?" అన్నది శ్రీవిద్య.

"60 ఏళ్ళున్న అంత పెద్ద ఆమెకు రెండో పెళ్ళి అంటే ఎందుకో మన భారతీయ సమాజానికి భిన్నంగా ఉందనిపిస్తోంది. ఇలాంటివి ఆమెరికాలో జరిగితే అర్థం చేసుకోవచ్చు. అంతే కాని మన దగ్గర ఇలాంటివి జరిగినట్లు మనం ఎప్పుడు వినలేదు. ఏదో పెద్దావిడ. ఆ వయస్సులో అమ్మమ్మలాగానో, నాయనమ్మలాగానో హాయిగా పూజ, పునస్కారాలు చేసుకోకుండా అలా పెళ్ళి చేసుకుంటుందంటావా? మా అమ్మో, మీ అమ్మో ఇలా చేస్తారా? అలా చేస్తే మనకే ఎంత చికాకుగా ఉంటుందో నువ్వే ఆలోచించు" తన అభిప్రాయాల్ని తేల్చి చెప్పేశాడు శశి.

"అదే? 60 ఏళ్ళ మగవాడు పెళ్ళి చేసుకుంటే మనకేమి అసహజంగా అనిపించదు. అదే ఒక స్త్రీ ఆ పని చేస్తే ఎక్కడో తేడా అనిపిస్తుందెందుకని? 60 ఏళ్ళ మగవాడు పెళ్ళి చేసుకుంటే లేని అభ్యంతరం 60 ఏళ్ళ ఆమె పెళ్ళి చేసుకుంటే ఎందుకు వస్తోంది? ఏ వయసావిడ ఆ నిర్ణయం తీసుకోవచ్చు, ఏ వయస్సావిడ ఆ నిర్ణయం తీసుకోకూడదన్నది మన లోపలవుందన్నమాట అసలు ఏ వయస్సు స్త్రీ అయినా తనకిష్టమైనట్లు తనకు నచ్చిన పద్ధతిలో తోడు వెతుక్కోగలిగే స్వేచ్ఛ మన సమాజంలో ఉందా, లేదా అన్నది నా ప్రశ్న. అది ఈ కథలో చెప్పటమే నా కథ ఉద్దేశం" అంది శ్రీవిద్య.

"చూడు, నీ స్నేహ బృందం ఉందిగా వాళ్ళను అడిగి చూడు, ఏమంటారో?" అంటూ కంప్యూటర్ ముందుకెళ్ళిపోయాడు శశి.

అప్పుడు టైం చూస్తే రాత్రి పది కావస్తోంది. ఇప్పుడెందుకులే, రేపు పొద్దున ఆదివారమేగా, వసంతకు పొద్దుటే ఫోన్ చేద్దాము అనుకుంటూ వెళ్ళి పడుకుంది శ్రీవిద్య. కథ పూర్తి అయిందన్న సంతృప్తి లేదు శ్రీవిద్యకు, శశి వేసిన ప్రశ్నల గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

ఇంతలో ఎదురుగా వచ్చి నిలబడింది శారద పాత్ర.

"నేను నీ చేతిలో మైనపు బొమ్మను కదా" అన్నది శారద.

తాను చేసిన తప్పేమిటో అప్పుడు అర్థమైంది శారదకు. తన కథలో శారదకు రక్తమాంసాలతో కాకుండా ఊహలతో ప్రాణం పోశానని.

అయినా తన పాత్రముందు ఓడిపోవడం శ్రీవిద్యకు ఇష్టం లేకపోయింది. శారదని నమ్మించే ప్రయత్నం చేసింది.

"నేను చేసిన పనికి సామాజిక ఆమోదం లభించాలని నువ్వు ప్రయత్నం చేయలేదు" అంటూ నిలదీసింది శారద.

అవునని నిజాయితీగా ఒప్పుకుంటూ "కానీ అది నీ మంచికే. అందరి దృష్టిలో నువ్వు చౌకబారు కాకుండా ఉండటానికి వీలైనంత డిగ్నిఫైడ్‌గా కనిపించాలని నిన్న జాగ్రత్తగా మలిచాను." అన్నది శ్రీవిద్య.

"అదే మరి. అంటే నేను చేసిన పని మీద నీకే గౌరవం లేదన్నమాట. మొదట నీ ప్రకటన్లో జీవితాన్ని అందంగా ఆనందంగా అనుభవించడం కోసం నేను తోడు వెతుక్కుంటున్నట్లు రాశావు. నేను ఈ తోడు వెతుక్కుంటోంది జీవితాన్ని ఎంజాయ్ చేయడం కోసమేనంటే నీ పాఠకులకు నచ్చదేమోనని మార్చావు. నిజంగా శారీరక వాంఛలతోనే నేను ఈ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నట్లు రాస్తే నీ పాఠకులకు నామీద గౌరవం ఉండదని నువ్వనుకున్నావు. అందుకనే నాకు సామాజిక సేవ పట్ల ఆసక్తి ఉన్నట్లు, నేను సామాజిక సేవా

కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నట్లు, అందుకోసమే తోడు వెతుక్కుంటున్నట్లు నమ్మించే ప్రయత్నం చేసావు. అవునా?" అన్నది శారద.

"అవును నిజమే. కానీ ఎందుకు చేసానో ఆలోచించు. నీ మీద ప్రేమతో చేశాను. నువ్వు అందరి దృష్టిలో ఉన్నంతగా కనిపించాలని ఆరాటపడ్డాను. నా ఆరాటం నీకు స్వార్థంగా కనిపిస్తోందా? నువ్వు నీ కూతురు అడిగినట్టు కోర్కెలతో కాలిపోతుండటం వల్లే పెళ్ళి చేసుకుంటున్నట్లు రాస్తే ఏమవుతుందో తెలుసా?" ఒకింత కోపంగా ప్రశ్నించింది శ్రీవిద్య. శారద ఫక్కున నవ్వింది.

"చూసావా? నీకు ఉన్న విషయం రాసే ధైర్యం లేకపోయింది. ఓ స్త్రీ ఎందుకు పెళ్ళి చేసుకోవాలో, ఎలా చేసుకోవాలో చాలా ముందే నిర్ణయించేసారు. నీకు ఆ చెలియలికట్ట దాటాలని ఉంది. కానీ నీకు తెలియకుండానే నువ్వు మళ్ళీ ఓ సరిహద్దుని గీస్తున్నావు. నన్ను ఓ సరిహద్దు నుండి ఇంకో సరిహద్దుకు పంపుతున్నావు. నాలుగు గోడల మధ్య ఉన్న నీ లోపల ఇంకో గోడ ఉంది" అంటూ వెను తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది శారద.

## మార్పు - ది ఛేంజ్ - లత కందికొండ

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 14వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో

**ద్వితీయ బహుమతి పొందిన కథ**

**అనకాపల్లిలో పుట్టి** పెరిగిన అమలని అర్థరాత్రి నిద్రలేపి నీ జీవిత ధ్యేయం ఏమిటి అని ఎవరైనా అడిగితే కళ్ళు తెరవకుండానే ఠపీమని - అమెరికా వెళ్ళడం అంటుంది.

చిన్నప్పుడే తలిదండ్రులు పోవడంతో అన్నా వదినల దగ్గర ఎంతో గారాబంగా పెరిగిన అమల ఒక రోజు అన్నగారితో ఇలా అంది. "అన్నయ్యా మీరేదో నాకు పెళ్ళి సంబంధాలు చూసి తాపత్రయపడుతున్నట్లున్నారు. అంత్య నిష్టూరం కంటే ఆది నిష్టూరం మేలని ఇప్పుడే చెప్పేస్తున్నాను నేను అమెరికా పెళ్ళికొడుకునే చేసుకుంటాను కాబట్టి నాకు అమెరికా సంబంధమే చూడు." అని సిగ్గులేకుండా కాకపోయినా - సిగ్గు విడిచి నిక్కచ్చిగా చెప్పింది.

"ఏముందే అమెరికాలో? అక్కడివాళ్ళే ఇక్కడికి తిరిగొస్తున్నారు. అయినా ఇరవై ఏళ్ళ క్రితం అమెరికా వెళ్ళడం అంటే ఏమైనా గొప్పేమోగానీ ఈ రోజు మన ఊళ్ళో కూడా సందుకొకరున్నారక్కడ" అన్నాడు అమల అన్నయ్య ప్రభాకర్.

"అదే - మన సందులోంచి ఎవరూ లేరనే నేను వెళదామనుకుంటున్నాను".

"హవ్వ! కలికాలం ఎంత సిగ్గులేకుండా చెపుతోందో" - ఆ ఆడగొంతు అమల వదిన అపర్ణది.

"సిగ్గుపడుతూ కూర్చుని మీరు చెప్పిన వాడిచేత మెళ్ళో తాళికట్టించుకోవడానికి నేను మామూలు ఆడదాన్ని కాదు మరి - నీ పెంపకంలో పెరిగి - స్వతంత్ర భావాలు నేర్చుకున్న వీరనారీ శిరోమణిని" అంది అమల.

"చూశావా నీవు నేర్పిన విద్యయే నీరజాక్షి అని అది వీర లెవెల్‌లో ఈనాడు మాట్లాడుతోందంటే దాన్ని అతిగారాం చేసి నెత్తికెక్కించుకున్నావు" పెళ్ళాన్ని కసిరాడు ప్రభాకర్.

"నాకేం తెలుసు, ఇలా తయారవుతుందనీ? తల్లి లేని పిల్ల కదా కన్న తల్లిలోటు తీర్చలేకపోయినా - సవతి తల్లి అన్న పేరు తెచ్చుకోకూడదనీ వదిననైనా... " అపర్ణ మాటలు పూర్తికానివ్వలేదు అమల.

"నీ మాటలకి అడ్డం వస్తున్నందుకు నన్ను క్షమించు వదినా అంటూ నాటక ఫక్కీలో అని అదెవరో అన్నట్లు అమ్మ శబ్దంలో 'అ' - నాన్న శబ్దంలో 'న్న' - కలిపి అన్న అయినట్లు మీరిద్దరూ నన్ను అమ్మా నాన్నల కొరత లేకుండా చాలా బాగా పెంచారని దేశ విదేశాలలో ప్రచారం చేసి వీలైతే అరుదైన అన్నా వదినలుగా మిమ్మల్ని గిన్నీస్ బుక్‌లోకి ఎక్కించడానికి ట్రై చేస్తాను గానీ దాని కోసమైనా నాకు అమెరికా మొగుడిని తేరూ ప్లీజ్...." అంటున్న అమల మాటలకి పోస్ట్ అన్న కేకతో బ్రేక్ పడింది.

గుమ్మం దగ్గరకెళ్ళి పోస్ట్‌మాన్ చేతినుండి ఉత్తరాన్ని అందుకున్న అమల "అన్నయ్యా ఇది నీకే ఎవరో మూర్తిగారట హైదరాబాదు నుంచి" అంటూ కవరు ప్రభాకర్ చేతికిచ్చింది.

ఈ మూర్తి ఎవరబ్బా అనుకుంటూ కవర్ ఓపెన్ చేసాడు ప్రభాకర్ - లోపల ఉత్తరం, ఒక బయోడేటా, దానితోపాటు ఒక ఫోటోని కూడా చూసిన ప్రభాకర్ ఆశక్తితో ఉత్తరాన్ని పైకే చదవడం మొదలెట్టాడు.

"ప్రభాకర్‌గారికి ఇక్కడ మ్యారేజ్ బ్యూరోలో మీ చెల్లెలు అమల ఫోటోని అమెరికాలో ఉన్న మా అబ్బాయి మాధవ్‌కి పంపాము. మా అబ్బాయి జాతకంతో పాటు తక్కిన వివరాలూ ఫోటో ఈ ఉత్తరంతో పాటు జతపరుస్తున్నాను. మీకు నచ్చి మాకు ఫోన్ చేస్తే వచ్చేవారం మా అబ్బాయి అమెరికా నుండి వస్తున్నాడు మీ వీలును బట్టీ వచ్చి మిమ్మల్ని కలవాలని అనుకుంటున్నాము. ఈ క్రింది మా అడ్రస్, ఫోన్ నెంబరు ఇస్తున్నాను. ఇట్లు, మూర్తి."

ప్రభాకరింకా ఉత్తరం చదవడం పూర్తి చేసీ చేయకుండానే అమల అన్నగారి చేతిలో నుండి ఉత్తరాన్నీ, ఫోటోనీ లాక్కుంది. "మొగాడ్! అచ్చం హీరోలా ఉన్నాడే? చూసారా ఈ యువరాణిని వెతుక్కుంటూ వచ్చి తలుపు కొట్టీ మరీ నా కలల రాకుమారుడు - నన్ను రెక్కల గుర్రాన్ని - సారీ - విమానాన్ని ఎక్కించుకు తీసుకుపోతాడని చెప్పానా లేదా...."

అమల సంబరాన్ని చూసి నవ్వుకుని - ఇలా పెళ్ళి గురించి మాట్లాడుకుంటుంటే అలా ఉత్తరం ఎలా వచ్చిందబ్బా? రాసి పెట్టడం అని దీన్నే అంటారేమో అనుకున్నారు అమల అన్నా వదినలు.

ఆ తర్వాత పెళ్ళివాళ్ళు రావడం, ఇరువర్గాలవారికి నచ్చడం, తాంబూలాలు పుచ్చుకోవడం అన్నీ ఫాస్ట్ ఫార్వర్డ్ లాగా జరిగిపోయాయి. కానీ ముహూర్తం మాత్రం మూడు నెలల దూరంలో ఉంచింది వాళ్ళిద్దరినీ - ఇదీ ఒకందుకు మంచిదే ఒకరినొకరు అర్థం చేసుకోవచ్చు, ఎంచక్కా ప్రేమించుకోవచ్చు. ఫ్యూచర్‌లో ఎవరైనా మీది అరేంజ్డ్ మ్యారేజా, లవ్ మ్యారేజా అని అడిగితే అరేంజ్డ్ మ్యారేజ్ అనో లవ్‌లో అరెంజ్డ్ మ్యారేజ్ అనో గొప్పగా చెప్పుకోవచ్చు అనుకుంది అమల. అప్పటి నుండి ఇద్దరూ ఫోన్లో గంటలు గంటలు మాట్లాడుకునేవారు. ' మరీ తిండీ, నిద్రా లేకుండా ఏమిటే ఆ మాటలూ' అని అపర్ణ అంటే - ఫోన్ పెట్టగానే చేసే పని అదే కదా వదినా? టిఫిన్ రెడీ అయ్యిందా లేదా? బ్రష్ చేసుకుని వస్తాను. ఆకలి దంచేస్తోంది, నిద్రకూడా కూరుకొస్తోంది అర్జంటుగా పడుకుని కలలో నా రాజకుమారుడితో డ్యూయెట్లు పాడుకోవాలి' అని బదులిచ్చేది అమల.

ఇటు వదినా మరదళ్ళ సరాగాలిలా ఉంటే అక్కడ అమెరికాలో ఉన్న మాధవ్ చెల్లెలు రేఖ - అమలకి ఫోన్ చేసి 'వదినా మొన్న వీకెండ్‌లో బోస్టన్‌కి వెళ్ళాము అన్నయ్య దగ్గరకి. వేళకి తిండీ, నిద్రా లేకపోవడం వల్లనో ఏమిటో చిక్కి సగమైపోయేడు. నేనైతే అసలు

గుర్తుపట్టలేదు కూడా - ఇంకా మా ఆయనేమన్నారో తెలుసా? మీ అన్నయ్య ఈ మూడు నెలల టెలిఫోన్ బిల్లు పెడితే ఆ అమ్మాయి వచ్చేసరికి అద్దె ఇంట్లోకి కాకుండా ఎంచక్కా స్వంత ఇంట్లోకి గృహ ప్రవేశం చేసేది' అన్నారు.

"ఆడపడుచు అర్ధమొగుడంటారు" - ఏమైనా అనుగానీ మా పెళ్ళికి సింపుల్‌గా ఓ ఇల్లు చిన్న గిఫ్ట్‌గా ఇవ్వకూడదూ?' అంది అమల.

ఇటు అమల ఎప్పుడు అమెరికా వెళ్తానా అని ఎదురుచూస్తోంటే అటు మాధవ్‌లో ఏదో అర్థంకాని అలజడీ, అయోమయ పరిస్థితి - అమలని తల్చుకున్నప్పుడల్లా

ఫ్లాష్ బ్యాక్ లోకి వెళ్ళాడు మాధవ్....

పెళ్ళి చూపులై ఒకరికొకరు నచ్చారని అనుకున్నాక మాధవ్ - అమలతో విడిగా మాట్లాడతానని పెద్దవాళ్ళ అనుమతితో బయటికి తీసుకెళ్ళేడు అమలని.

"మీ హాబీస్ ఏంటీ?" అడిగాడు మాధవ్.

"సంగీతం, సాహిత్యం, టీ.వీ చూడ్డం... ఇంకా ... సినిమాలు కూడా చూస్తుంటాను" చెప్పింది అమల.

"ఈ మధ్య కాలంలో ఏంజిలీనా జోలీ, జూలియా రాబర్ట్స్ సినిమాలు ఏం చూసావు?" అడిగాడు మాధవ్.

"జోలా, చిప్పా?" అవి అసలు ఆడపేర్లా, మగవాళ్ళ పేర్లా చెప్పండి ముందు?" అని అడిగిన అమలని వింతగా చూసాడు మాధవ్.

"ఇంగ్లీష్ సినిమాలు చూడవా?"

"అంత ఆశ్చర్యం ఎందుకు? రమణారెడ్డి, రేలంగి సినిమాలు మీరేం చూసారు? " అడిగింది అమల.

"వాళ్ళెవరూ" కాస్త చిరాగ్గానే మొహం పెట్టాడు మాధవ్.

"క్లూ ఇవ్వనా పోనీ - వాళ్ళు కమేడియన్స్. వాళ్ళిద్దరినీ ప్రక్క ప్రక్కన నిలబెడితే పది అంకెలా ఉంటారని కూడా అంటారు..... పోనీ అది వదిలేయండి - 'మనిసన్నాక కూసింత కలాపోసన ఉండాలి' అన్న డైలాగ్ ఏ సినిమాలోదో చెప్పండి?'" సవాల్ చేసినట్లే అంది.

తెలియదనట్లు తల అడ్డంగా తిప్పాడు మాధవ్

"అంటే మీకు బాపూ రమణల గురించి కూడా తెలియదన్నమాట" ఆశ్చర్యంగా చూసింది మాధవ్ వైపు.

"సినిమాల గురించెందుకులే గానీ, హెరాల్స్ రాబిన్స్, సిడ్నీ షెల్డాన్ నవలలేం చదివేవు" అడిగాడు మాధవ్.

"మీరు 'వేయిపడగలు' చదివారా? అది ఎవరు వ్రాసారో చెప్పగలరా?.... పోనీ శరత్ 'చరిత్ర హీనులు' చదివారా?"

"ప్రశ్నకి ప్రశ్న సమాధానం అవదు" అన్నాడు మాధవ్.

"మీరు కొంచెం బుర్రపెట్టి ఆలోచిస్తే నా ప్రశ్నలోనే మీకు సమాధానం దొరుకుతుంది" అంది అమల.

"అంటే నేను తెలుగు నవలలు చదవనట్లే నువ్వు ఇంగ్లీష్ నవలలు చదవనని తెలివిగా చెప్పేననుకుంటున్నావా" అడిగాడు మాధవ్.

"అది నా తెలివి అని మీరు కాంప్లిమెంట్ ఇస్తే సంతోషం. అంతే కాదు మీరు గనక నాతో ఛాలెంజ్ చేస్తే మీరు చెప్పిన ఏ ఇంగ్లీష్ నవలనైనా నేను చదవగలను కానీ మీరు మాత్రం 'వేయిపడగలు' చదవలేరని బాండ్ పేపర్ మీద వ్రాసిస్తాను కావాలంటే" నవ్వుతూనే ఛాలెంజ్ విసిరింది అమల.

ఇదెక్కడి పిల్లరా బాబూ, ఎక్కడికక్కడే ఫిట్టింగ్ పెట్టి ఫిక్స్ చేసి కన్ఫ్యూస్ చేస్తోంది అనుకుని టాపిక్ మార్చాలని - "పోనీ ఏ.ఆర్.రహమాన్ స్లం డాగ్‌లో పాటలు విన్నారా" అని అడిగాడు కాఫీ సిప్ చేస్తూ .

"వినడమేమిటి చక్కగా పాడగలను కూడా కానీ ఇక్కడ మాత్రం పాడమనకండేం? ఎందుకంటే ఎప్పుడో ఫిబ్రవరిలో వస్తుందనుకుంటున్న ఆస్కార్ నాకిప్పుడే ఈ హోటల్ వాళ్ళు ఇచ్చేస్తారేమోనని..... మీరు వినాలనుకుంటే వెళ్ళేటప్పుడు కార్లో పాడతాను.... ఏమైనా ఆ సినిమాకి గ్లోబల్ అవార్డ్ వచ్చాక అమితాబచ్చన్ అలా కామెంట్ చేయడం నా కసలు నచ్చలేదు" అంది అమల.

"ఏమన్నాడేంటీ?" ఏం చెపుతుందో విందామని కుతూహలంగా అడిగాడు మాధవ్.

"మనదేశం పేదదని చూపించి ఇండియా పరువు తీసేరన్నాడు"

"కరక్టే కదా" అన్నాడు

"అంటే ఐటీ ఇంత డెవలెప్ అయిన ఈ రోజుల్లో భారతదేశం ఎలాంటిదో ఆ సినిమాలో చూపిస్తేగాని తెలుసుకోలేనంత పిచ్చిదా ఈ ప్రపంచం?..... అయినా ఉన్నది ఉన్నట్లు చూపించి అవార్డు తీసుకుంటే ప్రశ్నించే ఈ బడా బాబులంతా లేనిది ఉన్నట్లు చూపించి మన ఆంధ్రప్రదేశ్‌దే కాక దేశం మొత్తం పరువు తీసి ప్రపంచం ముందు మన దేశాన్ని లాఫింగ్ స్టాక్‌లా నిలబెట్టిన పెద్ద మనుషుల గురించి ప్రెస్ మీట్ పెట్టి ఎందుకు మాట్లాడలేదు?" కొంచెం ఆవేశంగానే అడిగింది అమల.

"ఎవరి గురించి నువ్వంటున్నావు?"

"బ్యాలెన్స్ షీట్‌లో అంకెల గారడీ చేసిన (అ)సత్యరాజు గురించి... బ్యాలెన్స్ లేకుండా ఖాళీ షీట్‌ని మాత్రం చూపించి సైబర్ క్రైం సృష్టించిన (అ)ధర్మరాజు గురించి."

"క్వైట్ ఇంట్రెస్టింగ్. మా ఆవిడకి లోకజ్ఞానంకూడా తెలుసన్నమాట" మెచ్చుకోలుగా అన్నాడు మాధవ్.

"మీ లోకజ్ఞానం ఎంతుందో చూస్తాను - ఈనాడు ఇండియాని పట్టి పీడిస్తున్నవి ఏంటో సింపులగా నాలుగైదు మాటల్లో చెప్పండీ చూద్దాం" మళ్ళీ సవాల్ చేసింది అమల.

"ఆఁ..........."

"టైం అప్" మీరు ఓడిపోయారు. నేను చెప్పనా? క్యాస్ట్, క్యాష్, కరప్షన్, క్రైం, అండ్ గ్రీడ్ ఈ దేశంలో నేతలవ్వాలంటే వాళ్ళనడిగే ప్రశ్నలెలా ఉంటాయో తెలుసా? నీకు ఏ ఫీల్డ్‌లో ఎక్స్‌పీరియన్స్ ఉందని రాజకీయాల్లోకి వద్దామనుకుంటున్నావు? 'టాడా ఏక్ట్' నుండి తప్పించుకొచ్చావా? మాజీ క్రికెట్ క్యాప్టెన్‌గా ఆటలో నిన్ను బ్యాన్ చేస్తే ఇక్కడికొచ్చావా? సైబర్ టెర్రరిజం మూడోకంటికి తెలియకుండా సృష్టించే తెలివితేటలున్నాయా? నీ సినిమాలకింక డబ్బులు రావని ఈ ఫీల్డ్ ఎన్నుకున్నావా? రౌడీ షీటర్‌వా, బయటే కాకుండా జైల్లో కూడా హత్యలు చేయగలవా? ఎన్‌కౌంటర్ అంటే ఏంటో తెలుసా అని.... ఇలాంటి వాటిని అడగాలి అటు నందికి ఇటు పందికీ, అటు సినిమా తారకీ ఇటు క్రికెట్ స్టార్ కీ కూడా గుడి కట్టేంత గొప్పవాళ్ళు మన జనాలు... నిజానికి నిన్న రిపబ్లిక్ డే నాడు నాక్కూడా పద్మశ్రీ ఇస్తాననికబురు చేసారు గానీ - మా ఆడబడుచుకున్న తెలివితేటలకి పద్మశ్రీ ఇచ్చి అవమానం చేస్తారా? అని మా వదిన సున్నితంగా తిరస్కరించింది తెలుసా? "

అమల మాటలకి నవ్వి - "మీకు ఆవేశం బాగా ఎక్కువనుకుంటూనే? ఏదో అనకాపల్లి సరుకనుకున్నానే గానీ ఇంత జనరల్ నాలెడ్జ్ ఉందనీ, కీ ఇస్తే నాన్‌స్టాప్ అనీ ఇప్పుడే తెలిసింది." అన్నాడు.

"ఏయ్ మా అనకాపల్లినేమన్నా అన్నావంటే - ఒక్క విజిల్ వేస్తే చాలు - బయట వున్న నీ కారు నామ రూపాలు లేకుండా పోతుంది" అంటూ మాధవ్‌ని బెదిరించింది అమల.

"అయ్యబాబోయ్! ఇలాంటి రౌడీ వేషాలు కూడా ఉన్నాయన్నమాట. అలాంటప్పుడు ఇక్కడ పాలిటిక్స్‌లో చేరి సెటిలైపోకుండా అక్కడికొచ్చి నాలాంటి వాళ్ళని భయపెట్టడమెందుకు చెప్పు?" అన్నాడు మాధవ్.

"ఏమనుకున్నారు ఈ అమలంటే? ఒక కిరణ్ బేడీ... ఒక సునీతా విలియమ్స్... ఒక మిథాలీ రాజ్..."

"ప్లీజ్ ఒక కరణం మల్లేశ్వరి కోవలోకి మాత్రం వెళ్ళకేం? నేనసలే అర్భకుడ్ని" అమల మాటలకి భయం నటిస్తూ అన్నాడు మాధవ్.

"ఓ మైగాడ్! నేను కాకుండా మా ఆంధ్రా అమ్మాయి ఇంకొకరు కూడా మా ఆయనకి తెలుసన్నమాట. క్వైట్ ఇంట్రస్టింగ్" అంది అమల, మాధవ్ మాటలనే తిప్పికొడుతూ.

మరోసారి - నీకు మడోన్నా తెలుసా అని అడిగితే నీకు మిక్కీ జె మేయర్ తెలుసా అని అడిగింది. - వాడెవడూ అని అడిగితే - తెలియదా, మీ మడోన్నా తమ్ముడు అంది.

ఇంకో రోజు మాటల్లో ఏదో అడిగితే - "నువ్వు చాలా జీనియస్‌వి రా - రామలింగరాజులా" - అంది - అది తిట్టో పొగడ్తో అర్థం కాకుండా. అంతలోనే తనకి కోపం వచ్చిందని తెలిసి - నేననీ... నీవనీ... వేరుగా... లేమనీ... చెప్పినా వినరే ఒకరైనా - అన్నపాట అతి తీయగా పాడి - ఈ పాట ట్యూన్ చేసింది ఎవరో తెలుసా? మీ మడోన్నా తమ్ముడే అంది.

గతంలోంచి బయటకొచ్చిన మాధవ్ అమల గురించే ఆలోచిస్తూ పడుకున్నాడు.

పెళ్ళై అమెరికాకి వచ్చిన ఆనందానికి అవధులు లేకుండా పోయింది. భూతల స్వర్గమంటే ఇదేనా అనుకుంది. మొదటి వారమంతా జెట్‌లాగ్‌తోనూ సామాన్లు తెచ్చుకోవడం, ఇళ్ళు సర్దుకోవడంతోనూ సరిపోయింది. మాధవ్ లీవ్ అయిపోవడంతో జాబ్‌లో చేరిపోయాడు. అక్కడ ఇండియాలో ఇంటినిండా పనివాళ్ళతో, వంట వాళ్ళతో, వదిన చేసిన గారంతో, ఏ పనీ చేసి ఎరగని అమల చాలా కష్టపడాల్సి వచ్చింది పనులు చేసుకోవడానికి. కొన్ని కావాలంటే కొని వదులుకోవాలన్నమాట అని అనుకోకుండా ఉండలేకపోయింది.

అమల లేచే సరికి మాధవ్ ఆఫీస్‌కి వెళ్ళిపోయేవాడు. మాధవ్ వచ్చేసరికి పనులతో అలిసిపోయిన అమల పడుకుండిపోయేది. ఎంత అనుకున్నా ప్రొద్దున్న ఆరుగంటలకు నిద్రలేవలేకపోయేది. వీకెండ్స్ వస్తే ఫ్రెండ్స్‌ని కూడా పిలిచేవాడు. వాళ్ళంతా బ్యాచిలర్స్ తను ఒక్కత్తే అన్నీ చేయలేక ఏడుపొచ్చేది అమలకి.

ఒక్కో పనీ నేర్చుకుంటూ రోజుకో రకమైన ఎక్స్‌పెరిమెంట్స్ చేసేది వంటింట్లో. మొదట్లో అమల చేసిన వంటకాలకి ముద్దు ముద్దుగా రకరకాల పేర్లు పెట్టి నవ్వించిన మాధవ్ రాను రాను దీన్ని వంటంటారా? అని అరవడం మొదలుపెట్టాడు. అమెరికాకి రావాలి అన్న కోరిక ఉండగానే సరిపోదు. ఇండియాలోలా ఇక్కడ నౌకర్లు, చాఫర్లు ఉండరని కూడా మహారాణిగారు తెలుసుకోవాలి. కబుర్లతో కడుపునిండదు. అని దెప్పి పొడిచేసరికి అమల కళ్ళల్లో నీళ్ళు తిరిగేవి. ఊరు కాని ఊరు, దేశం కాని దేశం - పలకరించేవాడూ లేడు, చెప్పుకోవాలంటే వినే నాథుడూ లేడు. అటు అన్నా వదినలకి చెప్పాలంటే బెరుకు - ఒద్దంటే వెళ్ళేవు అనుభవించు అంటారేమోనని. రోజంతా నాలుగు గోడల మధ్య ఏం చేస్తుంది తను? టీ.వీ. చూసినా, మెయిల్స్ ఇచ్చినా, చాట్ చేసినా ఎంతసేపనీ, ఎన్ని రోజులనీ? ఆరు నెలలు కూడా కాకుండా తన బ్రతుకిలా అయిపోయిందేంటి? ఇదేనా తను కలలు కన్న అమెరికా జీవితం?

"ఏంటి కళ్ళల్లో నీళ్ళు? ఎందుకేడుస్తోంది తను?" అర్థంకాక తనని తనే ప్రశ్నించుకుంది అమల.

ఆ రోజు అమల పుట్టిన రోజు - అటు అత్తింటి నుండీ, ఇటు పుట్టింటి నుండీ కూడా అందరూ విష్ చేసారు. ఫ్రెండ్స్ అందరూ కూడా మెయిల్స్ ద్వారా, ఫోన్‌లోనూ శుభాకాంక్షలు చెప్పారు. మాధవ్ విష్ చేస్తాడని ఆ రోజు ప్రొద్దున్నే లేచింది కూడా. కానీ విష్ చేయకుండానే వెళ్ళిపోయాడు. "ఈ రోజు నా పుట్టిన రోజు తెలుసా"? అని అడగబుద్ధిపుట్టలేదు అమలకి. ఒకవేళ మర్చిపోయాడేమో - ఆఫీస్‌కెళ్ళి ఫోన్ చేస్తాడేమో అని ఆశతో ఎదురుచూసింది. ఏ ఫోన్ వచ్చినా, తలుపు కొంచెం చప్పుడైనా మాధవే అనుకుని ఉలిక్కిపడి లేచేది.

స్టవ్ ముందు నుంచున్న అమలని వెనక నుండి వచ్చి రెండు చేతులు చుట్టేసాయి. మెడ ఒంపులో మాధవ్ ముద్దుపెడుతోంటే పరవశించి పోయింది. తన కౌగిట్లో బంధించి ఊపిరి సలపకుండా ముద్దులతో ముంచెత్తుతూ హ్యాపీ బర్తడే టూ యూ డార్లింగ్ అని అమాంతం ఎత్తేసుకున్న మాధవ్‌ని "ఏయ్ నాకు ఊపిరాడటం లేదు వదులు" అని అరిచింది అమల.

స్టౌ మీద నుండీ పాలు పొంగిన చప్పుడికి ఈ లోకలోకి వచ్చిన అమల... ఏమిటీ ఇదంతా నా ఊహా గానమా మాధవ్ నిజంగా రాలేదా? అని కన్నీరు ధారాపాతంగా కారుతోంటే దివాన్ మీద పడుకుని దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది.

ఆ మర్నాడు సాయంత్రం ఆఫీస్ నుండీ వస్తూ మెయిల్ బాక్స్ నుండి తెచ్చిన లెటర్స్ చూసుకుంటూ "నీకేవో గ్రీటింగ్స్ వచ్చినట్లున్నాయే" అంటూ అమలకి కొన్ని కార్డ్స్ అందిస్తూ... "ఓ మై గుడ్ నెస్! ఈ రోజు డేట్ పధ్నాలుగు కదూ అంటే నిన్న పదమూడున నీ పుట్టినరోజు అయిపోయిందా? అలా ఎలా మర్చిపోయాను? బిలేటెడ్ బర్తడే గ్రీటింగ్స్"అంటూ అమల దగ్గరకి రాబోయాడు మాధవ్.

"నన్ను ముట్టుకున్నావంటే చంపేస్తాను. దొంగలు పడిన ఆర్నెల్లకి కుక్క మొరిగిందట". చీదరించుకుంటూ దూరంగా జరిగింది అమల.

"ఇక్కడ దొంగెవరు? కుక్కెవరూ?" అడిగాడు మాధవ్.

"రెండూ నువ్వే. పెళ్ళాం పుట్టిన రోజు - అదీ పెళ్ళైన మొదటి సంవత్సరంలోనే - మర్చిపోయావంటే నువ్వూ ఒక మొగుడివేనా? ఛీ అసలు నీలాంటి వాళ్ళని నమ్ముకుని ఇంట్లో వాళ్ళందరూ వద్దని మొత్తుకుంటూన్నా వినకుండా ఈ పరాయి దేశం వచ్చాను చూడూ! అందుకు నన్ను నేనే చెప్పుతీసుకుని కొట్టుకోవాలి." చేతిలో ఉన్న గ్రీటింగ్ కార్డ్స్ మాధవ్ మీదకి విసిరికొట్టి శివమెత్తినట్లు అరిచింది అమల.

"ఏంటీ! నోటికొచ్చినట్లు వాగుతున్నావ్? ఇప్పుడేమైందనీ నీ పుట్టీన రోజు మర్చిపోవడమా నేను చేసిన నేరం? నువ్వేం చరిత్ర సృష్టించిన మహారాణిననుకుంటున్నావా, కేలెండర్‌లో రెడ్ మార్క్ వేసి అమెరికా అంతా హాలిడే ప్రకటించడానికీ, నేను తెల్సుకోవడానికీనూ? మాకూ సవాలక్ష పనులుంటాయి. బోడి నీ పుట్టినరోజు గుర్తుపెట్టుకోవడమే పని అనుకుంటున్నావా? చూస్తూనే ఉన్నాను నిన్న గాక మొన్న నా జీవితంలోకి ప్రవేశించిందో లేదో - నా మీద సర్వ హక్కులూ తనవే నన్నట్లు ప్రవర్తిస్తోంది. ఈ వెధవ పెళ్ళి ఎందుకు చేసుకున్నానా అని నువ్వు కాదు నేననుకోవాలి" అరుస్తూ అన్నాడు మాధవ్.

అమలకి రోషంతో పాటు, దుఃఖం పొంగు కొచ్చింది. "నేనేమైనా దేవిరించి మీ వెంట పడ్డానా నన్ను చేసుకోమని? నచ్చేవంటూ ఉత్తరాలు వ్రాసి వెంటపడి పెళ్ళి చేసుకుని ఈరోజు ఇలా అనడానికి సిగ్గుగా లేదు? అసలు మీ మగజాతే ఇంత. పెళ్ళి చేసుకుని ఈ రోజు ఇలా అనడానికి సిగ్గుగా లేదు? అసలు మీ మగజాతే ఇంత. పెళ్ళి అయ్యే దాకానే ఆడది ముద్దుగా అనిపిస్తుంది. ఆ తర్వాత ఇంతే సంగతులు. పిలవగానే ఎవరికోసం వస్తుంది? అని పెళ్ళాం ఒక లైసెన్స్ కూలీ అనుకుంటారు. ఇంట్లో పనిమనిషిలా పనిచేయడానికీ,

పక్కలో పడుకోవడానికి నీలాంటి వాళ్ళకి భార్య కావాలి. సొసైటీలో మీ ప్రక్కన నడవటానికి స్టేటస్ సింబల్‌గా తీసుకెళుతున్నారు నన్ను'' ఎన్నాళ్ళగానో అణచుకున్న తన బాధను వెళ్ళగ్రక్కకుండా ఉండలేకపోయింది అమల.

''ఓయబ్బ! నువ్వో లిమోజిన్, బి.యం.డబ్ల్యూ అని స్టేటస్ సింబల్‌గా నిన్నేసుకుని తిరుగుతున్నాను మరి పాపం. ఏమీటే నువ్వు చేసే పనులూ? రోజంతా తంటాలు పడీ ఇంకెవరూ చెడగొట్టలేనంత ఛండాలంగా - చిమిడిన అన్నం, మాడిన కూర, ఇంకా ఆ వండినదేదో కూడా తెలుసుకోలేని పదార్థాలన్నీ చేసి నా మొహాన పడేస్తావు. నోట్లో పెట్టుకుంటే డోకు వచ్చేటట్లున్నా, నేనుగాబట్టీ అవి మ్రింగి నీళ్ళు త్రాగి పడుకుంటున్నాను. అసలు పెళ్ళి చూపులప్పుడు నీ వంకర సమాధానాలు విన్నప్పుడే అనుకున్నాను. నువ్వు ఒక అహంభావివని - నిన్ను పెళ్ళి చేసుకున్నాక నేను ఎన్ని పోగొట్టుకున్నానో తెలుసా? ఒక్క ఫ్రెండ్ లేడు, ఒక్క ప్లే గ్రౌండ్ కి వెళ్ళడం లేదు. టెన్నీస్ కెళ్ళకూడదు, ఫ్రెండ్స్‌తో పేకాట ఆడ్డానికి లేదు, తాగకూడదు. ఏం చేసినా ఈ క్వీన్ విక్టోరియా గారి పర్మిషన్‌తో టే చేయాలి. నువ్వొక ఎలిజబెత్ మహారాణిననుకుని మిడిసిపడుతున్నావేమో గానీ నా పాలిటి ఒక గుదిబండలా నా జీవితానికి ఒక అటాచ్ మెంట్‌లా దాపురించి నేనెక్కడికెళుతున్నా, ఏం చేస్తున్నా వాచ్ డాగ్ లాగా నన్ను కాపలా కాస్తూ ఉన్నా నేనేమైనా నిన్నెప్పుడైనా అన్నానానా? ఛీ... ఛీ... జీవితానికొక ప్రైవసీ లేకుండా పోయింది.

అయినా ఇప్పుడంత రాద్ధాంతం చేయడానికి ఏమైందనీ? అంటే నీ పుట్టినరోజు గుర్తుపెట్టుకుని విష్ చేసి గిఫ్టులిస్తేగానీ నీ మీద ప్రేమలేనట్లా? ప్రేమన్నది మనసులో ఉండాలి గానీ, నా పెళ్ళాన్ని నేను ప్రేమిస్తున్నానని మెడలో బోర్డు కట్టుకుని తిరగరెవరూ. అయినా మీ ఆడవాళ్ళందరూ మొగుడు సినిమా హీరోలాగా ఉండాలని ఊహా గానాలు చేసుకుంటారు. నీ పుట్టినరోజు కిద్దామని వారం రోజుల క్రిందే కొని ఉంచిన గిఫ్ట్ ఇదిగో తీసుకో'' అంటూ ఎదురుగా ఉన్న అలమార్లోంచి ఒక ప్యాకెట్ తీసి గిరాటేశాడు టేబుల్ మీదకి - మాధవ్. ''ఛీ! ఈ ఆడవాళ్ళంతా ఇంతే. ఏం చేసినా మెప్పుండదు. ఒక్కదానితో అన్నీ తుడిచి పెట్టుకుపోతాయి. ఏమీ అనక ముందే ఏడవడమొకటి తెలుసు'' అంటూ విసుక్కున్నాడు మాధవ్.

''నీ బోడి గిఫ్ట్ ఎవరికీ అక్కర్లేదు. దానికోసం ఎవరూ ఏడవడం లేదిక్కడ'' అంటూ మాధవ్ విసిరేసిన గిఫ్ట్ ప్యాకెట్‌తో పాటు ఎదురుగా బల్లమీదున్న వస్తువులన్నింటినీ కూడా క్రింద గిరాటేసి భోరున ఏడ్చుకుంటూ గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది అమల.

''ఐ యామ్ వెరీ సారీ డార్లింగ్! ఏదో చిరాకులో ఉండి అలా అన్నాను నన్ను క్షమించు. నీ చేతులతో ఈ లెంప ఆ లెంప వాయించు నన్ను - జీవితాంతం గుర్తుండేటట్లు నువ్వే శిక్ష వేసినా పడతాను'' అని అమల కన్నీళ్ళు తుడుస్తూ ఓదార్చలేదు మాధవ్.

మధూ,

నిన్నలా పిలిస్తే నీకిష్టమని తెలుసు. కానీ ఈ రోజు నిన్నిలా పిలవడం, నీకీ విధంగా ఈ మెయిల్ పంపడం నాకిష్టం లేకపోయినా - మన జీవితం ఈ రోజుతో ముగిసి పోయేది కాదు కాబట్టి ''రేపు'' అన్నది ఒకటుందన్న ఆశాభావంతో యిలా సంబోదిస్తూ వ్రాస్తున్నాను.

పెళ్ళన్నది నూరేళ్ళ పంట అంటారు. కానీ ఏడాది కూడా కాకుండానే మన మధ్య నిన్న జరిగిన సంఘటన - తప్పు ఎవరిది అని నేను అడగను. నేను ఇష్టపడి మనసా వాచా కోరుకున్న నా మనో నాథుడితో నేను కలలు కన్న అమెరికాలో అడుగుపెట్టిన రోజు నా అంత అదృష్టవంతురాలు ఈ ప్రపంచంలో ఇంకెవరూ లేరనుకున్నాను. మనమిద్దరం ఒకరినొకరు అర్థం చేసుకున్నామని అనుకున్నానే గానీ... జరుగుతున్న సంఘటనలూ, ఎదుర్కొంటున్న నిజాలూ, ఇదేనా నీ అదృష్టం అని వెక్కరిస్తున్నాయి.

ఇద్దరు మనుష్యులు - ఒక ఆడ, ఒక మగ రెండు విభిన్న వ్యవస్థల నుండి వచ్చి పెళ్ళి అనే పేరుతో ఏకమై దాంపత్య జీవితం గడుపుతారు. దాంపత్యమంటే నా దృష్టిలో స్నేహం, నమ్మకం, ప్రేమ - ఒకరినొకరు అర్థం చేసుకుని కష్ట సుఖాలలో జీవితాంతం ఒకరికొకరు తోడుగా నీడగా ఉండడమనుకున్నాను నేను నీ దానిననీ, నువ్వు నా వాడివనీ, ప్రేమంటే మనమేనని అనుకున్నాను. చిన్న చిన్న

పంతాలూ, పట్టింపులూ, ప్రణయ కలహాలు లేని జీవితం చప్పగా ఉంటుందని అనుకున్నాను. మనం ఒకరి కోసం ఒకరు పుట్టేమని, మనది ఆదర్శ జంటనీ అనుకున్నాను. కానీ ప్రపంచంలో చాలా మంది జంటల్లో మనమూ ఒకరిలా కాట్ల కుక్కల్లాగా పోట్లాడుకోవడమన్నది నాకే అసహ్యంగా అనిపించింది. నీలో, నాలో కూడా ఎక్స్‌ప్రెస్ చెయ్యని భావాలు కట్టతెంచుకుని బయటకొచ్చాయి.

దీనికి కారణం - ఈనాటి మగవాళ్ళకి అందం తెలివితేటలు గల భార్య కావాలి కానీ, వాళ్ళ మనసుల్లో మాత్రం ఆనాడు వాళ్ళ చిన్నప్పటి నుండి చూసిన అమ్మమ్మ, అమ్మలూ, వాళ్ళ వాళ్ళ పద్ధతులూ, ప్రవర్తనా సబ్ కాన్షస్‌గా మనసులో ఉండిపోతాయి. వీళ్ళకి తమ తాతయ్య వెనక నిలబడ్డ అమ్మమ్మ, తండ్రి చెప్పిన ప్రతి దానికీ తల ఊపిన అమ్మే ఆదర్శంగా అనిపించి వాళ్ళతో పోల్చుకుని తన భార్య కూడా అలాగే ఉండాలనుకుంటారు. ఆడది కూడా మాట్లాడగలదు నిర్ణయాలు తీసుకోగలదు అన్న ఆలోచన కొంత మందిలో ఉండదు. ఎందుకంటే మనది మేల్ డామినేటెడ్ సొసైటీ కాబట్టి. భార్యకి తనే ఆధారం అనుకునే భర్త - భార్య అభ్యుదయ భావాలతో పురోగమించాలని చూస్తే తనని ధిక్కరిస్తోందన్న అనుమానంతో భార్య తనని విడిపోతుందేమోనన్న భయంతో, అసూయతో, గిల్టీ కాన్షస్‌తో ఫీలై భార్యని తొక్కి పడేసి పైకి రాకుండా ఒక డోర్ మేట్‌లా వాడాలనుకుంటాడు. అందరి మగవాళ్ళు ఇలా ఉంటారని అనను, కానీ నీలోని స్ప్లిట్ క్యారెక్టర్ నాకు నిన్ను ఇలా అర్థం చేసుకునేలా చేస్తోంది. నీలాంటి వాళ్ళు అందుకే ఈ దేశం వాళ్ళని గానీ ఇక్కడ పుట్టి పెరిగిన ఇండియన్ అమ్మాయిలని గానీ పెళ్ళి చేసుకోవడానికి ఇష్టపడరు. ఎందుకంటే వాళ్ళు డామినేట్ చేస్తారన్న భయంతో నీకూ, మీ ఫ్యామిలీకి నేనూ మా సంప్రదాయం నచ్చి చేసుకున్నా ఎంతో మందిని వదిలి ఎక్కడో మారుమూలనున్న నన్ను ఎంచుకోవడానికి ఇది కూడా ఒక కారణమని నువ్వు ఒప్పుకోకపోయినా అది నిజం. నీకు నేనంటే చాలా ఇష్టమని తెలుసు. కానీ నా స్వతంత్ర భావాలని - నా ఆదిపత్యంగా భ్రమపడి ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో ఫీల్ అవుతావు. భార్యా భర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుని బ్రతకడం వేరు, కలిసి ఉండాలి కాబట్టి మొక్కుబడిగా జీవచ్ఛవంలా బ్రతకడం వేరు. ఎప్పుడూ కూడా సర్దుకోవడమన్నది రెండువైపులా ఉండాలి.

గేదని పలుపుతాడుతో కడతాం - దాని బలం ముందు ఆ పలుపు తాడెంత? కానీ దానికది అలవాటైపోయి ఉండాలి కాబట్టి పడి ఉంటుందలా - అది జంతువు - దానికి తెలివిలేదు - కానీ పెళ్ళి చేసుకుని పసుపుతాడులాంటి పలుపుతాడు నొకటి మెడకి తగిలించుకుని ఎంతమంది ఆడవాళ్ళు మనదేశంలో గత్యంతరం లేక పడి ఉంటున్నారో నాకు తెలియదుగానీ నేను మాత్రం అందరి ఆడవాళ్ళలా రాజీ పడలేను. మనం నిజాయితీగా ఉన్నప్పుడు తప్పు చేయడం లేదని మనం మనస్ఫూర్తిగా నమ్మితే జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవం మనకి ఒక బలాన్నీ, ధైరాన్నీ, నమ్మకాన్నీ ఇస్తుంది. దేనికీ భయపడనవసరం లేదు. ఆడది అనకాపల్లిలో ఉన్నా అండమాన్ వెళ్ళినా, అంతరిక్షానికెళ్ళినా, అమెరికా వచ్చినా ఇంట్లో మొగుడికి తను పసుపు తాడు కట్టిన భార్యగానే కనిపిస్తుంది పలుపుతాడుగా చేసి మెడకి ఉరితాడుగా బిగించనంత వరకూ ఇందులో తప్పులేదు.

నేను లైఫ్‌ని ఎప్పుడూ పాజిటివ్ ఆటిట్యూడ్‌తో ఛాలెంజ్‌గా తీసుకుంటాను. ఓడిపోవడం, వెనక్కి చూడడం అన్నది నాకు తెలియదు. నిన్న, ఈ రోజు, రేపు ఒకేలా ఉంటే బ్రతుక్కి అర్థం లేదు. ఒకనాడు బానిస జాతిగా కాలరాసిన ఒక నల్లవాడు నాలుగు వందల సంవత్సరాల చరిత్రని తిరగరాసి కొన్ని వేల వందల మంది హర్షధ్వానాల మధ్య ప్రపంచమంతా చూస్తోంటే సగర్వంగా శ్వేత సౌధంలోకి అడుగుపెట్టాడు. మార్పు తథ్యమని నిరూపించాడు. మొదటి ఆఫ్రికన్ ప్రెసిడెంట్‌గా వైట్ హౌస్‌లో ఒబామా ఇచ్చిన ఇనాగ్యురల్ స్పీచ్ విన్నప్పుడు చాలా డిలైటెడ్‌గా ఫీలయ్యాను. ఇక్కడి తెల్లవాళ్ళల్లో ఒబామా గురించి భిన్నాభిప్రాయాలున్నా నాకు అతని కాన్ఫిడెన్స్, కరేజ్, డివోషన్ ఎంతో ముచ్చటనిపించింది. మార్పు అన్నది బజారులో దొరికే వస్తువు కాదు. మార్పు స్వతహాగా మనుష్యులలో, వ్యవస్థలో రావాలి. సాటి మనిషిని అర్థం చేసుకోవాలంటే ముందు ఆ మనిషి మీద నమ్మకముండాలి.

నేను దేవుడిని నమ్ముతాను. కానీ మూఢనమ్మకాలనీ, మాయలనీ, మంత్రాలనీ నమ్మను. తెల్లారకుండా మొగుడు కంటే ముదర నిద్రలేచి మంగళ సూత్రాలు కళ్ళకి అద్దుకుని మొగుడి కాళ్ళకి దణ్ణం పెట్టి ఆ తర్వాతే ఇంటి పనులకుపక్రమించడం నాకు తెలియదు.

మహా సాధ్వీ సీతమ్మ తల్లిలా మొగుడు ఏదో అన్నాడని పుట్టింటికి (భూదేవి లోకి) పారిపోవడము తెలియదు. ఆమెరికాకి రావాలి అన్న ఆకాంక్ష నాలో బలంగా చిన్నప్పటి నుండి ఉన్నా ఇక్కడి డేటింగ్‌లూ, విడాకులూ అన్న మాటలు నాకుపడవు. ఎందుకంటే రెండేళ్ళు డేటింగ్ చేసి పెళ్ళిచేసుకోకుండా విడిపోయిన వాళ్ళూ తెలుసు, ఎనిమిదేళ్ళు డేటింగ్ చేసి పెళ్ళి చేసుకుని ఆరునెలలో విడాకులు ఇచ్చుకున్నవాళ్ళూ తెలుసు. నా మట్టుకు నాకు ఇది అర్థం లేని పని అనిపిస్తుంది. ఒక మనిషిని పెళ్ళి చేసుకుని వదిలేసి ఇంకొకరిని చేసుకుంటే వాడు ముందరివాడిలా ఉండడని రూలుగానీ, గ్యారంటీగానీ లేదుకదా! అందుకనే నాకు పెళ్ళి అన్న మన దేశ సంప్రదాయం మీద సంస్కృతి మీద అచంచలమైన విశ్వాసం ఉంది. నా జీవితం నేను చక్కదిద్దుకోగలనన్న నమ్మకం నాకుంది. ప్రతీ ఆడదీ చదువుకోవాలనీ, స్వశక్తి మీద నిలబడాలనీ నేనాకాంక్షిస్తాను.

భర్తకి ఎందుకు కోపం వచ్చిందో ఒక్క పది నిమిషాలు శాంతంగా ఆలోచించే భార్యా - భార్య బాధపడుతోంటే ఎందుకు బాధపడుతోందని ఒక్క ఐదు నిమిషాలు ఆలోచించే భర్తా ఉంటే భార్యా భర్తలలో గెలుపెవరిది అన్న ప్రశ్న రాదు.

ఇంక నిన్న మనమధ్య జరిగిన సంఘటనకొస్తే - తప్పు నీదా, నాదా అన్నది కాదు. తప్పు చేయని మానవుడు ఉండడు. కానీ చేసిన తప్పుని సరిదిద్దుకోవడమే మంచి వాళ్ళ లక్షణం. మన దుఃఖానికి గానీ సంతోషానికి గానీ మనమే బాధ్యులం అనుకుని జీవితాన్ని ఒక ఛాలెంజ్‌గా అడ్వెంచర్‌గా తీసుకోవాలన్నది నా మతం. మన జీవితం మన చేతిలోనే ఉన్న కేన్వాస్ లాంటిది దానిమీద రంగులు వేసుకోవడమన్నది మన చేతిలో పని. దాన్ని బ్లాక్ అండ్ వైట్‌గా చేసుకున్నా, పంచ రంగుల కలగా మార్చుకున్నా అది మనమీదే ఆధారపడి ఉంటుంది.

ఇవన్నీ ప్రొద్దున్నే కూర్చుని నీకు చెపుతున్న సుభాషితాలూ, సూక్తి ముక్తావళీ కాదు అర్థం చేసుకుంటావని వ్రాస్తున్నాను. నాలోని ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మాభిమానాన్ని నువ్వు అహంభావంగా అనుకుంటే నేనేం చేయలేను.

కాబట్టి నిన్న ఏం జరిగింది అన్న దాని గురించి మనం ఈ రోజూ, రేపూ, ఇంకెప్పుడూ కూడా మాట్లాడుకోవద్దు. ఎందుకంటే నిన్నటిని మనం సరిదిద్దలేం కాబట్టి as we cannot undo things.

నేనెక్కడో చదివాను

Friends are of two types – one says if you ever need any thing, I will be there. The other says you will never need any thing as long as I am there.

ఎంత మధురమైన భావన? నాకైతే ఫ్రెండ్స్ అంటే మాధవ్ - అమల అని చెప్పి క్రొత్త డెఫినిషన్ ఇవ్వాలనిపిస్తోంది. నీకు కూడా అలాగనిపిస్తే రోజూలాగా రాత్రి తొమ్మిది గంటలకి కాకుండా ఈ రోజు సాయంత్రం అయిదు గంటలకి ఇంటికి వచ్చేసేయ్

నీ కోసం వేయి కళ్ళతో ఎదురు చూసే నీ అమల.

మెయిల్ పూర్తి చేసి అమల దానిని మాధవ్‌కి పంపింది.

సాయంత్రం ఐదుగంటలైంది...........

కాలింగ్ బెల్ మ్రోగింది..... తలుపుతీసిన అమలని అమాంతం ఎత్తుకుని గదిలోకి వెళ్ళాడు మాధవ్.

........................

ఓ గంట తర్వాత -

"రానని అనుకున్నావా? అలిసి పోయి అమల ఒళ్ళో పడుకున్న మాధవ్ అడిగాడు.

"ఎవడి కోసమని వస్తావు?" చెదిరిన జుట్టు సవరించుకుంటూ అంది అమల.

"ఏయ్! ఆ పొగరే వద్దన్నది - నువ్వు మారవన్నమాట" అమలని తనమీదకి లాక్కుంటూ అడిగాడు - మాధవ్‌లో మగాడు.

"ఆ ఇగోనే వద్దన్నది - నిన్ను మారుస్తానురా" - మాధవ్ ముక్కు పట్టి ఊపుతూ అంది నేటి మహిళ అమల - ఆత్మ విశ్వాసంతో.

ప్రక్కనున్న సీ.డీ ప్లేయర్ నుండి - నిజంగా నేనేనా .... ఇలా నీ జతలో ఉన్నా... ఇదంతా ప్రేమేనా.... అన్న పాట సుమధురంగా వినబడుతోంది.

నేనేదన్నా సరదాగా అంటానురా - నువ్వు నా ప్రాణం కంటే ఎక్కువని నీకు తెలియదూ అంటున్న అమలని గుండెలకి హత్తుకుని నిశ్చింతగా కళ్ళు మూసుకున్నాడు మాధవ్